RNI No. APTEL/2003/12253

# భావవీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 16 Issue No. 2(1) Monthly February 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500



## కొలచలం శ్రీనివాసరావు



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Telugu Literary, Culture & Language Study**

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 16 - Issue. 2(1) - February 2019 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**

**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.
7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept.of Modern Indian Languages,
   Madhurai Kamaraj University, Madhurai,
   Tamilnadu.
8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
   Asst. Professor, Dept. of Telugu,
   Yogi Vemana University, Kadapa.

9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor in Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty in Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**COVER PAGE & PAGE SETTING**

**TENALI PRAKASH**, G.L.S. ENTERPRISES, Guntur. 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar,
Guntur - 522 002. Ph. 9703301698.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# కోలాచలం శ్రీనివాసరావు

సుప్రసిద్ధ నాటక రచయిత, న్యాయవాది, జ్యోతిష్య నిపుణుడు, బహుభాషా కోవిదుడు, ఆంధ్ర చరిత్ర నాటక పితామహుడుగా కీర్తి పొందిన శ్రీ కోలాచలం శ్రీనివాసరావు 1854 సంవత్సరంలో కర్నాటక రాష్ట్రంలోని బళ్ళారి జిల్లా హంపి వద్దనున్న కమలాపురంలో సేతుపతిశాస్త్రి, అచ్చమ్మ దంపతులకు జన్మించారు. మల్లినాధసూరి వంశీయుడైన కోలాచలం వారు చిన్న వయస్సులోనే తెలుగు, కన్నడ, సంస్కృత, ఆంగ్ల భాషలపై పట్టు సాధించారు. ఆ రోజుల్లో యఫ్.ఏ పరీక్ష పాసై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, డిప్యూటీ కలెక్టర్ వద్ద దివాన్‌గా ఉద్యోగం చేశారు. 1888 సంవత్సరంలో జాతీయోద్యమ పిలుపు నందుకొని ఉద్యోగాన్ని వదలి న్యాయవాద విద్యను అభ్యసించి న్యాయవాద వృత్తిని చేపట్టారు.

కోలాచలం వారు ఒకవైపు న్యాయవాద వృత్తిలో రాణిస్తూనే మరొకవైపు సాహితీ వ్యాసంగం వైపు ప్రయాణించారు. ఆ క్రమంలో తనకు అత్యంత ఇష్టమైన నాటక రంగాన్ని ఎన్నుకొని సాంఘిక, చారిత్రక నాటక రచనకు పూనుకున్నారు. చారిత్రక రచనలు, సంఘానికి సంబంధించిన రచనలు సమాజానికి అత్యావశ్యకములని ఆయన భావన. ముఖ్యంగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, చారిత్రక ప్రాధాన్యత గల విశేషాలు భావి తరాలకు అందించాలనే సత్సంకల్పంతో కోలాచలం వారు భగవద్గీత 18 అధ్యాయాలను సవిమర్శగా పఠించి ప్రతి అధ్యాయాన్ని వచనంగా ప్రకటించారు. అదేవిధంగా భారతదేశంలోనేగాక ప్రపంచంలోని ఇతర దేశాల నాటకాల చరిత్రను పరిశోధించి "ప్రపంచ నాటక చరిత్ర (ది డ్రమాటిక్ హిస్టరీ ఆఫ్ ది వల్డ్)" అనే గ్రంధాన్ని ఆంగ్ల భాషలో రచించారు.

పూనా, ధార్వాడ నుండి వచ్చిన నాటక సమాజాల నాటక ప్రదర్శనలచే ప్రేరణ పొందిన కోలాచలం వారు సమకాలీన సమాజ రుగ్మతలతోపాటు, చారిత్రక అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ నాటకాలు రచించారు. వీరి చారిత్రక నాటక రచన ఎంతో పరిశోధనాత్మకంగా కొనసాగింది. అందుకే కోలాచలం వారిని తెలుగు సాహితీ లోకం "ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడనే" బిరుదుతో సత్కరించింది. కోలాచలం వారు బళ్ళారిలో సుమనోరమ సభ అనే నాటక సమాజాన్ని స్థాపించి ఎన్నోనాటకాలను ప్రదర్శింపజేశారు. అంతేగాకుండా "వాణీ విలాస నాటకశాలా" నిర్మాణమును నిర్మించి అనేక నాటకాలను ఆ రంగస్థలంపై ప్రయోగింపజేసి నాటక రచనా సామర్థ్యమునకు మెరుగులు దిద్దగలిగారు. ఆ రంగస్థల ప్రారంభోత్సవ సభకు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు, లోకమాన్య శ్రీ బాలగంగాధర తిలక్‌ను ఆహ్వానించి తన సంఘ సంస్కరణ దృక్పథాన్ని చాటుకున్నారు. అటువంటి మహనీయత కలిగిన శ్రీ కోలాచలం శ్రీనివాసరావు రచనలు, జీవితం ఎందరికో ఆదర్శం.

**- సంపాదక వర్గం**

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | పక్కా మూలవాసి కథలు - ఎడారి బతుకులు | - డా. చింతం ప్రవీణ్‌కుమార్ | 6 |
| 2. | బోయి జంగయ్య గారి 'పుట్టుమచ్చ' నవల - ఇతివృత్త పరిశీలన | - డా॥ యం. ప్రసాద్ | 8 |
| 3. | జ్ఞాననేత్రుని దివ్యభక్తి | - గంగుల నాగరాజు | 13 |
| 4. | జాషువా - స్త్రీ | - జి. నీలిమ | 15 |
| 5. | "జూపాక సుభద్ర గారి అయ్యయ్యో దమ్మక్క కవిత్వం - పరిశీలన" | - డా॥ ఓరుగంటి సరస్వతి | 19 |
| 6. | వ్యక్తిత్వవికాస కేంద్రాలు మన పాఠశాలలు | - ఆచార్య కిన్నెర శ్రీదేవి &-అనిత ఓబిరెడ్డి | 21 |
| 7. | బెళ్ళూరి వారి వివేకానందము | - రాజేశ్వరి దివాకర్ల | 24 |
| 8. | "రాజీపడని సమరయోధుడు గరిమెళ్ళ సత్యనారాయణ" | - డాక్టర్. మండి అన్వర్ హుస్సేన్ | 27 |
| 9. | మానవత్వం పరిమళించిన - జాషువా కవితా దృక్పథం | - కె.ఎం. సౌందర్యవతి | 30 |
| 10. | తెలుగులో మొట్టమొదటి కల్పిత ప్రబంధం - ధనాభిరామం | - డా. ఇడికోజు శ్రీనివాసాచారి | 32 |
| 11. | తెలుగదేలయన్న .... | - డా॥ స్వర్ణలత గొట్టిముక్కల | 35 |
| 12. | తెలుగు నాటకసాహిత్యం - సమకాలీన సమాజం (2001-15) | - డా. వి. త్రివేణి | 38 |
| 13. | వేమన కవిత్వం - జాతి జీవన దృక్కోణం | - డా॥.బూసి వెంకటస్వామి | 45 |
| 14. | దళిత కవిత్వం - దళిత స్త్రీ ప్రాథమిక హక్కుల ఉల్లంఘన | - పి. వాణి | 51 |
| 15. | నెల్లూరు జిల్లాలో పర్యావరణ స్పృహ | - టి. వనజ | 54 |
| 16. | విజయనగర సామ్రాజ్య సాహిత్యం - జ్యోతిష్యాంశాలు | - రాంభట్ల వేంకటరాయశర్మ | 59 |
| 17. | సినారె 'మట్టీ మనిషీ ఆకాశం' - కావ్యేతిహాస తత్త్వం | - డా॥ పి. విజయకుమార్ | 65 |
| 18. | విశ్వనాథ నవలల్లో ఆత్మాహుతులు | - డా. సింగుపురం నారాయణరావు & - డా. సుసర్ల ఇందిర | 69 |
| 19. | నక్కల గిరిజన తెగ-సామాజిక సాంస్కృతిక జీవన విధానం | - డా. ముడావత్ వెంకటేష్ | 84 |
| 20. | డా॥ వి.ఆర్ రాసాని ప్రకృతి వైపరీత్య కథలు - సామాజిక స్పృహ | - యం. రాజన్న | 89 |
| 21. | బాలసాహిత్యం - ఆధునిక పోకడలు | - డా॥ పి. ఉష | 92 |
| 22. | అర్నాద్ సత్య నవల - సమీక్ష | - డా॥ పప్పుల వెంకటరమణ | 94 |
| 23. | విప్లవ కవిత్వంలో వచన రూపం | - డా॥ గోనిపాటి ధర్మారావు | 98 |
| 24. | విశ్వము - మానవునికి అవినాభావ సంబంధము | - డా. యస్.పి. కృష్ణవేణి | 101 |
| 25. | గురజాడవారి 'ముత్యాల సరాలు' - పరిశీలన | - డా॥ యం. గిరిబాబు | 103 |
| 26. | నెమలి కన్నులు కవిత్వం -అభివ్యక్తి వైవిధ్యం | - దారిశెట్టి పుష్పిణి | 107 |
| 27. | నెల్లూరు జిల్లా - డప్పు విన్యాసం | - కె. వెంకట రమేష్ బాబు | 112 |
| 28. | తెలుగు పత్రికారంగంలో - ఓరుగల్లు | - షేక్ అక్బర్ పాషా | 115 |
| 29. | మహబూబ్‌నగర్ కథలు - దళిత, గిరిజన, బహుజన జీవన చిత్రణ | - డా॥ డి. మల్లయ్య | 118 |
| 30. | జాషువా 'కాందిశీకుడు' - మానవతావాద దృక్పథం | - డా॥ పల్లి చిన్నారావు | 122 |

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# పక్కా మూలవాసి కథలు - ఎదారి బతుకులు

- డా. చింతం ప్రవీణ్ కుమార్, పోస్ట్ డాక్టరల్ ఫెలో, తెలుగు శాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

ఎదారి బతుకులు - పల్లె కతలు. ఎండపల్లి భారతి సిరా గర్భం నుండి పురుడు పోసుకున్న దళితాత్మ కథలు. సహజంగా సాధారణంగా ఒక ముచ్చటలాగా సాగే ఈ కథలు అత్యంత ప్రభావ శీలమైన భారతీయాత్మ కథలు. ఇప్పటివరకు వచ్చిన దళిత జీవిత కథలకు భిన్నంగా అత్యంత చిన్న గొంతుకగా మొదలై మన మస్తిష్కాలను కుదిపేసే ఒక సాధారణ మాతృమూర్తి రచించిన అసాధారణ కథలు 'ఎదారి బతుకులు'. ఒక బోలా మనిషి రాసిన బోల్డ్ కథలు ఎదారి బతుకులు. మేకప్పు లేని మట్టి మనుషుల సహజ కతలు జీవిత వెతలు ఈ కథలు.

సాధారణంగా దళిత బహుజన కథల్లో ఏకరువు పెట్టే విష యాల జోలికి వెళ్ళవు ఈ కథలు. 'మేం ఇలాగే బతుకుతాం... ఇలాగే బతకడం మా అస్తిత్వం అని చెప్పే నినాదప్రాయపు విషయ చర్చలు ఈ కథల్లో ఎక్కడా కనిపించవు. తమ జీవితాలు ఇలా ఉండడానికి గల కారణాలు ఏకరువు పెడుతూ సాగే టీకా తాత్పర్యాలుండవీ కథల్లో. తమ జీవన విధానం,ఆహారపు అలవాట్లు గురించి ప్రత్యేకంగా చెప్పవీ కథలు. అగ్రాధిపత్యపు పోక డలు, అణిచివేతలులాంటి మూస ధోరణికి ఈ కథలు చర్చా వేదిక కాబోవు. కథ చెప్పడానికి కసరత్తులు చేయడం ఈ కథల్లో కనిపించదు. దళిత స్త్రీలు ఎదుర్కుంటున్న వివక్షను కేవలం దళిత స్త్రీలకు మాత్రమే పరిమితం చేయక మొత్తంగా భారతీయ సమాజంలోని స్త్రీలందరికీ వర్తించేలా ఒక ధార ఏదో ప్రవహిస్తుం టుందీ కథల్లో. ఒక్క మాటలో ఈ కథలు చెప్పేదేమంటే...కేవలం శుద్ధ జీవితం. జీవితం జీవిస్తున్నట్లుగా ఉన్నది ఉన్నట్లుగా అత్యంత సహజంగా చిత్రించబడ్డాయీ కథలు. రచయిత్రి తన చుట్టూ ఉన్న జీవితాల గురించి మనతో ముచ్చటించినట్లుగా కథ చెబుతుంటుంది...కాని కథలు వింటున్న కొద్ది మనలో అంతర్లీనంగా ఉన్న ఆధిపత్య భావజాలాలు గిరిగీసుకున్న పొరలు ఒక్కొక్కటిగా తొలగిపోతూ ఉం టాయి. అంతే. అంతటి శక్తివంత మైన కథలు 'ఎదారి బతుకులు'.

ఎదారి బతుకులు కథా రచయిత్రి ఎండపల్లి భారతికిది మొదటి కథా సంపుటి. రచయిత్రి తన జీవితంలో ఎదుర్కున్న అనేక ఆటుపోట్లు,వివక్ష,తన బాల్య వివాహపు కుటుంబ చట్రంతో కూడిన సమాజం తనను రాయకుండా ఎండలేని స్థితికి తెచ్చాయి. అయితే ఇవన్నీ కథలుగా కనిపించినా వాస్తవ జీవిత గాథలు. తన జీవితం తన చుట్టూ ఉన్న జీవితం తాలుకు వాస్తవ దృశ్యాలను అక్షరం చేసింది రచయిత్రి భారతి. అయితే బాల్య వివాహపు స్థితి నుండి ఒక పదునైన కథా రచయిత్రిగా కథలు వెలువరించే స్థితికి చేరుకున్నా ఎక్కడా వ్యవస్థ మీద నిందారోపణలు వేయకపోవడం ఆమె రచనా పరిణితికి, మానసిక ఉన్నతీకరణ స్థితికి అద్దం పడుతున్నది. తనలాగే తన సమూహపు బతుకులు కూడా ఉన్నాయనే స్పృహ ఆమెను తన సమూహాలను గాఢంగా ప్రేమించే దిశగా సాగి అత్యంత సహజంగా తన సమూహపు భాషలోనే కథలు రాయించింది. ఎదారి బతుకులకు రచ యిత్రిగా తాను చెప్పుకున్న ముందు మాట చాలు ఈ కథల సహజత్వాన్ని పట్టివ్వడానికి -

'పుట్టుక,చావు ఇవి రెండూ మనకు సమ్మందం లేకుండానే జరిగేటివి. మన బతుకుమటుకు మన చేతులారా జరిగేది. మన కండ్లెదురుగా జరిగేవి. మనకు తెలిసి తెలిసి జరిగేవి. కులాన్ని బట్టి, చదువును బట్టి,జరుగుబాటును బట్టి,నడవడికను బట్టి, రకరకాల ఒడిదుడుకుల్లో మన బతుకులు సాగిపోతా ఉంటాయి. నగువూ, ఏడుపూ, కోపమూ తాపమూ, కుళ్ళుబోత్తనమూ కని కరమూ...ఇట్ల అడుగుకొక మలుపు మనిషి బతుకులో. ఆ మలు పుల్ని గుర్తు తెచ్చుకుని మనిసి ఉండేరేమో;

ఈ కతల్లోదంతానూ పల్లె ఆడవాళ్ళ బతుకు దీన్లో బాసంతా మా పల్లె బాస. చానామందికి బూతు, చెడ్డ మాటలు అనిపించే వాటిని. మేము కడుపు మండి నబ్బుడు మామూలుగా మాట్లాడు కుంటాము. వాటిని బూతులు అనుకోవద్దండి, మా బతుకుల్లో బాగమే మా బాస..' ఇలా అత్యంత సహజంగా ఉంటుంది రచ యిత్రి మదిలో మాట. ఇందులోని కథలూ ఇంతే సహజత్వంతో ఉంటాయి.

సీమ ప్రాంతపు భాషలో సాగే ఈ కథలు చదువు తున్నంతసేపు ఇందులోని జీవితాల పట్ల ప్రేమ కలుగు తుంది. ముఖ్యంగా సీమ భాష పట్ల వల్లమాలిన అను రాగం కలుగుతుంది. ఇందులోని కథలు ఆంత అద్భు తంగా పండడానికి కారణం ఈ కథల్లోని భాషే. ముఖ్యంగా బొగ్గులబట్టి, సచ్చి సాధించడం, పాపం గెంగవ్వ, నక్కా ముట్టీ, మొగుని పోటుకులు, అవ్వ తలపులు, ఆవైతే పేయ దూడ ఆడదైతే మగ పిల్లోడు కథల్లోని స్త్రీ పాత్రలు మన చుట్టు ఉన్న స్త్రీ జీవితాలను మన కళ్ళెదుట నిలిపి మనల్ని నిలకడక ఉండనీయవు. ఇందులోని కొన్ని కథలు భర్తతో ఆడమనిషి పడ్డ వెతలను తెలియజేస్తే మరి కొన్ని వారిపై కొనసాగిన వివక్ష లైంగికదాడులను తెలియ జేస్తాయి. మొత్తంగా ఎదారి బతుకులు కథలు మనల్ని ఆలోచింపజేస్తాయి...కన్నీళ్ళు పెట్టి స్తాయి...పరుగులు పెట్టి స్తాయి... అంతిమంగా గుండె లోపల తడిని రాజేస్తాయి.

'సావు బియ్యం', లాంటి కథ జీవితంలోని అసలు తాత్వికతను నొక్కి చెబుతూ ఆకలి కన్న మించిన తత్వం ఏది లేదని, ఎంతటి తత్వమైన, ఎంతటి నమ్మకమైన చివరికది మూఢ నమ్మకమైనా ఆకలి ముందు తోక ముడవాల్సిందేనని జ్ఞానబోధ చేస్తుంది. ఇంకా 'మాయన్న సదువు', 'కుట్టేవానికి మెట్టు కరువు' మొదలైన కథలు మనల్ని ఒక్క కుదుపు కుదిపి మన ఆలోచనకు పని కల్పిస్తాయి. ఇక 'నల్లడబ్బు' కథ ఒక మాస్టర్ పీస్. ఈ కథా సంపుటి పేరే కలిగిన 'ఎదారి బతుకులు' కథ ప్రపంచీకరణ కోణాన్ని టెలివిజన్ మాయాజాలాన్ని మన ముందు పరిచి మాయ మవుతున్న మనిషిని మనకు మళ్ళీ పరిచయం చేస్తుంది. ఇక తాగుబోతు, అంటిత్తులు, తప్పేది ఒప్పేది మొదలైన కథలు మనకు కాస్త గిలి గింతలు పెడుతూనే మరొక వైపు మనల్ని దీర్ఘా లోచనలో పడేస్తాయి. ఇలా ముప్పయ్ కథలు గుక్కతిప్పుకోనీక మనల్ని ఆసాంతం ఏకబిగిన చదివిస్తూనే ఉంటాయి. ఈ కథల్లో కులం, స్త్రీ, అవిద్య, వివక్ష, పేదరికం, అస మానతలు, లైంగిక హింస, సంస్కృతి, పండగలు, పబ్బాలు, ఆహరపు అలవాట్లు మొదలైనవి పైకి కనిపిస్తున్న ప్పటికీ ఈ కథల గుండా ప్రవహించే దంతా శుద్ధ జీవితం. అంతే.

ఎడారి బతుకులకు ముందు మాట రాసిన రచయిత్రి పి.సత్యవతి ఇలా అంటుంది

"ఎదారి బతుకులు కతల్లో భారతి వర్ణించి వర్ణించి మాజి క్కులు చేసి ఏమీ చెప్పదు. నెత్తిమీద మొట్టీ చెప్పదు. ఉపన్యా సాలూ ఇవ్వదు. కబుర్లు చెప్పినట్టు చెప్పి ఉలి క్కిపడేలా చేస్తుంది. ఇవి ఒక్క దిగువబురుజు కతలే కావు. భారతదేశపు కతలు" అన్న మాటలు అక్షరాలా ఈ కథలకు సరిపోతాయి.

ఈ కథా సంపుటిలోని ముప్పయ్ కథల్లో ప్రతీ కథ దేనికదే ప్రత్యేకం. ఏ కథలోనూ సాగదీతలు లేకుండా అప్పుడే కథ అయి పోయిందా అన్నంత ఉత్సుకతను కలగజేస్తాయి...రచ్చబండ కాడ కూసోని చెప్పుకునే ముచ్చ ట్లలాగా ప్రతీ కథ పల్లెతనాన్ని అక్షరాలా పట్టిస్తుంది. స్త్రీ గొంతుక నుండి పలికిన ఈ కథలు ఒక మాతృ మూర్తి స్వచ్ఛమైన అనురాగం వలెనే స్వచ్ఛంగా శుద్ధంగా ఉన్నాయి. ఎక్కడా అసత్యాలకు పోకుండా సూటిగా సాగే ఈ కథల్లో అసహజ ఫ్రేం వర్క్ ఎక్కడా కనబడదు. సన్నివేశాలను కూర్చడం, పాత్రల్ని పేర్చడంలాంటి జిమ్మి క్కులు ఏవి లేకుండా సాదాసీదాగా, మట్టిమనుషుల భాషలో సాగిపోయే ఈ కథలు దళిత జీవితాన్ని దళిత స్త్రీల జీవితాలను చెప్పినట్లు బయటకి కనిపిస్తున్నప్పటికీ కచ్చితంగా 'ఎదారి బతుకులు' కథలు ఈ దేశ మూల వాసుల జీవితాలు.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# బోయి జంగయ్య గారి 'పుట్టుమచ్చ' నవల – ఇతివృత్త పరిశీలన

– డా॥ యం.ప్రసాద్, పాఠశాల సహాయకులు (తెలుగు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాపూరు, నెల్లూరు

దళిత కుటుంబాలలో కులాచారం పేరుతో చేసే కన్నెరికం లాంటి దురాచారాలు ఆనాటి సమాజంలోని పెద్దలు దళిత కుటుంబాలలో పుట్టిన ఆడపిల్లల జీవితాల్ని బుగ్గిపాలు చేశారు. వాటిని రూపుమాపి సాటి కులంలోని స్త్రీలకు అండగా నిలిచిన గంగ పాత్రను బోయ జంగయ్య 'పుట్టుమచ్చ' నవలలో ధీర వనితగా చిత్రీకరించారు. దళిత కులంలో పుట్టిన ఆమె జీవిత గమనంలో తనకు ఎదురైన అటుపోట్లను ఎదుర్కొని విజేతగా నిలవడం, ఆమె ఎంతోమంది స్త్రీలకు ఉపాధిని కల్పించి గొప్ప ఆదర్శ మహిళగా పేరుపొందడం అనే విషయం 'పుట్టుమచ్చ' నవలలో ప్రధాన ఇతివృత్తంగా కనిపిస్తుంది. ఈ ఇతివృత్తాన్ని పరిశీ లించడమే ప్రస్తు వ్యాసం ప్రధాన ఉద్దేశం.

గంగ ఈ నవలలో ప్రధాన పాత్ర. గంగ తండ్రికి ముగ్గురు భార్యలు. ఒకామెను పెళ్ళి చేసుకున్న తరువాత ఆమెకు సంతానం కలగలేదు. అందువలన మరొకామెను రెండవ వివాహం చేసు కుంటాడు. రెండవ భార్యకు ఇద్దరు కుమార్తెలు కలుగుతారు వారి పేర్లు గంగ, జానకి. గంగ తండ్రి, ఇద్దరు భార్యలతో సరిపెట్టు కోకుండా వేరొకామెతో అక్రమ సంబంధం పెట్టుకొని ఆమెతో సహజీవనం చేస్తుంటాడు. వీరంతా ఎవరి కష్టం వారు పడుతూ ఎవరి కాళ్ల మీద వారు నిలబడి వేరుగా ఇల్లు కట్టుకొని అందులో జీవిస్తుంటారు. మొదటి భార్యకు పిల్లలు లేరు కాబట్టి గంగ అక్క జానకిని పెంచుకుంటుంది. సహజీవనం చేస్తున్న ఆమెకు పిల్లలు పుట్టకుండా పసరు పోయిస్తాడు. ఈమె వ్యభిచారం చేసి సంపాదించిన ధనంతో గంగ తండ్రి జీవిస్తుంటాడు. ఇతను రాత్రి పగలు అనే తేడా లేకుండా పొద్దు అస్తమానం తాగడం, పనీబాట లేకుండా ఊరంతా తిరగడం తప్ప ఏ పనిచేయడు.

పద్నాలుగేళ్ళు రాగానే బడి మాన్పించి గంగను కుల ఆచారం ప్రకారం కన్నెరికం చేయాలని తల్లి అనుకుంటుంది. "కులవృత్తి మాని మనం బతుకలేము. తరతరాల నుండి వస్తున్నది. ఇప్పుడు వద్దంటే ఎట్లా? అ యినా చదువుకుని చేసేదేముంది? మనకెవ రన్నా నౌకరిస్తరా? అప్పుడూ ఈ పనే చేయాలి" అని అంటుంది.

దళిత స్త్రీలను పెద్దమనిషి కాగానే డబ్బున్న వాళ్ళ దగ్గరకి పంపి వారి పశువాంఛలకు బలిచేసే ఆచారాన్ని ఆనాటి సమాజం కన్యరికం అని పిలిచేది. ఈ దురాచార ముసుగులో అంతకు ముందు గంగ తల్లి, మేనత్తలు కూడా బలి కాబడ్డారు. అదే దురాచారానికి గంగను బలి చేయాలని తల్లి ప్రయత్నిస్తుంది. అందుకు గంగ అంగీకరించదు. ఆమె అక్క జానకి జీవితాన్ని కూడా అలాగే చేయడం దగ్గరుండి చూసిన గంగకు తన జీవితం, అక్క జానకి జీవితంలా కాకూడదని తల్లిని ఎదిరిస్తుంది. కష్టపడి పనిచేసైనా డబ్బు సంపాదిస్తాను కానీ అలా తన మానాన్ని ఎవరికి పడితే వారికి అర్పించనని కరాఖండిగా తన అభిప్రాయాన్ని తేల్చి చెబుతుంది.

పుత్తడిబొమ్మ లాంటి అక్క జానకిని కులవృత్తిలోకి దింపడానికి జరిగిన తతంగాన్ని గురించి తలచుకొని గంగ బాధపడుతుంది.

''ఆరోజు దగ్గరి చుట్టపక్కాలు, అమ్మలక్కలు వచ్చింద్రు. ఆడ మగ కలిసి కానుగు చెట్టుకిందనే సారాను తాగుతూ కాల్చిన పందివార్లను తిన్నరు. మధ్యాహ్న భోజనాలు అయినాక గుడిసెలో చాప పరిచి, అందర్కీ బొట్టు పెట్టింద్రు. మధ్యన చిన్న పీట మీద జానకిని కూర్చోపెట్టింద్రు. అప్పటికే తలంటుస్నానం చేయించి అద్దింద్రు. ఒళ్ళో కొత్తబట్టలుంచింద్రు. దోసిటిలో బట్టలతో లేచి చుట్టూర చూస్తూ దండం పెట్టింది. అందరు చేతులెత్తి సరే అన్నట్టు చూసారు. పక్క గుడిసెలోకి తీసుకెళ్ళి కొత్త

బట్టలు కట్టించి, కాళ్లకు పసుపు పెట్టి, పాదాలకు కుంకుమ చారలు గీసి మళ్ళీ తీసుకొచ్చింది మేనత్త. అందరు మట్టి కంచులల్లో మరోసారి సారా తాగింగ్రు. అంతకుముందే కానుగు చెట్టు కింద మేనమామను తీసుకొచ్చి ఆయన పాదాలకు పసుపు పెట్టి ఇద్దరి మీద తలంబ్రాలు చల్లి, ఒకరి కాలు మరొకరితో తొక్కించగానే అందరు లేచి నిలుచున్నరు''.

''అంతే! మనువు అయిపోయిందంటూ బయటికి నడిచింగ్రు. ఈ తతంగం పూర్తి అయ్యేసరికి పొద్దు పోతుంది. గుడిసెలో నుండి బయటికొస్తున్న గంగ తల్లి రాత్రికి ఇంటికి రానున్న పెద్దమనిషి గురించి చెపుతుంటే విని 'అదృష్టం అదృష్టం' అంటూ ఆడమొగ తలాడించింగ్రు. కులపెద్ద చేతిలో తల్లి కొంత పైకం ఉంచగానే నవ్వు ముఖంతో అతను కదిలిండు. అతని వెంట అందరు కదిలింగ్రు. వాళ్ల వెనకాల మామకూడ''

ఇది దళిత కుటుంబంలో పుట్టిన ఆడపిల్లకు జరిగే తంతు. గంగ అక్క జానకికి కన్నెరికం చేసే వ్యక్తి వయస్సు మూడింతలు కంటే ఎక్కువే ఉంటుంది. జానకి ఎదిరించ లేని పరిస్థితి. తెల్లవార గానే జానకి తన జీవితాన్ని తలచుకొని ఏడుస్తుంది. పొద్దున్నే కన్నీటి చారలు కట్టిన చెంపలు. చిందరవందరైన జుట్టు గింజలు వలిచిన కంకిలాగ ఉంది. ''అందరికి మొదటి రాత్రి మధుర రాత్రి అయితే దళితుల ఆడపిల్లలకు రాక్షస రాత్రి. కాట్లు గీట్లతో శరీరం పుండైపోతుంది. ఆరోజు నుండి జానకి మకాం పక్క గుడిసెలోకి మారుతుంది. పెళ్లి చేసుకుని అత్తగారింటి కెళ్లాల్సిన జానకి ఆ గుడిసెలోనే ఉండిపోతుంది. శివ అనే వ్యక్తి జానకిని ఇష్టపడతాడు. జానకి కూడా అతనంటే ఇష్టం. కానీ జానకీకి పెళ్ళి చేసుకొనే స్వేచ్ఛ లేదు. గంగ పెద్దమ్మ కూడా కులవృత్తిలో భాగంగానే ఏ మగాడు వచ్చినా కాదనకుండా శారీరక సుఖాన్ని అందిస్తుంది. అందులో భాగంగానే ఆమెను ఇద్దరు వ్యక్తులు హింసించి అనుభవిస్తారు. ఇదంతా దగ్గరుండి చూసిన గంగ తన జీవితం అలా కాకూడదని తల్లిని ఎదిరిస్తుంది. తల్లి ఎన్ని తిట్టినా భరిస్తుంది. గంగ పనికి వెళ్తున్న క్రమంలో నాయుడు అనే అతనితో పరిచయం ఏర్పడుతుంది. ఆ క్రమంలోనే అతన్ని ఇష్టపడుతుంది. నాయుడు గంగను పెళ్ళి చేసుకొని వేరే ఊర్లో కాపురం పెడతాడు. తొలిరోజుల్లో గంగను బాగా చూసుకుంటాడు. ఓరోజు మిషన్ బాగుచేయించాలని బొంబాయి వెళ్తున్నానని కొంత డబ్బు ఇచ్చి పని పేరుతో చెప్పాపెట్టకుండా గంగను మోసం చేసి నాయుడు ఎక్కడికో వెళ్ళిపోతాడు. నాయుడు తనను మోసం చేశాడన్న విషయం తెలుసుకోవడానికి గంగకు ఎంతో సమయం పట్టలేదు. గంగ కులవృత్తిని మాని పెళ్ళి చేసుకోవడం తల్లికి నచ్చకపోవడంతో గంగ కన్పించటం లేదని ఫిర్యాదు చేస్తుంది. ఈ విషయం గంగకు తెలుస్తుంది. గంగ నాయుడుచేతిలో మోసపోవడానికి ప్రతీకగా ఓ ఆడ బిడ్డకు జన్మనిస్తుంది. ఈ బాధ ఇలా ఉండగా, బిడ్డ తల్లిని అనుభవించడానికి డబ్బున్న వారు ముందుకు రారని, బిడ్డ అడ్డమని గంగ తల్లి గంగను ప్రతీసారి తిడుతుంది. తన తల్లి ఎంత తిట్టినా కులవృత్తిలోకి దిగడానికి గంగ ససేమిరా ఒప్పుకోదు. కష్టపడి పనిచేసి బిడ్డను పెంచుకోవాలనుకుంటుంది. గంగ బిడ్డకు మూడు సంవత్సరాల వయస్సులో బాగా జ్వరం వస్తుంది. ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ జమునాదేవి అనే ఆమెతో పరిచయమవుతుంది. గంగ కథనంతా తెలుసుకొనిన జమున తన ఇంటిలో గంగను పనికి చేరమంటుంది. గంగ తన కూతుర్ని అక్క జానకికి అప్పజెప్పి పనికి వెళ్తుంది. కొంతకాలం తర్వాత జమునా కుటుంబం బదిలిపై వేరే ఊరికి వెళ్లిపోతుంది.

బలహీనతను నెమరేస్తూ కూర్చోవద్దు. బలాన్ని పుంజుకోవాలి అని గంగ అనుకుంటుంది. దాంతో గంగ రాజకీయ శిక్షణ శిబిరంలో కార్యకర్తగా రాజకీయ నాయకులకు టీలు అందించడం లాంటి మొదలైన పనులు చేయడానికి చేరుతుంది. అక్కడ గంగకు మోతీ అనే గిరిజన యువతి పరిచయమవుతుంది. మోతి గిరిజన అమ్మాయి. 10వ తరగతి చదువుకుంది. రాజకీయాలంటే ఇష్టం ఉండడంతో ఉన్నత పదవులు సాధించి పై స్థాయికెళ్ళి అణగారిన వర్గానికి సేవ చేయాలనే కోరిక ఉండడంతో రాజ

కీయ నాయకుల దగ్గరకు చేరుతుంది. అందువలన ఎక్కడ మీటింగులు జరిగినా పోతూ రాజకీయ నాయకుల ఇష్టానుసారంగా మసులుకుంటుంది. తనకు పరిచయం అయిన గంగకు కూడా మెలకువలు నేర్పుతుంది. అను కున్నవి సాధించాలంటే కొన్ని వదులుకున్నా పర్వాలేదని మోతి చెప్పడంతో గంగ తన గతాన్ని, బిడ్డని గుర్తుకు తెచ్చుకుని బాధపడ్తుంది. పెద్దనాయకులతో చనువుగా వుంటే అన్ని పనులవుతాయని, దాంతో అన్ని సమస్యలు తీరుతాయని చెబుతుంది. మొదట బిడియంగా ఉండే గంగ మోతీ సాంగత్యంతో చలాకీగా తయారవుతుంది. ఎలాగైనా రాజకీయ నాయకుల అండను సంపాదించా లనుకుంటుంది. ముగింపు సమావేశంలో రాష్ట్ర మహిళ విభాగపు కమిటీలో మోతీ, గంగల పేర్లుంటాయి. తర్వాత గంగ, మోతీ ఎవరి ఊర్లకు వారు వెళ్ళిపోతారు. గంగ శిక్షణ శిబిరంలో వచ్చిన డబ్బుతో సంతోషంగా ఇంటికి వెళ్ళి తల్లికి డబ్బులిస్తుంది. ఆ డబ్బులు చూసిన గంగ తల్లి సంతోషిస్తుంది.

మహిళా శిశుసంక్షేమమంత్రి వచ్చినప్పుడు గంగ ఆమెను కలుస్తుంది. ఈ క్రమంలో సూర్యాపేట నుండి మోతీ, సాగర్ నుండి గంగా హైద్రాబాద్‌కి వచ్చి ఒకే హోటల్‌లో ఉంటారు. గంగకు మోతీ బాడుగకు ఒక ఇల్లు ఇప్పిస్తుంది. మోతీ ద్వారా పెద్ద పెద్ద నాయకులతో పరిచయాలు ఏర్పడడం వలన వారికి కావాల్సిన పనులు చేయించుకుంటారు. ముంపు భూముల బాధితులకు పట్టాలిచ్చే కార్యక్రమాలలో కలెక్టర్‌తో పాటుగా గంగ, మోతీ ఇద్దరూ పాల్గొంటారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టు అండ్ ఫొటో గ్రాఫర్ అయిన జాన్‌సన్ అనే వ్యక్తి గంగ పేద ప్రజలకోసం చేసే సేవను చూసి, ఒకరోజు ఆమెను కలిసి, ఆమెను ఫొటో తీస్తాడు. అందుకుగాను పదివేల రూపాయల చెక్కు ఇస్తాడు. ముందు ఇంకా డబ్బు వస్తుందని గంగ అడ్రస్ తీసుకుంటాడు.

ఇంకా గంగ ఊర్లో చుట్టుపక్కల అనాథ శవాలు ఏవైనా సాగర్‌లో కొట్టుకొని వచ్చినా వారికి స్వయంగా దహన సంస్కారాలు చేయిస్తుంది. ఊర్లో ఎక్కడ ఏ అనాథశవం ఉన్నా పంచనామ పూర్తికాగానే గంగకు కబురంపు తుంటారు. అలా గంగ ఊర్లో చుట్టుపక్కలా నాయకులకు గుర్తుంటుంది. మొదట ఆమె కులాన్ని ఎత్తి చూపిన ఊరి ప్రజలే ఆమె గుణాన్ని మెచ్చుకుంటారు. పత్రికలన్నీ గంగపై ప్రశంసల వర్షం కురిపిస్తాయి. గంగ తన పనులు, ఊరి ప్రజలు ముఖ్యంగా మహిళలకు సంబంధించిన ఏ పను లైనా అధికార్లను కలిసి చేయించుకుంటుంది. ఈ క్రమం లో ఎవరు ఎన్ని సూటిపోటీ మాటలన్నా పట్టించుకోదు. మోతీ, గంగా అన్ని విషయాలు ఒకరికొకరు పంచు కుంటారు. గంగ తన మేనత్త గురించి మోతికి చెబుతుంది. "మా కులం మీద హక్కు, ఇష్టం ఉన్నా లేకపోయినా కోరినవాని కోరిక తీర్చవలసిందే! అట్ల తిరిగే కదా మా మేనత్త ఆ మధ్య మనం ఎన్నికల ప్రచారానికి కర్నాటకకు పోయినప్పుడే పోయింది" అని బాధపడుతుంది. మోతీ ఇచ్చిన ధైర్యంతో రానురాను గంగ ఎన్నో విషయాలు తెలుసుకుంటుంది. మొదట్లో ఉన్న జంకును వదిలి పుస్తకా లను, పత్రికలను చదివి ఎన్నో విషయాలను తెలుసు కుంటుంది. అనాథల విషయంలో గంగ సేవాభావం రోజురోజుకు పెరుగుతుంది. వరదలప్పుడు సాగర్‌కు కొట్టు కొచ్చే శవాలను దగ్గరుండి ఖననం చేయిస్తుంది. స్థానికుల సహకారం, పోలీసుల ప్రోత్సాహం ఆమె వెన్నంటే ఉం టాయి.

గంగ తన కూతుర్ని మోతీ సహాయంతో జనగాంలోని ఓ మిషనరీ స్కూలులో చేర్పిస్తుంది. ఆ స్కూల్లో మోతీకి తెలిసిన ఫాదర్ ఉండడం వల్ల గంగ కూతురికి 'సాగరి' అని పేరు పెట్టి అక్కడే చేర్పిస్తారు. బిడ్డను అనాథలాగా హాస్టల్లో చేర్పించినందుకు గంగ బాధపడుతుంది. ఈ క్రమంలోనే ఒకసారి తనింటికి వెళ్ళి అక్క జానకిని కలు స్తుంది. కొంత డబ్బు ఇస్తుంది. పాపను స్కూల్లో చేర్పించా నని చెబుతుంది. కానీ పాప పేరు, ఏ ఊర్లో, ఏ స్కూల్లో వేశారో చెప్పదు. ఎందుకంటే తన పాప అడ్రస్ కనుక్కొని తన వాళ్ళు కులవృత్తి పేరుతో జీవితం నాశనం చేస్తారేమో నని గంగ భయం. జానకి బ్రతిమలాడగా పాప పేరు 'సాగరి' అని అమ్మతో చెప్పొద్దని చెబుతుంది. హైదరా

బాదులో ఉంటున్నానని చెప్పి వెళ్ళిపోతుంది. ఇంటికి వెళ్ళగానే పనిమనిషి దుర్గ పోస్ట్‌లో వచ్చిన కవర్‌ను గంగకు ఇస్తుంది. గంగ ఆ కవర్ విప్పి చూడగా అందులో ఇంగ్లీష్ మాసపత్రికలో గంగ ఫొటోలు. జాన్సన్ ఆ పత్రికలో గంగ చేస్తున్న సేవా కార్యక్రమాలను గురించి గొప్పగా రాస్తాడు. కరి వేపాకు, తెల్లగడ్డలు వంటి వాటితో కారంపొడి తయారు చేసే పొడిని గూర్చి జాన్సన్‌కు చెప్పగా, అతడు దానికి కూడా ఎగుమతి చేయడానికి అనుమతిని ఇప్పించి గంగకు ఆసరాగా నిలుస్తాడు. గంగ ఊర్లో మహిళలకు కుటీర పరిశ్రమల పేరుతో ఉపాధిని కల్పిస్తుంది.

గంగ మహిళా సంఘాలను కలుసుకొని వారికి కారం పొడి వ్యాపారం గురించి వివరిస్తుంది. “సంపాదించుకునే వ్యక్తి బానిసలాగ బతకాల్సిన అవసరం లేదు. భర్తల వేధింపు నుండి తప్పించు కోవచ్చు. కష్టించి బతికే వ్యక్తి కుండే గౌరవం వేరే ఉంటుంది. పిల్లల పెంపకంలో మార్పు ఉంటుంది. తినే తిండిలో, కట్టే బట్టలో తేడా వస్తుంది” అని గంగ చెబుతుంది. ఈ విధంగా సేవా కార్యక్రమాల్లో ఉన్న గంగకు సాగర్‌లో ఉన్న తల్లి గారింట్లో ఉండడానికి సమయం ఉండదు. గంగ చిన్నమ్మ ఓ లారీ డ్రైవర్‌తో వెళ్ళిపోతుంది. పెద్దమ్మకు జబ్బుచేసి వైద్య సౌకర్యం లేక చనిపోతుంది. విషయం తెలిసిన గంగ దహన సంస్కారాలు చేస్తుంది. కర్మకాండలు జరిపిస్తుంది. గంగ తండ్రి రాములుకు పూట గడవలేని పరిస్థితి. తాగి, తాగి నరాల బలహీనతతో వణుకుడు జబ్బు వచ్చి తండ్రి కూడా చనిపోతాడు. ఇక మిగిలిన తన తల్లి, అక్క జానకి బాధ్యతలు గంగే తీసుకుంటుంది.

“అమ్మా! మనం ఈ బతుకు నుండి బయటపడాలి. త్వరలో అన్ని ఏర్పాట్లు చేస్తాను. నీవు కాదనొద్దు. అక్క బతుకన్నా కాపాడుకుందాం. హోలియాలో ఓ ఇల్లు చూస్తున్న. అక్కడ ఏదన్న పరిశ్రమను పెట్టుకుని బతు కుదాం”. అని చెబుతుంది. గంగ తన కూతురు సాగర్‌లో చదువుతున్న స్కూల్‌కి వెళ్ళి చూస్తుంది. గంగ పేద మహిళలందరికీ లోన్లు ఇప్పించి కారంపొడి గిర్నీలు పెట్టిస్తుంది. పాత సామాన్లు ఏరుకుని పనిచేసుకుని, ముగ్గురు పిల్లల్ని చదివిస్తున్న సుశీలని ఒకరోజు కలుసు కుంటుంది. కులవృత్తి పేరుతో సుశీల అక్క సుజాత జీవితం రోగాలపాలు కావడంతో, తను పెళ్ళి చేసుకొని ముగ్గురు పిల్లల్ని కష్టపడి చదివిస్తున్న సుశీలని చూసి గంగ సంతోషిస్తుంది. “నా ప్రయత్న మంతా ఈ మార్పు కోసమే. మన కులం వాళ్ళు ఆ వృత్తిని మర్చి పోవాలి. మనం పదిమందిలో తలెత్తుకుని తిరగాలి. రోజులు మారుతున్నాయి. మారుతున్న కాలంతో మనం మారాలి. అందు కోసం పిల్లలను బాగా చదివించాలి” అని చెబు తుంది. ఈవిధంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న గంగ కోసం సాగర్‌లోని మహిళామండలి ఆఫీసుకు ప్రెస్ మీట్ కోసం వివిధ టీవీ ఛానళ్ళ వారిని జాన్సన్ తీసుకు వస్తాడు. గంగకు ‘ఉత్తమ సమాజ సేవిక’ అవార్డు ప్రకటిం చడం గురించి ఆ ప్రెస్‌మీట్‌ను జాన్సన్ ఏర్పాటు చేస్తాడు.

స్త్రీకి సంపాదన లేక బలహీనురాలుగా మారిపోతుంది. ఆమెకు ఆలోచనలున్నా ఆర్థికంగా చేయూత కావాలి. అందుకు బ్యాంకులను ఆశ్రయించినాము. ఈజీగా తయారుచేసే కారంపొడి ఉత్పత్తిని ప్రారంభించినాము. పంపిణి మొదలు పెట్టడంతో అది విజయవంతమైంది. ఇప్పుడది అంతర్జాతీయంగ ఎగుమతి అవుతుంది. దాంతో మహిళ సాధికారత సాధ్యమైంది. దాన్ని చూసి మరొకరు కుటీర పరిశ్రమలను పెట్టుకుంటున్నారు. ఒకప్పుడు వొళ్లమ్ముకున్న కొందరు స్త్రీలు ఇప్పుడు మార్కెట్లో వస్తు వులు అమ్ముతున్నారు. శ్రమిస్తే బట్ట, పొట్టకు కరువుం డదని అంటుంది.

జాన్సన్‌ని మనసులో ఇష్టపడిన గంగ అదే విషయాన్ని వ్యక్తం చేస్తుంది. జాతి, దేశం వేరైన ఇద్దరు కలవడం ఆశ్చర్యం, అభి నందనీయంగా చెప్పవచ్చు. జాన్సన్ గంగతో “చూడు గంగా కులం అనే పుట్టుమచ్చతోనే ప్రతి ఒక్కరూ పుడతారు. నిజమే అది మారదన్నావు. కాని మనిషి రంగునే మార్చేస్తున్న కాలం ఇది. మచ్చను మార్చడం పెద్ద ఇదేమీ కాదు. దానికి కొంత టైం కావా లంతే” అని అంటాడు. ఈవిధంగా గంగ ఒక అట్టడుగు వర్గం నుంచి వచ్చి, దురాచారాల పేరుతో దళిత కుటుం

బాల్లోని స్త్రీల జీవితాల్లాగా కాకుండా ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో ముందుకు నడుస్తుంది. గంగ కూతురు 10వ తరగతి కాగానే దేవుని పేరుతో నన్‌గా మారి సేవ చేయాలనుకుంటుందన్న విషయం తెలిసి మొదట బాధపడుతుంది. కానీ తన కూతురి నిర్ణయానికి గంగ సంతోషిస్తుంది.

ఈ విధంగా 'పుట్టుమచ్చ' నవలలో గంగ కులవృత్తి పేరుతో 8వ తరగతిలోనే చదువు ఆపేసినా ధైర్యంగా ముందుకు నడిచి ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తుంది. అసలు ఎవరూ చేయలేని సాహసకార్యాలైన అనాథా శ్రమాలు, జంతువుల కళేబరాలను ఖననం చేయడం వంటి సేవాకార్యక్రమాలను చేస్తుంది. అందుకు గంగ రిక్షా రాములు సహాయం తీసుకుంటుంది. ఎక్కడో ఓ దళిత కుటుంబంలో ఆచారాలు, కులవృత్తి పేరుతో జీవితాన్ని చాలించుకోకుండా 'ఉత్తమ సమాజ సేవిక' అవార్డు అందుకునే గొప్ప స్థాయికి ఎదిగిన చైతన్య వంతమైన దళిత మహిళగా గంగ పాత్రను రచయిత శ్రీ బోయ జంగయ్యగారు చిత్రించారు. ఊళ్ళో ప్రతి ఒక్క మహిళ సాధక బాధకాలను తీర్చే దిశగా, పెద్దవారిని కలిసే చొరవను చూపించే గంగ నేర్పు అద్వితీయం. తన అక్క జమున జీవితాన్ని కూడా పెళ్ళి పేరుతో చక్కదిద్దిన ఆదర్శ మూర్తిగా కన్పిస్తుంది. గంగ కూతురు సాగరి కూడా సేవ చేయా లన్న దృక్పథాన్ని కలిగి ఉండడం ఈనవలలో కొస మెరుపు. కులం, ఆచారాల పేరుతో స్త్రీ జీవితాన్ని, భవిష్యత్తుని ప్రశ్నార్థకం చేయొద్దన్న సందేశాన్ని గంగ పాత్ర ద్వారా చైతన్యవంతమైన సందేశాన్నిచ్చిన బోయి జంగయ్య 'పుట్టుమచ్చ' నవల తెలుగు సాహితీ చరిత్రలో ఓ గొప్ప సామాజిక సందేశాత్మక నవలగా నిలుస్తుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# జ్ఞాననేత్రుని దివ్యభక్తి

– గంగుల నాగరాజు, విద్యావారధి పరిశోధన విద్యార్థి, ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం, తిరుపతి.

ఆది మారుమూల పల్లె 1950 వరకు ఆంధ్రా ప్రాంతమైనా నేడది తమిళపల్లె కారణం పటాస్కర్ తీర్మాణం. ఆ తమిళ తెలుగు పల్లెనే కావేరి రాజపురం. ఆ ఊరిలో జక్కంపూడి మునస్వామి నాయుడు కుమారుడు జక్కంపూడి మునిరత్నం. వీరి తల్లి నరసమ్మ. జన్మతః అంధుడైన జ్ఞాన నేత్రంతో సాహిత్యపు లోతులను గాంచిన మహానుభావుడు. దాదాపు 20 శతకాలు వివిధ అంశాల మీద రాశారు. అవి భక్తి, నీతి, యతులకు సంబంధించినవిగా ఉన్నాయి.

భక్తి శతకాలలో శైవ శతకాలు, వైష్ణవ శతకాలు రాశారు. వైష్ణవ శతకాలలో వేంకటేశ్వర శతకం, కృష్ణ శతకం వున్నాయి. ఈ శతకాల ద్వారా మునిరత్నం వైష్ణవ మతాన్ని. విష్ణు భక్తిని, విష్ణు తత్వాన్ని ఎలా కొనియాడినారో?, అందులోని విశేషాలేవో ఈ వ్యాసం పరి చయం చేస్తుంది.

వేంకటేశ్వర శతకంలో వేంకటేశ్వరా! అన్నది మకుటం దీనిలో 108 ఉత్పల మాల పద్యాలు ఉన్నాయి. అన్నీ సులభంగా సరళ సుందరంగా ఉంటాయి. కళ్ళు లేక పోయినా తన మర్మచక్షువులతో వేంకటేశ్వరస్వామిని దర్శించిన తీరు క్రింది పద్యం తేటతెల్లం చేస్తుంది.

పూజలు సేయనెంచినను పూవులు గైకొని రాన సక్తుడన్
జాజులమారు నర్చనిదె సల్పెద నుత్పలమాలికావళిన్
నీజవమేర్పడంగ గొని నిండుదనంబు నొసంగి కావవే
రాజసహస్ర తేజ! మునిరాజసుపూజిత ! వేంకటేశ్వరా!

చక్కని పద విన్యాసంతో వేంకటేశ్వరున్ని రాజసహస్ర తేజ అనడం చాలా గొప్ప భావన. పద్యం కడుహృద్యం.

వేంకటేశ్వర శతకం భక్తి ప్రధాన శతకమైనా దీనిలో నీతులను కూడా అడుగడుగునా చెప్పి, భక్తికి లంకె పెట్టిన తీరు మనోహరం. భక్తి పేరుతో విచ్చలవిడిగా సంచరించి, మనసులో ఒకటి మాటలో వేరొకటి చెప్పే ఖలులను గురించి 97వ పద్యంలో ఇలా సెలవిచ్చారు.

చొప్పడు చిత్తమందొకటి చూడగవేరగు నంతలోపలన్
చెప్పునదొక్కమాట మరిచేతతదీయ విరుద్ధమయ్యెడిన్
చొప్పులెరుంగరాదు మనుజుల్ యిటులెందుకు మారిపోదురో
విప్పుము వారి కన్నులను వేగమే ధాత్రిని వేంకటేశ్వరా!

పూటకు మాటలు మార్చే దుష్టుల కన్నులను తెరిపించి మంచి మార్గములో నడిచేలాగున కృపతో వారి కళ్ళు తెరిపించు అని వినయ పూర్వక వేడుకోలు చక్కగా నున్నది.

వేంకటేశ్వర శతకంలో దశావతారాల గొప్పతనాన్ని, పురాణాల ప్రాశస్త్యాన్ని పురాణ పురషుల వ్యక్తిత్వాన్ని అత్యద్భుతంగా వింగడించి చెప్పించిన తీరు కడురమ్యం.

కృష్ణ శతకంలో ఒకే పద్యంలో దశావతారాల ప్రాముఖ్యాన్ని అత్యంత నేర్పుతో కూర్చిన తీరుకు క్రింది పద్యమే సాక్షం. ఈ కృష్ణ శతకంలో 116 శార్దూల పద్యాలున్నాయి.

మీనంబై, కమఠంబునై, కిటియునై, మేల్నారసింహంబునై,
కానన్వామనుడై కుఠారధరుడై, కౌసల్యకుంబిడ్డడై,
పీనోరుండగు కృష్ణుడై, పురసతీబింబాధరస్వాధియై
రానుంకించెడు కల్కియై భువనముల్ రక్షించు కృష్ణప్రభూ !

గుండెల్లో పొంగులెత్తిన కృష్ణ భక్తితో విష్ణుదేవుని దశావతార మహిమను ఒక్క పద్యములో వక్కాణించడం మహద్భుతం. తన హృదయాన్ని శ్రీవారికి అంకితం చేసిన సందర్భం మనోహరం.

మునిరత్నం కవిత్వం విష్ణుభక్తిలో ధారాశుద్ధిగా సాగిపోగలదు. ప్రసన్నమైన భావవ్యక్తీకరణ, అందమైన పదాల పొందిక, ఊహల విశ్లేషణ పాఠకులకు ఆనందం కలిగిస్తుంది. "హరినామ స్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళి" - అన్న పోతన మాట స్మరింపదగినది. ఈ శతకంలో మునిరత్నం భగవంతుని పట్ల తపనతో కూడిన ఆర్తి అక్షరబద్ధమై శోభాయమానమైంది. అట్టి శోభాయమాన ప్రకాశం వెదజల్లు పద్యాల్లో మచ్చుకు ఒకటి చూస్తే......

నీపాదాబ్జయుగంబు నాదుమదిలో నిత్యంబు తానుండనీ,
గోపీవల్లభ! నీకథా శ్రవణమే గుండెన్ సదా పండనీ,
గోపాలా! భవదీయ భక్తిసుధ నాకున్ ప్రాణమై యుండనీ,
పాపధ్వంసక! లోక నాయక! కృపాపారేణ! కృష్ణ ప్రభూ!
- 7వ పద్యం.

కృపతో పాపాలను హరించే లోకనాయకుడు మాధవుడు. అలాంటి మాధవుని పాదాలు సేవించడం, కథలు వినడం, భక్తి సుధను గ్రోలడం నిరంతరం నాకు ఇవ్వాలని కవి కోరుకున్నా...... లోకుల హృదయ స్పందనను తెలిపి నట్లున్నది.

తన జ్ఞాన నేత్రంతో దివ్యమైన విష్ణు భక్తిని మునిరత్నం సమాజానికి అందించారు. తన వేంకటేశ్వర, కృష్ణ శతకాలలో చారిత్రక, సమకాలీన, పౌరాణిక అంశాలను మేళవించి, అవతార పురుషుల గరిమను కొనియాడిన తీరు రసరమ్యం.

వేయిమాటలెందుకు ఒక్క మాటలో చెప్పాలంటే రెండు శతకాలు అర్థ గాంభీర్యంతో సాగిన ఆత్మాశ్రయ భక్తికి పరాకాష్టగా చెప్పవచ్చు. సమాజానికి నిలువెత్తు నిగ్గుటద్దాల్లా, సమాజాభివృద్ధికి దోహదం చేసేలా రెండు శతకాలు భక్తిరసంతో తొణికిసలాడు తున్నాయి.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# జాషువా - స్త్రీ

**- జి. నీలిమ,** పరిశోధక విద్యార్థిని, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

తెలుగు జాతి గర్వించదగ్గ కవి, నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా. సమకాలీన కవులతో ప్రశంశలు అందుకున్న జాషువా, తన రచనలో ఓ శతాబ్ధి ముందున్నాడు. విశ్వ నరుడుని అని సగర్వంగా చాటుకుని అశేష ఆంధ్ర ప్రజానీ కానికి ఆరాధ్యుడు, మార్గదర్శకుడు అయినాడు.

చిన్నతనం నుండి ఎన్నో కష్టాలు, అవమానాలు ఎదుర్కొన్నాడు. ఆచార్య జి.యన్. రెడ్డిగారు జాషువా గురించి "ఆధుని కాంధ్ర సాహిత్యరంగంలో తొలితరం కవుల్లో అన్ని విధాలా విల క్షణంగా ప్రసన్నమయ్యే మూర్తి జాషువా. వారిది రాపిడిపడ్డ జీవితం. రాపిడిలో రాణించిన ప్రతిభ ప్రతిభతో గుబాళించిన కవిత" అంటారు.

స్త్రీలను గౌరవించడం మన సంస్కృతిలో భాగం. పిత్రృస్వామ్య వ్యవస్థలో ఆనాడు స్త్రీ పరిస్థితి దయనీయంగా ఉండేది. ఆ పరిసితే జాషువాను కదిలించింది. "స్త్రీని బానిసగా, నిష్ప్రయోజనంగా, పురుషాధిక్య భావనతో జాషువా చూడలేదు. అలా చూసేవారిని, ఆర్థిక, సాంఘిక అసమానతలను చూసి బాధ పడ్డాడు. జాషువాలో ఉన్న మాతృస్వామ్య భావాలే దీనికి కారణం. అందుకే అనాథ, స్వప్న కథలలో స్త్రీలనే పాత్రలుగా చేసి భావ కవితా స్త్రీ కన్నా భిన్నమైన స్త్రీలను సృష్టించాడు" (జాషువా స్వప్నం సందేశం - రాచపాళెం). ఇది జాషువాలోని మరో కోణం. స్త్రీ వాదులు నేడు ప్రకటిస్తున్న భావాలను వందేళ్ళ క్రితమే జాషువా తన రచనలలో చెప్పారు.

"మగతెగయు నాడ తెగయను
తెగలున్నవి రెండు ఆడు తెగ లేకున్నన్
మగ తెగకు పుట్టగతిలే
దగణ్యములు రెండు తెగల అనుబంధంబుల్" (ముసాఫరులు)

సృష్టి క్రమం జరగడం కోసం జీవరాసులన్నీ ఆడామగా అనే బేధాలతో ఏర్పడ్డాయి. ఇందులో ఒక తెగ ఎక్కువ, ఒక తెగ తక్కువ అనే బేధాలు ఉండవు. సృష్టిలో అందరూ సమానమే. ఆడ తెగ లేకపోతే మగతెగకు పుట్టుకేలేదు. కనుక ఆడ, మగ ఇద్దరు కలిసి జీవించడమే మానవ లోకకళ్యాణమని గుర్తించాలి! అంటూ స్త్రీ పురుషులిద్దరూ సమానమే అని చెప్తున్నారు జాషువా.

'ఆడుది లేకుండిన నీ
రేడు జగంబులకు శోభయేలేదు నరుం
డూడిగపు యంత్రమను కొని
చెడెను బంధించి వ్యర్థజీవి నొనర్చెదన్'
(ముసాఫరులు)

మేమే గొప్పవారము అంటూ పురుషులు విర్రవీగుతుంటారు. ఇంతి లేకపోతే ఈ ఏడు జగాలకు కూడా కళకాంతి ఉండదు. స్త్రీ లేని జీవితంపై పురుషులకు విరక్తి కలుగుతుంది. సృష్టికి కారణమైన స్త్రీని ఊడిగం చేసే యంత్రం లాగా చూస్తున్నారు. ఇది మంచిది కాదు అంటూ జాషువా మహిళల పక్షాన మాట్లాడు తున్నారు.

సమకాలీన భావకవులంతా స్త్రీ అంటే శరీరం మాత్రమే అని వారి శరీరాన్ని ఎన్నో రకాలుగా వర్ణించారు. స్త్రీ అంటే శరీరం మాత్రమే కాదు అనే విషయాన్ని జాషువా

"వాడు వారని పుష్పపరిమళాసారంబు
చిలికించి తనువుల సృష్టి జేసి
నగ సహస్రములలో బిగి యెల్ల గొని వచ్చి
పసరు పాలిండ్లలో పాదుకొల్పి
ఆణిముత్యపు చిప్పలందున్న నైగని
గ్యమును లావణ్యంబుగా బిగించి
తీపిజారని పుట్టుతేనే వాకలమూక
అధర బింబంబుల యందమర్చి
కాంతలను సృష్టి చేయని కారణమున
పెండ్లియాడిన భార్యల పిప్పిజేసి

తరుముచున్నవి పురుష భూతములు కొన్ని
స్త్రీత్వమిడి యట్టి వారి శిక్షింపవోయి"
(కొత్తలోకం)

ఆడదంటే ఇలాగే ఉండాలని భావకవులు చెప్పే వర్ణనలు చదివి మగవారు తమ భార్యలు అప్సరసలుగా ఉండాలని కోరుకుంటారు. భార్య అందంగా లేని పక్షంలో ఆమెను హింసలకు గురిచేస్తుంటారు. దేవుడా! అటువంటి మూర్ఖులను షండులుగా మార్చిశిక్షించు! సౌందర్యం అంటే బాహ్యసౌందర్యం కాదు అంతఃసౌందర్యం! దానిని గుర్తించలేని వారిని శిక్షించాలంటూ దేవుని ప్రార్థిస్తున్నాడు జాషువా.

జయప్రభ "సౌందర్యాత్మక హింస" అనే కవితలో ఇదే భావాన్ని

"మనమంటే 34,24,36 కొలతలమైనచోట
మొటిమలు మొలవడం, జుట్టురాలడం
నడుం సన్నగా లేకపోవడమే
... ... ...
అందాల వ్యాపారాన్ని నిషేదిద్దాం" అంటూ శరీరపు వర్ణనలను నిరసిస్తున్నారు.

"స్త్రీ కంటెం బురుషుడు శ్రేష్టుడనుచున్ సిద్ధాంతముల్ చేసి తా
టాకుల్ కంఠములెత్తి స్త్రీ జగతి కన్యాయంబు గావించెనో
యేకాలంబున పుట్టి నింటయిన లేవేనాటి స్వాతంత్రముల్
స్త్రీకిన్ మారు సమాన గౌరవ విభూతిన్ గాంతకుం గూర్పమా"

స్త్రీ కంటే పురుషులు గొప్పవారని తరతరాలుగా సిద్ధాంతకర్తలు తాటాకుల గ్రంథాలపై రాస్తున్నారు. అది స్త్రీకి అన్యాయం చేయడం కాదా. మెట్టినింట్లోనేకాదు పుట్టింట్లో కూడా ఆమెకు స్వాతంత్ర్యంలేదు. అక్కడకూడ వివిధ కట్టుబాట్లతో పెంచుతారు. స్వాతంత్ర్యం రుచి చూడని స్త్రీల బానిసత్వాన్ని జాషువా ఎత్తి చూపుతున్నాడు.

"అనసూయాదులు మూటగట్టుకొని రానాడు గంపంత చి
క్కని పుణ్యంబని వేదశాస్త్రములు వక్కాణింపగానమ్మిగొం
తునకుచ్చుల్ దగిలించు సంఘమను శార్దూలంబు వ్యక్తిత్వమున్
దినుచున్నన్ జలియింప విప్పటికి నింతీ యెంతశాంతాత్మవో"
(వంచిత)

స్త్రీలను నియంత్రించడానికి, చిన్నతనం నుండి ఎన్నో పతి వ్రతల కథలను నూరిపోస్తుంది సమాజం. ఆడది అంటే అణిగి మణిగి ఉండాలి. వంచిన తల ఎత్తకూడదు. భర్తమాటకు ఎదురు చెప్పకూడదు. భర్తే దైవం. జీవితం మొత్తం భర్త, అత్త మామలకు సేవ చేస్తూనే గడపాలి అంటూ పతివ్రతల పేర్లు చెప్పి ఈ సంఘం క్రూరంగా ప్రవర్తిస్తుంది. వ్యక్తిత్వాన్ని చంపడానికి ప్రయత్నిస్తుంది. ఆ విషయం గుర్తించిక అవన్నీ నిజమని నమ్ముతావు. అన్ని హింసలను శాంతంగా భరిస్తున్నావు! దుర్మార్గపు సంఘం ఆలోచనలకు తలవంచి, అంతా తలరాత అని సరిపెట్టు కొని భారంగా జీవితాలను గడపకండి. మేల్కొనండి, విద్యావంతులు కండి అంటూ ప్రబోధం చేస్తున్నాడు జాషువా.

కుటుంబంలో ప్రధాన పాత్ర స్త్రీదే. అందరికీ అన్నీ సమ కూరుస్తూ ఒక యంత్రంలా పనిచేస్తుంది. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో తల్లి ప్రముఖ పాత్ర వహిస్తుంది. అటువంటి నీకు ఎందుకు సమానహోదా ఇవ్వరు. అదే విదేశీ మహిళలైతే, తమ సమానత్వానికి భంగం వాటిల్లితే సహిస్తారా! వారిని చూసైనా మేలుకోండి

"పిల్లలగాంచి పెంచి పృథివింబొదలించెడు మాతృమూర్తివై
యల్లములేని శాసన పుంటచ్చులకుం గురియై తపింతువే
తల్లీ! విదేశ సుందరీమణుల దంతపుర బ్రతుకుల్ సహింతురే
కల్లలు విశ్వశించి సమగౌరవ హానికి సమ్మతింతురే?"
అంటూ మహిళలను చైతన్యవంతులను చేస్తున్నాడు.

నేటి పితృస్వామ్య వ్యవస్థలో పురుషుని ఆదిపత్యం కొనసాగుతుంది. స్త్రీలను కేవలం ఇంటి పనులకే పరిమితం చేస్తున్నారు. వంటిల్లే నీ ప్రపంచం అంటూ వంటింటికే అంకితం చేస్తున్నారు. ఈ భావనను జాషువా.

"పురుషులు వంట యింటి కొరముట్టుగ నిన్ను గణించుచుండ కి
క్కురు మనకుండ సంసరణ కూపమునంబడి మంద భాగ్యవై
వరవుడ మాచరించెదవు భారత పుత్రిక నంచు రిత్త సం
బరపడుచుందు వింటి తలవాకిలి దాటని పుట్టు ఖైదువై"

పురుషులు నిన్ను వంటింట్లో ఒక వస్తువుగా చూస్తున్నా ఏమీ మాట్లాడక మౌనంగా ఉంటావు. సంసారం అనే

కూపంలో పడి 'నూతిలో కప్పలా' బయట ప్రపంచం గురించి తెలుసుకోకుండా బ్రతుకుతున్నావు. ఇంటి వాకిలి దాటలేని ఖైదీలా బందీవైనావు. ఈ బంధనాల నుండి బయట పడి నీ అస్థిత్వాన్ని కాపాడుకో అంటూ హితబోధ చేస్తున్నాడు జాషువా.

ఇదే భావనను విమల 'వంటిల్లు' కవితలో

"మా అమ్మ నడుస్తున్న వంటగదిలా ఉంటుంది
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే మహారాణి
అయినా చివరకు వంటింటి గిన్నెలపై కూడా మా నాన్నపేరే"

అంటూ స్త్రీలు వంటింటికి పరిమితం కావడం గురించి చెబుతుంది.

"దయ్యంము పూనకంబయ్యె నాకని లేచి
నగ్నతాండవ మాడుభగ్నచిత్త
కృపలేని మగని ఱంపపు కోత బడలేక
యురిబోసుకొని దేహమూడ్చుతరిణి
అత్తమామల క్రూరమైన దాష్టికంబు
నోర్వక చిచ్చులో నురకురమణి"
(వంచిత)

కుటుంబంలో హింసను తట్టుకోలేక మానసిక వ్యధతో హిస్టీ రియా వచ్చినట్లు ప్రవర్తిస్తుంటారు కొందరు. అటువంటి వారికి దయ్యం పట్టిందని చెప్పి ఆమెను ఇంకా హింసిస్తారు. భార్యలను హింసించడమే జన్మహక్కు అనుకునే భర్తల నుండి తప్పించుకోలేక ఎందరో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ అరాచకాలన్నింటికి ఒక రకంగా మన శాస్త్రాలు, వాటిని ప్రోత్సహించే వ్యక్తులే కారణం. అంటూ సమాజపు కట్టుబాట్లను జాషువా ద్వేషిస్తున్నాడు. కరుణ లేని కాపురాలు అగ్నిగుండంలో గుగ్గిలాల వంటివి అంటూ అబలలపై హింసను జాషువా ఈసడించుకుంటున్నారు.

ఇటువంటి దురాచారాలన్నీ నశించి, స్త్రీకి ప్రశ్నించే శక్తి రావాలంటే విద్య అవసరం "అబల విద్యాపూర్ణమై తోడు రాకున్నన్ దేశము నిద్రమేలుకొనునే?" అంటూ ప్రశ్నిస్తున్నాడు జాషువా.

"అబలయన్న బిరుదమంటించి కాంతల
స్వీయశక్తులదిమి చిదిమినారు
సబలయన్న బిరుదు సాధించి హక్కులు
గడన చేసికొమ్ము కష్టచరిత"
(వంచిత)

స్త్రీలు సుకుమారులని, శక్తిహీనులు అని, తెలివి లేని వారని చెప్పి బలవంతంగా అబల అనే బిరుదు తగిలించారు. నీకు బలంలేదని చెప్తూ నిన్ను అణగదొక్కడం వల్ల నీ బలం ప్రదర్శించే వీలు లేకుండా పోయింది. పురుషులు నీ శక్తి యుక్తులు అణచి వేశారు. పురుషుల అహంకారానికి తలవంచి ఇంకా ఎన్ని రోజులు అబలగా ఉంటావు? నేను అబలను కాదు అని నిరూపించుకో. పురుషులతో సమానంగా అన్ని హక్కులు సాధించుకుని తల ఎత్తి నిలబడు అంటూ జాషువా మహిళా లోకాన్ని ప్రోత్సహిస్తున్నాడు.

"గగరిను ప్రభృతుల సాహస
గగన విజేతలకు సాటిగా రాకెటుతో
నెగిరి జయించితవబలా
ప్రగతికి నాదర్శమగు వాలంటీనా" (వీరకుమారి)

మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరు. 'ముదితల్ నేర్వగ రాని విద్యలు కలవే ముద్దార నేర్పింపగన్" అంటారు కదా. రష్యా వనిత వాలెంటినా తెరిష్కోవాను ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవండి అంటూ చెపుతున్నారు జాషువా.

స్త్రీ పురుషులు ఇద్దరూ సమానంగా ఎదిగినపుడే ప్రగతి.

"కాంత మగవారితో చేయిగలపకున్న
తలపనేల యనర్థంబు తప్పదనచు" (నేటి నెలత)

అంటూ స్పష్టం చేశాడు జాషువా.

మారుతున్న కాలంతో పాటు స్త్రీలలో కూడా అనేక మార్పులు వచ్చాయి. మగువలో వచ్చిన తెగువను మెచ్చుకుంటూ జాషువా

"గ్రహియించినది నేటి కామినీ తిలకంబు
బురఖాల కెరయైన బుద్ధిబలము

తెలిసికొన్నది నేటి కలికి ముద్దులగుమ్మ
యుబ్బించు గాధలందున్న కిటుకు
అర్థమైనది నేటి యంబుజాతాస్యకు
లేలేత బుడత పెండ్లిండ్లనేగి"
(నేటి నెలత)

భారత స్త్రీ మానసిక పరదాల నుండి బయటపడింది. మూఢ విశ్వాసాల నుండి, పాతివ్రత్య మహిమల నుండి నేటికి వెలుపలికి వచ్చింది. ఆ మూఢార్థాల ఆంతర్యము తెలుసుకొని విముక్తురాలైంది అంటూ మహిళలో వచ్చిన మార్పును జాషువా ప్రశంశిస్తున్నాడు. జాషువాలోని ప్రేమతత్వమే స్త్రీని మనిషిగా చూసింది. ఆమె ఈ భావ దాస్యాల నుండి, సామాజిక కట్టుబాట్ల నుండి బయటకు రావాలనే ఆకాంక్ష ఏర్పడింది. స్త్రీ అభ్యు దయానికి బీజం వేసి ఆ ఫలాలు అందరికీ అందించింది జాషువా కవిత్వం.

✿ ✿ ✿

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# "జూపాక సుభద్ర గారి అయ్యయ్యో దమ్మక్క కవిత్వం - పరిశీలన"

- డా॥ ఓరుగంటి సరస్వతి, పి.డి.ఎఫ్., నిఘంటు నిర్మాణశాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాదు.

దళిత మహిళల సాధికారం, బహుజనులకు అధికారం, మహి ళకు సరైన ప్రాతినిధ్యం తెలంగాణా సాంస్కృతిక వికాసం కోసం కలం బట్టిన జూపాక సుభద్ర గారు కవిత, కథ, గేయ, వ్యాస ప్రక్రియలను తెలంగాణ మట్టి జీవితాలకు జీవం పోశారు. కాలమిస్టుగా, గేయ రచయిత్రిగా, అనువాదకురాలిగా, పరిశోధకురాలిగా, అధ్యాపకురాలిగా, సామాజిక కార్యకర్తగా జూపాక సుభద్ర గారు బహుముఖ ప్రజ్ఞాశాలి.

జూపాక సుభద్ర గారి అయ్యమోదమ్మక్క కవితా సంపుటిని తన సహజ భాష, భావాలతో రాశారు. 'బువ్వ పెట్టే భూమి - కావాలి కవితలో

"మా భూమిని బువ్వను మాయంజేసి
మాసేతుల పైసబెడితే - మేంజేస్కోవాల్నో
మే మెత్తుతెలాల్నో యెరుకలేనోల్లం
బబుక్కు బలమిచ్చి సావుకు తలంపంచే
మట్టి తత్వాల తడులు కార్పోరేట్ కళ్ళకు
అర్తమైతంతరూ!
మాకు బువ్వపెట్టే భూమి కావాలె!
పాడయిపోయే పైసెందుకు?" అని చెప్తుంది.

కాలు నా బొచ్చె మీద కావలుండే బొంత పేగ్గాదు కవితలో దళిత స్త్రీ కొంగును గురించి వివరించారు.

"నాదుక్కం, కంటికిమింటికి ఏకధారైతే
నాకండ్ల కథల్ని కన్నతల్లోలె దగ్గెరికి దీసి
అదుముకుంటది నా మట్టికొంగు పేల్క
పెనిమిటికి తాపమొచ్చినా కోపమొచ్చినా
సెతిల యెన్నముద్దోలె నాకంటి ముందట్నే దొరికిపోతది
ఇంట్లోని, బైటోని, బలిమికైనా జులుముకైనా
సెంబడేది ముందు నా కొంపేగే అని అలసిన
దళిత స్త్రీ యొక్క కొంగును చిత్రించారు.

పొయిమీద గిన్నెలకు మసిబంతపేగై
సెయిగాల్సుకుంటది
యేడ్సే నా యెడపిల్లలకు
పొత్తిగుడ్డై హత్తుకుంటది
ఈనినావు నాకినట్లు పెయిమీని దుమ్మంత నాకుతది
నెలబట్ట మాసిన మోదుగుపూరంగుకు
తడ్కసాటోలె అడ్డువడ్తది.....అటువంటి కొంగు
గుండెలమీద......చీరే గుదిబండకాదు. అని చీర కొంగును గురించి వివరించారు.

అలాగే మాక్క ముక్కుపుల్ల గీన్నే పోయింది. కవితలో.....

"మా ముసలవ్వలు లేకిసాటలల్ల సెరిగి, కొడిన సప్పుల్లేంటి మో
కాల్లాల్ని కుల్లబొడిసి పూడ్సిన లేకి సీపర్లకంటని
యిత్తుల యిల్లంత కుంటలేంటిమొ" అని దళిత స్త్రీల ఆవేదనల్ని వారికి దక్కని శ్రమను వివరించారు.

కారంచేడు నుంచి కైర్లాంజిదాక కవితలో అన్ని వర్గాల స్త్రీలు ఒక్కటేనన్న అభిప్రాయాన్ని ఖండించారు రచయిత్రి.....

దొరోని కింద దొర్సాండ్లమైనా
మాసెంపమీద సెయ్యేసెటోడు బుట్టకపోవు
బాంచెగాని యెన్నుదన్నుకొని, బాసిగం గట్టుకున్న పాపానికి
మామ సెప్పుకింద వాడ కాలికింద సెత్తలమైతిమి
నల్లోడు జెరతెల్లబట్ట గట్టాదు......అన్నారు.

ఎనుకటి మా బలిచక్రవర్తి కాన్నుంచి కైర్లంజి భయ్యాలాల్ దాక
కొట్టి, నరికి, మానభంగాలు జేసి, సంపికాల్వలేసి
నాజాతి జాగల్ని, మనుషుల్ని దాదఋ ఫిరాదుల్లేకుంట
ఆగం జేసిన బాగోతాల్లే ఆల్లయనీ......అన్నారు

ఇంకా.....మాది మాల-కూలి, వాడజెండర్, అత్యాచారాలకు అడ్డా జెండర్

ఇంకా..... మామీద జరిగే మర్డర్లు మానభంగాలు నీల్లు తాగినంత వీజి...

ఎంత తోడుకున్నా నాచరిత్ర సెదపురుగులు మంగిన సంగతులే
పోలీసులు-చట్టాలు-కోర్టులు-తీర్పులు-ఏలినోల్లు-సంచుర్లు
దళితుల్లో ఐకమత్య కోరుతూ గోరుకొయ్యనై కావలుంటానురా కవితలో

"మన అంటరాని సిప్పసందమామల
దళితనూకసుక్కలు సిల్లంకల్లంగాకుంట
నేను గోరుకొయ్యనై కావలుంటరా బిడ్డా" ...... అని అంటుంది

సెత్తోలె ఎత్తిపారబోస్తం కవితలో చెత్తఎత్తె కార్మికుల వెతల్ని చిత్రించారు....

ఒక్కదినం గాదు రెండుదినాలుగాదు
రోడ్లూడ్సి వూడ్సి సీపురుకట్టలోలె తిరిగిపోతిమి
మొండిసెత్తను ఎత్తిపోసి కంకెరదేలినట్లు
మాబొక్కలు తేలినయి.....
మనుషుల్ని మరుగునేస్తే
మిషిండ్లను సెత్తోలె యెత్తిపారబోస్తం. అని నిరసన తెల్పారు.

వాకపల్లి గిరిజన స్త్రీల మీద అత్యాచారానికి రుజువుల్లేవని కేసును కొట్టేసినందుకు నిరసనగా సుభద్రగారు **మా అడవిపంచకురాండ్రి** కవితలో చిత్రించారు.

అయ్యా..సారూ...బాంచెన్
నోరున్నోల్లు వూరున్నోలు
మీద్ది కిందజేత్తరు కిందిది మీద జేత్తరు
మీ సేతిల సుత్తె......అని అంటారు.

అంతేకాకుండా మీ అనుమానపు అక్షరాలు - మీకండ్ల కయితాల నిండా ఎగరేసిన సంచలన జెండాలైనయి
తడిగుడ్డ గొంతుకోతలు అబద్ధాల్ని సానబెట్టుకున్నయి
సెట్టుంగొట్టేసినట్లు మాకసును కొట్టేస్తిరి అని ఆవేదనను వ్యక్తం చేస్తారు.

అయ్యమ్మోదమ్మక్క పు. 50
మట్టిపూల సొదల్ని ఎదమీదికెత్తుకోవా కవితలో.......

పుట్ల దాన్యెం వూడ్చినా
పురిసెడు గింజలు దక్కని లేకిసీపుర్ని
దుబ్బల్ల, రాళ్లల్ల, పొక్కల్ల
ఎల్కపిల్లలోలె, దాక్కున్న యిత్తుల్ని
వూపిరంత వుగ్గపట్టి
పుట్టెడు మట్టిని సెరిగి సెరిగి సెండాడిన
సొరెడిత్తులు వేటాడుకోలేని పాతశాటని
కాళీ కడుపుల కాళ్లు ముడ్సుకొన్న తెల్లారని నడిజామును
.........మహిళాదినోత్సవాలు జాతి జాజిమల్లెల్తో
అంతర్జాతీయ ఆమనీలతో
మీడియా మీసాలమీద ఉయ్యాల జంపాలైతయి
మార్చి ఎనిమిదవ్వ
మా మట్టిపూల సొదల్ని నీ ఎదమీదికెత్తుకోవా?

అని దళిత మహిళలను గుర్తించాల్సిన ఆవశ్యకతను వివరించారు.

నేటికి కూడా దళితులపై జరుగుతున్న అకృత్యాలను, అఘా యిత్యాలను, దళితుల వెతలను కవిత్వం రూపంలో వెలువరించారు. చాలీచాలని బతుకులను ఎల్లదీయలేక, పడే బాధల్ని కడుహృద్యంగా చిత్రించారు రచయిత్రి.

ఆధునికయుగం అని చెప్పుకుంటున్న నేటి కాలంలో కూడా రోడ్లూడ్సే వారి జీవితాలు వెలుగుబాటల్లోకి రాని వైనాన్ని చెత్తఎత్తె కార్మికుల వెతల్ని చిత్రించారు.

దళితశక్తి జూపాక సుభద్ర తెలంగాణ సెక్రటేరియట్‌లో పంచాయితీరాజ్ శాఖలో అదనపు కార్యదర్శి విధులు నిర్వహిస్తూనే, సమాజంలో అనేక సమస్యలతో బాధపడుతున్న వారిని, ముఖ్యంగా అట్టడుగువర్గ ప్రజానీకం వెతల్ని తన కలం నుండి కథలు, కవిత్వం ద్వారా వెలువరిస్తున్న రచయిత్రి జూపాక సుభద్ర గారు. అట్టడుగు వర్గాల వెతల్ని కళ్ళకు కట్టినట్లు నడిపించే తన రచనా పాటవం అద్భుతం. దళిత మహిళల్ని ఎదగనియ్యని కుసంస్కృతిని కూడా తూర్పారపట్టిన రచనా వ్యాసంగం ఆమెది. అటువంటి గొప్ప రచయిత్రిగా పేరెన్నికకన్న జూపాక సుభద్ర గారి కలం నుండి మరెన్నో రచనలు వెలువడి బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల దాస్య విముక్తికి దోహదం చేయాలిని కోరుకుందాం.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# వ్యక్తిత్వ వికాస కేంద్రాలు మన పాఠశాలలు

- ఆచార్య కిన్నెర శ్రీదేవి,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

- అనిత ఓబిరెడ్డి,
పరిశోధక విద్యార్థి, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

"ఏమనిషిని కదిపినా నేటి సమాజంలో మానవ విలువలు అంతరించిపోతున్నాయి. స్వార్థం పెరిగిపోతోంది. అధర్మ మార్గంలో విజయాన్ని పొందడం ప్రజల అంగీకారమైపోయింది. ఏది మంచి ఏది చెడు అని నిర్వచించలేని స్థాయికి నేటి జీవనవిధానం చేరింది. ఎవరైనా ఒక వ్యక్తి దోషాలను ఎత్తిచూపితే నా దోషాల గురించి మాట్లాడటం కాదు, ఎదుటివాడు నాకన్నా ఎక్కువ దోషాలను కలిగి ఉన్నాడు వాడి గురించి మాట్లాడండి అంటాడు." నేటి సమాజం మీద ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు. మరి మన చదువులు మనకి ఏమి నేర్పాయి? నేటి సమాజంలో స్వీయ పరిశీలన స్వీయ క్రమశిక్షణ ఎందుకు కనుమరుగవుతోంది? సమాజం పట్ల తన బాధ్యతను మరచి ఎదుటివారిని ప్రశ్నించడం నేటి సమాజ ధోరణిగా మారిపోయింది. మన పాఠశాలలు మనకు ఏమి నేర్పిస్తున్నాయి. మన ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ఏమైపోయాయి. ఎందుకు మనుషుల్లో స్వార్థం ఇంతలా పెరిగిపోయిది? రేపటి తరాలకు మనం ఇచ్చే వారసత్వం ఇదా? ఒక్కసారి మనం ప్రశ్నించుకుందాం?

ప్రతి వ్యక్తి తన విద్యాభ్యాసం పూర్తి అయ్యేలోపు ఎక్కువ సమయం విద్యాలయంలోనే గడుపుతాడు. ప్రపంచీకరణ, సాంకేతికాభివృద్ధి మరియు సామాజిక మాధ్యమాల ప్రభావంతో విద్యకి అర్థమే మారిపోయింది. మానవ విలువలను పెంపొందించడానికి ఉద్దేశించిన భాషా అధ్యయానాన్ని కేవలం మార్కుల కోసం మాత్రమే చదవడం విద్యార్థులకు అలవాటయిపోయింది. మానవ విలువలను బోధించే ఎన్నో పాఠాలు భాషా అధ్యయనం ద్వారా మనం తెలుసుకోవచ్చు. ఎప్పుడైతే విద్యకు అర్థం మారిందో విద్య విజ్ఞానం కోసం కాదు విద్య ధనార్జన కోసం, విద్య అధికారం కోసం, విద్య హోదా కోసం అనే భావన సమాజంలో వచ్చిందో ఆరోజే సమాజంలో మానవ విలువలు పతనం అవడం ప్రారంభమైంది.

ఏ కాలంలో అయిన ఏ యుగంలో అయినా మనిషి ఉన్న తంగా జీవించడానికి కావలసిన జీవన సూత్రాలను మన సాహిత్యం ఎంతో వివరంగా తెలియజేస్తోంది. భాషా బోధకులు ఇప్పటికైనా జీతం కోసం ఉద్యోగం చేస్తున్నాం అన్న ధోరణి వదలి విద్యార్థుల జీవితాలు ఆనందమయమవడానికి తద్వారా ఓ కొత్త బంగారు లోకాన్ని సృష్టించడానికి తమ బోధనలను ఉపయోగించాలి. రామాయణం, మహాభారతం, భగవద్గీత మరియు ఉపనిషత్తులు మనకు ఉన్న జ్ఞాననిధులు. నేటి ఆధునిక సమా జంలో ఎన్నో సమస్యలకు పరిష్కారాలను మన సాహిత్యం తెలుపుతోంది. ప్రతి విద్యార్థి తన సంస్కృతిని, సంప్రదాయాలను అర్థం చేసుకొని, వాటిని ఆచరణలో పెట్టడం ద్వారా ఎన్నో ఆధునిక సమాజ సమస్యలను విజయవంతంగా ఎదుర్కొనవచ్చు. "ఎవరి సంస్కృతి అయినా సహనానికి ప్రతి రూపమంటారు" స్వర్గీయ రాధాకృష్ణన్. ఏ కాలంలో అయినా సహనం ద్వారా ఎన్నో సమస్యలను ఎదుర్కొనవచ్చు. చిన్ననాటి నుండి విద్యార్థులకు సహనం అలవరిస్తే ఈ రోజు మనం చూస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలకు చరమగీతం పాడవచ్చు.

సంస్కృతి సాంప్రదాయాలకు దూరమవడమే నేటి సామాజిక సమస్యలకు కారణం. సాంప్రదాయాన్ని పాటించడం అంటే ప్రాచీనతను గుడ్డిగా అనుకరించడం కాదు. వాటిలోని వైశిష్ట్యాన్ని గ్రహించి మంచి చెడుల విచక్షణ చేసి నేటి సమాజం అంగీకరించే సంప్రదాయాలను పాటించడం. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను పరిశీలించిన నేటి ఆధునిక జీవితానికి అవసరమైన ఎన్నో పరిష్కార మార్గాలు మనకు లభిస్తాయి. నేటి ప్రజలు ఏది ధర్మం?

ఏది అధర్మం? అన్న సత్యాన్ని తెలుసుకోలేకపోతున్నారు. ధర్మాచరణ వలన లాభం ఏమిటి? అధర్మాచరణ వలన నష్టం ఏమిటి? వాటి ఆచరణ వలన మనకు కలిగే ఫలితం ఏమిటి? ఇలాంటి సందేహాలకు భారత సాహిత్యంలో ఎంతో చక్కని సందేహ నివృత్తి కలదు. భాషాశాస్త్ర బోధకులు చిన్న వయసులోనే విద్యార్థుల మనసులో ధర్మ అధర్మాల గురించి విశదీకరించి చెప్పడం వలన మానవునికి ఉన్న ఉచితానుచిత వివేచన శక్తి, బుద్ధి వయస్సుతోపాటు సమాజ వ్యవస్థలకనుగుణంగా ప్రవర్తమానమై వర్ధిల్లుతుంది.

సమాజానికి మేలు చేసేటువంటి కార్యక్రమ సమూహాలను ధర్మమని అంటే, సమాజానికి కీడు చేసే చర్యల సమాహారాన్ని అధర్మమని అనవచ్చు. ధర్మమునాచరించువాడు శాశ్వత శాంతిని పొందునని ఉపనిషత్తులు చెబుతున్నాయి. మంచి చెడు తోబుట్టువుల లాంటివి. ఏది మంచి అని తెలిసినప్పటికీ మంచి చేయడానికి మనస్సు ఒప్పుకోదు. చెడును విడిచిపెట్టేంత నిగ్రహం ఉండదు. మహాభారతంలో మంచి చెడుల గురించి విశ్లేషణ తెలుసు కోవడం ప్రతి మనిషికి ఎంతో అవసరం. మహాభారత యుద్ధం జరుగుతూ వుంది. వానప్రస్త కాలంలో వున్న ధృతరాష్ట్రునితో వ్యాసమహర్షి "ఇప్పటికైనా నీ కుమారులకు ఏది మంచి, ఏది ధర్మం తెలియజెయ్యి, యుద్ధం ఆపి ఇప్పటికైనా న్యాయమార్గాన నడుచుకొమ్మని చెబుతాడు. ధృతరాష్ట్రుడు అందుకు తన అసహాయతను, అసమర్థతను వ్యక్తం చేసే సందర్భంలో వ్యాసుడు చెప్పే సమాధానం మనందరికీ ఎంతో ఉపయుక్తం "జరగవలసినది జరిగి తీరుతుంది. జరిగేదాన్ని ఎవరూ ఆపలేరు. తప్పు ఎవరిదైనా ధర్మానికి జయం, అధర్మానికి అపజయం తప్పదు అంటాడు. కౌరవ పాండవుల మధ్య జరిగే యుద్ధం ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగేదని, ఆ రెండింటి ఫలితం భూమి మీద శాశ్వతంగా నిలిచిపోతుంది ఈ విశ్వంలో ధర్మం అధర్మం అనేవి ఎప్పుడూ ఉంటాయి. మనము దేనిని ఆచరించాలి అనేది మనిషి యొక్క, విచక్షణా జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. ధర్మాధర్మాలు గురించి సుయోధనుడే మనకు చక్కగా చెబుతాడు. "ధర్మమంటే ఏమిటో నాకు తెలుసు. కానీ నా మనస్సు ధర్మమార్గం వైపు వెళ్ళడం లేదు. అధర్మం అంటే కూడా నాకు తెలుసు కానీ అది నన్ను మాత్రం విడిచిపెట్టడం లేదు. తన మార్గం వైపు నన్ను ఆకర్షిస్తోంది." ఇక్కడే మనం మనసును నిగ్రహించుకోవాలి. ఈ జీవిత పాఠాలు విద్యార్థులకు చిన్నతనంలో భాషా బోధకులు నేర్పడం వలన భవిష్యత్తులో సమాజంలో ధర్మాచరణకు కట్టుబడి ఉండే వ్యక్తుల సమూహం పెరుగుతుంది. తద్వారా ఆరోగ్య కరమైన సమాజస్థాపన జరుగుతుంది.

ఏ కాలంలో అయినా ధర్మము మానవుని ఉద్ధరించటం ఎంత సత్యమో, అధర్మము మానవుని నాశనము చేయుట కూడా అంతే సత్యము తను ధర్మంవైపు ఉండాల అధర్మం వైపు ఉం డాల అనే విచక్షణ జ్ఞానం విద్యార్థి దశ నుంచే అలవరచుకొనేల ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలి. అధర్మాన్ని ధర్మం అంతం చేస్తుందని మన ఇతిహాసాలలో ఎన్నో ఉదాహరణలు కలవు. దీపం ఏవిధంగా చీకటిని నాశనం చేస్తుందో అదే విధంగా ధర్మం పాపాలను నశింపచేస్తుంది. అందుకే ధర్మమే ప్రధానమని శాస్త్రం చెబుతుంది.

సమాజ హితానికి, సర్వజన కళ్యాణానికి సహకరించే మార్గాన్ని అనుసరించే వాడే మనుష్యుడు. తనవలే ఇతరుల కష్ట సుఖాలను లాభ నష్టాలను తెలుసుకున్నవాడే మనుష్యుడని ఋగ్వేదం తెలుపుతుంది.

నేడు ఎందరు ధర్మానికి నిష్ఠయినారు. అధిక భాగం ప్రజలు అధర్మానికి కొమ్ముకొస్తున్నారు. కాబట్టి నేడు సమాజంలో విపరీత మైన హింస, అభద్రతా వాతావరణ అసమతుల్యతలు సంభవిస్తున్నాయి. విద్యార్థి దశలో సరి అయిన ఆలోచనా విధానం లేకపోతే ఆ విద్యార్థులు పెద్దవారై సమాజంలో అధర్మం రాజ్యమేలుతుంది. మహాభారతంలో ధర్మం మీకేమిచ్చింది? ధర్మాచరణ చేసి మీరేమి సుఖపడ్డారు? అధర్మపరుడైన రారాజు ఎలా సుఖిస్తున్నాడో గమ నించారు? అని ద్రౌపది ధర్మరాజుని ప్రశ్నిస్తే ధర్మరాజు "ధర్మా చరణ నా స్వభావం" ధర్మంవల్ల ఏదో

వస్తుందని, ఏదో రావాలని నేను ఆశించడం లేదు. నేను ధర్మాచరణను మాత్రమే అను సరిస్తున్నాను. ధర్మంతో వ్యాపారము చేసేవాడు నీచుడు అని చెప్పాడు. మరి నేడు ఎందరు ధర్మాన్ని ఆచరించే స్వభావం కలిగివున్నారు. పిల్లలకు పాఠం చెప్పడం ఉపాధ్యాయుడి ధర్మం, రోగికి వైద్యం చెయ్యడం వైద్యుడి ధర్మం, పిల్లలను సంరక్షించడం తల్లిదండ్రుల ధర్మం. ముసలి తల్లిదండ్రలను సంరక్షించడం ప్రయోజకులైన సంతానం ధర్మం, పాలకులు సుపరిపాలనను అందించడం పాలకుల ధర్మం. మరి నేడు ఎందరు తమ ధర్మాన్ని ఏమీ ఆశించకుండా ఆచరిస్తున్నారు. తమ ధర్మాన్ని ఆచరించిన వారు మానసికంగా ఎంతో ధృఢంగా, ఆనందంగా ఉంటారు. తమ ధర్మాన్ని ఆచరించనివారు ఎంత మానసిక క్షోభననుభవిస్తున్నారో మనం చూస్తున్నాం.

ఇది మంచి, ఇది చెడు, ఇది ధర్మం, ఇది అధర్మం అని తెలుసుకోవడానికి వేదాలు చదవక్కరలేదు, పురాణాలు పఠించన వసరంలేదు, నీతి వాక్యాలు పఠించనవసరం లేదు. ప్రతి వ్యక్తి స్వధర్మం గురించి ఆలోచన చేస్తే ఆత్మవిమర్శ మొదలై కొత్త ఆలోచనలకు దారి తీస్తుంది. మంచి చెడుల మధ్య బేదాన్ని గ్రహించగలరు. ప్రతి వ్యక్తి తాను చేసే ప్రతి పనికి ఈ సూత్రాన్ని అన్వయిస్తే అన్ని మంచి పనులే చేస్తాడు. ఈ ఆత్మవిమర్శ అన్నది విద్యార్థి దశ నుండీ ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలి. యుద్ధానికి సిద్ధమైన దుర్యోధనుడు తల్లి గాంధారి దగ్గరికి వచ్చి తనకు జయం కలిగేలా దీవించమని అడిగితే తన కుమారుడు చేసిన అధర్మాన్ని ఎరింగి, ధర్మ మెరిగిన ఆ తల్లి "విజయోత్సు" అని దీవించకుండా "యతోధర్మ స్తతోజయః" అని దుర్యోధనుని దీవించింది.

ధర్మం సత్యం, ధర్మం మంచి ధర్మం అభయం ధర్మం ప్రతి వ్యక్తి ఆచరించవలసిన సంస్కృతి. ధర్మానికి కట్టుబడి జీవిస్తే ఏ కాలంలో అయినా ఆ జీవితానికి ఒక వెలుగుని ఒక శాశ్వత కీర్తిని ఇస్తుంది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# బెళ్ళూరి వారి వివేకానందము

- రాజేశ్వరి దివాకర్ల

శ్రీ బెళ్ళూరి శ్రీనివాసమూర్తిగారి వివేకానందము, సమగ్రము, ఉదాత్తము అయిన కావ్యం. అమృతాభిషేకము, రెడ్డిరాజ్య మహోదయము వంటి ఉత్తమ కావ్యాలను రచించిన శ్రీ బెళ్ళూరి 'మధురకవి' బిరుదాంకితులు.

శ్రీ బెళ్ళూరి శ్రీనివాస మూర్తిగారు, అనంతపురం జిల్లా, కుంటిమద్ది వాస్తవ్యులు. కవిత్వరచనమే జీవనాళంగా, ప్రాణ సర్వస్వంగా వీరు భావించారు.

కాంక్షలే వేరు, నా మనోగతులె వేరు
పూరి గుడిసెలలోన పొద్దు పుత్తుగాని,
కవన మల్లక బతుకు సాగింపలేను
భావగానంబె నాదు సర్వస్వమవని' అంటూ బతికిన వీరు విషాదగీతాలను,

ఎలిజీలను రాయడంలో ప్రసిద్ధి పొందారు. దువ్వూరి రామిరెడ్డిగారిని గురించి రాసిన స్మరణ గీతాలు ఎంతో గొప్పవి. వీరి కుమార్తె మరణించినప్పుడు రాసిన శోక గీతాలు, ఎంతటి

వారికైనా హృదయ స్పర్శను కలిగించకమానవు. 'రెడ్డిరాజ్య మహోదయము' కావ్యంలో కాటయ వేమారెడ్డికి పుత్ర వియోగము కలిగిన సందర్భంలోని పద్యాలు ప్రతి ఒక్కరిని కన్నీరు పెట్టిస్తాయి. తమ జీవిత కాలంలో శ్రీ బెళ్ళూరి వారు అనంతపురం జిల్లాపరిషత్ హైస్కూలు, తెలుగు పండితులుగా వృత్తి నిర్వహణ కావించారు. బెళ్ళూరి వారి 'వివేకానందము', వివేకానందుని జీవితాన్ని ఆద్యం తము చక్కగా చిత్రించిన కావ్యం. 'నరేంద్రుడు' అన్నది వివేకా నందుని తొలి నామం. ఆనంద స్వరూప మైన వివేకమును కలిగిన వాడవడం వల్ల అతనికి "వివేకా నందుడు" అను పేరు కలిగింది. ఈ ప్రధాన భావంతోనే బెళ్ళూరి వారు తమ కావ్యాన్ని 'వివేకా నందము' అన్న అభిదానంతో వెలయించారు.

వివేకానందుని చరిత్ర అసదృశము, ఉదాత్తము, అనాఘ్రాత కుసుమము అని కవి పేర్కొన్నారు. అతిశయ మైన ఈ చరిత్రను వీరు 'ద్విపద'లో రచించారు. 'వివేకా నందము' కృత్యవతరణికలో, కవి కావ్యనిర్మాణం ఒక తపస్సులాంటిదని, ఆ కావ్యాన్ని నవ్యత వెలయునట్లు, నానా రసములు కూడి ఉన్నట్లు సంతరించాలని చెప్పారు. ఔచిత్యాన్ని పోషించాలని నొక్కి చెప్పారు. అంతే కాకుండా 'కవివాణి హృదయము నాకర్షించవలె'నన్న అద్భుత రహస్యాన్ని కూడా వెల్లడించారు. ఇలాంటి కావ్య నిర్మాణ తత్వాన్ని ఆకళింపు చేసుకున్న వారవడం వల్లనే, మృదు మధురమైన శైలితో ఈ కావ్యాన్ని వెలయించారు.

'వివేకానందము' కావ్యంలో, నరేంద్రుని జననం, అతని శైశవ గాథలు, గురుసన్నిధి, తపస్సిద్ధి, ప్రబోధ ములు, పర్యటనములు, మొదలైన వివిధ ఘట్టాలు మనోహరంగా వర్ణితములయ్యాయి. నరేంద్రుని జీవిత గమనాన్ని ప్రభావితం చేసిన ముఖ్య వ్యక్తు లిద్దరు. వారిలో ఒకరు అతని తల్లి భువనేశ్వరి, రెండవ వారు అతని గురువు శ్రీ రామకృష్ణుడు. వీరిద్దరి పట్ల నరేంద్రుడికున్న మాతృభక్తి, గురుభక్తి భావాలను, వారీతనికి మార్గదర్శ కులైన విధానాన్ని కవి సహజ సిద్ధంగా చిత్రించారు.

నరేంద్రుని తల్లి భువనేశ్వరీ దేవి ఆదర్శమాత. కవి కావ్యా రంభంలోనే భారతనారీ సతీత్వాన్ని శ్లాఘించారు. ఇందువల్ల తాము నిర్మించనున్న భువనేశ్వరీ శిల్పానికి పనిముట్లు సిద్ధం చేసుకున్నారు. భువనేశ్వరి నోముల పంట నరేంద్రుడు. ఆమె అతనికి తూగుటు య్యాలలూపు చున్నప్పుడే తత్వజ్ఞానాన్ని బోధించింది. 'శ్రీకరమగు జగత్సృష్టి గర్భమున ఏకమై పొల్చు' ఈశ్వరుని పసి బాలునిలోనే చూచి ఉగ్గుపాలతోనే వస్తు తత్వమును రంగరించి పోసింది. భువనేశ్వరీదేవి తనయుని ఆదర్శా లకు ఆలవాలమై నిలిచిన పరిపూర్ణ మాతృమూర్తి.

నరేంద్రుడు కూడా తల్లిచాటు బిడ్డ. అతడెప్పుడూ తల్లి ఆజ్ఞను అతిక్రమించడు. విశ్వహిందూ సభకు వెళ్ళిన ప్పుడైనా సరే తల్లి అనుమతించే వరకూ వేచి ఉండి పయనమయ్యాడు. చికాగో నగరంలోని వనితలు మాతృ పూజానత మస్తకుడైన వివేకానందుని తల్లిని ఆమె 'అజ్ఞాత యోగినీ మణి' అని, అమె 'శాశ్వత శాంతి రసాధీనమగు ఇలను బోలి భువనేశ్వరియైనదని' స్తుతించారు. ఆమె తన అంతిమ సమయాన తనయునకు కర్తవ్య బోధను కావించింది. ఇలా తనయుని ఆశయ సిద్ధికి ఉత్ప్రేరకంగా నిలి చిన ఆధునిక వనితా రూపం మనకు ఆమెలో గోచరి స్తుంది. నరేంద్రుని గురువు రామకృష్ణ పరమహంస. ఈ గురువు కూడా తల్లినే నమ్మి ఉండడం ఒక విశేషం. లోకంలో పసిపిల్లలు తమను సంరక్షించడానికి తల్లి ఉందనే ప్రగాఢ విశ్వాసంతో, ఎలాంటి చీకు, చింతలు లేక నిర్భయంగా ఉంటారు. అలాగే జగన్మాత యైన అంబ మీద సర్వ భారాన్నీ ఉంచి నిర్లిప్తుడై చరించాడు

శ్రీ పరమహంస రామకృష్ణుడు. సనాతన ధర్మాన్ని, ఆర్ష సంప్రదాయాలనూ పునరుద్ధరించిన మహనీయుడు రామకృష్ణుడు. రామకృష్ణుని ఆదేశంతో భారత ఆధ్యాత్మిక ప్రతిభను దిగంతాలకు వ్యాపింపజేశాడు నరేంద్రుడు.

రామకృష్ణ, నరేంద్రుల గురుశిష్య అనుబంధం అను పమాన మైంది. గురువు శిష్యునికి సత్యాన్ని ప్రబోధిం చాడు. పరమేశ్వర రూప దివ్య సాక్షాత్కారానుభవాన్ని కలిగించాడు.

'జ్ఞానమే స్వర్గ, మజ్ఞానమే నరక
కానన భూమి, సంకట సముత్కటము
సకల జీవులందు సమమైన ప్రేమ

మొకటె నీ కందించు నుత్తమ సిద్ధి' అని అతడు ప్రబోధించాడు. నరేంద్రుడు కూడా గురువు కాంచన విజయాన్ని పరీక్షించి కనుగొన్నాడు. గురువునే పరబ్రహ్మగా ఆరాధించాడు. గురువు వ్రణం అంకురించి చనిపోగా బేలతనంతో దుఃఖించాడు. గురువు గారి ఆదర్శాలను, భారత ధర్మ ప్రబోధ కార్యక్రమాన్ని అందుకుని, తుదివరకు కొనసాగించాడు. నరేంద్రుడొక దివ్వె. అందులో దీపం రామకృష్ణుడు. వీరిరువురిది ఆత్మ పరమాత్మల అద్వైత సిద్ధి. ఈ ఆఖ్యానాన్నంతా ఎంతో కట్టుదిట్టంగా కవి మనకు వివరించి చెప్పారు.

వివేకానందుని జీవిత చరిత్రను కమనీయ కావ్యంగా తీర్చిదిద్దడంలో బెళ్ళూరి వారు కృతార్థులయ్యారు. ఇందు లోని పలు సన్నివేశాలను వీరు చిన్ని చిన్ని కథలుగా చెప్పారు. ఎంతో ఆసక్తి జనకంగా వివేకానందుడి శైశవ గాధలను మలచారు. వివేకానందుడిని వలచి వచ్చిన కాంతలకు అతడు జ్ఞానబోధను చేసిన గట్టం, మాలవాడు ఊదిన చిలుము గొట్టాన్నిఊది, విశ్వమానవ తత్వాన్ని ఋజువు చేయడం, ఆళ్వారు సీమకు వెళ్ళి, అక్కడి ప్రభువుకు విగ్రహారాధన మర్మాన్ని బోధించడం, క్రైస్తవు లకు, మహమ్మదీయులకు సర్వమత సమానత్వాన్ని తెలు పడం, నాస్తికుడొకడికి 'దైవ మెచ్చట లేడు తలపోయుము' అన్న అతని పలుకులకు, అతని వాక్యాలతోనే పరమేశ్వ రుని అస్తిత్వాన్ని తెలియజేయడం, వంటివి ఆనంద సముద్రంలో మునకలు వేసేవాడికి అమృతం లభించిన భావాన్ని కలిగిస్తాయి.

బెళ్ళూరి వారు ఎంతో కఠినమైన తత్వబోధను కూడా ఎంతో లలితంగా, సరళమైన పదాలతో కథలా చెప్తారు. కూపమండూక కథ ఇందుకొక ఉదాహరణ. చిన్న బావిలో నివసించే కప్ప దానినే స్వర్గధామం అని తలుస్తుంది. అది జలధిలో సంచరించే సౌఖ్యాన్నె రుగదు, అలాగే సర్వమతస్థులు స్వీయమార్గ సంకుచితావనీ స్థలము నొదిలి విశాల దృక్పథాన్ని అలవరచు కోవాలని, ఒక్కటి యైన పరమేశ్వర తత్వాన్ని తెలుసుకోవాలని...ఇలా చిన్న చిన్న పదాలతోనే అనంత భావాన్ని ఇమిడ్చి చెప్పారు.

'వివేకానందము'లోని శైలి ఎంతో సుకుమారమైంది. ఇందులో స్నిగ్ధంగా కనిపించే శబ్దాలే సందర్భానుసారంగా రసానందాన్ని కలుగచేస్తాయి. ఈ కావ్యం శాంతరస ప్రధాన మైంది. నిండా వ్యాజంతో శృంగారం పోషింపబడడం కవి చేసిన చమత్కారం.

కలికి చూపుల లేతగా నవ్వినప్పుడు
..................

అవయవపుష్టి తానై పిల్చినప్పుడు

...................

నిరసించి రంభకై నీరస స్వర్గ పురిగోరి

రసికుడే పురుషుండు వగచు... అని స్త్రీ అంగాల కవ్వింతను వెల్లడిస్తూనే, అటుపై పురుషుడు చింతిస్తాడన్న హెచ్చరికను చేస్తారు.

ఇక గురువును కోల్పోయినప్పుడు నరేంద్రుడు

పరమహంస యొకండు పలుకబోడింక

సరస సుందర సూక్తి సరసి నోలార్ప.... కావించిన ఆర్తనాదం గుండెను కరగిస్తుంది.

'సామీ దేవబాస పొంగారు మీ నోట పూనరాదిద్ది' అను దళితుని పలుకుల్లో వాని అమాయకత్వము, అజ్ఞానము మూర్తి కడుతుంది. విశ్వమత హిందూ మహాసభల్లో కట్టకడపటి ఉపన్యాసం నరేంద్రుడిది. అక్కడతనికి కేవలం ఐదు నిముషాల వ్యవధిని మాత్రం ఇచ్చారు. అంతట అతడు అంబోధి వలె ఉప్పొంగే కంఠాన్ని విప్పాడు. వివేకానందుడు సంబోధించిన ఆత్మీయ సరణికి, కోమల భావనా గుంఫిత తతికి సభికులు ముగ్ధులయ్యారు. ఈ ఘట్టాన్ని చదివేటప్పుడు పాఠకులు కూడా సభా భ్రాంతిని పొంది కరతాళ ధ్వనులను చేస్తారనడంలో సందేహం లేదు. ఇలా బెళ్ళూరి వారి వాణి హృదయాలనాకర్షిస్తుంది. భావ గంగలో ఓలలాడిస్తుంది.

✿ ✿ ✿

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# “రాజీపడని సమరయోధుడు గరిమెళ్ళ సత్యనారాయణ”

– డాక్టర్. మండి అన్వర్ హుస్సేన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, ఉస్మానియా కళాశాల, కర్నూలు.

ప్రజాపాటల తాతయ్యగా ప్రసిద్ధులైన కవి, రచయిత, స్వాతంత్ర సమరయోధుడు గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట తాలూకా, గోనెపాడు అనే గ్రామశివారులోని ప్రియాగ్రహారంలో 1893, జూలై 14వ తేదీన వెంకటనరసింహం, సూరమ్మ అనే దంపతులకు జన్మించారు. బాల్యంలో ప్రియాగ్ర హారంలో నివాసం ఉంటూ అక్కడే ప్రాథమిక విద్యను అభ్య సించారు. తరువాత విజయనగరంలోనూ, మచిలీపట్నంలోనూ, రాజమండ్రిలోను ఉన్నతవిద్యను అభ్యసించారు. బి.ఏ, డిగ్రీ పూర్తిచేసిన తర్వాత గంజాం కలెక్టర్‌కార్యాలయంలో గుమాస్తాగా కొద్దికాలం పనిచేశారు. విజయనగంలో ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగాకూడా కొద్దికాలం పనిచేశారు. వీరి ముక్కు సూటితనం కారణంగా ఏ ఉద్యోగంలోనూ ఎక్కువకాలం ఉండేవారు కాదు. ప్రియా గ్రహారంగ్రంథాలయంలో ఫ్రీలాన్స్ జర్న లిస్టుగా కొద్దికాలం పనిచేశారు. ‘అనంతవాహిని’ అనే పత్రికకు సంపాదకులు గాను, ‘ఆచార్యరంగా’, ‘వాహిని’, అనే పత్రికలకు సహాయ సంపాదకులుగా గరిమెళ్ళ సత్యనారాయణ పనిచేశారు. వీరిదిబాల్యవివాహం వారి మేనమామకూతుర్ని వివాహం చేసు కున్నారు వారికి ఒక కుమార్తె. మొదటి భార్య మర ణించడంతో రెండవ వివాహం కూడా చేసుకున్నారు.

తెలుగుభాష పై మంచిపట్టున్న గరిమెళ్ళ సత్యనారా యణ 1915లో ‘వాడుకభాష’ అనే మొదటి రచనచేశారు అది గురజాడ స్మృతిగీతం. నాటి భారతదేశ రాజకీయ పరిస్థితులు గరిమెళ్ళ జీవితంలో అనేక మార్పులు తీసు కొని వచ్చాయి. 1920 సెప్టెంబరు 4 నుండి 9వ తేదీ వరకు జరిగిన కలకత్తా ప్రత్యేక కాంగ్రెస్ సభలో గాంధీజీ తీసుకున్న సహాయనిరాకరణ ఉద్యమ తీర్మాన కారణంగా అనేక మంది స్వాతంత్ర సమరయోధులు ప్రభుత్వ ఉద్యోగాలను, బ్రిటీష్ ప్రభుత్వం ఇచ్చిన బిరుదులను విడిచి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. గాంధీ గారి పిలుపు మేరకు స్వాతంత్ర పోరాటమే తన జీవిత లక్ష్యంగా నిర్ణయించుకుని గరిమెళ్ళ సత్యనారాయణ ఆ విషయాన్ని వారితండ్రి వెంకట నరసింహం గారికి తెలియజేశారు. అప్పటినుండి స్వాతంత్ర్య కాంక్షతో ఒక కార్యకర్తగా, రచ యితగా ఎన్నో త్యాగాలు చేసి భరత మాత ముద్దుబిడ్డగా తెలుగుజాతి గర్వించదగ్గ వీరుడిగా రచనలు చేసి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటంచేశారు గరిమెళ్ళ.

1921లో ‘స్వరాజ్యగీతములు’ మొదటి భాగం, 1922లో ‘స్వరాజ్యగీతములు’ రెండవ భాగం, 1926లో ‘నూతన జాతీయ గీతములు’, 1933లో ‘హరిజన పాటలు’ వంటి ఆనేక జాతీయ భావాలను వ్యక్తపరిచే గేయ రచన చేశారు. స్వరాజ్యగీతములు మొదటి భాగంలోనే వీరి చారిత్రాత్మకమైన ‘మాకొద్ది తెల్లదొర తనము’ అనే పాట ఉంది. స్వాతంత్రఉద్యమంలో భాగంగా సహాయ నిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ వంటి అంశాలను తన గేయాలలో బలంగా తెలియజేశారు.

గరిమెళ్ళ “మాకొద్దీ తెల్లదొరతనము.... దేవా మా కొద్దీ తెల్ల దొరతనము” అంటూ గళమెత్తి పాడుతూ ప్రజలను చైతన్య వంతంచేసేవారు. బ్రిటీషువారు వ్యాపారం కోసం వచ్చి, భారతదేశాన్ని తమహస్తగతం చేసుకొని జాతీయ సంపదనంతా కొల్లగొడుతున్నారని, పాడిపంటలకు నిల యమైన దేశంలో భారతీయులు పస్తులుండే పరిస్థితి తెచ్చారని చెప్పారు. ఉప్పుసత్యాగ్రహానికి పదేళ్ళమునుపే “ఉప్పుముట్టుకుంటే దోషమండి” అని ముందే ఊహిం చారు. ఈగేయాన్ని గరిమెళ్ళ స్వయంగా పాడగా విన్న బ్రిటిష్ కలెక్టర్ బ్రేకన్, “భాష తెలియని నాకేఇంత గగుర్పాటు కలిగితే ఇంక జనసామాన్యం ఈపాటతో ఎంత మహోద్రిక్తులై ఆవేశపడుతున్నారో” అని అక్కడికక్కడే గరిమెళ్ళకు ఒక సంవత్సరం జైలుశిక్ష విధించారు. జైలు

నుండి విడుదలైన తర్వాత బ్రిటీషు వారికి వ్యతిరేకంగా తనువ్రాసిన గేయాలను రెట్టింపుస్వరంతో పాడుకుంటూ వెళ్ళేవారు గరిమెళ్ళ. అనేకమంది అధికారులు ఫిర్యాదు చేయడంతో, కాకినాడ మెజిస్ట్రేట్ జాతీయ ప్రభోధ రచనలు చేసినందుకు మరో రెండు సంవత్సరాలు కారా గారశిక్షను విధించారు. మాకొద్ది తెల్లదొరతనము అనే పాటను పుస్తకంగా ప్రచురించిన స్థానిక స్వాతంత్ర సమర యోధులు ఆచంట సత్యనారాయణ గారికి ప్రభుత్వం ఆరోజుల్లోనే ఒక ఏడాది కఠిన కారాగారశిక్ష విధించింది. అయితే గాంధీ గారు గరిమెళ్ళ సత్యనారాయణ గారిని నిబర్మతీ ఆశ్రమానికి పిలిపించి వారి ముఖతా మాకొద్దీ తెల్లదొరతనం అనే గేయాన్ని విని ముగ్ధులయ్యారు. ఈ గేయాన్ని ఇతర భాషలలోకి తర్జుమా అయ్యేలా ఏర్పాటుచేశారు. ఈ విధంగా ఈగేయం ఆంగ్లభాష లోనికి అనువాదమై ప్రకాశం గారి 'స్వరాజ్య' పత్రికలో వెలువడింది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా నిరసన తెలప డానికి శక్తివంతంగా ఈపాట ఉపయోగపడింది. ఆంధ్ర రాష్ట్రంలో కాంగ్రెసు సేవకులు ఖద్దరుదుస్తులు, గాంధీ టోపీ ధరించి, 'మాకొద్దీ తెల్లదొరతనము' అని పాడు కుంటూ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపేవారు.

గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీశారదా గ్రంథమాలను ప్రారంభించి అనేక గ్రంథాలను అచ్చువేశారు. 1926లో 'ఖండ కావ్యాలు', 'భక్తి గీతాలు', 'బాలగీతాలు' తెలుగులో అచ్చువేశారు. గరిమెళ్ళకు తమిళ, కన్నడ, ఆంగ్ల భాషలలో కూడా మంచి పాండిత్యం ఉండేది. తిరువళ్ళువర్ రచిం చిన పద్యాలను తెలుగులోకి అనువాదం చేసి 'అర్థత్రయ సర్వస్వం' అనే పేరుతో అచ్చువేశారు. తమిళంలోని 'తిరుక్కురల్', కన్నడ లోని 'తల్లికోట నాటకం', అలాగే భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంగ్లంలో రచించిన, ("The Economic Conquest of India") గ్రంథాన్ని తెలుగు లోనికి అనువదించారు. 'గృహలక్ష్మి', 'కృష్ణాపత్రిక', 'భారతి', 'ఢంకా', 'త్రిల్లింగ్', 'ఆంధ్రపత్రిక'లో అనేక వ్యాసాలు వ్రాశారు. వీరు స్వయంగా ఆంగ్లంలో 'హార్ట్ఆఫ్ ది నేషన్', 'మదర్ ఇండియా' అనే పద్య కావ్యాలు రచించారు.

గురజాడ అప్పారావుగారి ముత్యాలసరాలు, కన్యాశు ల్కం నాటకం, గరిమెళ్ళ వారిని ఎంతో ఉత్తేజపరిచాయి. వారికి నివాళులర్పిస్తూ జానపద బాణీలో 'వాడుక భాష' అనే గేయాన్ని వ్రాశారు. అందులో అప్పారావు గారి ముత్యాలసరాలకు వాడుక భాషా పరంగా జేజేలు పలి కారు. గురజాడ వారి రచనలు తనకు మార్గనిర్దేశం చేశా యని చెప్పుకున్నారు. ఈ గేయం 1915 డిసెంబరు 4న 'కృష్ణాపత్రిక' సంచికలో వెలువరించింది. గరిమెళ్ళ రచన లలో మకుటాయమానం 'మాకొద్దీతెల్లదొరతనము' అనే గేయం 142 చరణాలు కలిగిన ఈ పాట ఒక్కొక్క మాట ఒక ఫిరంగి గుండు, శక్తివంతమైన ఆయుధంలా బ్రిటిష్ ప్రభుత్వ గుండెలకు తగిలింది. తెల్లదొరలను నిర్భయంగా వాడు, వీడు అని ఈ సడిస్తూ భారతీయులను వారు ఎలా పీడిస్తున్నారో, జాతీయ సంపదను ఎలా కొల్లగొడు తున్నారు తేల్చి చెప్పారు. ఈ గేయం 1921లో ప్రచు రించిన 'స్వరాజ్య గీతములు' మొదటిభాగంలో ఉన్నది. మా కొద్దీ తెల్లదొరతనము అనే గేయంతో పాటు, 'దండా లండోయ్. మేముండలేమండోయి బాబు అనేగేయాన్ని 'సైతానుప్రభుత' అనే శీర్షికతోవ్రాశారు. వీటితోపాటు 16 గేయాలున్నాయి. అందులో 'రాట్నము', 'మేలుకొలుపు', 'పాంచాలము', 'స్వరాజ్యము', 'గాంధీ', 'గ్రామము', 'ఆంగ్లేయ విద్య', 'కోర్టులు', 'కల్లు', 'పంచములు', 'ఖిలాఫతు ప్రశ్న', 'రాజ్యమేలుదాము', 'రథము పాట', మొదలైన శీర్షికలతో బ్రిటీషు ప్రభుత్వ పరిపాలనలో జరుగుతున్న అరాచకాలను విశ్లేషించి చేప్పారు. 1922లో స్వరాజ్య గీతములు రెండవభాగం వెలువడింది అందులో 11 శీర్షికలతో బ్రిటిష్ ప్రభుత్వాన్ని అంటగట్టే విషయాలను ప్రస్తావించారు. విదేశీవస్తు బహిష్కరణ, సహాయ నిరా కరణ, స్వరాజ్య పరిపాలన వంటి విషయాలను బాగా ప్రచారంచేశారు. స్వరాజ్య గీతములు రెండవ భాగాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేదించి ఐదువేల ప్రతులను ధ్వంసం చేసి గరిమెళ్ళకు రెండేళ్ళు కఠినశిక్ష విధించారు. 1926లో 'నూతన జాతీయగీతములు' అనే గేయకావ్యాన్ని ప్రచురిం చారు. ఇందులో 13 శీర్షికలతో జాతీయనాయకుల గొప్ప

దనాన్ని, వందే మాతరం నివాదపు ప్రయోజనాన్ని వివరించారు. ఇక కృష్ణాపత్రికలో గరిమెళ్ళ సత్యనారాయణ గారి 'ఆంధ్రా యూనివర్సిటీ', 'కాంగ్రె సులో గలాభా', 'రాజభక్తి గీతము', 'లాలాజీకి'!, 'ఆది స్వతంత్రము', 'నెమలి పాట', 'స్వరాజ్యమునకొకబాట', 'మోహనరంగడి పదములు', మొదలైనవి చెప్పుకోదగినవి. 'సీతాకోకచిలుక' అనేది పిల్లల గేయం, ఇక గరిమెళ్ళవ్రాసిన గేయం 'దేశీయ గీతము' బల్గేరియా గీతానికి అనువాదం. 1933లో 'హరిజనుల పాటలు' అనే గేయసంపుటిలో 14 శీర్షికలతో అంటరానితనాన్ని నిరసిస్తూ, భారతదేశంలో రావలసిన కుల రహిత సమాజాన్ని విశ్లేషించారు. 1936 జనవరి ఆంధ్రభూమి పత్రికలో 'సంక్రాంతి మహిమ' అనే కవితలో సంక్రాంతి పండుగకు కొత్త భాష్యాన్ని చెప్పారు. 1947 నవంబర్ 'భారతి' దీపావళి సంచికలో అమృతాంజనం ప్రకటన కొరకు వ్రాసిన 'అమృతాంజనము' అనే గేయం నేటి ప్రకటనలకు ఒక ఆదర్శం.

1933లో నలభై ఏళ్ల వయసులో మద్రాసు చేరారు గరిమెళ్ళ. అక్కడ కె.ఎన్.కేసరి నడిపే 'గృహలక్ష్మి' మాసపత్రికలో కొద్దికాలం పనిచేశారు. అక్కడినుండి ఆంధ్రప్రభ దినపత్రికలో కొద్దికాలం, తర్వాత 'ఆనంద వాణి'లో కొద్దికాలం ఈ విధంగా అనేక పత్రికలలో పని చేశారు. వావిళ్ళ రామస్వామి శాస్త్రి నడిపే 'త్రిల్లింగ్' అనే పత్రికలో గరిమెళ్ళ వారి అనేక వ్యాసాలు వచ్చేవి. వీరు 'దుందుభి', 'వికారి' అనే కలం పేర్లతో కూడా వ్యాసాలు రాసేవారు. గరిమెళ్ళ వారికి రాజీపడటం అంటే ఏమిటో తెలియదు తన చెల్లెలిని ఇంగ్లీషు చదివిన వాడికిచ్చి పెళ్లి చేయడానికి కూడా వారు ఇష్టపడ లేదు. 1923లో వారి తండ్రి మరణించినప్పుడు జైల్లో ఉన్నారు. క్షమాపణ చెబితే విడుదల చేస్తామన్నారు జైలు అధికారి. క్షమాపణ చెప్పడానికి నిరాకరించి తండ్రి అంత్యక్రియలలో కూడా పాల్గొన లేకపోయారు. వారి జీవిత చరమాంకంలో ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు అప్పుడప్పుడు ఆర్థికంగా ఆదుకున్నారు, వావిళ్ళ వెంకటేశ్వరరావు గారు నెలకు పదిరూపాయలు భృతిగా ఇచ్చేవారు. కంటికి చేయించుకున్న ఆపరేషన్ విఫలమై ఒక కన్ను పోగొట్టుకున్నారు. బ్రిటీషు ప్రభుత్వానికి సింహస్వప్నంగా నిలిచిన నిస్వార్థ, స్వాతంత్ర సమరయోధుడైన గరిమెళ్ళ సత్యనారాయణ, మద్రాసు మహానగరంలో ఎవరికీ తెలియని వ్యక్తిగా 1952 డిసెంబర్ 18వ తేదీన చివరిశ్వాస వదిలారు, ఇరుగు పొరుగువారే గరిమెళ్ళ అంత్యక్రియలు నిర్వ హించారు.

**ఆధారగ్రంథాలు :**

1. గరిమెళ్ళ గేయాలు - పరకాల పట్టాభిరామారావు (సంపాదకులు)
2. జాతీయ గేయకవితాగరిమ గరిమెళ్ళ - శ్రీరమణ (2015 డిశంబరు 'ఆంధ్రప్రదేశ్' పత్రికలోనివ్యాసం)

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# మానవత్వం పరిమళించిన - జాషువా కవితా దృక్పథం

- కె.ఎం. సౌందర్యవతి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), రాజమహేంద్రవరం.

## జాషువా జననం - జీవితం :

గుఱ్ఱం జాషువా 1985 సెప్టెంబర్ 28న వినుకొండ ప్రాంతం (గుంటూరు జిల్లా)లో గుఱ్ఱం వీరయ్య, లింగ మాంబ దంపతులకు జన్మించాడు. దుస్సహమైన కుల, మత బేధాలను, దుర్భరమైన దారిద్రాన్ని చవిచూసాడు (అనుభవించాడు). ఈయన 1905లో వినుకొండలో ఎలి మెంటరీ స్కూల్‌లో చేరాడు. అక్కడ కుల, వర్గ బేధాలు ఆయన లేత మనసును కలిచి వేసాయి. గాయపడిన హృదయంతో తాను గుర్తించిన సాంఘిక వ్యవస్థలోని అసమానత లను ప్రశ్నించడం ప్రారంభించారు. జాషువా సాహత్యంలోని తాను వ్యక్తీకరించిన స్పష్టమైన అభి ప్రాయాలకు చిన్ననాటి సన్నివేశాలే ప్రాతిపదికలయ్యాయి. అనంతరం బాపట్లలోని హయ్యర్ గ్రేడ్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసి వినుకొండ సమీపంలోని చాట్రగడ్డ పాడులో 1909లో బడి పంతులు ఉద్యోగంలో చేరాడు. నాటి నుండి జీవన పోరాటం సాగిస్తూనే ఉన్నాడు. ఈ పోరాట పటిమతోనే అతడు తన జీవితాన్ని గడిపాడు.

హిందూపురాణాలను పారాయణం చేస్తూ హిందూ గ్రంథాల్ని వ్రాస్తున్నాడనే భావంతో క్రైస్తవ మతబోధకులు ఆయన్ని టీచర్ పోస్టు నుండి తొలగించారు. ఆ తరువాత మూకీ సినిమాల కథా వాడకుడుగా కొంతకాలం పని చేశాడు. ఆ ఉద్యోగం కూడా వదలి రాజమండ్రిలోని కోటిలింగాల దగ్గర గల ప్రాథమిక పాఠశాలలో ఉపా ధ్యాయుడిగా చేరాడు. ఆ సమయంలో ఆయన పడిన కష్టాల గూర్చి

"ఇదరు సుతులం గూరిమి
ముద్దియ మేరాంబతోడు ముట్టెడు జీతం
బద్దెకు ముద్దకు చాకలి
పద్దుకు సరిపోక పెక్కుపాట్లుండితిన్" అని వ్రాసాడు

ఆ పిదప రాజమండ్రి వదిలి వినుకొండలో పండి తుడుగా పనిచేశాడు.

## జాషువా రచనా విధానం :

20వ శతాబ్ది ప్రారంభంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం వలన భారతీయ భాషా సాహిత్యాలలో కాల్పనిక ధోరణి చోటు చేసు కుంది. ఈ కాలంలో తెలుగులో భావ కవిత్వం ఒక ఉద్యమంగా రూపుదాల్చింది. భావ కవిత్వములో అంతర్లీనం అయిన ఖండ కావ్య ప్రక్రియ దానితో పాటు మూడు పువ్వులు ఆరు కాయలుగా వికసించింది.

ఈ భావ కవితా రీతులలో కావ్య ప్రక్రియలను చేపట్టి రచనలు చేసిన ఖండకావ్య నిర్మాత గుఱ్ఱం జాషువా, భావ కవితా వృక్షములో కొమ్ములు సాగిన ఆత్మా శ్రేయ త్వం ప్రకృత్యోపాసన స్వేచ్ఛా ప్రియత్వం, సంఘ సంస్క రణ గత వైభవ స్మరణ వంటి పోకడలను తన ఖండకావ్యా లలో వ్యక్తం చేశాడు.

జాషువా సమకాలనీ కవిత్వోద్యమ ముఖ్య లక్షణాలను తన కవిత్వంలో కనబరిచిన వాటికి అతీతమైన ఒక తత్వాన్ని బలమైన వ్యక్తిత్వ ముద్రతో వ్యక్తం చేశాడు. సార్వకాలికం, సార్వజనీనమైన సత్యం, ధర్మం, సమత, సౌందర్యం, మొదలైన అంశాలను ప్రాతి పదికగా చేసుకుని అతడు రచించిన ఖండకావ్యాలు కుల, మత, ప్రాంతీయ భావాలకు అతీతంగా పాఠకుల హృదయాలను స్పృశిం చగలిగి ఉన్నాయి.

జాషువా ఒక సందర్భంలో "విశ్వమానవ సౌభ్రాతృత్వం, నిర్మాత నిర్జాతి సంఘం నా ఆదర్శం. ఒక జాతికి ఒక మతానికి చెందిన కవిత్వాలు మంచివి కావు అని కవి త్వాలే కావు. అలాంటివి వీలునామా కవిత్వాలు అంటాను. నా భావం సామాన్యులకు అందివ్వడానికే ప్రయత్నించాను. గహన సంచారం లేని కవిత్వం నా లక్ష్యం", అని చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

## జాషువా రచనలు :

జాషువా ప్రారంభ దశలో ధ్రువ విజయం, హిమద

మార్క్ పరిణయం నాటకాలు వ్రాశాడు. 1924-1930 సంవత్సరం మధ్య కాలంలో భారతిలో విరివిగా అచ్చు కావడంతో క్రమంగా ప్రసిద్ధి పొందాడు. ఆ తర్వాత ఫిరదౌసి, స్వప్నకథ, కాందిశీకుడర, ముంతాజ్ మహల్, గబ్బిలం (మొదటి భాగం), నేతాజీ, చిన్ననాయ కుడు, బాపూజీ, గబ్బిలం (రెండవ భాగం), స్వయంవరం, రాష్ట్ర పూజ, కొత్తలోకం, ముసాఫరులు, క్రీస్తు చరిత్ర, నాగార్జున సాగర్ మొదలైన లఘు కావ్యాలు వ్రాసాడు.

జాషువాకు కవిఆ విశారద, కవికోకిల, కవిదిగ్గజ, మధుర శ్రీనాథ, నవయుగ చక్రవర్తి, కళా ప్రపూర్ణ బిరుదులు లభించాయి. భారత ప్రభుత్వం వారికి పద్మభూషణ పురస్కారం 1970లో ఇచ్చారు. తెలుగు సాహితీ క్షేత్రంలో భావకవితావృక్షం మోడువారి అభ్యుదయ కవిత్వం అంకురించినకాలంలో 1934లో జాషువ ఈ కృతులను రచించాడు. 'స్వప్నకథ' భావ విన్యాసానికి సంబంధించిన పోడిమిని 'అనాథ' అభ్యుదయ కవిత్వంలోని పీడిత ప్రజల ఆక్రందనలను పుణికి పుచ్చుకున్నాయి.

"ఒకటి మూటగట్టిన గాలి
మరియొకటి సలసల గ్రాగి చిందిన కన్నీటి బిందువు"
అని జాషువాయచే పేర్కొన్నాడు.

## గబ్బిలము :

సామాన్యుణ్ణి గొప్పవాడిని చేసిన మానవోద్యమం భారత రాజకీయం రంగంలో గాంధీజీ కాలు మోపటంతో కొత్త ఊపరి పోసుకున్నది. ఈ నేపథ్యంతోనే సర్వాంగీణ జాతి వికాసానికి ప్రాతిపదిక అయిన వ్యక్తి స్వేచ్ఛను అరికట్టే సామాజిక దౌర్జన్యాలపై జాషువా కలంపట్టి దోపిడీవ్యవస్థకు సవాలుగా నిలిచెను. అంతేకాక కులవ్యవస్థపై ధ్వజమెత్తాడు. దుస్సహమైన కులభేదం వలన కలిగిన హీనత్వాన్ని, దైన్యాన్ని తాను చూడలేక అర్థాకలితో బ్రతకలేక, బ్రతికే తన కులంవాళ్ళను బంధువులను చూసి నిట్టూర్చిన జాషువా జాలిగుండె నుండి "గబ్బిలము" కావ్యం వెలువడింది.

గబ్బిలం కావ్యంలో 40 పద్యాలు సామాజిక దురన్యాయంగా పరిగణమించిన అస్పృశ్యతా జాడ్యానికి గురిచేయబడిన పీడిత పంచమ జాతికి ప్రతినిధిగా గ్రహింపబడిన అరుంధతీసుతుని (అంటరానివాడు) హృదయవిదారక స్థితిని ఆవిష్కరించాయి. మిగిలిన పద్యాలలో మార్గనిర్దేశ సందర్భంగా దేశవర్ణన చేయబడింది. కాళిదాసు 'మేఘసందేశ' కావ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కావ్యాన్ని రచించినట్లు జాషువా 'విజ్ఞప్తి'లో పేర్కొన్నాడు. నిశిత వ్యంగ్యాన్ని ఉక్తివైచిత్రని ఆశ్రయించి ఈ కావ్యంలో జాషువా దోపిడీ వ్యవస్థకు పాదలు తీసే కులవ్యవస్థను గర్హించాడు.

"వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము ‹బెట్టు వానికి భుక్తిలేదు
వాని తలమీద బులిమిన పంకిలమును
గడిగి కరుణింప లేదయ్యెగగనగంగ" - జాషువా కనబరచిన వ్యక్తిత్వ సంయమనానికి గబ్బిలం ఉదాత్తమమైన లక్ష్యంగా నిలుస్తుంది.

"సుకవి జీవించు ప్రజల నాలుకయందు" అని చెప్పిన జాషువా 1971, జూలై 24న మరణించినారు. మరణం అనేది జాషువా గారి శరీరానికి కాని ఆయనకు కాదు. ఎందుకంటే మహోన్నతమైన నవయుగ చక్రవర్తి కవికోకిల, కవితా విశారద మధుర శ్రీనాథ జాషువా" ప్రజలందరికి మనస్సులో చిరస్థాయిగా నిలిచి ఉంటారు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య సమీక్ష, డా॥ జి. నాగయ్య (ద్వితీయ సంపుటం)
2. జాషువా రచనలు - ఖండకావ్యాలు
3. గబ్బిలం! - గుఱ్ఱం జాషువా

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగులో మొట్టమొదటి కల్పిత ప్రబంధం -ధనాభిరామం

- డా. ఇడికోజు శ్రీనివాసాచారి, ఉస్మానియావిశ్వవిద్యాలయం, హైదరాబాదు.

శ్రీనాథయుగంలో ఆంధ్రసాహిత్య ప్రక్రియా వైవిధ్యంను చేపట్టిన వారిలో 'నూతనకవి' సూరన ఒకడు. ఇతని జన్మస్థానాన్ని గురించి పలు అభిప్రాయాలున్నవి. వీరేశలింగంగారు, చాగంటి శేషయ్యలు గోదావరి మండలం దాక్షారామ పరిసరప్రాంతంవాడు కావచ్చని ఊహించారు. కాని ఆరుద్ర సహేతుకంగా నల్లగొండ జిల్లావాడనే నిర్ణయించాడు. ఈ కవి గురువైన ముదిగొండ వీర భద్రుడు దేవరకొండ సమీపంలోని ముదిగొండ గ్రామనివాసి. ఇదే గురువు యొక్క మరో శిష్యుడైన భైరవుడు కూడా ముదిగొండ నివాసి అగుటచేత సూరన కావ్యంలో తెలంగాణ మాండలిక పదాలుండుట కారణం చేత ఇతడు తెలంగాణవాడని, విశ్లేషించి దేవరకొండ ప్రాంతంవాడని నిర్ధారించడం జరిగింది. కాకతీయుల కాలంలో ముదిగొండ గొప్ప శివక్షేత్రం. పూర్వకవి స్తుతి, గ్రంథాలలోని అంతస్సాక్షాలను బట్టి భైరవకవికి సమకాలీనుడు కావడాన్ని బట్టి ఇతడు క్రీ.శ. 1400-1480 మధ్యకాలంవాడని భావించ వచ్చు. ఇతడు 'ధనాభిరామం' నే ఒక్క కావ్యాన్ని మాత్రమే రచించాడు.

తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి కల్పిత ప్రబంధం 'ధనాభిరామం' శ్రీనాథయుగంలో శృంగార ప్రధానమై ఏకవస్తు కమైన కావ్యరచనలు ఆరంభమైనవి. 14, 15 శతాబ్దాలలో సంస్కృత భాషలో రూపకాలు శ్రవ్యకావ్యాలుగా తెలుగుభాషలోకి అనువదింపబడ్డాయి. రూపకాలలో కల్పితేతివృత్తం గలవి కూడ కలవు. అట్టి ఇతివృత్తంగల కావ్యాలను తెలుగులో రాయదలచి సూరన ధనాభిరామ రచన చేశాడు. 15వ శతాబ్దం నాటికి ఒక సాంఘిక సమస్యను గ్రహించి, దానిని కావ్యేతివృత్తముగా పెంచి కావ్యరచన చేయడం అనేది కొత్తవిషయం. 16వ శతాబ్దిలో కూడ కల్పితేతివృత్తంగల రచనలపై సదభిప్రాయం లేదు. అట్టి పరిస్థితులలో సాంఘికపరమైన ఇతివృత్తంతో కల్పిత రచన చేయడంచేత ఇతనికి 'నూతన కవి' అనే బిరుదు వచ్చినది. తెలుగులో నేటివరకు లభించిన ఆధారాలను బట్టి ఈ సూరన ధనాభిరామమే మొదటి కల్పితకావ్యం.

**సంక్షిప్త కథా విశ్లేషణ :** ధనాభిరామం మూడు ఆశ్వాసాల కావ్యం. ధనం, సౌందర్యం ఈ రెండింటిలో మనిషికి ఏది ముఖ్యమో తెలియజేసే కథను కవి కల్పించాడు. కుబేరుడు, మన్మథుడు మొదలగువారు ఇంద్రసభలో ఉండగా ఈ చర్చ జరిగింది. అక్కడ మన్మధుడు సౌందర్యమే ముఖ్యమనగా, కుబేరుడు ధనప్రాముఖ్యాన్ని సమర్థిస్తాడు. చివరకు తమ తమ వాదాలను నిరూపించడానికి భూలోకంలో దాక్షారామానికి చేరు కుంటారు. అక్కడ మన్మథుడు తన సౌందర్యంచే 'సుగుణావతి' అనే వేశ్యను లోబరచుకుంటాడు. అనంతరం కుబేరుడు అక్కడికి చేరి ధన ప్రభావానికి ఆ వేశ్యను గురి చేస్తాడు. దీనిచేత ధనమే ప్రాధాన్యమని తేలిపోతుంది. తరువాత భీమేశ్వరస్వామిచే ధనరూపములకు సమప్రాధాన్యము గలదని చెప్పించి కావ్యంను ముగిస్తాడు.

ఈ విధమైన సాంఘిక సమస్యను ఇతివృత్తంగా గ్రహించి ధనానికి కుబేరున్ని, రూపానికి మన్మథున్ని, సంఘంనకు సుగుణావతిని ప్రతినిధులుగా ఎన్నుకున్నాడు. సమాజానికి ప్రతినిధిగా సుగుణావతి అనే వేశ్యనే ఎందుకు తీసుకున్నాడని ఆలోచిస్తే ఏ కుల స్త్రీ కూడ ఇట్టి పరీక్షలో తీర్పరిగా ఉండలేదు. కురూపియైనను, కుంటివాడైనను, అగ్నిసాక్షిగా వివాహమాడిన భర్తయే దైవముగా భావించి గౌరవించుట కులస్త్రీ యొక్క ధర్మం. ఈ విధమైన ఆచారం గల సమాజంలో పై సమస్య పరిష్కరణలో కుల స్త్రీ పాత్ర ఉన్నట్లైతే అధర్మప్రతిపాదకమై కావ్యానికి అనా దరణ కలిగును. ఇక స్త్రీ పాత్రనే గ్రహించుటకు కారణమేమని ఆలోచించగా 15వ శతాబ్దంలో

ఆంధ్రసాహిత్యంలో శృంగార రసప్రధానమైన కావ్య రచనలు ఆరంభమైనది. కావున యుగ ధర్మాన్ని అనుసరించి శృంగార వర్ణనలు చేయుటకై స్త్రీ పాత్రలు అవసరం. కావున తీర్పరిగా 'సుగుణావతి' అనే వేశ్యను గ్రహిం చాడు.

కథను చెప్పుటలో కవి వర్ణనా సందర్భంలో తప్ప మిగిలిన కథాభాగమంతా ఆయాపాత్రలచేతనే నడిపించాడు. కథ కాలాక్రమ పద్ధతిలో సూటిగా చెప్పబడింది. కావ్యంలోని చాలా పాత్రలు పౌరాణికాలగుట చేతను, కావ్యం యొక్క ఆరంభంలో కథాస్థలం దేవలోకమగుట చేతను, కావ్యం యొక్క ఇతివృత్తం సాంఘికమైనప్పటికిని కాల ప్రభావంచే పౌరాణిక పాత్రలను ప్రవేశ పెట్టుటచేత పౌరాణికంవలె ఉండి కాలక్రమపద్ధతిలో నాటకీయ విధానాలను అవలంభించి కథ నిర్వహించబడింది.

**రచనా విధానం :**

మూడు అశ్వాసాలు గల ఈ చిన్నకావ్యంలో అష్టాదశ వర్ణన లను కొన్నింటిని మాత్రమే వర్ణించి ఔచిత్యంను పాటించాడు. అయినప్పటికి కొన్ని అనవసరమైన వర్ణనలు ఉన్నాయి. కాల క్రమపద్ధతిలో నాటకీయంగా కథాకథనం గావించాడు. ఇతడు రచించిన ధనాభిరామం కథ కొంత మనోహరంగా ఉన్నది కవిత్వం కూడ హృద్యంగానే ఉన్నదని వీరేశలింగం గారు "ఇకారసంధి మొదలుగాగల ప్రయోగములున్నను ఇతని కవిత్వము మొత్తము మీద సరసముగానే ఉన్నదని" చాగంటి శేషయ్యగారు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

"శాబ్దిక చండ తాండవమే శైలి అనుకునే అపోహలతో పదాల పటాలపు కవాతు కసరత్తులతో అలంకారాల కలంకారితో అష్టాదశ వర్ణనల సాముగరిడీలతో, ఊకదంపుడు ఉపదేశాలతో, కట్టు కథలతో, పిట్టకథలతో దస్త్రాలవంటి పెద్ద కావ్యాలు వ్రాయడం కన్న చిరస్మరణీయమైన ఒక్క పాత్రను సృష్టించిన, చిత్రించిన చిన్నకావ్యం రచించడం మంచిది" అను విమర్శకు గురగు శాబ్దిక చండతాండవాదులు దీనిలో లేవు. పరిమితమైన పాత్రలతో సామాజిక ఇతివృత్తంతో రచింపబడిన ఈ గ్రంథం చిరస్మరణీయమైనది. ప్రథమాంధ్ర కల్పిత కావ్యమగుట, సాంఘిక ఇతివృత్తం కలిగిఉండి సాంఘిక చరిత్రకు ఉపయుక్తమగుటయే ఈ గ్రంథం యొక్క విశిష్ట లక్షణాలు. హైద్రాబాదు ప్రాచ్యలిఖిత పుస్తక భాండా గారములోని లిఖిత ప్రతి లేఖకుడు 'సూరన' గూర్చి కిందివిధంగా వ్రాశాడు.

"తనరిన దక్షవాటిపురి ధాముడనందగు భీమనాథుపే
రను గిరిజేశుపేర నతిరూఢి వహించిన రు౹మపేరనూ
తనకవి సూరనామాత్యుడు ముదంబున జెప్పెధనాభిరామమ
త్యనుప సత్కవిత్వ మహి మాతిశయంబుల నొప్పుమీరగన్"

సూరన అక్కడక్కడ తనవెట్టియు తాత పెద్దతన ముంగలదే, గాలము మ్రింగిన మత్స్యముపోలిక, ధన మూలమిదంజగత్తు అనే సామెతలను, వన్నెవాసిగల యిట్టికులము, నెసంతకుకొఱత, వెట్టిజడ్డ, ఇలుచూఱ గదింటివి అనే జాతీయాలను వాడుతూ రచన చేశాడు.

**వర్ణనలు :**

ఈ కావ్యంలో శైల, ఉద్యాన, విహార, సలిల, క్రీడ, వివాహ, కుమారోదయాది వర్ణనలు లేవు. ఈ వర్ణనలు ఈ కావ్యంలో లేకపోవుటే మంచిది. ఎందుకంటే చిన్న సమస్యను ఇతివృత్తంగా తీసుకొని, కథను కల్పించుకొని రచించిన ఈ కావ్యంలో అష్టాదశ వర్ణనలు ఉండుటకు వీలులేదు. ఒకవేళ పనిగట్టుకొని వర్ణించినచో అది అనౌచిత్యమగునేగాని మరొక ప్రయోజన ముండదు. అందుకే కవికూడ వాటిని స్పృశించలేదు.

ధనాభిరామం ద్వితీయాశ్వాసంలో మన్మథుడు దాక్షారామంలో ప్రవేశించినపుడు మధుమాసం, పుష్పఫల శోభను,చల్లనిపిల్ల వాయువులను, ఉద్యానవనాలను వర్ణించి శృంగార సంబంధమైన కోర్కెలను రేకెత్తించుటకు అనువైన వాతావరణాన్ని సృష్టించి వసంత ఋతువును గూర్చి వర్ణిస్తూ...

సీ. "మంజుల నవలతా కుంజపుంజమ్ములు
రంజిల్లు ధారా ధరంబు గాగ
చంచరీకాటోప ఝంకారములు మహో
ద్దండ భీషణ గర్జితములుగాగ
గాలితాకున నేలరాలు పూ మొగ్గలు
కడిమిచే వడగండ్ల కరణిగాగ

దొర మెయ్యెడ లేక దొరగు పూదేని య
విడువక జడిగొన్న వృష్టిగాగ
దాకి వ్రాల్తొడిమెల గూడి తరులనుండి
జారు పూసోన సోనపుంజములు గాగ
నంచిత స్ఫూర్తి నీవసంతాగామంబు
ధరణి వర్షాగమంబు చందంబు వహించె" (2-8)

అని వసంతాగమం వర్షాగమంను వచ్చినదనియు గోదావరి నదిని కిందివిధంగా వర్ణించాడు.

సీ. కమనీయతర కచ్ఛపములు మీగాళ్ళుగా
సైకత స్థలికటి స్థలముగాగ
భాసురావర్త విభ్రమరీతి నాభిగా
వరకోకములు కుచద్వయముగాగ
విదిత శంఖముల యొప్పిదము కంఠమ్ముగా
మోవి పద్మము సొంపు మొగముగాగ
దళుకు బేడిస మీలు ధవళ నేత్రములుగా
నవకంపు ఫేనంబు నవ్వుగాగ
ఘనత తనయందె పుణ్యముల్ గలుగుననుచు
వీచికా హస్తములు పాచి వేడ్కబిలుచు
ముక్తికామిని విధమున మురియుచున్న
సప్త గోదావరముజూచె శంబరారి (2-28)

అని గోదావరి నదిని ముక్తికామినిగా భావించినాడు. పై రెండు పద్యాలలో అనుసరించిన పద్ధతి కవి భావనా బలమునకు మచ్చు తునకలని చెప్పవచ్చు.

**సాంఘిక మత విషయాలు :**

ధనాభిరామంలో ఇతివృత్తం కేవలం సాంఘిక సమస్య మాత్రమే. ఆ సమస్యను ఆధారంగా చేసుకొని కథను కల్పించుకొని పౌరాణిక పాత్రలను ప్రవేశపెట్టి రచింపబడినది. ధనాభిరామంలో ధన, రూపముల గూర్చి వాద, ప్రతి వాదంల సమస్య తేల్చుటకు అనువైన స్థలముగ దాక్షారామంను, తీర్పరిగా సుగుణావతిని కవి ఎన్నుకున్నాడు. ఇట్టి స్థలనిర్ణయానికి ఆనాటి సమాజంలో దేవాలయ ప్రాధాన్యమే ప్రధానకారణం. పూర్వ కాలంలో దేవాలయాలు సంఘంలో ప్రధానపాత్ర వహించాయి. రాజకీయ, మత, సాంఘిక, సాంస్కృతిక రంగాల యందు కీలక పాత్ర వహించేవి.

ధనం, రూపంలలో రూపంను గాంచి మనసార ప్రేమించి సంపదలు తృణప్రాయంలని భావించిన సుగుణావతి చివరకు ధనపక్షపాతంనే చూపించుటచే నాటి సమాజం ధనంనకే అధిక ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పవచ్చును. ఇంచుమించు నేటివరకు ఇట్టి సమాజమే కలదని చెప్పవచ్చును.

ఇంటికి వచ్చిన అతిథికి పుష్పములు, మంచిగంధము, వీడెము నిచ్చుట సామాన్య ధర్మాలుగా ఉండేది. మన్మథుని అతిథ్య సందర్భముగా ఇట్టి మర్యాద చెప్పబడుటచే పురుషులు కూడ పుష్పములను అలంకరించుకొనుట, మంచి గంధము పూసు కొనుట అనే ఆచారాలు ఉండేవని చెప్పవచ్చును.

వేశ్యతల్లి తన ఇంటికి వచ్చిన కుబేరునకు మంచి ఇప్పపువ్వు సారాయి ఇచ్చినది. దీనిని ఇప్పపూరసమున ఖండశర్కర కలిపి వండి, మంచి కర్పూరము వేసి తయారు చేసేవారు. ఇట్టి మద్య పానీయాలు ఈ యుగంలో తయారు చేయబడేవి.

కుబేరుడు దాక్షారామంలో ప్రవేశించునపుడు శుభ శకునములు, జ్యోతిష్యాది శాస్త్రాల వంటివి వర్ణింపబడ్డాయి. ఆనాడు సమాజంలో ఉండే 26 రకాల ఆభరణ విశేషాలు, 25 రకాల చీరలను, వాద్యవిశేషాలను, వస్తు విశేషాలను పేర్కొన్నాడు.

ఈ విధంగా సమకాలీన సమాజంలోని ఎన్నో సాంఘిక, మతపరమైన విషయాలను నూతనకవి సూరన తన ధనాభిరామంలో వివరించాడు.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగదేలయన్న ....

– డా॥ స్వర్ణలత గొట్టిముక్కల, ఆంధ్రోపన్యాకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

తెలుగుజాతికి, తెలుగుభాషకు, తెలుగుసాహిత్యానికి అతి దీర్ఘమైన చరిత్ర ఉంది. ఋగ్వేదానికి చెందిన ఐతరేయ బ్రాహ్మణంలో (క్రీ.పూ 1000) ఆంధ్ర పదం జాతిపరంగా ప్రయోగింపబడింది. క్రీ.పూ. 200 నాటి ప్రాకృత శాసనంలో తమ్సయదానం అనే తెలుగుమాటను పరిశోధకులు గుర్తించారు. అలాగే క్రీ.శ.11వ శతాబ్దానికి చెందిన నన్నయను ఆదికవిగా ఆయన రచించిన భారతాన్ని తొలి తెలుగు కావ్యంగా మనం పేర్కొంటున్నా అంతకు ముందు చాలాకాలంనాటి నుండే సమాజంలో తెలుగు సాహిత్యం ఉందనడానికి గద్య పద్య శాసనాలు ఆధారం.

తెలుగుభాష ప్రాచీనమైనదే కాక శక్తివంతమైనది కూడా. ఎందుకంటే ఏ భాషా పదజాలాన్నైనా యథాతథంగానో లేక కొన్ని మార్పులతోగాని తనలో కలుపుకొని భావ ప్రకటనకు శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. చరిత్రను పరిశీలిస్తే తొలి నాళ్ళలో సంస్కృత పదజాలాన్ని, తర్వాత ఉర్దూ పారసీక పదాలను ఆ తర్వాత ఆంగ్లపదాలను తెలుగుభాష తనలో కలుపు కోగలిగింది. ఎంత సున్నిత భావాన్నైనా, ఎంతటి గహనమైన భావాన్నైనా బలంగా చెప్పగలిగిన శక్తి తెలుగు భాషకుంది. అందుకే తెలుగువారేకాక, ఇతర భాషావ్యవహర్తలు కూడా తెలుగును ఎంతగానో ప్రశంసించారు.

తమిళ జాతీయకవి సుబ్రహ్మణ్య భారతి 'సుందర తెలుంగు' అని, శ్రీనాథుడు కర్ణాటభాష అని, 'ఎప్పటికైనా భారతదేశంలో జాతీయభాష కాగల సత్తా, అవకాశం దక్షిణాది భాషల్లోని తెలుగుకే ఉంది' అన్నారు శ్రీ శ్రీ.

'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' గా తెలుగుభాషను నికొలాయ్‌డి కాంటి, భారతదేశానికి జాతీయస్థాయిలో అధికార భాష చేయాలంటే అందుకు అన్ని విధాలా అనువైనది, యోగ్యత, అర్హత కలిగినది తెలుగుభాషే అని జె.బి.యస్. హాల్డెన్ అనే పాశ్చాత్య పండితులు అభిప్రాయపడ్డారంటే తెలుగు విశిష్టత తెలుస్తుంది.

తనదైన భాషతోనే రాష్ట్రానికి గుర్తింపు లభిస్తుంది. రాష్ట్ర ప్రజలకు స్వీయవ్యక్తిత్వం చేకూరుతుంది. మూడువేల సంవత్స రాల సగర్వ సంస్కృతి, చరిత్ర గల భారతదేశపు అత్యుత్తమ తెలుగుజాతి ఈనాడు ఒక సంకట పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన విద్యా సాంస్కృతిక మండలి (యునెస్కో) త్వరలో మృతభాషల్లో చేరబోయే కొన్ని భాషల పట్టికలో తెలుగును కూడా చేర్చిందంటే, తెలుగుభాష, తెలుగు జాతి ఎంతటి గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందో అర్థమవుతుంది. ప్రపంచీకరణ నేపధ్యం, ప్రజల భావదారిద్ర్యం, సంస్కృతి ప్రేమి కులు కాని పాలకుల విధానాలు, అమలుకు నోచుకోని చట్టాలు, చేవచచ్చిన భాషాసంఘాలు, వేషంలోగాని, భాషలోగాని తెలుగు తనం ఏ మాత్రమూ కనబడని బుల్లితెర ప్రయోక్తలు, విష సంస్కృతిని వ్యాపింపజేసే వెర్రిమొర్రి సినిమాలు కొంతమేరకు తెలుగును చంపే బాధ్యతను తమవంతు కృషిగా కొనసాగిస్తు న్నాయి. ఒక భాషపై ఆ జాతి జనులు చూపుతున్న గౌరవాన్ని బట్టి వారి సంస్కృతిని అంచనా వేయవచ్చు. ఎందుకంటే భాష లేకుండా సంస్కృతి, కళలు, చరిత్ర, కవులు, చరిత్ర నిర్మాతలు, వేషభాషలు, ఆచార వ్యవహారాలు ఏమీ మిగలవు. కనుక మూడువేల సంవత్సరాల సగర్వ సంస్కృతి, చరిత్ర గల భారతదేశపు అత్యుత్తమ తెలుగుజాతి నిరంతరం వెలుగుజాతిగా ఉండాలంటే తెలుగు భాషా పరిరక్షణ ఒక ఉద్యమంగా సాగాలి. ప్రతి తెలుగు వాడు ఉద్యమ కార్యకర్త కావాలి. ముద్రణా మాధ్యమం మాత్రం తెలుగును బ్రతికించుకొనే దిశగా కృషి చేస్తోందని చెప్పవచ్చు. కొత్త తెలుగుపదాలు, కొత్త వ్యక్తీకరణలు, కొత్త సమాసాలు ప్రజలకు పరిచయం చేయడంలో ముద్రణా మాధ్యమం సృజనాత్మకంగా పనిచేస్తోంది.

వాడుకలేనిభాష వెనుకబడుతుంది. వాసి తరిగి, వాడి కోల్పోయి, గాడి తప్పి క్రమేణా మరుగున పడిపోతుంది. వేగంగా మారుతున్న సాంఘిక అవసరాలకు అనుగుణంగా భాషను అనుసంధానించుకోకపోతే ప్రపంచంలో మన ఉనికిని చాటుకోవ డానికి అన్యభాషే ఆధారమౌతుంది. అలాంటి పరిస్థితి తెలుగుకు రాకూడదనే సత్సంకల్పంతో తెలుగుకు సాంకేతిక పరమైన సొగసు లద్దుతున్నారు యువ సాఫ్ట్‌వేర్ నిపుణులు. మొదటి నుంచీ కంప్యూటర్ టెక్నాలజీ నిర్మాణానికి, వినియోగానికి వాడుతోంది ఆంగ్లాన్నే. ఈ సమయంలో తెలుగు టెక్‌ను అభివృద్ధి చేసి అంతర్జాలంలో తెలుగు వినియోగానికి తెరతీశారు. ఆధునిక మానవ జీవితంలో అంతర్భాగమైన అంత ర్జాలంలో తెలుగు ప్రస్థానం అప్రతిహతంగా సాగుతూ ఎండకు ఎండి వానకు తడిసి శిధిలమైపోతున్న శాసనాలు, కాలపరీక్షకు తట్టుకోలేని తాళ పత్రాలు, ఆలనాపాలనకు దూరమై చెదలు పట్టిన పుస్తకాలు అజరామరమై తెలుగు భాషాభిమానులకు ఊరట కలిగిస్తున్నాయి.

లేఖిని. ఆర్గ్, కూడలి. ఆర్గ్ లాంటి వెబ్‌సైట్లు, తెలుగు వికీ పీడియా (ఆన్‌లైన్ తెలుగు విజ్ఞాన సర్వస్వం), మాడ్యులర్ తెలుగు కీ బోర్డులు తెలిసినవారు కొత్తగా నేర్చుకోవాల్సిన అవసరం లేకుండా యూనికోడ్‌లో టైప్ చేయగలిగే ఉపకరణాలను వీరు సృష్టించారు. అంతే కాకుండా తెలుగు పదం. ఆర్గ్ అనే వెబ్‌సైట్ తెలుగు నూతన పద సృష్టి కోసం స్థాపించిన వెబ్‌సైట్ తెలుగు నిఘంటువులను, వ్యుత్పత్తి కోశాలను అందుబాటులో ఉంచి పదసృష్టిచేసే వారిని ప్రోత్సహిస్తున్నది. తెలుగులో బ్లాగులు రాయాలనుకునే వారికి కరదీపికలా ఉప యోగపడే 'బ్లాగు పుస్తకాన్ని' ప్రచురించారు. తెలుగు కంప్యూటర్ టైపింగ్‌ను నేర్చుకోవాలనుకునే వారికోసం అన్‌లైన్ ట్యూటర్ కోడ్‌ను తయారు చేశారు. కంప్యూటర్ పారిభాషిక పదాలకు తెలుగు సమానార్థ కాలను సూచించే నిఘంటువును కూడా రూపొందించారు. సృష్టి, సంహిత అనే యూనికోడ్ ఖతులను తయారుచేశారు. వర్డ్‌ప్రెస్, లాంచ్ పాడ్‌లను తెలుగు చేయడానికి కృషిచేస్తున్నారు. లినక్స్‌ను అభివృద్ధి చేసి తెలుగు ఓయస్‌ను రూపొందిం చడం, అన్ని అప్లికేషన్స్‌లో తెలుగు ఇంటర్ఫేస్‌ను అందు బాటులో ఉంచారు. తెలుగు లిప్యంతీకరణ సాధనాలను తయారు చేశారు. తెలుగు ఓ కె ఆర్ (ఆప్టికల్ కారెక్టర్ రికగ్నిషన్)ను రూపొందించడం కోసం కృషి చేస్తున్నారు. 'బంతి' పేరిట ఇప్పటికే ఈ ప్రాజెక్టు మొదలైంది. పీసీక్వెస్ట్ లినక్స్ తెలుగు వెర్షన్‌ను తయారుచేశారు. తెలుగు కంప్యూ టింగ్‌పై ఆసక్తి పెంచుకొని తెలుగుకు విస్తృతిని, శాశ్వత త్వాన్ని కల్పించే దిశగా సాగుతున్న కొన్ని కార్యక్రమాలివి.

ప్రజానీకంలో ముప్పైశాతానికి తమభాష చదవడం, రాయడం రాకపోతే ఆ భాషకు చేటుకాలం దాపురించి నట్లేనని యునెస్కో హెచ్చరిస్తోంది. మన మురిపాల తెలు గుకు అటువంటి దురవస్థ కలగకుండా చేయాల్సింది ఎంతో ఉంది. ఏ భాషాభివృద్ధికైనా వ్యూహరచన అవసరం. 'కర్ణాటక' లో కన్నడ భాషాభివృద్ధికి విస్తృతాధికారాలతో ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవతరించింది. కన్నడ ప్రాధికార సమితికి విస్తార నిధులిచ్చారు. భాషాభివృద్ధి, పాలన భాష అమలు నిమిత్తం తాలూకా స్థాయి ద్వారా అంచెలవారీ ప్రభుత్వ యంత్రాంగాన్ని కొలువు తీర్చారు. ఆ తరహా విశేషమైన చొరవ కొరవడిన కారణంగా తెలుగువెలుగులు వెలవెలబోతున్నాయి. ఆధికార భాషా వారోత్సవాలు, అధికార భాషపై చర్చావేదికలు లాంటి కార్యక్రమాల్లో చిత్తశుద్ధి లోపించడం, తెలుగు బోధకులపట్ల చూపించే చిన్నచూపు, పాఠశాలల్లో తరగతుల కాలక్రమ పట్టికలో తెలుగు బోధనకు కేటాయించే గంటల్లో కోతలు వలన అటు సమాజంలోనూ, ఇటు పాఠశాలల్లోనూ, ప్రజల్లోనూ, విద్యార్థులలోనూ మాతృభాష పట్ల నిరాసక్తత నెల కొంటోంది.

అమ్మ భాషను సక్రమంగా నేర్చుకొంటే ఎన్ని భాషలైనా సులువుగా అలవడతాయని, మాతృభాషాజ్ఞానం లేకపోతే ఏ సబ్జెక్టు/విషయం సరిగా బోధపడదనీ భాషాశాస్త్రవేత్తలు ఋజువు చేసిన విషయం. పచ్చని చెట్టంటూ ఉంటే కదా చిలకలు వచ్చి వాలేది అమ్మభాష కూడా అంతే. జ్ఞాన సముపార్జనకు, అవసరమైన ఆలోచనకు ఆది అదే. కనుక

తెలుగు బోధకులు బోధనలో కొత్త పంథాను అనుసరిస్తూ విద్యార్థులను ఆకట్టుకోవాలి. 'చేసి చూపడం' ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వాలి. అమ్మఒడిలో జోల పాటతో మొద లయ్యే భాషా బోధన శిశువు పెరిగే కొద్దీ జోలపాట స్థాయిని దాటి ఎన్నో తీరుల్లో సాగుతుంది. జాతికి శ్వాస భాష. ఏ భాషకైనా జనం నోళ్లలో నానే జాతీయాలు, పొడుపు కథలు, సామెతలు, గేయాలు ఆయువుపట్లు. ఇవే భాషకు ప్రాణం, ఆధారం. తరగతి గదిలో ఉపాధ్యా యుడు కేవలం భాషను రాయ గలిగే, మాట్లాడగలిగే విద్యార్థులను మాత్రమే కాక ఏ సందర్భానికైనా అతికినట్లు సరిపడే అందమైన భాషను మాట్లాడే విద్యా ర్థులను తయారు చేయాలి. పిల్లల్లో చురుకుదనం, వివేచనాశక్తి పెంచే విధంగా భాషాబోధన ఉంటే వారికి సాహిత్యంపై చక్కని అభిరుచి ఏర్పడుతుంది.

నేటి బాలలే రేపటిపౌరులు కనుక మాతృభాషా పునాదిని తెలుగు బోధకులు గట్టిగా, సృజనాత్మకంగా వేయాలి. భాషపట్ల ప్రేమను, మమకారాన్ని పెంపొందింప చేయాలి. పిల్లలు ఏ మాధ్యమంలో చుదువుతున్నా ఇంట్లోనూ, బంధుమిత్రులతోనూ చక్కని తెలుగులో మాట్లాడమని అమ్మానాన్నలు ప్రోత్సహించాలి. మన భాషాసంస్కృతుల గురించి వారి స్థాయిలో మన మాటల్లో యథాలాపంగా చెబుతుండాలి. బాలగేయాలు, కథలు, సామెతలను సందర్భానుసారంగా చెబుతూ ఆసక్తిని పెంచాలి. ఇంట్లో తాను మాట్లాడే యాసతో కూడిన భాషతోనే పూర్వ ప్రాథమిక స్థాయి విద్యనందించాలి. ఆ మేరకు పఠనాంశాలను స్థానిక జిల్లా అధికారులు, భాషా వేత్తలు రూపొందించి ముద్రించేలా మార్గ దర్శకాలు రూపొందించాలి. దీనివల్ల విద్యార్థికి మాండలిక అసమా నతలు, భేదాలు, మానావమానాల ప్రసక్తి లేకుండా చదివే చదువు పట్ల విశ్వాసం, తృప్తి కలుగుతాయి.

తెలుగు మాధ్యమంలో చదివినవారిని ప్రత్యేకంగా ప్రభుత్వం గుర్తించి ఉపాధి అవకాశాలను కల్పించాలి. ప్రాంతీయభాషా పరీక్షలో ఉత్తీర్ణులైతే తప్ప పదోన్నతి పొందలేరన్న నిబంధన అఖిలభారత సర్వీసుల్లోని అధికారులకున్నట్లే ప్రజలతో నిత్యం సంబంధ బాంధ వ్యాలు కలిగివుండే అన్ని వృత్తుల వారూ ఉన్నత విద్యా స్థాయిలో తెలుగును చదివే విధంగా చర్యలు తీసుకోవాలి.

ప్రతి రంగంలోనూ వ్యావహారిక పదకోశాలు, సాంకేతిక పద కోశాలు, నిఘంటువులు, తులనాత్మక పదకోశాలు రూపొం దించాలి. అధికారభాషా సంఘం, రాష్ట్ర సాంస్కృ తిక శాఖలు క్రియాశీలమవ్వాలి. ప్రభుత్వ ఉత్తర్వులు, తీర్మానాలు, నిర్ణయాలు తెలుగులోనే వెలువడేలా ఒత్తిడి తీసుకురావాలి.

తెలుగులో పరిశోధనలను, ప్రచురణలను లలిత కళలను ప్రోత్సహించేందుకు పరిషత్తులు ప్రాచ్య కళా శాలలను ప్రోత్సహించాలి. సంస్కృతీ సంప్రదాయాల ప్రచా రానికి సంచార విభాగాన్ని ఏర్పాటు చెయ్యాలి. తెలుగు బోధకులకు పదోన్నతులులాంటి ప్రోత్సాహకాలను కల్పిం చాలి. భాషోద్యమాలు గ్రామ స్థాయికి వెళ్ళి సదస్సులలో గోష్ఠుల్లో పల్లెప్రజలకు ప్రాధాన్యత నివ్వాలి. వారి అభి ప్రాయాలను తెలుసుకోవాలి. తెలుగును ఎందుకు చదువుకోవాలి? తెలుగు గొప్పతనమేమిటి? అనే ప్రశ్నలకు తడముకోకుండా సమాధానమీయగలిగే విధంగా భాషా వ్యవహర్తలు భాషాభిమానులు తొణికిసలాడాలి. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగాలు, పత్రికలు, ప్రసార మాధ్యమాలు వ్యక్తుల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా తెలుగుకోసం కృషి జరిగే వాతావరణాన్ని సృష్టించాలి. మొత్తం మీద కుటుంబం, సమాజం, సాంస్కృతిక, విద్య, వ్యవహారాలు, ప్రభుత్వమనే ఆరు కోణాల నుంచి నిర్మాణా త్మక కృషి జరిగితేనే తెలుగుభాషా పరిరక్షణ సాధ్యమవు తుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తెలుగు నాటకసాహిత్యం - సమకాలీన సమాజం (2001-15)

**- డా. వి. త్రివేణి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాదు.

అన్ని ప్రక్రియల కంటే నాటకసాహిత్యం విభిన్నమైంది. కవిత్వం, కథానిక, నవలా రచయితల కంటే నాటక రచయితకు సమకాలీన సమాజంతో సంబంధం ఎక్కువగా ఉంటుంది. కవిత్వం గానీ, కథానిక గానీ, నవల గానీ రాసే రచయితలు కేవలం పాఠకులను మాత్రమే దృష్టిలో పెట్టుకొని సృజనాత్మకశక్తితో రచనను ఇనుమడింపజేస్తారు. నాటక రచయితలు అలా కాదు, మొదట రంగస్థలాన్ని దృష్టిలో పెట్టుకోవాలి... తరువాత పాత్రలను, ప్రాంతాన్ని, సన్నివేశాచిత్రణను, సంభాషణలను, ఆంగిక చలనాదులను, రసస్పృహను ఏకకాలంలో సమకూర్చుకొనే స్థితి ఏర్పరచుకొని రచనకు సిద్ధపడాలి. వీటన్నింటికంటే ముందు దర్శకుడి నేర్పరితనాన్ని గమనించాలి. నాటక రచయితకు, దర్శ కుడికి మధ్య అవినాభావ సంబంధం ఉండాలి. నాటకాంశంతో ఇద్దరూ మమేకమై ఉండాలి. నాటక రచయిత ప్రతిభా పాటవాలు దర్శకుడిని ప్రభావితం చేయాలి. అందుకే నాటక రచనా నేపథ్యంలో రచయితకు పరిమితులు నిర్దేశించబడ్డాయి. స్వేచ్ఛాయుత ధోరణి నాటక రచయిత విషయంలో పనికిరాదు. రచనకు నిడివి కూడా ప్రధానమే. రచనను బట్టి విడివి ఉంటుంది. నాటిక ప్రదర్శన 45 ని॥ నుంచి 1 గం॥ నిడివి, సాంఘిక నాటకం 1½ గం॥ నుంచి 2 గం॥ నిడివి, పద్యనాటకం 2½ గం॥ నుంచి 3 గం॥ నిడివిని కలిగి ఉంటుంది.

చతుషష్టి కళల్లో నాటకానికి విశిష్టమైన స్థానం ఉంది. "నాటకం - నాట్యం" రెండింటిలో మొదటి రెండు అక్షరాలకు సంబంధం "నట్" అనే సంస్కృత ధాతువు నుంచి ఈ రెండూ ఉద్భవించాయి. నాట్యం, నాటకం సమానార్థకాలు. దీనికి ఆధారం నాట్య శాస్త్రం భరతుని నాట్య శాస్త్రాన్ని తెనిగించినవారు పోణంకి శ్రీరామ అప్పారావు. అప్పటినుంచి భారతీయ సంప్రదాయాన్ని బట్టి అనేక సంస్కృత నాటకాలు. పాశ్చాత్య ప్రభావానికి లోనై అనేక ఆంగ్ల నాటకాలు తెలుగులోకి అనువదించబడ్డాయి. దేశీయతనే ప్రధానంగా తీసుకొని అనేక స్వతంత్ర నాటకాలు రచించబడ్డాయి. ఇలా తెలుగు నాటక సాహిత్య విస్తృతి పెరిగింది. ఆయా కాలాల్లో ఆయా నాటకాలు సమకాలీన సమాజాన్ని, జీవితాన్ని దేశ కాల పరిస్థితులను, సంస్కృతులను ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ పదిహేనేళ్ల కాలం (2001-15)లో కూడా సమకాలీన ఆవశ్యకతను బట్టి నాటక సాహిత్యం వృద్ధిపథంలోనే నడిచింది. వందల కొలది నాటికలు/నాటకాలు రచించబడ్డాయి. ప్రదర్శించబడ్డాయి కూడా.

శ్లో॥ "ఆంగికం భువనం యశ్యా
వాచికం సర్వ వాఙ్మయం
ఆహార్యం చంద్రతారాది
త్వమ్ వందే సాత్వికం శివం" (నాట్యశాస్త్రం)

పై శ్లోకంలోని ప్రతి శబ్దానికి విస్తృతమైన వివరణ ఉంది. రంగస్థలానికి, నటుడికి, దర్శకుడికి, రచయితకు పనికివచ్చే అంశాలు ఆహార్యం, వాచికం, ఆంగికం, సాత్వికం పట్ల తీసు కోవలసిన జాగ్రత్తల ద్యోతకమవుతాయి.

"వాక్యం రసాత్మకం కావ్యం"
"కావ్యేషు నాటకం రమ్యం"
"నాటకాంతం హి సాహిత్యం"

వాక్యం కావ్యాన్ని రసవత్తరంగా చేస్తుంది. కావ్యాలన్నింటిలోకెల్లా నాటకం రమ్యమైంది. సాహిత్య శాఖలన్నింటిలో నాటకం చివరిది. నాటకం మిశ్ర కళే. సంగీతం, సాహిత్యం సమ్మిళితం. అందుకే ఇది సామాహార కళ.

ఈ పదిహేనేళ్ల కాలం (2001-15) మధ్యకాలంలో అనేక నాటిక/నాటకాలు రచించబడ్డాయి. సామాజిక,

సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, మత పరమైన అంశాలకు సంబంధించి ఆయా రచయితలు నాటిక/నాటకాలు రచించారు. సాంఘిక నాటిక/నాటకాలు, పద్య నాటకాలు, బాలల నాటికలు, సంగీత నృత్య రూపకాలు అనేకం రచించబడ్డాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

## 1. సాంఘిక నాటికలు :

ఆకెళ్ల గారి నాటక రచనా రీతి విభిన్నమైంది. 'కొత్త సైన్యం', 'నెంబరు లేని ఖైదీ' అనే నాటికలు రచించారు. ఆత్మాభిమానం గల ఒక తండ్రి ఒక కొత్త సైన్యాన్ని తయారు చేసుకోవడం కొత్త సైన్యంలోని కథాంశం. తన ఉద్యోగం నుంచి పదవీ విరమణ పొందిన ఒక తండ్రి తన కొడుకు, కోడలు నుంచి అనేక అవమానాలు, సూటి పోటి మాటలు తరుచు అనుభవిస్తూ ఉండేవాడు. ఇతనితో పాటు తన వయస్సు గల పదవీ విరమణ పొందిన వారిని సమాయత్తపరిచి కొత్త సైన్యాన్ని ఏర్పాటుచేసుకొని ఇంటినుంచి వెళ్లిపోవడం, ఆత్మాభిమానంతో బ్రతకడం ఈ నాటికలో కనిపిస్తుంది. సంభాషణా రచనలో తండ్రి పాత్రకున్న ఓర్పు ఆకెళ్ల ప్రదర్శించారు.

స్నిగ్ధ మరొక నాటక రచయిత. 'నమస్తుభ్యం', 'ఎవరి కోసం', 'పుష్కరిణి', సిగ్ధ సమకాలీన సమాజ ప్రతిబింబానికి తార్కాణంగా నిలిచిన నాటికలు. పి.వి. భవానీ ప్రసాద్ 'ఆయుష్మాన్ భవ' అనే నాటికను సమకాలీన రాజకీయ వ్యవస్థను ప్రదర్శిస్తూ రచిం చారు. 'నువ్వోసగం - నేనో సగం' నాటిక భార్యాభర్తల అన్యోన్య సంబంధాన్ని గూర్చి తెలియజేస్తుంది. పి.వి. భవనీ ప్రసాద్ గారే రచించిన 'శ్రీకారం' అనే నాటిక నలుబైకి పైగా ఉత్తమ ప్రదర్శనా, ఎనిమిదికి పైగా ఉత్తమ రచనా బహుమతులను కైవశం చేసుకుంది. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రదర్శనకుగాను లక్ష రూపాయల పారితోషకాన్ని పొందింది. ఇందులోని నాటకాంశం... ప్రేమించుకున్న యువతీ యువకులు తల్లి దండ్రులకు చెప్ప కుండా వివాహాలు చేసుకోవడం, కన్న వారిని మానసికంగా క్షోభ పెట్టడం, వారి మనసులను గాయపరచడం సరికాదని ఈ నాటిక సూచిస్తుంది. యువత పెద్దలను గౌరవించడం తమ విధి, బాధ్యతగా తెలియజేయబడింది. అదే విధంగా 'ఒక్కమాటే చాలు' అనే నాటిక కూడా అనేక బహుమతులను పొందింది. 35 ఉత్తమ ప్రదర్శన, 6 ఉత్తమ రచనా బహుమతులను, నంది నాటకోత్సవ పోటీలలో మూడు నందులు (బంగారు నంది, కాంస్య నంది, తృతీయ రచనా బహుమతి) సాధించింది. ఈ నాటికలోని అంశం సందేశాత్మకమైంది. ఒక్కమాటైనా చాలు, ఆచితూచి మాట్లాడకపోతే వచ్చే అనర్థాలు తద్వారా ఏర్పడే పొరపొచ్చాలు, వైషమ్యాలు అనేకమని, ఏ పరిస్థితులలో కూడా మనం మాట జార కూడదని ఈ నాటిక తెలియజేస్తుంది. "మనం మాట్లాడే ప్రతీ మాట ఆమోదయోగ్యంగా ఉండాలి" అని నాటక రచయిత నటుడి చేత పలికించి, మంచి మానవ సంబంధాలకు పునాదులు వేశారు.

ఆకురాతి భాస్కరచంద్ర అనేక సామాజికాంశాలతో నాటికలు రచించారు. 'గుండమ్మగారి లేడీస్ హాస్టల్', 'మృత సంజీవని', 'గేలం మింగిన చేప', 'భూమి గుండ్రంగా ఉంది' వంటి నాటికలు రచించారు. ఇందులో 'భూమి గుండ్రంగా ఉంది' భారతీయ వివాహ వ్యవస్థ గురించి తెలియజేస్తుంది. ప్రపంచంలోనే భార తీయ వివాహ వ్యవస్థకు గొప్ప గౌరవం ఉందని, అటువంటి విలువైన, పవిత్రమైన వివాహ వ్యవస్థని విదేశీ సంస్కృతికి బలి చేయవద్దని, డేటింగ్, లివింగ్ టుగెదర్ వంటివి మన దేశంలోకి వస్తే వివాహ వ్యవస్థ భవిత ఏమవుతుంది? అనే సందేశం ఈ నాటిక కలిగిస్తుంది. మంచి సామాజిక విలువలు గల నాటికలు వీరు రచించారు.

'శేషార్థం', 'చదువు', 'నువ్వు+నేను-ప్రేమ = పెళ్లి' వంటి నాటికలు రచించారు నాగరాజు గంధం. 'శేషార్థం' అనే నాటిక స్త్రీ సాధికారతకు సంబంధించింది. ఈ నాటికలో భర్త వ్యాపారవేత్త, భార్య డాక్టర్. భార్య తన వృత్తి ధర్మాన్ని పాటిస్తూ, మానసిక రోగ గ్రస్తులకు వైద్యం చేసి, వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేది. అలా ఒక సామజిక రోగిని తన ఇంట్లోనే ఉంచుకొని వైద్యం చేస్తున్న సందర్భంలో భర్త అనుమానించడం, అవమానాలకు గురి చేయడం వంటివి భరించిన భార్య తన భర్తలో పరివర్తన రావడానికి ప్రయత్నిస్తుంది.

ఎల్.బి. శ్రీరాం 'పద్మవ్యూహం', తాటికొండ కె. శివ కుమారశర్మ 'ఇది అహల్యకథ కాదు', ప్రభల శ్రీనివాస్ 'బాబోయ్ సెల్‌ఫోన్', బి.కమలాకర్ 'విజయదశమి', సుకమంచి కోటేశ్వరరావు 'కలహాల కాపురం', వై. సాయి బాబా 'జ్వాలాకుసుమం', కీ.శే. అప్పలాచార్య 'తులసి తీర్థం', ఎన్‌కె హుస్సేన్ 'ఎంతో చిన్నది జీవితం', చందూరు శ్రీరామమూర్తి 'ధరణీ విలాపం', ఎం.వి.ఎస్. హరనాథరావు 'రెడ్‌లైట్ ఏరియా', బండారి దేవరాజ్ 'చెల్లని పైసలు', యుం అగస్యశాస్త్రి 'ఆ గీతకు అటూ ఇటూ' నాటికలు వర్తమాన కాలంలోని సమాజాన్ని చిత్రించాయి. ఇందులో 'పద్మవ్యూహం' నాటిక ప్రేక్షకుల ఆదరణను చూరగొన్నది. సగటు మనిషి సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను, కష్టాలను ఈ నాటిక ప్రదర్శించింది. పద్మవ్యూహం లాగా సమాన్య మానవుని జీవన వలయం ఉందని, విద్యావైద్య రాజకీయ న్యాయవ్యవస్థలలో పనితీరు - అవినీతి, లంచ గొండితనం, అక్రమాలు, అన్యాయాలలో బలి పశువులు అవుతున్న మానవులు, సాధారణ కార్య కలాపాల్లో, రేషన్ షాప్‌లలో, ఎన్నికల ప్రచార సందర్భాలలో ఎన్ని అవకతవ కలు జరుగుతున్నాయో ఈ నాటిక ప్రత్యక్షంగా ప్రదర్శిం చింది. సమాజాన్ని చైతన్యపరిచింది., వై.యస్. కృష్ణేశ్వర రావు 'సంపద' నాటిక రచించారు. ఈ నాటిక కుటుంబ సంబంధాలను మానవీయకోణంలో పారదర్శకంగా చూపించింది. విదేశాల్లో చదువుకుంటున్న కొడుకుకు తల్లి దండ్రులు కాయాకష్టం చేసి చదివిస్తుంటారు. అత్యంత దుర్భరమైన పరిస్థితులలో కుటుంబ పోషణ కూడా సరిగా చేసుకోలేని స్థితిలో ఇక్కడి తల్లిదండ్రులు అష్టకష్టాలు పడుతుంటారు. ఒకసారి విదేశాల నుంచి తన స్నేహి తుడు ఇండియాకు వస్తుంటే అతనితో తన తల్లిదండ్రు లకు బహుమతులు పంపిస్తాడు. ఆ స్నేహితుడు ఆ పేద తల్లిదండ్రుల ఇంటికి వచ్చి వారి పరిస్థితికి చలించిపోయి ఇక్కడే ఉండిపోవాలని నిశ్చయించుకోవడం, తన స్నేహి తుడి తల్లిదండ్రులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ, కంటికి రెప్పలా కాపాడుతూ, వారికి సేవ చేయడం ఈ నాటికలో ప్రధానాంశం. వీరే 'పక్కింట్లో పుట్టండి', 'నష్ట పరిహారం' వంటి నాటికలు రచించారు.

మల్లింది రవికుమార్ 'తోడొకరుండిన', పరమాత్ముని 'తెల్ల చీకటి', కీ.శే. బత్తుల రామకృష్ణ 'అమెరికా అల్లుడు', 'మండేపూడి పూర్ణ 'ఎవరో ఒకరు', రావినూతల ప్రేమ కిషోర్ 'లైఫ్ లైన్', 'మట్టి వేళ్లు', చెరుకూరి సాంబశివరావు 'ఎవరో వస్తారని', 'గారడి మరో దేవాలయం', భాగవతుల ఉదయ్ 'బొమ్మ సముద్రం', వరికూటి శివప్రసాద్ 'అంతా బ్రాంతియే', భూపతి ధర్మారావు 'దరిత్రి రక్షతి రక్షిత', వల్లూరి శివప్రసాద్ 'శ్రీముధివ్యాఘ్రం', 'ఒక మహాపతకం', 'క్షతగాత్రగానం', ఎం.వి.ఎస్. హరనాథరావు 'తళాంగు తకథిమి', కట్టా సుబ్బారావు 'మనిషి మంచోడే', శేష గిరీశం 'కడవరకు', చల్లా మధుకర్ 'న్యాయమేవ జయతే' వంటి నాటికలు రచించారు. ఇందులో రావినూతల ప్రేమకిషోర్ రచించిన 'లైఫ్ లైన్' నాటిక కుటుంబవ్యవస్థకు సంబం ధించింది. భార్యాభర్తల అన్యోన్యసంబంధం బలంగా ఉండాలని తెలియ జెప్పే నాటిక ఇది. శతమానం భవతి... అంటూ వేదమంత్రాలతో ముడిపడిన వివాహబంధం, చిన్నచిన్న క్షణికావేశాలకు లోనై నూరేళ్ల వివాహబంధాన్ని విడాకులతో తుంచేస్తున్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలు ఈ మాంగళ్య బంధాన్ని ఆదర్శంగా తీసుకుంటే, గ్లోబలై జేషన్ పేరుతో వికృత అనాగారిక సంస్కృతిక అలవాటు చేసుకొని వివాహ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారు. ఇదీ- నేటి వివాహ వ్యవస్థ. సంసారమంటే ఒంటరితనం నుంచి నమ్మకంలోకి ప్రయాణం చేయడం. దాంపత్యం అంటే జీవితంలో సమాన భాగస్వామ్యం వహించడం. ఇద్దరూ చుక్కానియే పట్టుకుంటా నంటే పడవ నడవదు. దాంపత్య నౌకసవ్యంగా సాగాలంటే ఒకరు తెడ్డం, ఒకరు చుక్కాని పట్టుకోవాలి. అప్పుడే సమన్వయం కుదురుకుంటుంది. సమతూకం అవుతుంది.

కట్టా సుబ్బారావు రచించిన 'మనిషి మంచోడే' నాటి కలో వ్యక్తిత్వ వికాసానికి చెందిన ఇతివృత్తం ఉంది. ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా పారిపోయి వివాహం చేసు కున్న ఒక యువజంట, తర్వాత బతకడానికి అనేక కష్టాలు పడతారు. ఉద్యోగం లేక చిన్నచిన్న దొంగతనాలకు అల వాటు పడుతాడు ఆ యువకుడు. అయితే ఇంటి యజమాని అతనిని సన్మార్గంలో పెడతాడు.

చెరుకూరి సాంబశివరావు రచించిన 'గారడి' నాటిక హాస్యరస ప్రధానమైంది. ఒక పేదింటి వాడికి దేవుడు ప్రత్యక్షం కావడం, అడిగిన దానికంటే అదనంగా ధనాన్ని ఇవ్వడం, ఆ పేదవాడి ఇల్లు పూర్తిగా ధనంతో నిండి పోవడం, తినడానికి కూడా అన్నం లేకపోవడం వంటి సన్నివేశాలు ఈ నాటికలో ప్రదర్శింపబడ్డాయి. చివరికి దేవుణ్ణి ఇంట్లో నుంచి వెళ్లగొట్టే పరిస్థితికి వస్తాడు ఆ పేదవాడు. వల్లూరి శివప్రసాద్ రచించిన 'క్షతగాత్రగానం' టెర్ర రిస్టుల ఆగడాలకు సంబంధించింది. గోకుల్ చాట్, లుంబినీ పార్క్, బొంబాయి, డిల్లీ ప్రాంతాలలో జరిగిన ఉగ్రదాడికి సంబంధించిన సన్నివేశాలు ఈ నాటికలో కనిపిస్తాయి. సామాన్య ప్రజల ఆర్తనాదాలు, క్షతగాత్రులైన వారి దయనీయస్థితి అత్యంత భయంకరంగా చూపించ బడుతుంది. అంతిమంగా ఉగ్రదాడులకు నిరసనగా నినదించడం నాటిక లక్ష్యాన్ని అందుకున్నట్లుగా తెలుస్తుంది.

భారతుల రామకృష్ణ 'ఆన్సర్', 'ఒకటి + ఒకటి = ఒకటి', 'నాలుగు వేళ్లూ నావైపే', 'ఇల్లే స్వర్గం' వంటి నాటికలు రచించారు. 'ఆన్సర్' నాటికలో భారతీయ సంస్కృతి - సంప్రదాయాలను పరిరక్షించుకోవాలనే సందేశం ఉంది. విదేశీ వ్యామోహంలో పడి స్వదేశీ వస్తువులను ఉపయోగించుకోలేకపోవడం, దానివల్ల అనేక వ్యాధులు, అనారోగ్యం సంభవించడం ఇందులో చూప బడింది. అందుకే సంప్రదాయ వస్తువులైన వేపపుల్ల, అంబలి, సున్నిపిండి, కుంకుడు కాయరసం, చల్లదనం కోసం మజ్జిగ, గటుక, శరీరానికి వేడిని అందించే ఆము దం నూనె వంటివి వాడాలని, ఆరోగ్య వంతులుగా జీవించాలని తెలియజేయబడింది.

'పిపీలికం' అనే నాటికను రచించినవారు యం.ఎస్. చౌదరి. 'పిపీలికం' అంటే చీమ. "చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ" అన్నట్లు సంఘటిత శక్తితో ఎంతటి కార్యాన్నైనా సాధించవచ్చు. అనేక దుష్టకార్యాలు చేసే వారిలో ప్రతిగా చిన్నదైన చీమలు కూడా అద్భుతమైన విజయం సాధించవచ్చునని ఈ నాటిక తెలియజేస్తుంది. 'కాంట్రవర్సీ' అనే నాటికను కూడా ఇతనే రచించారు.

'ఆత్మగీతం', 'రెండు నిశ్శబ్దాల మధ్య' అనే నాటికను శిష్టా చంద్రశేఖర్, 'శ్రేయోజీవనం' ఎ.నర్సిరెడ్డి, 'మా ఊళ్లో గోదారుంది' తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి, 'సంచలనం' తులసి బాలకృష్ణ, 'గమనం' విద్యాధర్ మునిపల్లె, 'తస్మయ్‌శ్రీ గురువే నమః' సూదనగుంట వేంకటేశ్వర్లు, 'జననీ జయహే' యం.వి.యన్. హిరనాధరావు, 'చంగల్వ పూదండ' తారక రామారావు, 'ఆచం ద్రార్కం' చెలికాని వెంకట్రావు రచించారు.

'శ్రేయోజీవనం' నాటిక కుటుంబవ్యవస్థకు సంబంధించినది. నాటక రచయిత భారతీయ సంస్కృతి, సంప్ర దాయాలకు మహోన్నతమైన స్థానం కలిగిందిగా చిత్రించారు. అటువంటి కుటుంబవ్యవస్థ ఈనాడు పాశ్చాత్య నాగరికతల ప్రధానమో, ఆధునిక ఆలోచనల విధానమో తెలియదు; కాని చిన్నాభిన్న మవుతుంది. భర్త ఒకచోట, భార్య ఒకచోట ఉద్యోగాలు, పిల్లల రెసిడెన్షియల్ స్కూల్స్, ముసలివాళ్లు వృద్ధాశ్రమాలు... ఈ విధంగా కుటుంబాలు చిన్నాభిన్నం కాకుండా, అశాంతికి గురి కాకుండా, ప్రశాంతమైన జీవనాన్ని సాగించేందుకు కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం ఈ నాటిక సారాంశం.

'సంచలనం' అనే నాటికను నేటి వర్తమాన కాలానికి అను గుణంగా రచించారు. పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ తన అల్లుడిని హత్య చేస్తాడు. వృత్తి ధర్మాన్ని తెలిపే నాటిక ఇది. స్వంతవాళ్లయినా, పరాయివాళ్లయినా తప్పు చేస్తే శిక్ష తప్పదనే విషయం హెడ్ కానిస్టేబుల్ ద్వారా ప్రదర్శింపజేశాడు నాటక రచయిత. అల్లుడు జర్నలిస్ట్. కాని అశ్లీల చిత్రాలు తీసి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు సంపాదించే క్రమంలో పోలీసులకు దొరికి పోతాడు. అలా అయినా అల్లుడు తన ప్రవర్తన మార్చుకోలేక పోవడం వల్ల ఎన్‌కౌంటర్ చేస్తాడు హెడ్ కానిస్టేబుల్.

'ఆత్మగీతం' అనే నాటికను శిష్టా చంద్రశేఖర్ రచించారు. ఈ నాటిక జీవవైవిధ్యాన్ని ప్రదర్శిస్తుంది. జంతువుల

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

మీద, పక్షుల మీద, ప్రకృతిమీద ప్రేమ కలిగి ఉండాలని ఈ నాటిక చెబు తుంది. భూతదయ ప్రధానోద్దేశం.

'ఉరితాడు' నాటికను రావి కొండలరావు, 'అను బంధం' పల్లేటి లక్ష్మీకులశేఖర్, 'మా ప్రేమకు న్యాయం కావాలి' బండారి దేవ రాజ్, 'దెయ్యాలున్నాయ్ జాగ్రత్త' పనసాల. 'అక్షయ' అందూరి నరసింహారెడ్డి, 'అరణ్యాంతర' సి.యస్ మూర్తి, 'దత్తస్వీకారం' వై. భాస్కరరావు, 'మాయ పొర' కె.కె.ఎల్.స్వామి, 'సంకల్పం' జిబికె మూర్తి, 'మేఘ వర్ణం' జి. భాస్కరరావు, 'కుక్క' శ్రీ యండమూరి వీరేంద్ర నాథ్ రచించారు. 'కుక్క' తెలంగాణ మాండలికంలో రాయబడిన నాటిక. పాత్రల నిర్మాణం ఇతివృత్తం ప్రతీక వాదాన్ని మేళవించి రచించిన నాటిక ఇది. ఇది రంగస్థలం మీద అద్భుతంగా రాణించి, తెలుగు నాటక సాహిత్యంలో గొప్ప ప్రయోగంగా కీర్తింపబడింది.

'నాలుగు వేళ్లూ... నావైపే!!' అనే నాటికను భారతుల రామకృష్ణ రచించారు. ఈ నాటిక మానవ సంబంధాలను పెంపొందించే దిశగా నడుస్తుంది. జ్ఞానం ఉన్న చోట అజ్ఞానం. వెలుతురు ఉన్నచోట చీకటి నిలబడటానికి వీల్లేదు కానీ మేధావుల సంఖ్యను గణనీయంగా మనం పెంచుకుంటున్నాం. కానీ రోజు రోజుకూ - సమాజంలో అవినీతి, లంచగొండితనం, రౌడీయిజం మొదలైన చర్యలు గుణాత్మక సంఖ్యతో ఎన్నోరెట్లు అధికంగా పెరిగి పోతున్నాయి. ఇందుకు కారణమేమిటి? లోపం ఎక్క డుంది? అన్న ప్రశ్నలతో ఈ నాటిక ప్రారంభం అవుతుంది. విలువలతో కూడిన విద్య నేర్వకపోవడం - మానవత్వం లేని మేధావుల్ని తయారుచేసుకోవడం ఈ విపరీత అనార్థ లకు మూలం. ఎంత సేపూ ఎదుట వాళ్లను వేలెత్తి చూప డమే అలవాటుగా చేసుకున్న మనం - ముందు మనవైపే చూపిస్తున్న ఈ నాలుగు వేళ్లను గమనిస్తే, ఆత్మపరిశీలన జరుపుకొని పరివర్తన పొందగలిగితే, అవినీతి అరాచకాలు సమాజంలో వాటంతట అవే సమస పోతాయని ఈ నాటిక తెలియజేస్తుంది. అవినీతికి ఆలవాలంగా నిలుస్తున్న అధికారుల్లో పరివర్తనను ఆకాంక్షిస్తూ నాటిక ముగుస్తుంది. అవినీతి ప్రధానాంశంగా కుటుంబ కథలో దాన్ని మేళవించి ఓ రిటైర్డ్ ఉపాధ్యాయిని పాత్ర చుట్టూ అల్లబడ్డ సన్ని వేశాలు ఈ నాటికలో కనిపిస్తాయి.

ఎస్.ఎస్.ఆర్.కె గురుప్రసాద్ నాటికలు చాలా రచిం చారు. తరాల అంతరం, పెళ్లికుదురింది, పరివర్తన, మాండవ్యుడు, మిస్టర్ వరహాలు, ధర్మో రక్షతి రక్షితః, మీరూ ఆలోచించండి, ధనం మూలం ఇదం జగత్, బాగోదు, వారసుడు, గురుదక్షిణ, సారీ నాటకం లేదు, హితైషి, 'ఎక్కడో ఒకచోట' వంటివి రంగస్థలం మీద ప్రదర్శింపబడి పేరు ప్రఖ్యాతులు సాధించాయి.

రెండు తెలుగు రాష్ట్రాలలోని నాటక రచయితలే గాక, రాష్ట్రేతర తెలుగు నాటకాభిమానులు నాటికలు రచిం చారు. ఇందులో ముఖ్యంగా చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి ప్రవాసాంధ్ర ప్రజానాట్య మండలి, ఖిలాయ్ వాళ్లుశ్రీ పాదనాటక కళాపరిషత్తు నిర్వహించే జాతీయస్థాయి నాటిక పోటీలలో పాల్గొంటుంటారు. ఎల్.ఆర్. రావు రచించిన నాటిక 'నిశ్చలన చిత్రాలు' జాతీయస్థాయిలో ప్రశంసలు అందుకుంది.

## 2. సాంఘిక నాటకాలు :

ఆయా నాటక రచయితలు రచించిన సాంఘిక నాటకాలు రంగస్థలం మీద ప్రత్యేక ప్రదర్శనగా నిలి చాయి. ఇందులో శ్రీపాద కుమారశర్మ దర్శకత్వంలో విజయాదిత్య ఆర్ట్స్ వాళ్లు ప్రదర్శించిన నాటిక 'మనసులు కలిస్తే'. జి.బి.కె. మూర్తి ఈ నాటకాన్ని రచించారు. మానవ సంబంధాలను తట్టి లేపే నాటకం ఇది. మనందరికీ జన్మ నిచ్చింది ఆ భగవంతుడు ఒక్కడే! పాపాలు చేసే వయసు ఇరవై అయితే, ప్రాయశ్చిత్తం చేసుకొనే వయసు అరవై అన్నారు. ఈ జన్మలో మనకు మనం ఏం చేసు కున్నామన్నది ముఖ్యం కాదు. అందులో మన స్వార్థం ఉం టుంది. ఇతరుల కోసం మనం ఏం చేశామన్నదే ముఖ్యం. మనిషి ఇతరుల కోసం పాటుపడటంలో అవ ధులు లేని తృప్తి దొరుకు తుంది. ఈ సత్యాన్ని తెలుసు కోకుండా మనం అహంకార అతి శయాలతో ప్రవర్తించి సమస్యలను సృష్టించుకొని మన చుట్టూ ఉన్న వారిని దూరం చేసుకుంటున్నాం. వారికి దూరమవుతున్నాం. ఈ వాస్తవాన్నే 'మనసులు కలిస్తే' ప్రదర్శించింది.

మరొక సాంఘిక నాటకం గోపరాజు విజయ్ రచించిన 'ఆరోజు కోసం'. ఈ కాలంలో యాంత్రికతతో మూడిపడిన జీవితాలను గూర్చి ఈ నాటకం తెలుపుతుంది. కంప్యూటర్ యుగంలో పనే పరమావధిగా, ఆర్థిక విలువలే ప్రాధాన్యంగా జీవించే యాజ మాన్యం, తమ సిబ్బందికి అధిక మొత్తంలో వేతనం చెల్లిస్తూ, ఆ సిబ్బంది యొక్క కుటుంబ సంబంధాలను, బాంధవ్యాలను, మానవ విలువలను విస్మరించి పరోక్షంగా దాస్యం చేయించుకుంటుంది. ఈ ప్రపంచంలో డబ్బుంటే చాలు అన్నీ సొంతం చేసుకోవచ్చు అన్న యాజమాన్య ప్రతినిధి యల్.యన్. సిన్హాతో డబ్బుతో ఏమైనా కొనవచ్చు కానీ, బంధాలు, అనుబంధాలను కొనలేవు అని పందెం కాస్తాడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గోవర్ధన్ రావు. అలనాడు శ్రీకృష్ణుడిని తన దగ్గరున్న ధనంతో తూచడానికి ప్రయత్నించి దారుణంగా ఓడిపోయింది సత్యభామ. చివరికి చిన్న తులసీ దళంతోనే మళ్లీ ఆయనను దక్కించుకుంది. ఈ చిన్న దళమే బంధం అంటే అన్న గోవర్ధన్‌రావు మాటలుక ఎల్.ఎన్. సిన్హా ఏ విధంగా స్పందించాడో తెలియజెప్పే ప్రయత్నమే ఈ నాటక సారాంశం.

భ్రష్టు పట్టిపోయిన నేటి రాజకీయ, సామాజిక వ్యవస్థను ప్రతి బింబించే 'శర పంజరం' అనే నాటకాన్ని ఎస్.వెంకటేశ్వర్లు; అవినీతి లంచగొండితనంతో నిండిపోయిన సమాజాన్ని చూపే 'అమృతం తాగిన రాక్షసులు' అనే నాటకాన్ని శైలమూర్తి; సామాజిక స్థితి గతులను తెలియజేసే నాటకాలు 'అద్వితీయం', 'మాండవ్యుడు' లను ఎస్.ఎస్.ఆర్.కె. గురుప్రసాద్ రచించారు.

### 3. పద్య నాటకాలు :

పల్లేటి లక్ష్మీ కులశేఖర్ పద్యనాటక రచయితల్లో ప్రముఖులు. 'వీరపల్నాడు' వీరు రచించిన పద్యనాటకం. ధర్మపరిరక్షణార్థ సంభవించిందే మహాభారతం. సర్వకుల సమానత్వానికి, దళిత జనోద్ధరణకు సాక్ష్యమైన చాపకూడు ధర్మసిద్ధాంత సంరక్షణార్థం సంభవించినదే పల్నాటి భారతమని ఈ నాటకం ప్రధానాంశం. మరొక పద్యనాటకం 'శ్రీ మాధవశర్మ'. దీనిని రచించినవారు పి.వి.ఎన్. కృష్ణ. ధర్మం కోసం సర్వాస్వాన్ని త్యాగం చేసిన మహ నీయులెందరో ఉన్నారు. మన జాతి చరిత్రలో 5వ శతాబ్దంలోనే ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన విష్ణుకుండిన మహారాజు శ్రీమాధవ వర్మ. ధర్మంకోసం తన కన్నకొడుకునే శిరచ్ఛేదనం చేసే శిక్ష విధిస్తాడు. ధర్మం, న్యాయం కారణాలుగా ఈ నాటకం నడుస్తుంది.

అదేవిధంగా శారదా ప్రసన్న రచించిన పద్యనాటకం 'జీవన్ము తుడు'. సప్త వ్యసనాలలో మద్యపానం ఒకటి. ఆ వ్యసనం వల్ల తన 'మృతసంజీవని' మంత్రం మరిచిపోయి అనేక రకాలుగా భ్రష్టుడైన శుక్రాచార్యుడి స్థితిని తెలిపే నాటకాంశం ఇందులో ఉంది. భారతేతికథాంశంతో నడిచే నాటకం ఇది. తర్వాత డి. విజయభాస్కర్ రచించిన 'వేమన', ఆకెళ్ల 'అల్లసాని', గేదెల రామారువు 'మహాసాధ్వి శకుంతల', తడకమళ్ల రామచందర్‌రావు 'కృష్ణపక్షం', తాంద్ర సుబ్రహ్మణ్యం 'శ్రీ మహిషాసుర మర్ధని' వంటి పద్యనాటకాలు కళాభిమానుల మనసులను అలరించాయి.

### 4. సంగీత నృత్య రూపకాలు :

డి.వై. నారాయణమూర్తి రచించిన 'కూచిపూడి మాహాత్మ్యం', కె.వి. రాజారావు రచించిన 'మానవతావేదం' అనే సంగీత నృత్య రూపకాలు ఈ మధ్యకాలంలో ప్రదర్శింపబడ్డాయి. ఇందులో మొదటి రూపకం కూచిపూడి ప్రాశస్త్యాన్ని, చరిత్రను తెలియజేస్తూ, రెండవ రూపకం మానవ విలువలను ప్రతిబింబించింది. నైతిక విలువలు పతనమైనప్పుడు, సంస్కృతి కనుమరుగైనప్పుడు, ఆ చీకటి కోణాలను చీల్చుకుంటూ ఉద్భవించిందే 'మా-నవతా వేదం' అనే రూపకం.

### 5. బాలల నాటికలు/నాటకాలు :

బాలల మనస్థితిని, వారి ఆలోచనావిధానాన్ని, సృజనాత్మక శక్తికి పదును పెట్టే అనేక ఇతివృత్తాలతో అనేక నాటకాలు వెలిశాయి. ఇవి బాలల చేతనే ప్రదర్శింపబడి, వారి వ్యక్తిత్వ, మానసిక వికాసానికి తోడ్పడుతున్నాయి.

'ఆ వెచ్చని సముద్రగర్భం' అనే బాలలనాటకాన్ని ఎం.ఎస్. చౌదరి రచించారు. ఈ నాటకం పర్యావరణానికి

సంబంధించింది. తొలి మానవుడు పుట్టే నాటికి స్వచ్ఛమైన వెలుతురు, ప్రకృతి, నీరు ఎంతో అద్భుతంగా ఉండేదని, అది మనిషి ఎదుగుదలకు ఎంతో ఉపకరించేదని... మరి ఈనాడు... ఎంతటి విధ్వంసం జరిగిందో ఈ నాటకం తెలియజేస్తుంది. మరొక బాలలనాటకం 'కాళ్లా గజ్జా కంకాళమ్మా'. దీనిని కవి పి.ఎన్.ఎమ్. రచించారు. ఇందులో బాలల చదువుకు సంబంధించిన విషయం ఉంటుంది. ''చదువు బాల్యానికి భారం కావొద్దు. ర్యాంకుల కోసం బాల్యం బందీ చేయొద్దు. స్వేచ్ఛాయుత బాల్యాన్ని అనుభవించాలి. చదువుకోవాలి'' వంటి సందేశం ఈ నాటకంలో చోటు చేసుకుంది.

తర్వాత 'మేమున్నా' అనే బాలల నాటిక కె.వి. రంగా రావు రచించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల పట్ల చూపించ వలసింది సానుభూతి కాదని, వాళ్లల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపితే అద్భుతాలు సృష్టిస్తారని ఈ నాటిక తెలుపుతుంది. పిల్లల మేధాశక్తి అనంతమైందని, వాళ్లకు ప్రేరణ ఇవ్వాలని సూచిస్తుంది. అదే విధంగా 'ఒంటరి రెక్కలు' అనే బాలల నాటికను డి. విజయ భాస్కర్ రచించారు. పశుపక్ష్యాదులతో ఈ నాటిక నడుస్తుంది. ఓ సముద్రం దగ్గరలో ఉన్న అడవిలోని పక్షులన్నీ సఖ్యంగా ఉంటూ తమ ఉనికికి, వృద్ధికి కారణమైన వనదేవతకు, ప్రకృతిమాతకు వందనాలు పలుకుతుంటాయి. కాని సాగరుడు తనకు ప్రత్యేకమైన కృతజ్ఞత తెలుపలేదనే ఆక్రోషంతో ఓ నెమలిజంట గుడ్లను తీసుకొని వెళ్తాడు. ఆ నెమలిజంట ఎంత ప్రార్థించినా ఆ గుడ్లు తిరిగి ఇవ్వడానికి నిరాకరిస్తాడు. ఇక పక్షులన్నీ ఏకమై విప్లవం లేవదీసి యుద్ధాన్ని ప్రకటించి, గరుత్మంతుని సాయంతో సాగరుడిపై దండెత్తి విజయం సాధిస్తాయి.

ఈ విధంగా ఈ పదిహేనేళ్ల కాలం (2001-15)లో నాటక సాహిత్యం విస్తృత రీతిలో వెల్లివిరిసింది. సామాజికతను ప్రదర్శించింది. చివరగా...

Drama Writer is a ''Dynamo''
Director is the ''Curtain Riser''
*Artist is the ''Blub''*
(C.S.Rao)

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# వేమన కవిత్వం - జాతి జీవన దృక్కోణం

– డా॥.బూసి వెంకటస్వామి, శాఖాధిపతి, తెలుగు విభాగం, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు,

## ఉపోద్ఘాతం :

దక్షిణ ద్రావిడ భాషల్లో ముఖ్యమైన భాష తెలుగు. ఇది మధ్య ద్రావిడ కోవకు చెందింది. క్రీ.శ. 11వ శతాబ్దం లోనే ఆదికవి నన్నయ తెలుగులో ఆంధ్ర మహాభారత రచనతో గ్రంథస్థ సాహిత్యం ప్రారంభమైనది. ఎంతోమంది మన తెలుగు కవులు తమ రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. వారి 17వ శతాబ్దానికి చెందిన కవి వేమన. వీరు అచ్చ తెలుగు కవి. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఎన్నో రుగ్మతల్ని రూపుమాపడానికి సాహిత్యాన్ని సాధనంగా చేసుకున్న నిజమైన ప్రజాకవి వేమన. సమాజంలో అనేక కులాలను, మతాలను, వాటి మౌఢ్యాలను వేమన తూర్పారబట్టాడు. వేమన ప్రజల కొరకు కవిత్వం రాశాడు. కావున వీరు తేలికైన పదాలతో పదునైన భావాలతో పాఠకుల మనస్సులో పది కాలాలపాటు నిలువగలిగారు. వీరి పద్యాలలో

"ఊరు కొండవీడు ఉనికి పశ్చిమ వీధి
మూగ చింతపల్లి మొదటి యిల్లు"

అని ఉండడం వల్ల వారి జన్మస్థానం 'మూగచింతపల్లి' అని భావించారు. అయితే ఈ 'మూగచింతపల్లి' ఒంగోలు తాలూకా లోనిదని శేషాద్రి రమణ పేర్కొన్నారు. అలాగే రాళ్ళపల్లి అనంతకృష్ణ గారు వేమన కడప జిల్లా వాడని భావించారు. 'మూగచింతపల్లి' అనే గ్రామం చిత్తూరు జిల్లా చంద్రగిరి తాలూకాలో తప్ప ఆంధ్రదేశంలో మరెక్కడా లేదని భావించారు. వేమన చంద్రగిరిలో పుట్టి కొండవీడులో పెరిగాడని ఆరుద్ర గారు అభిప్రాయపడ్డారు. వేమన పద్యాల్ని సి.పి. బ్రౌన్ దొర సేకరించి తెలుగు వారికి మహోపకారం చేశారు. వేమన పద్యాలన్నీ కూడా సహజ సిద్ధమైన రీతిలో సాగుతాయి. అన్వయ కాఠిన్యం లేకుండా, దీర్ఘ సమాసాలు లేకుండా తన పద్యాల్ని రచించారు. వేమన భావాలు స్వతంత్ర మైనవి. వీరు ఆటవెలది ఛందస్సులోనే శతక పద్యాలు రాశారు.

## విశిష్ట కవి వేమన :

యోగి వేమన మహాకవి, గొప్ప ప్రజాకవి. తెలుగు సాహిత్యంలో సామాన్య ప్రజలకు దగ్గరైన కవి మరొకలు లేరు. వేమన పద్యాలు వినని తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఆంధ్రదేశంలో చాలామందికి కనీసం ఒక్కటైనా వీరి పద్యం వస్తుంది. దీనికి కారణం వారి పద్యాల్లోని భాష, భావం, విషయం, వీరి పద్యాల్లోని స్వచ్ఛమైన, సహజమైన, సులభమైన భాషే. వారు రచించిన పద్యాల్లో మంచి సామెతలు, చక్కని జాతీయాలు, సూక్తులు, నీతులు, సుభాషితులు అన్నీ కూడా కలగలుపుగా అత్యంత సహజంగా ఉంటాయి. వీరి పద్యాల్లో చక్కని ఉపమానాలు, పోలికలు ఔచిత్యవంతంగా ఉంటాయి. ప్రజలకు సుపరిచితాలైన పురాణాలు, ధర్మశాస్త్రాలు మొదలైన హిందూమత గ్రంథాల్లోని అనవసర కర్మకాండల్ని, వర్ణవ్యవస్థను, కులవ్యవస్థను, బ్రాహ్మణాధిక్యాన్ని, ప్రజల్లో ఉన్న మత మౌఢ్యాలను, నమ్మకాలను, మోసాలను, దుర్మార్గాలను, దొంగ గురువుల్ని, విగ్రహారాధనను, పురోహితుల ముహూర్తాలను, శైవ-వైష్ణవుల మత కలహాలను మొదలైన వాటన్నింటిని వేమన తన పద్యం ద్వారా తూర్పారబట్టారు.

సామాన్య ప్రజల మంచికోసం, వారి సంక్షేమం కోసం వేమన కవిత్వం చెప్పాడు. జానపదుల్లో జానపద సాహిత్యం ఎంత ప్రసిద్ధి చెందిందో వేమన పద్యాలు కూడా ప్రజల్లో అంతటి ప్రసిద్ధిని సంతరించుకున్నాయి. తెలుగు సాహిత్యంలో వేమనది అనితర సాధ్యమైన మార్గం. వారితో సాటిరాగల తెలుగు కవి మరొకరు లేరు. అందుకే వేమన తెలుగు సాహిత్యంలో గొప్ప విశిష్టమైన ప్రజాకవి. మిగిలిన కవుల్లాగా వారు పురాణాల్లోని కథల్ని తీసుకుని కల్పితంగా కావ్యాలు రాయలేదు. అంతేకాదు పూర్వ కవుల్లాగా రాజాశ్రయాల్లో సుఖభోగాలు అనుభవించి కవిత్వం,

కావ్యాలు రాసినట్లుగా వేమన చేయలేదు. వేమన ఒక చోటనే కూర్చొని కవిత్వం చెప్పలేదు. దేశ సంచారం చేస్తూ లోకం తీరును గమ నించి అందులో వున్న మంచిచెడు లను తన కవిత్వం ద్వారా చెప్పాడు. వేమన అశువుగా పద్యాలు చెబుతుంటే వారి వెనుక నున్న శిష్య బృందం ఆ పద్యాల్ని విని తర్వాత రాసుకున్నాడు. ఆ విధంగా వేమన చెప్పిన ఒక్కొక్క పద్యం ఒక్కొక్క ఆణిముత్యం లాగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిని సంపాదించు కున్నాయి. జాతి జీవన ప్రతిబింబంగా వేమన కవిత్వం నిలిచింది.

తెలుగు సాహిత్యంలో వేమన లాగా కవిత్వం చెప్పి ప్రజల మెప్పును పొందినవారు మరొకరు లేరని చెప్ప వచ్చు. నిజంగా వేమన విశిష్టమైన ప్రజాకవి. వీరు కొన్ని ప్రత్యేకమైన లక్షణాలతో ప్రజాకవిగా వెలుగొందుతున్నారు. వేమన కవిత్వానికి సంబంధించి వాటిని రెండు రకాలుగా వర్గీకరించి అధ్యయనం చేయవ్చు. 1) కవిత్వం పరంగా వేమన, 2) కవిగా వేమన.

## కవిత్వం పరంగా వేమన :

1) మూఢాచారాలను హాస్యయుక్తంగా ఖండించండం.
2) సులభమైన తెలుగు పదాలను ఉపయోగించడం.
3) అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన.
4) ధారణకు వీలుగా ఉండడం.
5) మంచి సుభాషితాలు చెప్పడం.
6) సామాన్య విషయాలను ఉపమానాలుగా చెప్పడం.
7) వేదాంత విషయాలను సులభమైన పదాలతో చెప్పడం
8) ఉల్లేఖాలంకారానికి ఉజ్వలమైన ఉదాహరణ.

## కవి పరంగా వేమన :

1) ప్రజాకవి, 2) ధీరకవి, 3) యోగకవి, 4) భావ విప్లవ కవి, 5) విశ్వకవి.

## కవిత్వపరంగా వేమన :

ప్రస్తుతం కేవలం కవిత్వం పరంగానే వేమన కవిత్వాన్ని చెప్పడం ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం.

### 1) మూఢాచారలను హాస్యయుక్తంగా ఖండించడం :

వేమన తన పద్యాల్లో తన కాలం నాటి మూఢాచారా లను, మూఢ నమ్మకాలను తీవ్రంగా ఖండించాడు. ఎలాంటి జంకూ గొంగకూ లేకుండా నిర్భయంగా తిట్టాడు. ఆ తిట్టులో చక్కటి హేళనతో కూడిన హాస్యం కూడా ఉంటుంది. హేళనకు గురైన వారు కూడా చక్కగా నవ్వు కునేలా కవిత్వం చెప్పడం వేమనకు మాత్రమే సాధ్య మైనది. హిందువులు దాదాపు నూటికి తొంభై శాతం ప్రజలు బ్రాహ్మణులతో సుముహూర్తంగా ఏర్పాటు చేసు కుని, ఆ ముహూర్తంలోనే శుభకార్యాలు చేసే ఆచారం ఉంది. అందులో వివాహం ప్రధానమైనది. మంచి ముహూర్తంలో పెళ్ళి జరిగితే ఆ దంపతులిద్దరూ సుఖంగా ఉంటారని లోకాచారం. కాని దీనిని వేమన తీవ్రంగా ఖండించాడు. ఎందుకంటే మంచి ముహూర్తంలో పెళ్ళి చేసుకున్నవారు విడిపోవడం, భార్యాభర్తల్లో ఎవరో ఒకరు చనిపోవడం కూడా జరిగింది. కాబట్టి వేమన ఆ మూఢాచారాన్ని చిన్న చిన్న మాటలతో అందమైన పద్యా లలో ఈ కింది విధంగా చెప్పారు.

"విప్రులెల్ల జేరి వెర్రికూతలు కూసి
సతిపతులను గూర్చి సమ్మతమున
మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా
విశ్వదాభిరామ! వినురవేమ!"

అని హేళన చేశాడు. ఈ హేళనలో చక్కటి హాస్యం కూడా ఉంది. అలాగే చనిపోయిన తల్లిదండ్రులకు పిండాలు పెట్టే ఆచారం కూడా హిందువుల్లో కొన్ని కులాల వారు మూఢంగా ఆచరిస్తారు. ఇలా ఆచారాన్ని పాటించే వారు తండ్రి చనిపోయిన రోజున అన్నం ముద్దలను కాకు లకు ఆహారంగా పెడుతుంటారు. ఆ అన్నం ముద్దల్ని కాకులు తింటే చనిపోయినవారి ఆత్మ శాంతిస్తుందని వారి నమ్మకం. అంటే చనిపోయినవారిని కాకులుగా భావించి ఆ కార్యం నిర్వహిస్తారు. కాకి పెంట తింటుంది మరి పెంట తినే కాకి తండ్రి ఎలా అవుతాడని వేమన ప్రశ్నించ డమే కాక అలా పిండాలు పెట్టేవారిని గాడిదలని తిట్టాడు.

"పిండములకు చేసి పితరుల తలపోసి
కాకులకు పెట్టు గాడ్డెలారా
పెంట దినెడి కాకి పితరుడెట్లాయెరా
విశ్వదాభిరామ! వినురవేమ!"

**2) సులభమైన తెలుగు పదాలను ఉపయోగించడం :**

వేమన తన పద్యాల్లో కఠినమైన సమాస పదాలను ఉప యోగించడు. సాధారణంగా ఉండే నిత్య వ్యవహారం ఉన్న, సులభమైన తెలుగు పదాలను మాత్రమే ఉప యోగించాడు. తెలుగు పదాలను ఉపయోగించి నూతన మైన భావాలను చెప్పడం వేమనకు వేమనే సాటి. ఇది మరొక విశిష్టత. నీచుడికి అధికారమిస్తే వాడు తనలాంటి నీచులనే చేరదీసి మంచివారిని వెళ్ళగొడతాడు. ఎందు కంటే నీచునికి మంచివారి గొప్పతనం తెలియదు. మంచి వారి గొప్పతనం చెడుగా కన్పిస్తుంది. ఎలానంటే చెప్పు తినే కుక్కకు చెరుకులో వున్న తియ్యదనం తెలియనట్లు అని వేమన ఈ కింది పద్యంలో చక్కగా వివరిస్తాడు.

"అల్పబుద్ధి వానికధికార మిచ్చిన
దొడ్డవారినెల్ల తొలగ గొట్టు
చెప్పు దినెడు కుక్క చెరుకు తీపెరుగునా
విశ్వదాభిరామ! వినురవేమ!"

అలాగే మరో పద్యంలో లోకంలో తప్పులు చేయని వారు ఎవరూ ఉండరు. కాకపోతే కొందరు ఎక్కువగా చేస్తే మరికొందరు తక్కువ తప్పులు చేస్తారు. లోకులు తమలో వున్న తప్పుల్ని గురించి పట్టించుకోకుండ ఇతరుల్లో వున్న తప్పుల్ని గురించి మాట్లాడుతారని క్రింది పద్యంలో వేమన లోకుల మనస్తత్వాన్ని చక్కగా సులభమైన తెలుగు పద్యాల్లోనే వివరించాడు.

"తప్పులెన్నువారు తండోప తండంబు
లుర్వీజనులకెల్ల నుండు తప్పు
తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు
విశ్వదాభిరామ! వినురవేమ!!"

**3) అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన :**

వేమన తన కవిత్వాన్ని ఆటవెలది అనే ఛందస్సులో రాశాడు. ఇందులో నాలుగు పాదాలుంటాయి. చివరి పాదం మకుటం. మిగిలిన మూడు పాదాల్లోనే వేమన తాను చెప్పదలచుకున్న భావాన్ని చక్కగా చెప్పాడు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన కవి వేమన ఈ విధంగా అల్పాక్షరాల్లో అనల్పార్థం వచ్చే విధంగా రచించే గుణం వేమనలో కనబడుతుంది. ఇది మరో విశిష్టత.

"ఆత్మశుద్ధి లేని యాచారమది యేల
భాండ శుద్ధి లేని పాకమేల
చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా
విశ్వదాభిరామ! వినురవేమ!!"

పై పద్యంలో మూడు పాదాల్లోనే మూడు విషయా లను వేమన చెప్పాడు. ఆచారానికి ఆత్మశుద్ధి, పాకానికి భాండశుద్ధి, శివపూజకు చిత్తశుద్ధి వుండాలని చెప్పాడు. శూద్రుడు తాకాడని, అంటరానివాడు ఎదురయ్యాడని సచేల స్నానాలు చేస్తూ, తాము నిప్పులాంటి ఆచారాన్ని అవలంబిస్తామని గొప్పలు చెబుతుంటారు. ఇవన్ని మూఢా చారాలు. ఇలాంటి వారికి ఆత్మశుద్ధి ఉం డదు. దైవభక్తికి కావలసింది ఆత్మశుద్ధి గాని పనికిరాని మూఢాచారం కాదు. అలాగే పండిన పంట రుచికరంగా, శుభ్రంగా, చెడి పోకుండా ఉండాలంటే పాత్ర శుభ్రంగా ఉండాలి. పాత్ర శుభ్రంగా లేకుంటే వంట చెడిపోతుంది. అలాగే దైవ పూజకు చిత్తశుద్ధి చాలా అవసరం. మనస్సును దేవునిపై ఉంచి ఏకాగ్రతగా నిలిపి పూజిస్తే, ఆ పూజ ఫలిస్తుంది. అలా కాకుండా 'చిత్తం శివుని మీద భక్తి చెప్పుల మీదు న్నట్లు' అవుతుందని చక్కగా చెప్పాడు వేమన. అలాగే మరో పద్యంలో...

"చంపదగినయట్టి శత్రువు తన చేత
చిక్కెనేని కీడు సేయరాదు
పొసగ మేలు జేసి పొమ్మంటే చాలు
విశ్వదాభిరామ! వినురవేమ!"

అంటే వేమన గొప్ప అహింసావాది. ఏ కారణం చేత నైనా సరే ఏ జీవిని కూడా చంపకూడదనేది వారి సిద్ధాంతం. తనకు ఘోరమైన అపకారం చేసిన వ్యక్తి, తనకు శత్రువైన వాడు దొరికితే అలాంటి వాడిని చంపకుండా వదిలి

వేయడమే కాకుండా, తిరిగి మేలు చేయమని వేమన చెబుతాడు. ఈ విధంగా వేమన చిన్న చిన్న పద్యాల్లో గొప్ప భావాలను తెలియజేస్తాడు.

**4) ధారణకు వీలుగా ఉండడం :**

వేమన పద్యాలు సులభంగా కంఠస్థం చేయడానికి వీలుగా ఉంటాయి. అలా కంఠస్థం చేసిన పద్యాలు చాలాకాలం వరకు గుర్తిండిపోతాయి. రెండు మూడుసార్లు చదవగానే అవి నోటికి వచ్చేస్తాయి. దీనికి కారణం వేమన పద్యాలు ఏ పాదానికి ఆ పాదం వేరు వేరుగా విడిపోయి స్పష్టంగా ఉండడం. మొదటి పాదంలోని విషయం రెండవ పాదంలోనూ, అలాగే రెండవ పాదంలోని విషయం మూడవ పాదంలోకి రాదు. ఈ విధంగా వేమన పద్యాలు వేరు వేరు పాదాల్లో స్పష్టంగా ఉండడం మరో విశిష్టత.

"కులం గల్గువారు గోత్రము గలవారు
విద్య చేత విఱ్ఱవీగు వారు
పసిడి గల్గువాని బానిస కొడుకులు
విశ్వదాభిరామ! వినురవేమ!"

పై పద్యంలో వేమన లోకం యొక్క పోకడను, ధనం యొక్క ప్రాధాన్యతను చక్కగా తెలియజేశారు. పసిడి గల్గువాడు అంటే ధనవంతుడు, బానిస కొడుకులు అంటే పనిచేసేవాని కొడుకులు. పనివాడు, అతని పిల్లలు యజమానికి ఎంతో వినయంగా ఉం టారు. అలాగే గొప్ప కులంలో జన్మించానని, గొప్ప గోత్రాలలో జన్మించానని, విద్య చేత అన్ని శాస్త్రాలు చదివానని గర్వంతో విఱ్ఱవీగే వారందరూ ధనవంతుని దగ్గరికి వెళ్ళి వంగి వంగి నమస్కారాలు చేస్తుంటారని వేమన చక్కగా చెప్పారు. అలాగే ఇంకో పద్యం...

"ఉప్పుకర్పురంబు నొక్క పోలిక నుండు
చూడ చూడ రుచుల జాడ వేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా
విశ్వదాభిరామ! వినుర వేమ!"

పై పద్యంలో వేమన ఉప్పు, కర్పూరం రెండూ చూడడానికి తెల్లగా ఒకేవిధంగా ఉంటాయి. కాని వాటి రుచులను చూస్తే అవి వేరు వేరని స్పష్టమవుతుంది. అలాగే మనుషులందరూ పైకి ఒకేలాగా కనిపించినా వారిలో దర్జనులు, సజ్జనులు వేరువేరుగా ఉంటారని చెప్పాడు.

**5) మంచి సుభాషితాలను చెప్పడం :**

వేమన గొప్ప సుభాషితాలను, సూక్తుల్ని తన పద్యాల్లో చక్కగా వివరించారు. అవన్నీ కూడా ప్రజల్లో గొప్ప ప్రసిద్ధిని, ప్రచారాన్ని పొందినవి. వేమనకు పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టాయి. ఇలాంటివి అన్ని కూడా ప్రజల వ్యవహారంలో సామెతలుగా చలామణి అవుతున్నాయి. ఇది కూడా వేమన విశిష్టతల్లో ఒకటి.

"ఎంత చదువు చదివి నెన్ని విన్నను గాని
హీనుడవగుణంబు మానలేడు
బొగ్గుపాల గడువ పోవునా మలినంబు
విశ్వదాభిరామ! వినుర వేమ!"

పై పద్యంలో అపవిత్రమైన వస్తువును పవిత్రం చేయడానికి పాలతో అభిషేకం చేస్తారు. బొగ్గు నల్లగా మలినంగా ఉంటుంది. దానిని ఎంతగా పాలతో కడిగినా దాని మాలిన్యం పోదు. కారణం అది స్వతసిద్ధంగా మలినమైన వస్తువు కావడం. అలాగే నీచుడు ఎన్ని గొప్ప గ్రంథాలను చదివినా, ధార్మిక ఉపన్యాసాలు ఎన్ని విన్నా అతని స్వతసిద్ధమైన నీచ గుణాన్ని మానలేదని చెప్పాడు. అలాగే మరో పద్యం.

"అనవుగాని చోట అధికులమనరాదు
కొంచెముండుటెల్ల కొదువ గాదు
కొండ అద్దమందు కొంచెమై యుండదా
విశ్వదాభిరామ! వినురవేమ!"

పై పద్యంలో వేమన ఎంతటి గొప్పవాడైనా సరే తన పరిస్థి తులు తనకు అనుకూలంగా లేనప్పుడు తన గొప్పతనాన్ని ప్రద ర్శించకూడదు. అలాగే తన గొప్పతనాన్ని ప్రదర్శించడం వల్ల అతనికి ప్రమాదం కలగవచ్చు. అందువల్ల అలాంటి సమయంలో గొప్పవాడు తగ్గి ఉండడం మంచిది. అలా ఉండడం వల్ల అతని గొప్పతనానికి ఎలాంటి లోపం రాదు. కొండ అద్దంలో కొంచమే కనిపించినప్పటికీ దాని గొప్పతనానికి ఎలాంటి లోపం రాదు కదా! అని వేమన వివరించారు.

**6) సామాన్య విషయాలను ఉపమానాలుగా చెప్పడం :**

అలంకారాల్లో ఉపమాలంకారం శ్రేష్టమైనది. అలాంటి అలం కారాన్ని ఔచిత్యవంతంగా ప్రయోగించడంలో కవికుల గురు పాదుడు కాళిదాసు ముఖ్యులు. అందుకే అలకారికులు 'ఉప మా కాళిదాసస్య' అన్నారు. ఆ కోవకు చెందినవారు మన ప్రజాకవి వేమన. వీరు చక్కని ఉప మానాలను ఉపయోగించడంలో కాళి దాసుకు సరిసమా నులు. వేమన మన చుట్టు ప్రతిరోజు కనిపించే వస్తువులను సుందరంగా చెప్పాడు. అతిసామాన్యమైన విషయాలను ఉపమానాలుగా ప్రయోగించడం వేమనకు మాత్రమే సాధ్యమైంది. మొదటి రెండు పాదాల్లో ఒక విషయాన్ని చెప్పి, ఆ విషయాన్ని మరింత స్పష్టంగా మూడవ పాదంలో లోకంలో కనిపించే సామాన్య విషయాలను ఉపమానాలుగా చెప్పడం వేమన కవిత్వంలోని మరో విశిష్టత.

"మర్మమెరుగ లేక మతములు గల్పించి
యుర్వి దుఃఖలగుదు రొకరి కొకరు
గాజుయింట కుక్క కళకళపడు రీతి
విశ్వదాభిరామ! వినురవేమ!"

పై పద్యంలో వేమన మానవులు దేవుడు ఒక్కడేననే రహస్యాన్ని తెలుసుకోకుండా తమకు తోచిన రీతిలో అనేక మతాలను కల్పించుకున్నారని, అంతటితో ఆగకుండా మా మతమే గొప్పదని, మా దేవుడే గొప్పవాడని రకరకా లుగా మత గ్రంథాలను రాసి ప్రజల్ని రెచ్చగొట్టుతారు. మతం పేరుతో అనేక కలహాలను సృష్టిస్తుంటారు. ప్రజల్ని దుఃఖ సముద్రంలోకి పడేస్తారు. ఇది గాజు లేదా అద్దాలు అమర్చిన ఇంట్లో కుక్కను ఉంచితే అది తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకుని, ఆ ప్రతిబింబాన్ని వేరే కుక్కగా భావించి కరవడానికి ప్రయత్నించడం లాంటిదని వేమన చక్కని ఉపమానాన్ని సహజంగానూ, నూతనంగానూ వివరించాడు. అలాగే మరో పద్యం...

"చదువులన్ని చదివి చాల వివేకియై
కలుషచిత్తుడైన ఖలుని గుణము
దాలిగుంట కుక్క తలచిన చందమౌ
విశ్వదాభిరామ! వినుర వేమ!"

పై పద్యంలో వేమన లోకంలో సహజంగా కనిపించే విషయాన్ని సామాన్యంగా చెప్పారు. గ్రామాల్లో ఇంటి ముందు చిన్నగుంత తీసి దాన్ని పొయ్యిగా ఉపయోగించి నీళ్ళు కాచుకుంటారు. అలాంటి గుంటను దాలిగుంట అంటారు. చలికాలంలో ఆ దాలి గుంటలో ఉన్న బూడిదలో ఊరకుక్కలు వెచ్చగా పడుకుంటాయి. ఆ కుక్కలకు ఆకలేసినప్పుడు తిండి కొరకు ఇళ్ళలో దూరి ఇంటివారి చేత దెబ్బలు తింటాయి. ఆ విధంగా దెబ్బలు తిన్న ప్పుడు ఆ కుక్కలు ఇక దొంగతనంగా ఎవరి ఇంట్లోకి వెళ్ళ కూడదు, దెబ్బలు తినకూడదని అనుకుంటూ ఉం టుంది. కాని మరుసటి రోజు మళ్ళీ పాత పద్ధతి ప్రకారం పూర్వం లాగా చేస్తూ దెబ్బలు తింటూ ఉంటుంది. అలాగే దుర్మార్గుడు కూడా గొప్ప పుస్తకాలు చదివి అపార జ్ఞానాన్ని సంపాదించినప్పటికీ ఆ పుస్త కాలు చదవినంత సేపు తాను కూడా మంచివానిగా ఉండాలను కుంటాడు. పుస్తకం మూసేసిన తర్వాత మళ్ళీ తన సహజగుణం ప్రకారం దుర్మార్గాలు చేస్తుంటారని చక్కని ఉపమానాన్ని సామా న్యంగా వేమన చెప్పాడు.

**7) వేదాంత విషయాలను సులభమైన పదాల్లో చెప్పడం:**

సాధారణంగా శిష్ట కవులు వేదాంతానికి సంబంధించిన విషయాలు చెప్పడానికి సంస్కృత సమాసాలను ఉప యోగిస్తారు. చిన్న చిన్న తెలుగు పదాల్లో గంభీరమైన భావాలను చెప్పడం పండిత కవులకు చేత కాదు. కానీ వేమన ఎంతటి గంభీరమైన విషయాన్నైనా అతి సులభ మైన, చిన్న చిన్న తెలుగు పదాలతో ఎంతో స్పష్టంగా చెప్పగలిగాడు. ఈ లక్షణం కూడా జానపద కవులకు ఉంది. ఇది వేమనలో వున్న మరో విశిష్ట లక్షణం.

"తనువ నేటి యింట తన శత్రు మిత్రుల
దెలియలేని వాని తెలివదేమి
తెలిసిన మనుజునకు దివ్యామృతంబురా
విశ్వదాభిరామ! వినుర వేమ!"

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


పై పద్యంలో వేమన ప్రతివారిలోనూ "కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు" అనే ఆరు అరిషడ్వర్గాలుంటాయి. ఇవి మనిషిలో వున్న అంతర్గత శత్రువులు. ఇవి శత్రువులచే విషయాన్ని గ్రహించి వాటిని జయించాలి. దాన ధర్మాలు, పరోపకారం చేయడం, అహింసను పాటించడం మొదలైన సద్గుణాలను అలవరచుకోవాలి. ఈ విధంగా ఏది మంచి, ఏది చెడు అని గ్రహించినవాడే తెలివైనవాడు, జ్ఞాని అవుతాడని వేమన చక్కని వేదాంత విషయాన్ని చెప్పాడు. అలాగే మరో పద్యం...

"పశుల వన్నె వేరు పాలేక వర్ణమౌ
పుష్పజాతి వేరు పూజ యొకటి
దర్శనములు వేరు దైవంబు దొక్కటే
విశ్వదాభిరామ! వినుర వేమ!"

పై పద్యంలో వేమన పశువుల్లో నలుపు, తెలుపు, ఎరుపు మొదలైన అనేక వర్ణాలు ఉన్నా అవి ఇచ్చే పాలు మాత్రం ఒకే రంగులో తెల్లగా ఉంటాయి. అలాగే పూజకు ఉపయోగించే పూలు రకరకాలుగా, రంగురంగుల్లో ఉంటాయి. అయినా పూజించే విధానం మాత్రం ఒక్కటే. అలాగే దేవుణ్ణి దర్శించడానికి చెప్పిన మార్గాలుచాలా ఉన్నప్పటికి దేవుడు ఒక్కడేనని వేమన చెప్పాడు.

**8) ఉల్లేఖాలంకారానికి ఉజ్వలమైన ఉదాహరణ :**

వేమన, నన్నయ చెప్పిన భారతం లాంటివాడు. నన్నయ తన భారతాన్ని గురించి ఇలా పేర్కొన్నట్లుగా "ధర్మతత్వజ్ఞులు ధర్మ శాస్త్రంబని, యధ్యాత్మక విధులు..." అని ప్రశ్నించినట్లుగానే వేమన కూడా తాను రాసిన పద్యాలను బట్టి అనేకులకు అనేక రకాలుగా దర్శనమిస్తున్నాడు. వేమన కవిత్వం గురించి తెలిసిన వారికి ఇతను మహాకవిగా, ప్రజాకవిగా, సంఘసంస్కర్తగా, మానవతావాదిగా, కుల నిర్మూలనవాదిగా, నాస్తికుడిగా, ఆస్థికుడిగా, సమసమాజ స్థాపకుడిగా, వేదాంతిగా, జ్ఞానిగా ఇలా అనేక రకాలుగా వేమన కనిపిస్తాడు. అందుకే ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారు వేమనను ఉల్లేఖాలంకారానికి ఉజ్వలమైన ఉదా హరణగా పేర్కొన్నాడు. ఈ లక్షణం వేమన పద్యాల్లో ఉండడం మరో విశిష్ట లక్షణం.

**ముగింపు :**

ఈ విధంగా వేమన మానవుడు నైతికంగా పతనం చెందకూడదని, పతనం చెందిన మానవుణ్ణి బాగు చేయడం కష్టమని చెబుతూ "కుండ చిల్లు పడినప్పుడు దానికి గుడ్డ అమర్చి దానిని వాడుకోవచ్చునని, కూలబడిన నరుణ్ణి బాగు చేయడం కష్టసాధ్య మని" హితవు చెప్పాడు. ఈ విధంగా వేమన తెలుగు కవివై, తేట తెలుగు మాటలతో సామాజిక జాడ్యాలను విమర్శిస్తూ, ప్రజల్ని మేల్కొల్పడానికి, సంస్కరించడానికి కవిత్వాన్ని సృష్టించి ప్రజా కవిగా ప్రసిద్ధి పొందాడు. అందుకే...

"రాజు మరణించే నొక తార రాలిపోయే
కవి మరణించే నొక తార గగనమెక్కె
రాజు జీవించే రాతి విగ్రహములందు
సుకవి జీవించే ప్రజల నాల్కల మీద"

అన్న గుఱ్ఱం జాషువాగారి మాటలకు వేమన నిదర్శనం.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# దళిత కవిత్వం - దళిత స్త్రీ ప్రాథమిక హక్కుల ఉల్లంఘన

- పి. వాణి, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

భారత రాజ్యాంగంలో "మెగ్నాకార్టా" గా పిలువబడే 3వ భాగంలో 12 నుండి 35వ ప్రకరణ వరకు ప్రాథమిక హక్కుల ప్రస్తావన వుంది. అమెరికా రాజ్యాంగ స్ఫూర్తితో భారత రాజ్యాంగ నిర్మాతలు వీటిని పొందుపరచారు. ప్రాథమిక హక్కులు సంపూర్ణమైనవి, సమగ్రమైనవి మరియు ప్రపంచ రాజ్యాంగాలన్నింటి కంటే సవివరమైనవి.

సమాజంలో సాంఘిక, మతపరమైన ఆచారాలకు లోబడి, అనాదిగా అగ్రకులాలచే అణచివేతకు గురవుతున్న పీడిత ప్రజలు దళితులు, దళితులలో కూడా పురుషుల కంటే ఎక్కువగా దళిత స్త్రీలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. దళిత స్త్రీలు అగ్రకుల స్థుల వల్ల కుల వివక్షత, వెట్టిచాకిరి, సామాజిక ఆచారాలు, లైంగిక వేధింపులు, దాడులు మొదలైన సమస్యలను ఎదుర్కొంటున్నారనే విషయాన్ని రచయితలు, రచయిత్రులు దళిత కవిత్వంలో ప్రస్తావించారు.

"జాంబపురుణం" అనే కవితలో నష్కల్‌డెక్కల్ వారు వివక్షతకు గురైన దళిత స్త్రీ గురించి ప్రస్తావించారు.

"అమ్మలక్కలు బావికి పోతే
అమ్మలక్కలు బిందెలు పట్టక
బిందెలు పట్టుక నీటికి పోతే
నీదే కులమని నీటుగ అడిగిరి
బిందెకు బిందె తగిలెను గనుక
కంసలి వానికి ఇవ్వండి
దాని సాపు చేసుకుని దించండి "

అగ్రకుల స్త్రీలు నీళ్ళుకు వెళ్ళిన దళిత స్త్రీలను మీదే కులమని అడిగి, వాళ్ళ బిందెకు దళిత స్త్రీల బిందె తగిలినందుకు దానిని కంసలివానికిచ్చి కొత్తదిగా చేయించుకోవాలని అన్నారు. ఇక్కడ తోటి స్త్రీలనే భావన లేకుండా దళిత స్త్రీలనే కుల వివక్షత చూపించి అగ్రకుల స్త్రీలు హేళన చేశారని రచయిత పేర్కొన్నారు.

సమానత్వపు హక్కులో 17వ ప్రకరణ ప్రకారం రాజ్యాంగం అస్పృశ్యతను పాటించడాన్ని నేరంగా పేర్కొన్నప్పటికీ సమానత్వపు హక్కును దళిత స్త్రీలు అనుభవించలేకపోయారని, దళిత స్త్రీల ప్రాథమిక హక్కులను అగ్రకుల స్త్రీలు ఉల్లంఘించారని రచయిత పేర్కొన్నారు.

"కుల కాలేజ" అనే కవితలో నక్కా విజయ భారతి గారు కుల వివక్షతకు గురైన ఒక దళిత విద్యార్థిని ఆవేదనను గురించి పేర్కొన్నారు.

"అద్దెరూం కోసం తిరుగుతున్నపుడు
కుల మడిగిన టులెట్ బోర్డు
లేదు పొమ్మని ముఖం మీద తలుపులేస్తే
నా కళ్ళలోని ద్రావక సముద్రాన్ని
ఎలా చల్లార్చుకున్నానో ! "

దళితవాడ నుండి పట్టణాలకెళ్ళి చదువుకునే సమయంలో దళిత విద్యార్థిని అద్దెగది కోసం తిరుగుతున్నప్పుడు టులెట్ బోర్డు పెట్టుకున్న అగ్రకులస్థులు ఆమె కులం గురించి అడిగారు. ఆమె దళితులని చెప్పగానే వారు ముఖం మీదనే తలుపులేయడం వల్ల కులవివక్షత కారణంగా జరిగిన ఆ అవమానాన్ని తట్టుకోలేక ఆమె కళ్ళ నుండి పొంగిపొర్లే ద్రావక సముద్రాన్ని ఎలా చల్లార్చుకుందో అని ఆ దళిత విద్యార్థిని ఆవేదనను రచయిత్రి పేర్కొన్నారు.

అస్పృశ్యతను పాటించడాన్ని నేరంగా రాజ్యాంగం పేర్కొన్న ప్పటికీ అగ్రకులస్థులు దళిత స్త్రీల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించారని రచయిత్రి పేర్కొన్నారు.

"మంకెనపూవు" అనే కవితలో చల్లపల్లి స్వరూపరాణి గారు ఆఫీసులో కులవివక్షతను ఎదుర్కొన్న దళిత స్త్రీ మనోవేదనను గూర్చి ప్రస్తావించారు.

"నాలుగు అక్షరాలు నేర్చుకుని
నేను కూడా ఉద్యోగస్తురాలినై

ఆఫీసుకెళినపుడు
'రిజర్వేషన్ కేటగిరి' అనే గుసగుసల్ని వినలేక
నాకే నా చెవిలో సీసం పోసుకోవాలనిపించింది".

చాలాకాలంగా చదువుకు దూరమైన దళిత స్త్రీ ఇంట్లో, సమాజంలో ఎన్నో అవమానాలను, అడ్డంకులను ఎదుర్కొని పట్టు దలతో చదువుకుని రిజర్వేషన్ ద్వారా ఉద్యోగాన్ని పొందింది. ఆమె కర్తవ్య నిర్వహణకు ఆఫీసు కెళినపుడు 'రిజర్వేషన్ కేటగిరి' అనే అగ్రకులస్థుల గుసగుసల్ని వినలేక ఆమెకు చెవిలో సీసం పోసుకోవాలనిపించిందని దళిత స్త్రీ మనోవేదనను రచయిత్రి వివరించారు.

సమానత్వపు హక్కులో 16 ప్రకరణ ప్రకారం వెనుకబడిన వర్గాల ప్రజలకు, సరైన ప్రాతినిథ్యం లేదని భావించే ఉద్యోగుల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చు. దళిత స్త్రీ ఈ హక్కును పొందింది కానీ ఆ రిజర్వేషన్ ద్వారా ఉద్యోగం పొందడం వల్ల అవమానాన్ని, కుల వివక్షతను ఎదుర్కొందని, అగ్రకులస్థులు దళిత స్త్రీల సమానత్వాపు హక్కును ఉల్లంఘించారని రచయిత్రి పేర్కొన్నారు.

## వెట్టిచాకిరి :

"ఎట్టి చాకిరి" అనే కవితలో జె.సుభద్రగారు కేవలం అంటరాని స్త్రీలకు మాత్రమే అంటగట్టబడిన వెట్టిచాకిరి గురించి వివ రించారు.

"ఏగి పొద్దున లేసి దొరయింటికి యెట్టికి పోయి
అద్దమోలే ఆకిలూడ్చి ఎకురాల అలుకు జల్లి
గొడ్డు గోద తాగనీకి గోలాలన్నీ నింపాలె
ఎడ్లా కొట్టాలల్ల బండెడు పెండ దియ్యాలె
రొచ్చెత్తి పొయ్యాలె సెత్తెత్తి పొయ్యాలె
సెత్తంతా మోసి మోసి నెత్తంతా కాయగాసె
సాపెకూడె దక్కిన కూలీ ఓ మల్లక్క "

దళిత స్త్రీలు పొద్దున్నే దొర ఇంటికెళ్ళి చెత్తలూడ్చి, కళ్ళాపి చల్లి, పశువులు నీళ్ళుతాగే తొట్లెలన్నీ నింపి, బండెడు పేడను, రొచ్చును, చెత్తను శుభ్రం చేయాలి. ఇంత శ్రమ చేసినప్పటికీ వారికి కూలీ డబ్బులివ్వరని, పాచిపోయిన అన్నం కోసమే వెట్టి చాకిరి చేస్తున్న దళిత స్త్రీ జీవన విధానాన్ని రచయిత్రి ఈ కవితలో పేర్కొన్నారు.

వ్యక్తుల హుందాతనాన్ని, ఆత్మగౌరవాన్ని గుర్తించి, పరిరక్షించి, పెంపొందించడానికి పీడనను నిరోధించే హక్కును రాజ్యాంగం మనకు ఇచ్చింది. రాజ్యాంగానీ, సంపన్న వర్గాలు గానీ వ్యక్తులను దోపిడికి గురిచేయకుండా నివారించడానికి ఈ హక్కు దోహద పడుతుంది. 23వ ప్రకరణ ప్రకారం మనదేశంలో మనుషుల క్రయ విక్రయాలను జరపడం, ప్రతిఫలం చెల్లించకుండానే బలవంతంగా వెట్టిచాకిరి చేయించుకోవడం అనేవి నిషేధించబడినవి. అయినప్పటికీ అగ్రకులస్థులు దళిత స్త్రీల చేత వెట్టిచాకిరి చేయిం చుకుంటూ అగ్రకులస్థులు పీడనను నిరోధించే హక్కును ఉల్లంఘించారని రచయిత్రి పేర్కొన్నారు.

## సామాజిక ఆచారాలు :

జోగిని, బసవి, మాతంగి, దేవదాసీ మొ॥ ఆచారాలు అగ్రకులస్థులచే దళిత స్త్రీలపై బలవంతంగా రుద్దబడిన వారి పాలిట శాపాలు. దళిత స్త్రీలను ం చిన్న వయసులోనే దేవాలయాలకు అంకితమివ్వడమనే పేరుతో వారిని పెళ్ళికి, జీవన సంస్కృతికి దూరంగా వుంచి, "ఊరుమ్మడి బతుకులు"గా చేసి హింసించి, అత్యాచారాలు చేసే దుర్మార్గపు ఆచారం ఇది. ధనవంతులైన భూస్వాములు వివాహేతర లైంగిక తృప్తికోసం వేసిన ఎత్తుగడ ఇది. ఆడపిల్లలను దేవతలకు అర్పించే ఈ అమానుష చర్యకు ముఖ్యులు పోతురాజులు, కులపురోహితులు, భూస్వాములు, గ్రామ పెద్దలు మొ॥వారు.

శంభుకునికి తలనరికి వేసి అనే కవితలో మాష్టార్జీ బసవి, జోగిని ఆచారాలకు బలైపోయిన దళిత స్త్రీలను గురించి ప్రస్తా వించారు.

"ఈ దేశపు భూస్వాములు
కండ్ల కెక్కిన కామదాహపు
కోర్కెలెల్లా తీర్చుకోను
కన్యలను మన దళిత స్త్రీలను
కత్తికే పెండ్లంటు జేసి
బసవి అంటూ జోగి అంటూ
ఇంటికొక కుంతీ జేసారా - నా
దళితులారా "

దుర్మార్గులైన భూస్వాములు వారి కామకోరికలను తీర్చు కోవడానికి దళిత స్త్రీలను కత్తి కచ్చి పెళ్ళి చేసి జోగినులుగా, బసవినులుగా మార్చి, అనేక మంది భూస్వాములు వారికి భర్తలుగా మారారని, దళిత స్త్రీలను ఇంటి కొక కుంతీగా మార్చారని మాష్టార్జీ తన ఆవేదనను వ్యక్తం చేశారు.

మత స్వాతంత్ర్యపు హక్కులో 25వ ప్రకరణ ప్రకారం ప్రతి వ్యక్తికీ ప్రజాభద్రత, నైతికతకు లోబడి తన అంతరాత్మకు అనుగుణమైన మతాన్ని అవలంబించడానికి , ప్రచారం చేసు కోవడానికి హక్కుంది. కానీ మతం పేరుతో అసాంఘిక చర్యలకు పాల్పడితే ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చు అయినప్పటికీ భూస్వా ములు బసవి, జోగినీ ఆచారాలను దళిత స్త్రీలపై రుద్ది వారి మత స్వాతంత్ర్యపు హక్కును ఉల్లంఘించారని రచయిత పేర్కొన్నారు.

1955లో అస్పృశ్యతా నివారణ చట్టాన్ని రూపొందించినప్పటికీ, 1989లో షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల చట్టం ( ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) ప్రకారం అస్పృశ్యతను పాటించిన వారికి 6-7 సం॥ల జైలు శిక్ష విధించినప్పటికీ, 23 ప్రకరణ ప్రకారం వెట్టిచాకిరిని, 25వ ప్రకరణ ప్రకారం అసాంఘిక చర్యలను నిషేదించినప్పటికీ, ఏ భూస్వామికి గానీ, ఏ అగ్రకులస్థుడికి గానీ శిక్షపడినట్లు తెలుగు దళిత కవిత్వంలో ఎక్కడా ప్రస్తావించలేదు. అంతరిక్షంలో ఉపగ్రహాలు ఎగురుతున్నా, మనుషులు చంద్ర మండలానికి వెళుతున్నా, గుండెను మార్చి గుండెను పెట్టి బతికిస్తున్నా దళిత స్త్రీలు నాటి నుండి నేటి వరకు కుల వివక్షత, వెట్టిచాకిరి, సామాజిక ఆచారాలు మొ॥ సమస్యలను ఎదుర్కొంటూనే ఉన్నారు. రాజ్యాంగం దళితులకు ఇచ్చిన హక్కులను అగ్రకులస్థుల ఉల్లంఘిస్తూనే ఉన్నారు. చట్టాలలోని హక్కులు కేవలం ప్రతులకు మాత్రమే పరిమితమైపోయాయి.

మనిషిని మనిషిగా చూడనంత వరకూ ఎన్ని పోరాటాలు చేసినా, ఎన్ని హక్కులు ఉన్నా, ఎన్ని చట్టాలు ఉన్నా అవి నామ మాత్రమే. చివరిదాకా నిలబడవు. దళిత స్త్రీల జీవితాలు బాగుపడవు. ఏది ఏమైనా మనిషిని మనిషిగా చూసే రోజులు రావాలని, మనది సంక్షేమ రాజ్యం కావాలని ఆకాంక్షిద్దాం.

**ఆధార గ్రంథాలు :**

1. దళిత కవిత్వం -1
2. మంకెన పూవు
3. జోగినీ వ్యవస్థ
4. మేమే

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# నెల్లూరు జిల్లాలో పర్యావరణ స్పృహ

– **టి. వనజ,** పరిశోధక విద్యార్థిని, ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

మానవ సమాజానికి ఒక పెను ప్రమాదం ఎదురవుతుందని ముందుగా తెలిసినా తక్షణమే స్పందించే హృదయాలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. దేశ కాలాల్లో వేటికి అవధి అంటూ లేదు. అలాగే ఈ స్పందనలకు కొలమాన ప్రమాణమూ లేదు. ఉండదు కూడా. అందుకు కారణం భౌతిక ప్రపంచం ఎంత చిత్ర విచిత్ర మయిందే అయినా అది మానవ స్వభావం కన్నా అత్యంత విచిత్ర మయింది కాదు. మేధావులకు ఈ విషయం తెలుసు. అయి నప్పటికీ ఒక ప్రాంతపు ప్రజలు ఒక ముఖ్యమైన సమస్యపైన ఎలా స్పందించారో తెలుసుకోవాలని, దాన్ని లోకానికి తెలియ జెప్పాలని జిజ్ఞాసతో చేసిన ప్రయత్నమే "నెల్లూరు జిల్లాలో పర్యావరణ స్పృహ" అనే వ్యాసం పర్యావరణ:, దాని పరిరక్షణ గురించి అనేక రకాలుగా వివరించి ఉన్నారు. కాని అందులో కొందరు కొంత ప్రత్యేకతను ప్రదర్శించారు. వారిలో డా॥ లెనెన్ ధనిశెట్టి ఒక విశిష్టమైన నిశిత పరిశీలన, సూక్ష్మ అవగాహన అద్భుత అంశాలను లోకానికి స్పష్టంగా తెలియజెప్పే నేర్పు కలిగిన ప్రముఖ పరిశోధకుడు. ఆయనను ప్రత్యేకంగా ఒకరు పరిచయం చేయవలసిన పనిలేదు. పర్యావరణాన్ని గురించి ఆయన రాసిన వ్యాసాలే పాఠకులలో ఆ అభిప్రాయాన్ని కల్పిస్తాయి.

అటువంటి వాటిలో నెల్లూరు జిల్లాకు సంబందించి రాసిన మూడు వ్యాసాలను గురించి యీ వ్యాసంలో వివరించడం జరుగుతుంది. వాటిలో మొదటిది "మోటార్ సైకిల్ డైరి జర్నివిత్ ఐరన్ ఓర్" అనేది ముడి ఇనుము అనంతపురంలోని ఓబులాపురం నుంచి నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టుకు ఏవిధంగా తరలిపోయింది తెలుపుతుంది. ఈ ఇరన్ ఓర్ వ్యాసం. వ్యాసకర్త ధనిశెట్టి లెనిన్ దీనికి సంబంధించిన విషయాన్నంతా మోటార్ సైకిల్‌పై తిరిగి సేకరించటం వల్ల 'మోటార్ సైకిల్‌పై డైరి' అనే పదాన్ని ముందర చేర్చారు. రెండవది కూటాలమర్రి, మల్లె మడుగును వెతుక్కుంటూ --- అనే వ్యాసం కడప, నెల్లూరు జిల్లాలను వెలిగొండల నడుమ ఉండే ఈ రెండు గ్రామాల చరిత్రను రచయిత స్వయంగా దర్శించి రాసిందే వ్యాసం. ఈ రెండు గ్రామాలలోని అమాయక ప్రజలను నాగరిక ప్రపంచం ఎలా వంచించి వెతలపాలు చేసిందో వివరించాడు. ఇక మూడవది "సొన కాలువల అపూర్వ గాథ" ఇందులో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సొన కాలువల విశిష్టతను దాన్ని పరిశ్రమల కోసం కొందరు, ఇసుక కోసం మరి కొందరు డబ్బుమీది మమకారంతోను ఎలా నాశనం చేస్తున్నారో తీవ్రంగా నిర్మోహమాటంగా విమర్శిస్తూ రాసిన వ్యాసం.

ఈ మూడు వ్యాసాలు వేటికవే ప్రత్యేకమైనవి. అయినా అందులో చివరి వ్యాసం (సొన కాలువల అపూర్వ గాథ) రచయిత హృదయాన్ని పరిశోధన తత్వాన్ని సంపూర్ణంగా ఆవిష్కరిస్తుంది. ప్రకృతి మానవులకు సొనకాలువల ప్రత్యేకత, అది మానవ తప్పిదాల వల్ల అంతర్ధానమౌతున్న తీరు, వాటి ప్రత్యేకతను అధికారుల దృష్టికి తీసుకవెళ్ళగా స్పందించని వారి అజ్ఞానాన్ని ఎండగట్టిన వైనం కన్పిస్తుంది. ప్రకృతి పట్ల రచయితకున్న ఆరాధనా భావ తీవ్రత ఆవేశం, ఆక్రోశం, నిరాశ, నిస్పృహలు అన్నీ ఈ వ్యాసంలో పాఠకులకు స్పష్టంగా కనిపిస్తాయి.

హృదయమున్న వారి కంటివెంట నీటిని స్రవింపజేస్తుంది "మోటార్ సైకిల్ పై డైరి జర్ని విత్ ఇరన్ ఓర్" వ్యాసం.

ఇది ఏడుపుటల వ్యాసం సాహిత్య ప్రస్థానం పత్రికలో 2008వ సంవత్సరం నవంబర్ 4 డిసెంబర్ మాసాల ప్రత్యేక సంచికలో ప్రచురింపబడింది. రచయిత ప్రారంభంలోనే "గత తొమ్మిది నెలలుగా -- ప్రతి రోజూ ఒకోచోట --- వొక్కో మానవ ప్రాణం గాల్లో కలుస్తూ --- నెత్తుటి

తడి ఆరకముందే నెల్లూరు నుంచి ముడి ఖనిజపు ఎగుమతి వ్యతిరేక కమిటీ కన్వీనర్ కిషోర్‌బాబు ఫోన్ --- ఈ విధ్వంసపు మూలాలు వెళ్ళి చూడమని అట్లా ప్రారంభమయింది నా "Journey with Iron ore" అంటాడు రచయిత.

రవాణా జరుగుతూ ఉండటంలో పర్యావరణం కొంత వరకు కలుషితమౌతుంది. ఆకాలుష్యాన్ని తొలగించుకోవాలని ప్రజలు ప్రభుత్వాలు గూడా అదృష్టవశాత్తు శ్రద్ధ వహిస్తే తిరిగి మామూలు వాతావరణం ఏర్పడటానికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు. కాని అంతకన్నా ఘోరం ఏంటంటే ఇనుప ఖనిజాన్ని రవాణా చేసే లారీలు తమ దారికి అడ్డొచ్చిన, అడ్డునిలిచిన వాహనాలను మనుషులను, పశువుల్ని, గొర్రెల్ని సమస్తాన్ని ఢీకొట్టి చంపి నిర్లక్ష్యంగా వెళ్ళిపోవటం అడిగే నాధుడేలేడు. ఒకవేళ ఎవరైనా అడిగితే దిక్కున్నచోట చెప్పుకోమంటారు. లేదా తన్నబోతారు ఇనుప ఖనిజాన్ని చేరవేసే లారీలను చిన్న పిల్లలు గూడా తొలటమన్నది మరొక ఘోరం. ఈ ముడి ఇనుమును అనంతపురంలోని ఓబులాపురం నుంచి ప్రయోగించి కడప జిల్లా మీదుగా నెల్లూరు జిల్లాలో మర్రిపాడులో ప్రవేశించి కృష్ణపట్నం పోర్టుకు చేరతాయి. మొత్తం 45 గ్రామాల గుండా ఐరన్ ఓర్ లారీల ప్రయాణపు రాకపోకలుంటాయి. ఆ రాకపోకలు ఎలా జరిగాయో, జరుగుతున్నాయో ఆయా గ్రామాలకు వెళ్ళి అక్కడ వాళ్ళు చెప్పిన విషయాలను డాక్టర్ లెనిన్ అక్షరీకరించాడు.

ముడి ఇనుము రవాణా కలిగించిన భీభత్స ప్రాణభయం వల్ల మిరపకాయల కూలీలు కూలికి వెళ్ళటం మానేసి, కూటికి అలమటించారు. సాయంత్రం ఐదున్నర తర్వాత ఆటోలు నడపటం ఆపేసి, ఆటోవాలాలు అర్ధాకలితో కాలం వెళ్ళబుచ్చారు. ఇనుప రజను మానవులకున్న అన్ని రంధ్రాల్లోను చొరబడి అనేక రకాల వ్యాధుల్ని తెచ్చిపెట్టటం వల్ల ఆస్పత్రులు కళకళలాడాయి. తల్లిదండ్రులు పిల్లల్ని బడులకు పంపడం నిలిపేయటం వల్ల చదువులు అటకెక్కాయి. ముడి ఇనుము రవాణా అయిన గ్రామాల్లో చెట్లు, రోడ్లు ఇనుపరజను దుప్పటిలా పరుచుక పోయింది. పొలాలు, చెట్లు కళతప్పిపోయాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రకృతి పాడై పోయింది, ప్రజా జీవనం స్తంభించి పోయింది. తప్పనిసరి అయి రోడ్ల మీదకు వచ్చిన ప్రజలు, పశువుల్లో కొందరు కొన్ని మాత్రమే తిరిగి స్వస్థలాలకు చేరటం జరిగింది. తక్కినవి ప్రాణాలు పోగొట్టుకొనో, వికలాంగత్వంతోనే మిగిలాయి.

ఈ దుర్మార్గాన్ని ఎదిరించి కొన్ని గొడవలు, ఉద్యమాలు జరగకపోలేదు. వాటన్నింటినీ స్థానిక నాయకులు బెదిరించో, డబ్బులు చల్లో అణచివేశారు. ప్రభుత్వంవారు, పెట్టుబడిదార్లు, పెత్తందార్లు అంతా కలిపి ఐరన్ ఓర్ రవాణా ఓబులాపురం నుంచి కృష్ణపట్నం పోర్టుదాకా సకాలంలో జరిగేటట్టు చూసి తమ టార్గెట్ పూర్తి చేసుకున్నారు. ఆ ప్రయత్నంలో రవాణా చేస్తున్న తమవారిలో కొందరిని పోగొట్టుకొని ఉండవచ్చుగాక! యుద్ధంలో దిగాక విజయమే లక్ష్యంగాని తక్కినవి లెక్కకురావు గదా! ఇక్కడ అంతే జరిగింది. రవాణా జరిగేటప్పుడు తమ లారీలకు, ట్రక్కులకు అడ్డొచ్చిన వాహనాలను ప్రాణులను ఢీకొట్టి నుజ్జునుజ్జు చేసి ఒక్క మారు తామూ బలిపశువులుగా మారి రవాణా చేసినవారు. తమ కర్తవ్యపాలన చేశారు. స్వామిభక్తిని చాటుకున్నారు.

ప్రాణభయంతోను, అనైకమత్యంతోను, అజ్ఞానంతోను ప్రజలు ఉన్నతంతకాలం అధికారబలం, అంగబలం, పరపతి ఉన్నవారు తాము ఏం చేసినా చెల్లిపోతుందనే ధీమాతోనే ఉంటారు. నిర్లజ్జగా, నిర్భయంగా ఏమైనా సరే చేయగలుగుతారు. చేస్తూనే ఉంటారు. ఇందుకు తిరుగులేని ఉదాహరణగా ఈ ఐరన్‌ఓర్ రవాణా ఘట్టం నిలిచి పోతుంది.

### 2. కూటాలమర్రి, మల్లెమడుగులను వెతుక్కుంటూ :

కూటాలమర్రి, మల్లెమడుగు అనేవి అటవీ ప్రాంతంలో ఉన్న రెండు గ్రామాలు. కడప, నెల్లూరు జిల్లాలను వేరు చేసి వెలిగొండల మధ్య ఉన్న గ్రామాలు ఇవి. వాటిని గురించి ఇరవై ఐదేళ్ళుగా లెనిన్ సాధువులు, బైరాగులు, మూలికా వైద్యులు, వెదురు కాంట్రాక్టర్లు, ఫారెస్ట్ గార్డులు, యునాదులు చెప్పగా విన్నాడు. ఎన్నో

మార్లు ఆ గ్రామాలను చూసి రావాలని అనుకున్నా వీల్పడలేదు. చివరకు ఆ గ్రామాలను చూసే తీరాలని దృఢంగా అనుకొని తెలిసిన వారి సాయంతోను వెళ్ళిచూసి వచ్చి తను గ్రామాల విషయాలను రెండు వ్యాసాలుగా రాశాడు.

2012 ఫిబ్రవరి 5 ఆదివారం నాటి ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చింది. రెండవది 2012 ఫిబ్రవరి 12 ఆదివారం నాడు అదే ఆంధ్రజ్యోతి దినపత్రికలో అచ్చయింది.

అడవి మార్గాలు ఎలా వుంటాయో అనుభవజ్ఞులందరికి తెలి సిందే. నట్టడివిలో అథర్‌సిన్హానగర్ సుస్వాగతము. కూటాలమర్రి అనే బోర్డు కనిపించినపుడు ఆశ్చర్యానికి లోనవ్వటమనేది సహజంగానే జరిగింది. అథర్‌సిన్హా అనే పేరు ఉత్తర భారతీయుడిది. అతడు యిక్కెడికెలా వచ్చాడు? ఎందుకొచ్చాడు? ఇక్కడి యానాదుల్ని సంస్కరించటానికి వచ్చిన క్రైస్తవుడేమో! అనే వారి సందేహాలు గూడా సహజమయినవే. ఎందుకంటే మన దేశంలో ఒకప్పుడు క్రీస్తు మత వ్యాప్తి యిలానే జరిగింది కాబట్టి. ఏమైనా తను ఎన్నో ఏళ్ళుగా చూడాలనుకుంటున్న కూటాలమర్రి చెట్ల సందుల్లా నుంచి కనపించే సరికి లెనిన్ అన్ని విషయాలు మరచిపోయి అక్కడ దారి తీశాడు. శిధిలమయిన ఇరవై గుడిసెలు లెనిన్ బృందానికి వెక్కిరిస్తూ కనిపించాయి. మనుషుల జాడలేదు. అదృష్ట వశాత్తూ అగ్రామంలో శివరామరాజు అనే అతడు ఉండటం లెనిన్ బృందానికి అతిధ్యమివ్వటమే గాక మల్లెమడుగు చరిత్రను గూడా చెప్పటం జరిగింది.

ప్రతి గ్రామానికి ఏదో ఒక పూర్వ చరిత్ర ఉన్నట్టే మల్లెమడుగు గ్రామానికి కూడా ఒక కథ లేకపోలేదు. ఒకప్పుడు ఆ గ్రామంలో ప్రతి ఇంటా మల్లెచెట్టు ఉండటం వల్ల మల్లెమడుగు అన్నారట. ఆనాటి రెక్కల కష్టం మల్లెమడుగులోని భూముల్ని సాగులోకి తెచ్చింది. మరి ఇటువంటి గ్రామం యీనాడు ఎందుకు పాడు బడిపోయింది. నాగరిక వాసనలు తగలటంతో కుర్రకారు స్వభావాల్లో మార్పులొచ్చాయి. నాగరికత అలవర్చుకోవడం మంచిదే కాని, దాన్ని మత్తులో పడి ఉన్న వూరును, కన్నవారిని మరచిపోవటం ఏమాత్రం మంచిది కాదు. కాని మల్లెమడుగులో అదే జరిగింది. నీటి సౌకర్యం లేకపోయినా మంచుకే పంటల పండేవి. దున్ని విత్తనాలు వెసిరితే పుట్లకొద్ది పంట పండేది. పురుగుల మందులు లేవు. ఎరువులు లేవు. బస్సులు కరెంటు దీపాలు ఎరుగరు --- మా బిడ్డలు బయటి ప్రపంచాన్ని చూశారు. కలికాలం రోగాలు, రొష్టులు వచ్చాయి అంటాడు. పోనీ వాదన కోసం అతడు చెప్పిన చివరి మాటలు స్వీకరించినా, ఆ గ్రామంలోని యువత ఉద్యోగాలకోసం ఎంతగా ఎగబడిన గాని నిక్షేపం లాంటి భూముల్ని ఒదిలిపెడుతుందా? అనే సందేహం కలిగి తీరుతుంది. ఎంతోమంది యీనాటికి ఉద్యోగాలు చేస్తూనే వ్యవసాయం గూడా చూసుకుంటున్నారు గదా! అయినప్పుడు మల్లె మడుగు గ్రామం అలా అయిపోయిందంటే కారణం - తొలుత కొద్దిగా ప్రవేశించిన నాగరికత క్రమంగా ఆవూరి మొత్తాన్ని తన మోజులోకి లాక్కునేసింది అనుకోవాలి.

సుఖంగా జీవించాలని, సులభంగా డబ్బు సంపాదించాలని కోర్కెలతో పల్లె ప్రజలు పట్నాలకి ఎగబాకి, పల్లెల్ని ఎలా ఒదిలేస్తున్నారో స్వచ్ఛమైన గాలికి నేటికి ఎలా దూరమౌతున్నారో మల్లెమడుగును గురించి తెలసుకుంటే చాలు అర్థమౌతుంది.

ఇక్కడ ఒక విశేషం ఉంది. మల్లెమడుగు గ్రామాన్ని ఆ ఊరి వాళ్ళే వదలి వెళ్ళిపోయారు. అందువల్ల మంచైనా, చెడైనా అది గ్రామాస్థుల స్వయంకృతం కాని కూటాలమర్రి విషయం అలా కాదు. కావాలనే ఆ అడవి బిడ్డల్ని ఉన్న చోటు నుండి మరో చోటుకు వెళ్ళేట్టు చేశారు. అందువల్ల కూటాలమర్రి గ్రామస్థుల ఉదంతం దారుణమయింది.

ఐదారు సంవత్సరాల క్రితం సుబ్రమణ్యం అనే కలెక్టర్ వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు. మిమ్మల్నందర్నీ అభివృద్ధి చేస్తారన్నారు. అతడి మాటలకు ఆ అడవి ప్రజలు ఆనందించారు. ఆదరంగా చూసి సాగనంపారు. తరువాత వచ్చిన ఆథర్‌సిన్హా కలెక్టర్ ఈ అడవిలో ఏం బ్రతుకు? బయటికొచ్చుయండి బంగారంగా బతుకొచ్చు, మీకు భూములిస్తాం, ఇళ్ళు కట్టిస్తాం అంటూ ఆశలు పెట్టాడు. తరువాత

వచ్చిన అశోక్‌కుమార్ కలెక్టర్ వాళ్ళకు ఇళ్ళు కట్టించి, దానికి అశోక్‌నగర్ అని తన పేరు పెట్టించాడు. అదే కూటాలమర్రి కాలని.

పక్షవాతంతో మంచాన పడ్డ అడవి వైద్యుడు మాట్లాడుతూ మగవాణ్ణి ఆడదాన్నిగాను, ఆడమనిషిని మగ మనిషిగాను చేసే మూలికలు, పులిని మనిషిగాను, మనిషిని పులిగాను చేసే మూలికలు తనకు తెలుసునంటాడు. ఈనాడు మనం నమ్మలేకపోవచ్చుగాని, ఒకప్పుడు మూలికలుండేవని మొన్న మొన్నటిదాకా పెద్దలు చెపుతూ ఉండేవారు. ఇది నిజమే గనుక అయితే మనం ప్రకృతి ప్రసాదించిన ఎన్నో దివ్యమైన మూలికలను గూర్చిన జ్ఞానాన్ని పోగొట్టుకున్నవారం అవుతాము. ఒక్క చిన్న అడవి పల్లె జనాన్ని యీ విదంగా కష్టాలపాలు చేసిన గొప్ప విద్యావంతుల్ని, ఘనమయిన అధికారుల చేష్టల్ని శాడిష్టులనటంలో తప్పు లేదేమో! దానికంతా కారణం రాజకీయంగా పెరిగిపోయిన అవి నీతి, అజాడ్యం అన్ని రంగాల్లోనూ వ్యాపించి పోయింది అనటానికి కూటాలమర్రి పల్లెగాథే నిదర్శనం.

### 3. సొనకాలువ అపూర్వగాథ :

ఈ వ్యాసం సాహితా స్రవంతి విజయవాడవారు 2014 మార్చిలో ముద్రించారు. ఈ వ్యాసాన్ని చదివినప్పుడు "ఒక వ్యవస్థ వెలికి తీయాల్సిన చారిత్రక వాస్తవాలను ఒక వ్యక్తి ..... బహిర్గతం చేసినందుకు ... ఆశ్చర్యపోతాం. సహృదయులు అభినందించ కుండా ఉండలేరు. దీనివల్ల మాకేంటి? అనుకొనే వారికి గూడా చెప్పవలసిన పనిలేదు. బేధమల్లా అర్థం చేసుకొనే లేక స్పందించే విధానంలోనే కాబట్టి ఇక అసలు విషయాన్ని చూద్దాం.

సొనకాలువలు అంటే నేలలో నుంచి నీళ్ళు ఊరి కాలువలా ప్రవహించేది. అయితే ఈ సొన కాలువలు ఎక్కడబడితే అక్కడ ఏర్పడవు. ఈ సొనకాలువలు ఏర్ప డాలంటే ఇసుక దిబ్బలు ఉండి తీరాలి. ఈ కాలవలకు ఇసుక దిబ్బలే ఆధారం.

ఇసుక భూముల్లో స్థాపిస్తున్న ఒక బహుళజాతి టెక్స్‌టైల్స్ కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా ఆ ప్రాంత గ్రామాల జనంతో కలిసి డా॥ లెనిన్ కూడా ఉద్యమిస్తున్నాడు. వేలమంది ప్రజలు తమ వ్యవసాయ భూములు పరిశ్రమల మూలంగా నాశనమై పోతున్నాయని బాధపడుతుంటే అధికారులు, రాజకీయ నాయకులు, స్థానిక పెత్తందార్లు ప్రజల్ని మభ్యపెట్టి ఎలా తమ దారికి తెచ్చుకోవాలో ఆలోచిస్తున్నారు. ఈ స్థితిలో ఆ సభను ప్రజాప్రాయునికి అనుగుణంగా ఎలా మార్చాలా అని ఆలోచిస్తూ లెనిన్ దాహమేసి పక్కనే వున్న సొన కాలువలో నీళ్ళు తాగాడు. నీటి స్వచ్ఛతకు, రుచికి ఆశ్చర్యపోయిన లెనిన్ స్థానిక సన్నకారు రైతు రవీంద్రను అడిగాడు. అక్కడి రైతుల్ని సొన కాలువలు ఏర్పడ్డ విధానాన్ని ప్రశ్నించాడు. అయితే ప్రస్తుతం ఇసుకదిబ్బలు ఇప్పుడు లేవు. వాటికి 1970 నుంచి గ్రహనం పట్టింది. ఆ ప్రాంతంలో జరుగుతున్న ఇసుకలోనే సిలికామైనింగ్ వందలాది ఎకరాల ఇసుకదిబ్బల్ని మింగేసి మైదానంగా మార్చేసింది. ఆ మైదానాల మధ్యలో సగం చచ్చిన ప్రాణంతో సొన కాల్వలు ప్రవహిస్తున్నాయి. (కండలేరు) నది నుంచి పులికాట్ వరకూ ఉండే ఇసుక దిబ్బల ప్రస్తావన.

సొనకాలువల చరిత్రను తవ్వితీయటంలో లెనిన్ పడ్డ శ్రమ గాని కష్టాలుగాని సామాన్యమైనవి గావు. అయితే ఆయన శ్రమ మాత్రం వృథా కాలేదు. ఆ విషయ సేకరణ వివరాలన్నింటిలోనూ యస్.వి. యూనివర్శిటి జియాలజి ప్రొఫెసర్ ప్రస్తుతం విశ్రాంత ఆచార్యులయిన డా॥ ఆర్ జగదీశ్వరరావు గారు 2012లో సొన కాలువలకు సంబంధించి చెప్పిన విశేషాలను ఇక్కడ చెప్పడం జరిగింది.

దాని ప్రకారం చరిత్ర పూర్వ యుగాలైన ప్లేస్టోసిన్ యుగంలో సంభవించిన తీవ్ర హిమ పాతాల మూలంగా, ఆతరువాత హలో సేన్‌శకంలో భూవాతావరణం ఆకస్మికంగా చల్లబడి వేడెక్కే క్రమంలో సంభవించిన భీభత్సపు సముద్ర వుప్పెనలో భాగంగా కోట, చిల్లకూరు మండల పరిసర ప్రాంతాలు చాలాకాలం సము ద్రంలో ఉండిపోయాయి. కాలక్రమంలో ఉష్ణోగ్రతల్లో మార్పు రావటం వల్ల సముద్రం వెనక్కి వెళ్ళిపోవటం ఆ ప్రాంతం ఇసుక మేటలు నెలవంక ఆకారంలో ఆవిర్భవించి ఉనికిలోకి

వచ్చాయి. కొన్ని వందల సంవత్సరాల పాటు యిసుక మేటలు తీవ్రమైన గాలికోతకు గురయి స్వచ్ఛమైన సిలికాన్ డయాక్సైడ్ రూపాన్నే సంతరించుకున్నాయి. ప్రపంచంలో సముద్రతీర ప్రాంతంలోని యే కాలువలైనా తూర్పు నుంచి పడమరకు ప్రవహిస్తాయి. సొన కాలువలు మాత్రం పడమర నుంచి తూర్పుకు ప్రవహిస్తాయి. ఇటు వంటి లక్షణాలు గల కాలువలు ప్రపంచంలోనే లేవు. కాబట్టి భూమి మీద సృష్టిలోనే ఏకైక ప్రాకృతిక అద్భుతం ఈ సొనకాలువలు అని చెప్పవలసి ఉంటుంది. ప్రస్తుతం ఈ సొన కాలువలు కొన్ని సంవత్సరాలలోనో, నెలలోనో అభివృద్ధి పేరిట నశించిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి.

మరొక విశేషమేమంటే సొనకాలువల్ని ప్రవహింపజేసే ఇసుక దిబ్బలు చలన రహితమైనవి కావు. అవి తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర వహిస్థాయి.

ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఈ సొనకాలువలు గురించి వాటి రక్షణ గురించి డా॥ లెనిన్ ఎన్నో మహాజనులు ప్రభుత్వ అధి కారులకు, ప్రభుత్వాలకు సమర్పించాడు. కాని అవన్ని బుట్ట దాఖలయ్యాయి. మిడియాలు, పత్రికలు కూడా చివరకు ఈ రాజకీయ సుడిగుండంలోనే తగులుకొనే జీవిస్తున్నాయని అతనికి క్రమంగా అర్థమై తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. అ ఈదుస్థితికి అసలు కారణం ప్రజల్లో సరయిన స్పందన లేక పోవటం. ఒక ప్రాంతంలో ప్రజలకు అన్యాయం జరుగు తుందని తెలిసినప్పుడు తక్కిన ప్రాంతాల ప్రజలు ఉద్యమించాలి. కాని మన తెలుగు దేశాన ఒక ఇంటి దుఃఖం ఆ ఇంటి వరకే పరి మితం. ఎవరికి వారే యమునా తీరే అనే సామెత మన ఆంధ్రు లకు చక్కగా వర్తిస్తుంది. ఇకనైనా ప్రాంతీయ బేధాలు మరిచి ఇలాంటి సందర్భాల్లో సంఘటితంగా పోరాడతారని ఆశిద్దాం.

ఇక డా॥ లెనిన్ గురించి చెప్పదలిస్తే పై మూడు వ్యాసాలు ఆయన సామాజిక బాధ్యతలను చెపు తున్నాయి. అతనిలో జర్నలిస్ట్, ఒక రిపోర్టర్, ఒక తాత్త్వికుడు, భావకుడు చక్కని రచయిత ఉన్నాడు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన మూడు వ్యాసాలు అతని పరిశీలనాసక్తిని, పరిశోధనలపై అతనికున్న మక్కువ, సత్యాన్వేషణని తత్పరతను స్పష్టంగా చూడవచ్చు. జర్నీవిత్ ఐరన్ ఓర్ వ్యాసం వల్ల పాలకుల, అధికారుల అరాచకత్వం నిర్లక్ష్యంగా పశువుల మనుషుల పట్ల వారి ప్రాణాలతో చలగాటం ఆడేందుకు సిద్ధపడ్డారో తెలుపుతుంది. కూటాలమర్రి, మల్లెమడుగు సంబంధించిన వ్యాసం అమాక గిరిజనులను తియ్యనిమాటలతో మభ్యపెట్టి ఆశలు రేపి చివరికి వారి బ్రతుకు లను చిద్రం చెసిన వారు కలెక్టర్లు కావడం చూస్తే నాగరికత పైశాచిక ఆనందం ఒక భాగమేనని అనిపించక మానదు. సొన కాలువల అపూర్వ గాధలలో గతం, వర్తమానం, భవిష్యత్తు మూడింటిని మానవులు అర్థం చేసుకొని ఎలా ప్రవర్తించాలో పర్యావరణం దెబ్బతింటే ఫలితాలు భవిష్యత్తు ఎంత భయానకంగా ఉండబోతుందో తెలిపాడు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# విజయనగర సామ్రాజ్య సాహిత్యం - జ్యోతిష్యాంశాలు

- రాంభట్ల వేంకటరాయశర్మ పరిశోధకవిద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

సృష్టి పరిణామ క్రమంలో ఆటవిక జీవనం నుండి బయటపడి మనిషి సాంఘిక జీవనాన్ని అలవాటు చేసు కొని "సంఘజీవి"గా పరిణమించాడుబుద్ధి కుశలతతో మనుగడ సాగిస్తున్నాడు కాబట్టి "బుద్ధి జీవి" కూడా. ఈ క్రమంలో తను నిత్య గమనించే విషయాలను పరిశీలిస్తూ, కొత్త విషయాలను, శాస్త్రబద్ధం చేసి తన తర్వాతి తరానికి అందించాడు. వేదాంగాలలో భాగమైన జ్యోతిషం కూడా ఒకటి. సంఘజీవనానికి అలవాటు పడిన మానవుడు, తనను తాను రక్షించుకొంటూ, తన చుట్టూ ఉన్నవారిని కూడా రక్షించసాగాడు. ఇలా సంఘ జీవనంలో రాజ్యాలేర్పడ్డాయి. ఎన్నో మార్పులకు లోనైనా, ప్రజలను కన్న బిడ్డల్లా రక్షించిన రాజులు, రాజ్యాలు కూడా చరిత్రగానే మిగిలిపోయాయి. కానీ తెలుగు సాహిత్యానికే స్వర యుగంగా భాసిల్లినది మాత్రం విజయనగర సామ్రాజ్యం మాత్రమే. క్రీ.శ. 1336లో విద్యారణ్యస్వామి వారి ఆశీస్సులతో స్థాపించబడి, సంగమ, సాళువ, తుళువ, ఆరవిటి వంశాలచే పరిపాలించబడిన విజయనగర సామ్రాజ్యం, ఎంతోమంది తెలుగు కవులను పోషించింది. ఆ కవులు తమ రచనలతో తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకొన్నారు. విజయనగర రాజులను ఆశ్రయించి, వారి మన్ననలు పొందిన కవుల సాహి త్యంలో కొన్ని జ్యోతిషాంశాలను ఈ పరిశోధనా పత్రంలో పరిచయం చేస్తాను.

శ్లో. ఆదిత్యాయచ సోమాయ: మంగళాయ బుధాయచ
గురు శుక్ర శనిభ్యశ్చ రాహవే కేతవే నమః !!

శ్లో. మేషో వృషశ్చ మిధునః కర్కసింహ కుమారికా!
తులా విచాప మకరాః కుంభమీనౌ యథాక్రమమ్!!
(బృహత్పరాశర హెూరాశాస్త్రం)

రవి, చంద్రుడు,కుజుడు, బుధుడు, గురుడు, శుక్రుడు,శని, రాహువు, కేతువు ఈ తొమ్మిదింటిని నవగ్రహాలంటారు. మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, సింహం, కన్య, తుల, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం. ఇవి 12 రాశులు. 27 నక్షత్రాలు. 108 పాదాలు కలిసి, ఒక్కొక్క రాశికి 09 పాదాల చొప్పున 12 రాశులు ఏర్పడుతున్నాయి. సూర్యుని చుట్టూ భూమి తిరిగే కక్ష్యలో ఇవి ఉన్నాయి. వీటన్నింటిని కలిపి "భగణం" లేదా భ చక్రం అని అంటారు.

ఏదైనా మంచిపని ప్రారంభించడానికి "శుభ సమయం కావాలి. అప్పుడే ఆకార్యం సిద్ధించి, ఫలితాన్ని అందరూ ఆస్వాదిస్తారు. విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించడానికి విద్యారణ్య స్వామి శంకుస్థాపన ముహూర్తం నిర్ణయించారు. రెండువేల సంవత్సారు నిరాఘాటంగా, పరిపూర్ణమైన కీర్తిని పొందే విధంగా ఉన్న శుభ సమయాన్ని హరిహరరాయలకు, బుక్కరాయలకు చెప్పి, నేను "శంఖధ్వని" చేస్తాను, ఆ సమయానికి శంకుస్థాపన చేయమని చెప్పారు. అయితే విధివశాన, ఆ దారిలో వెళ్తున్న జంగం, నిర్ణీత సమయం కన్నా కొన్ని నిముషాల ముందే "శంఖం" ఊదుకుంటూ వెళ్ళాడట. అదే సరైన సమయంగా భావించి శంకు స్థాపనను చేశారా అన్నదమ్ములు. ఆ తర్వాత విద్యారణ్యుల శంఖ ధ్వని వినపడింది. వివరం తెలుసుకున్న స్వామి, ఈ ముహూర్తం వలన 200 సంవత్సరాలు విజయనగర ఖ్యాతి, అమో ఘంగా వ్యాపిస్తుంది. చరిత్రలో చిర స్థాయిగా ఉంటుందని దీవిం చారట. ముందుగా అనుకున్న సమయానికే శంకు స్థాపన జరిగి ఉంటే, విజయనగర మహా వైభవం, తెలుగు భాషకు సేవ ఇంతకు ఎన్నిరెట్లు ఉండేదో?.

క్రీ.శ. 1355-1377 సంవత్సరాల మధ్య విజయనగరాన్ని పాలించిన మొదటి బుక్కరాయలు, నాచన సోముని ఆదరించి, అగ్రహారాన్నిదానం చేశాడు. (ఆంధ్ర సాహిత్య చరిత్య- ఆచార్య పింగళి), "సకలభాషా భూషణ,

సాహిత్య రసపోషణ, సువిధాన చక్రవర్తి, నవీన గుణ సనాథ నాచన సోమనాథ" అని ఉత్తరహరి వంశం గద్యలో చెప్పుకున్నాడు. ఇందులో జ్యోతిషాంశాలున్నాయి.

**శకునాలు :**

జ్యోతిషం పంచస్కంధ సమన్విత శాస్త్రం. సిద్ధాంతం, సంహిత, హెూర, ప్రశ్న, శకునాలనే ఐదు స్కంధాలు ప్రత్యేక విభాగాలుగా జ్యోతిష శాస్త్రంలో అధ్యయనం చేయబడుతున్నాయి. ప్రకృతి పరిశీలన ద్వారా ప్రకృతిలోని జీవుల స్పందనలలోని శుభాశుభాలనుగమనించి, చెప్పేదే శకునం. ఆధునిక విజ్ఞానశాస్త్రాల తల్లిగా సంహితా శాస్త్రం పేరెన్నెకగన్నది. సంహితలు అంటే కూర్చ బడినవి అని అర్థం. ముహూర్తం, వాస్తు, స్వప్న శాస్త్రం మొదలైనవి సంహితలలో భాగాలు. భారతదేశంతో పాటు వివిధ దేశాల్లో కూడా ప్రజలుకు శకునాల మీద నమ్మకం ఎక్కువ. మంచి శకునాలు, చెడ్డ శకునాలు ఏవనే విషయంలో తరాల నుండి వస్తున్న నమ్మకమే ముఖ్యమైనది. నాచన సోమనాథుడి ఉత్తర హరివంశంలో దుశ్శకునాలు గురించి ఉంది.

బాణాసురుడి రాజధాని శోణితపురంలో దుశ్శకునాలు కని పించాయిట. రాక్షసులు ప్రాణాలు తల్లడిల్లేటట్లుగా శోణిత పురంలో అకాల కుంభవృష్టి కురిసింది.

కం. మార్జాలంబులు చెలగుచు
గర్జించెను గొబల నుండి కంపించె బహు
స్ఫూర్జితనినదముతో ధర
వర్జితపర్వుడయి రాహు వడి బట్టె రవిన్
(ఉత్తర హరివంశం 5 వ ఆశ్వాసం. 33 వ పద్యం.)

పిల్లులు అదేపనిగా అరుస్తున్నాయి. భూమి ఒక్క సారిగా కంపించింది. సూర్యుణ్ణి రాహువు పట్టుకున్నాడు. విడిచిపెట్టకుండా సుడిగాలి రేగింది. దక్షిణ దిక్కున "ధూమకేతు" అనే ఛాయా గ్రహం కనపడింది. రాక్షస కన్యలు పూజిద్దామని వెళ్తుంటే రచ్చ మాను ఒరిగి పోయింది. కృత్తికా నక్షత్రంలో కుజుడు వక్రించి, హానిని సూచిస్తున్నాడు. గుండెలు పగిలేటట్లుగా శుక్రుడు అస్తం గతుడౌతున్నాడు. సూర్యుడు రక్తవర్ణంలోకి మారు తున్నాడు. రచ్చ బండ దగ్గర నీడ గురించి పెంచిన చెట్టు కూలిపోయింది. బాణుడి జన్మ నక్షత్రమైన "భరణి" నక్ష త్రంలోకి సూర్యుడ ప్రవేశించాడు. తెలుపు, ఎరుపు, నలుపు రంగులు కలగలిసిన మొండెమాకారపు మేఘం, సాయం సంధ్యా సమయంలో సూర్యుణ్ణి కప్పేసింది. (33 నుండి 38 పద్యాల వరకు)

పైన చెప్పిన వన్నీ దుశ్శకునాలు. ఇందులో కృత్తికలో కుజుడు వక్రించడం, శుక్ర గ్రహం, సూర్యుడి గురించిన విశయాలన్నీ జ్యోతిషంలో జాతక భాగానికి సంబంధిం చినవి.

**స్వప్నాలు( కలలు) :**

భారతీయ జ్యోతిష శాస్త్రంలో స్వప్న శాస్త్రానిది ప్రత్యేక స్థానం. "ఆహార నిద్రామైధునాలు" ప్రాణికి సహజం. పగ లంతా అలసిన శరీరానికి నిద్ర వలన విశ్రాంతి దొరుకు తుంది. నిద్రలో సుషుప్తావస్థలో ఉన్నప్పుడు వ్యక్తిలో నిబిడీకృతమైన చేతనలోని అంశాలు స్వప్నాల ద్వారా సాక్షాత్కరిస్తుంటాయి. వాటి శుభాలు, అశుభాలు ఏవైనా ఉండవచ్చును. వీటి గురించి తెలియజేసేదే స్వప్న శాస్త్రం. కలలు ఏడు రకాలు. 1) చూసినవి, 2) విన్నవి. 3) అను భవించినవి, 4). కోరినవి, 5) కల్పితాలు, 6) భావికాలు 7) దోషజాలు. వీటిలో మొదటి ఐదు రకాల కలలకు ఫలంలేదు.

తెలుగు సాహిత్యంలో కలలకు విశేషమైన స్థాన ముంది. తిక్కనకు సాక్షాత్కరించిన హరిహరనాథుడి రూపాన్ని వర్ణించాడు. యోగ వాసిష'ంలో "లవణరాజు కల"ను గురజాడ అప్పారావు ముత్యాల సరాలలో అను వదించారు. ఆంధ్ర భోజుడైన శ్రీకృష? దేవరాయలకు, ఆంధ్ర మహా విష్ణువు కలలో కనిపించే ఆముక్త మాల్య ద"ను తెలుగులో రచించమన్నట్లుగా స్వయంగా రాయలే చెప్పుకున్నాడు. నాచన సోమన ఉత్తరహరివంశంలో ఉషాపరిణయ ఘట్టంలో "ఉష"కు చెడుకలలు వచ్చి తల్లడిల్లితే, చెలికత్తె చిత్ర రేఖ ఊరడించిందని రాశాడు. (ఉత్తర హరివంశం 5 వ ఆశ్వాసం 82 వ పద్యం)

సంగమ వంశం తర్వాత విజయనగరాన్ని సాళువ వంశానికి( క్రీ. శ. 1450- 1500) చెందిన రాజులు పరి పాలించారు. 'సాళువ' అంటే డేగ అని అర్థం. ఈ వంశపు రాజైన సాళువ నరసింహరాయలు ( క్రీ.శ. 1485-1492) కవులను పోషించాడు. పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుడు తన జైమిని భారతాన్ని ఇతనికే అంకితమిచ్చాడు. ఈ కావ్యంలో కూడా దుశ్శకునాలు, దుస్స్వప్నాల గురించి ఉన్నాయి. తెల్లవారఝామున వచ్చిన కల నిజమౌతుందనేది నమ్మకం. ఆనాటి నుండి ఈ నాటి వరకూ అందరూ నమ్ముతున్న అంశం. జైమిని భారతంలో ఉత్తరరామ చరిత్రలో శ్రీరాముడికి వచ్చిన "కల" నిజమయ్యిందని ఉంది.

కం : నాలుగు మాసములరుగగ
డాలక్ష్మణు చేత సీత దడయక గంగా
కూలమున విడువ "గల" గని
యాలోమేల్కాంచి గుండియ తటాలనగన్
(జైమిని భారతం-6 వ ఆశ్వాసం- 13 వ పద్యం)

అప్పటికి నాలుగు మాసాల తర్వాత లక్ష్మణుడి చేత సీతను గంగానది తీరంలో విడువమని రాముడు చెప్పి నట్లుగా కలగని తటాలునగానే మెలుకువ వచ్చిందిట. ఇది దుస్స్వప్నం.

"పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడు" హరికీర్తనా చార్యుడిగా ప్రసిద్ధి చెందిన తాళ్ళపాక అన్నమా చార్యుడు (క్రీ.శ. 1424-1503), ఈ సాళువ నరసింగ రాయలకు బాల్య మిత్రుడని ప్రతీతి. తెలుగులో తొలి సారిగా సంకీర్తన రచనకు శ్రీకారం చుట్టి యోగవైరాగ్య శృంగార మార్గాలలో ముప్పైరెండువేల సంకీర్తనలను రచించాడు. ఒక కీర్తనలో 12 రాసులను అలమేలు మంగకు ఆపాదించి ఇలా రాసాడు.

ఇన్ని రాసుల యునికి ఇంతి చెలువపురాశి
కన్నె నీరాశి కూటమి కలిగిన రాశి
కలికి మొమవిండ్లు గల కాంతకు ధనురాశి
మెలయు మీనాక్షికిని మీనరాశి
కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభరాశి
వెలగు హరిమధ్యకును సింహరాశి
(అన్నమయ్య కీర్తన)

కనుబొమ్మలు ధనుస్సురాశి, కళ్ళు మీన రాశి, కుచ కుంబాలు కుంభరాశి, "హరిమధ్య"అంటే సింహం వంటి నడుము. ఆడవాళ్ళను హరిమధ్యలుగా చెప్పడం పరిపాటి. కన్నెప్రాయపు సతికి కన్యారాశి, వన్నెల్లో బంగారంతో తుల తూగే వనితకు తులారాశి, తిన్నని వాడిగోళ్ళ సతికి వృశ్చిక రాశి, గుట్టుగా మాటలాడే సతికి కర్కాటక రాశి, ఆముకొనే నొరపులతో మెరిసే అతివకు వృషభ రాశి, కోమలమైన చిగురు మోవి గల కోమలికి మేష రాశి, ప్రేమతో శ్రీవేంక టేశ్వరుని కలిసేటప్పుడు ఇద్దరూ కలిసి మిధున రాశి అవుతుందని చక్కగా, అన్నమయ్య కీర్తనలో రాసులను రాశి పోసాడు.

సాళువ వంశం తర్వాత విజయనగర సామ్రాజ్యాన్ని తుళువ వంశం పరిపాలించింది. సాళువ గుండ నరసింహ రాయల దండ నాథుడైన తుళువ నరసనాయకుడు (క్రీ.శ.1493-1505) తర్వాత రాజయ్యాడు. ఈ నరస నాయకుడికి, తమ వరాహ పురాణాన్ని, నంది మల్లయ, ఘంట సింగయలు ( క్రీ. శ.1450-1520) జంట కవులు అంకితమిచ్చారు. ఆదివరాహమూర్తి, భూదేవికి చెప్పిన కథల సంకలనమే వరాహ పురాణం. విజయనగర రాజ చిహ్నం " వరాహం" కాబట్టి ఈ కవులు వరాహ పురాణాన్ని కొంతభాగం వరకూ అనువదించి, విజయనగర దండ నాథుడికే అంకితం ఇచ్చారు. చప్పిడి పురాణంగా పేరు పొందిన ఈ పురాణం నిండా జ్యోతిషశాస్త్ర అంశాలే. సిద్ధాంత భాగంలో చెప్పిన తిథుల వారిగా పాద్యమి నుండి పున్నమి, అమావాస్యల వరకు, ప్రతిరోజూ ఆచ రించవలసిన వ్రతాలు, చేయవలసిన దానాలు చైత్ర మాసం నుండి పాల్గుణ మాసం వరకు పట్ట వలసిన నోములు దానాల గురించి చెప్పారిందులో.

తెలుగు సాహిత్యంలో స్వర్ణయుగంగా పేరొందినది ప్రభంధ యుగం. విజయనగర సామ్రాజ్యాన్ని పరిపా లించిన తుళువ శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1509 లో రాజ్యానికి వచ్చాడు. కవిరాజు, రాజకవి అయిన రాయలు,

ప్రబంధ రాజం, రాజ ప్రబంధమైన ఆముక్తమాల్యదను తెలుగులో మనోహరంగా నారికేళపాకంలో రచించాడు. ఆముక్తమాల్యదలో వర్షాకాల ఆగమనాన్ని ఇలా వర్ణించాడు.

తే.గీ వనతతి వరాహ వాహోరి వాయుభుగ్వి
రోధి వారణ వర్షాభూలాధి దొరగె
నెండ్రి రవిచేర మూడవ యెడకు జేరు
తరణి ధరణిం బ్రమోద సంధాయి గాడె
(ఆముక్తమాల్యద 4 వ ఆశ్వాసం- 77 వపద్యం)

"అహః సూరాణాం తద్రాత్రిః కర్కాద్యం దక్షిణాన యనమ్!!. సూర్యుడు కర్కాట రాశిలోకి ప్రవేశించాడు దక్షిణాయనం ప్రారంభమైంది. " షట్రి దశస్థో భానుః" అని జన్మరాశికి మూడింట, ఆరింట, పదింట ఉన్న సూర్యుడు శుభఫలప్రదుడు. కాబట్టి " వనతతి, వారాహ, వాహోరి, వాయు భుగ్విరోధి, వారణ వర్షాభుల నామాల మొదటి అక్షరాలు "వ" కారం అవడంతో "వో వా వీ వూ రోహిణీ" అనే నామ మొదటి అక్షరాల చేత, వాటికి రోహిణీ నక్షత్రం అయ్యింది. క ృత్తిక 3 పాదాలు, రోహిణీ 4 పాదాలు, మృగశిర 2 పాదాలు కలిసి వృషభ రాశి. ఈ వృషభానికి మూడవ రాశి కర్కాటకం. అందుకని రవి కర్కాటక ప్రవేశం వలన వర్షాలు కురిసి, ఆ ఆరింటికి సంతోషాన్ని కలిగించాయని అర్థం. అడవులు, అడవి పందులు, నెమళ్ళు, ఏనుగులు, కప్పలు, నీటికోసం ఎదురుచూస్తుంటాయి. వర్షాకాలం రాగానే వాటికి మనోవ్యథ తొలగింది.

రవి కర్కాటక ప్రవేశంతో వర్షాకాలం ప్రారంభ మౌతుంది. ఈ విషయాన్ని జ్యోతిషంలోని "గోచార ఫలితానికి " అనుసంధానిస్తూ రాయలు అద్భుతంగా వర్ణించాడు. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో పరిపూర్ణమైన తొలి ప్రబంధంగా మన్ననలందుకున్న మను చరిత్రలో అల్లసాని పెద్దన జ్యోతిషాంశాలను అక్కడక్కడా ఉటంకించాడు. తెలుగు సాహిత్యంలో అన్ని లక్షణాలతో వెలువడిన మొదటి ప్రబంధమిది. ఇది కృష్ణరాయలకే అంకితం. "స్వారోచిష మను సంభవం"లో ప్రవరుడి దగ్గరకు "కుతప కాలంలో "సిద్ధుడొకడు వచ్చాడు. ఈ "కుతప" కాలం గురించి సాహిత్యలోకంలో పెద్ద చర్చే జరిగింది. ఈ విషయమై, పెద్దనకు కాలనియమం తెలియదని కొందరంటే, పొర బాట్లు సహజమని మరికొందరన్నారు.

కం. ఈ విధమున నభ్యాగత
సేవాపరతంత్ర సకల జీవనుడై భూ
దేవ కుమారకుడుండం
గా విను మొకనాడు కుతపకాలమునందున్
(మనుచరిత్ర 1 ఆశ్వాసం. 58 వ పద్యం)

ఈ "కుతప" కాలం మధ్యాహ్నం తర్వాత అని వావిళ్ళ వారు అర్థం చెప్పారు. వెంపరాల సూర్యనారయణ శాస్త్రి గారు ఇలాగే చెప్పారు. ఆ తర్వాత హిమాలయాలకు వెళ్ళిన ప్రవరుడు మధ్యాహ్నం అయ్యిందనుకున్నాడు అని మను చరిత్రలోనే ( 2 వ ఆ. 12 వ పద్యం ) ఉంది. కుతపకాలనికి జ్యోతిష శాస్త్ర పరంగా నా వివరణ ఇది.

శ్లో. అహ్నోముహుర్తా విజ్ఞేయా దశపంచ చసర్వదా
తత్రాష్టమో ముహూర్తోయః సకాలః కుతుపః స్మృతః
(నిర్ణయ సింధువు 138 వ పుట)

ఒక పగలు ఒకరాత్రి కలసి రోజు ఏర్పడుతుంది. ఇందులో మొత్తం 30 ముహుర్తాలుంటాయి. పగలు 15 ముహుర్తాలు, రాత్రి 15 ముహుర్తాలు. ముహుర్తం అంటే 48 నిమిషాల ప్రమాణం. ఈ ముహుర్తాలకు పేర్లు కూడా ఉన్నాయి. 1). రౌద్రం, 2)శ్వేతం 3) మైత్రం. 4). సారభటం 5) సావిత్రం. 6) వైశ్వదేవం, 7) గాంధర్వం, 8) కుతపం ( విధి) 9). రోహిణం, 10) తిలకం 11) వైభవం 12) నిరు ఎళీళీతి. 13) జయం . 14) శంబరం. 15) విజయం.

వీటిలో 8 వ ముహుర్తం "కుతపం" సూర్యోదయంతో పగలు కాబట్టి సూర్యోదయాత్తు 48 నిమిషాల చొప్పున 7×48=336 నిమిషాలు. అంటే 05 గంటల 06 నిమిషాలకు కుతపకాలం ప్రారంభమౌతుంది. సూర్యోదయం ఉదయం 6 గంటలకు అయితే ఉదయం 11 గంటల 6 నిమిషాలకు కుతప కాలం. అక్కడికి నుండి హిమాలయాలకు వెళ్ళి అన్ని తిరిగి చూసే సమ యానికి

మధ్యాహ్న కాలం అయింది. కాబట్టి పెద్దన గారి సమయ పాలనలో దోషం లేదు. ఇది జ్యోతిశ్శాస్త్రం వలన తెలుస్తోంది. అదేవిధంగా స్వరోచి జననం దగ్గర కూడా జ్యోతిష విషయాలను చెప్పారు.

శా. "తేజం బబ్బ భవాండ గేహమునకున్ దీపారంకురచ్ఛాయమై
రాజిల్లన్ గ్రహపంచకంబు రవి జేరంబోని లగ్నంబునన్..."
(మనుచరిత్ర. 4 వ ఆశ్వాసం. 5 వ పద్యం)

గ్రహపంచకం సూర్యుణ్ణి చేరడం అంటే సూర్యుడున్న రాశిలో, రాజయోగానిచ్చే మిగిలిన 5 గ్రహాలు చేరడం. దీన్నే అస్తమయం లేదా అస్తంగతం అంటారు. ఈ గ్రహాలు శుభ ఫలితాలను ఇవ్వ లేవని జ్యోతిశ్శాస్త్రమతం.కాబట్టి కుజుడు మొదలైన గ్రహాలకు అస్తంగత దోషంలేని యుక్తమైన లగ్నంలో స్వరోచి పుట్టాడు. ఇవి మనుచరిత్రలోని జ్యోతిషాంశాలు.

నందితిమ్మన రచించిన "పారిజాతాపహరణం" కూడా శ్రీకృష్ణదేవరాయలకే అంకితం. ఇందులో కూడా కొన్ని జ్యోతిషాంశాలున్నాయి. పారిజాత వృక్షం కోసం సత్యభామ శ్రీకృష్ణులు స్వర్గం వెళ్ళిన సందర్భంలో సూర్యోదయ వరన ఇది.

మ. "నలినాప్తుండు మదీయ బంధులను తా నక్షత్ర సంఘంబులం
గల పన్వచ్ఛుచు నున్న వాడనుచు మున్గల్గంగ నాత్మీయ....."
(పారిజాతాపహరణం. 2 వ ఆశ్వాసం. 54 వ పద్యం)

సూర్యుడి రాకతో నక్షత్రాలు శోభావిహీనం అవడం సహజం. సాధారణంగా వేకువన తూర్పున సూర్యోదయం కన్నా ముందు శుక్రగ్రహం ఉదయిస్తుంది. దీన్నే 'వేగు చుక్క' అంటారు. చుక్క దూరిందని కూడా వ్యవహరిస్తుంటారు. ప్రకృతం నక్షత్ర రూపుడైన శుక్రుడు ముందుగా నక్షత్రాలను పంపించి, తర్వాత తాను ఉదయించాడని చెప్పాడిందులో తుళువ వంశం తర్వాత ఆరవీటి వంశం విజయనగరాన్ని పరిపాలించింది. తిరుమల దేవరాయలు (క్రీ.శ. 1565- 1572) కళాపోషకుడు. సంగీత సాహిత్య ప్రసిద్ధమైన రామరాజభూషణుడి వసుచరిత్ర తిరుమలదేవరాయలకు అంకితం ఇచ్చాడు. గిరికా వసురాజుల ప్రణయాన్ని వర్ణించిన వసుచరిత్రలో కూడా జ్యోతి షాంశాలున్నాయి.

ఉ. సారసకైరవంబులకు చంద్రదినేంద్ర విరోధ మంచకుం
బారము లేని మందగతి భారము దెమ్మరకునె ఫణిగ్రహ
క్రూర విఘాత మంగజునకుంగడతేర నిభీమవీక్షణాం
గారకవైర మింత తలకంబని లేదు మనోజుఘాటికిన్
(వసుచరిత్ర- 3 వ ఆశ్వాసం-129 వ పద్యం)

గిరిక విరహవ్యథతో మన్మధుణ్ణి ఆక్షేపిస్తున్న సందర్భమిది. పద్మాలకు చంద్రుడు, కలువపూలకు సూర్యుడు, హంసకు, ఎప్పటికీ ముందుకు నడవని (మందగతి) శని గ్రహగతి యొక్క భారం, అంటే హంసకు శని చాలడని అర్థం, మలయమారుతానికి రాహు గ్రహం చాలడని అర్థం, వాయువు పాములచేత భక్షించబడేదని అర్థం. అంటే గ్రహచారబలం చాలకపోతే మన్మథుడి చేత అతని పరివారం వలన భయంలేదని తాత్పర్యం.

ఇవి విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన సంగమ, సాళువ, తుళువ, ఆరవీటి వంశాల రాజులు పోషించిన కవుల రచనలలోని కొన్ని జ్యోతిషంశాలు.

## ఉపయుక్త గ్రంథ సూచిక :

1) తెలుగు సాహిత్య సమీక్ష- ఆచార్య జి. నాగయ్య
2) సమగ్ర ఆంధ్ర సాహిత్యం- పద్మనాయక, రెడ్డిరాజుల యుగం.
3) సమగ్ర ఆంధ్ర సాహిత్యం- తొలిరాయలు, మలిరాయల యుగం
4) ఉత్తర హరివంశం- నాచన సోమన
5) వరాహ పురాణం- నంది మల్లయ-ఘంటసింగన
6) జైమిని భారతం- పిల్లలమర్రి పినవీరభద్రుడు

7) ఆముక్తమాల్యద - శ్రీకృష్ణదేవరాయలు- వావిళ్ళ ప్రతి
8) మనుచరిత్ర- అల్లసానిపెద్దన- వావిళ్ళ ప్రతి
9) మనుచరిత్ర- వెంపరాల సూర్యనారయణ శాస్త్రి పీఠిక
10) పారిజాతాపహరణం- నందితిమ్మన-వావిళ్ళ ప్రతి
11) వసుచరిత్ర- రామరాజ భూషణుడు- వావిళ్ళ ప్రతి
12) బృహత్పరాశరహెూరా శాస్త్రం
13) నిర్ణయసింధువు- ప్రథమ ద్వితీయ - కమలాకరభట్టు-డా. కిడాంబి నరసింహాచార్య (అనువాదం)
14) సంహితలు- శ్రీ గోరస వీరభద్రాచారి సంపాదకులు
15) శబ్దరత్నాకరం - బహుజనపల్లి సీతారామాచార్యులు
16) ఆంధ్ర సాహిత్య చరిత్ర- ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# సినారె 'మట్టీ మనిషీ ఆకాశం' - కావ్యేతిహాస తత్త్వం

**- డా॥ పి. విజయకుమార్,** తెలుగు సహాయ ఆచార్యులు, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

విశ్వమానవ హృదయాంతరాలలోని చైతన్య జల పాతాల సవ్వడిని, విప్లవ జ్వాలల వేడిని రంగరించి కవితా జగత్తులో మానవతా దృక్పథానికి మనోజ్ఞ రూపాన్ని దిద్దుతున్న శిల్పి సి. నారాయణ రెడ్డి. పద్యం నుండి గేయానికి, గేయం నుండి వచనానికి అభ్యుదయాన్ని సాధిస్తూ పట్టింది బంగారంలా, పలికింది కవిత్వంగా ప్రగతి సాధిస్తున్న కవి చంద్రులు సి. నారాయణరెడ్డి. మనిషిలోని మమతను, బాధను, కన్నీటిని, శృంగారాన్ని, వియోగాన్ని, అంగారాన్ని, విప్లవాన్ని కవితలో కీర్తించిన కీర్తి చంద్రులు సినారె.

మట్టిని స్థలానికి, ఆకాశాన్ని కాలానికి ప్రతీకలుగా గ్రహించి మనిషిని ఈ రెంటికీ అనుసంధాన కర్తగా రూపొందించి, రచించిన కావ్యమిది. భూమి తన అస్థిత్వానిన చూసుకుని అహంకరిస్తుంది. ఆకాశం ఆ అహంకారాన్ని అణచివేస్తుంది. ఆకాశం సముద్రాన్ని చూసి అసూయ పడుతుంది. మనిషి కూడా అంతే! పంచేంద్రి యాల మాయాజాలానికిలోనై తన చిరునామాను పోగొట్టుకుంటాడు. భ్రాంతికి, వాస్తవానికి మధ్య కొట్టుమిట్టాడుతుంటాడు. కాని అంతలోనే తేరుకొని హేతువును జీవధాతువుగా చేసుకుని పురోగమిస్తారు. ఇలాంటి మనిషికి మరణం లేదు. అది ఉంది అంటే శరీరానికే! ఆలోచనలకు కాదు. (ఆశ శ్వాసగా పరిణామ శీలిగా పరిక్రమిస్తాడు) నిత్య చైతన్యవంతుడైన మనిషి స్థలాన్ని, కాలాన్ని జయిస్తాడు. ఇదీ ఈ కావ్యంలోని ఇతివృత్తం.

మట్టీ, మనిషీ, ఆకాశంలోని నాయకుడు మానవుడే. నిత్య చైతన్యవంతుడైన మనిషి నిరుత్సాహపడకుండా ఏ విషయానికీ కృంగిపోకుండా తిరోగమన ధోరణులను కట్టిబెట్టి జీవితంలో పురోగమనానికి కృషి చేస్తాడని ఈ కావ్యేతిహాసం వివరిస్తుంది. చైతన్యమూర్తికి కవిత్వం ద్వారా ఉత్సాహాన్ని అందించడం, లక్ష్యసాధనలో నిరుత్సాహం వద్దని సూచించడం ఈ కావ్యాతే హాసంలో కన్పిస్తాయి. సమస్త మానవజాతి నిర్భీతితో, ఆనందంతో చైతన్యవంతంగా మసలాలని ఈ కావ్యేతిహాసం ఆకాంక్షిస్తుంది.

ఈ కావ్యేతిహాసం ఏ ఒక్క మానవునికో, జాతికో, సమూహానికో సంబంధించింది కాదు. ఇది సమస్త మానవ జాతికి వర్తించే విషయం. మానవుడు ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దం పట్టిన కావ్యం వర్తమాన కాలం గురించిన వ్యాఖ్యానంలా కన్పిస్తుంది. మనసు గుఝం చేసే ఆగడాలను వివరిస్తూ, దానిని అదుపు చేసుకోవాల్సిన ఆవశ్యకతను, అనివార్యతను చెప్తూ ప్రేరణ కల్గించడం కావ్యంలో ప్రధానంగా కన్పిస్తుంది.

జీవిత సత్యాలను వెల్లడించడంలో ఈ కావ్యేతిహాసానిది ప్రథమ స్థానం. మానవ జీవితంలోని మౌలిక సంఘర్షణని, అతని ఉత్థానపతనాలను స్వరూపాన్ని, పరస్పర విరుద్ధమైన అంశాలను ఆవిష్కరించడంలోను ఈ కావ్య మార్గం అద్వితీయం. వర్తమానం స్వరూప - స్వభావాదులని వెల్లడించిన తీరు కూడా అద్భుతం. నడుస్తున్న చరిత్రపై వ్యంగ్యాత్మకంగా వ్యాఖ్యానించిన విధానం ఈ కావ్యేతిహాసంలో దర్శనమిస్తుంది.

తాత్విక పరమైన విషయాలను కవి సందర్భోచితంగా ప్రయో గించి, దీనికో విశిష్టతను సాధించాడు. భారతీయ, ప్రాచీన, తాత్విక సిద్ధాంతాలను పూర్తిగా జీర్ణించుకున్న సినారె చేతిలో రూపుదిద్దు కున్న ఈ కావ్యం మనిషి తాత్విక చింతనతోనే జీవితం అర్థాన్ని, పరమార్థాన్ని తెలుసుకుంటాడని చెపుతుంది. ప్రాక్పశ్చిమ జీవిత సరళిని అన్వయించి, ఏకరక్త సింధువైన మానవుని ప్రస్థానాన్ని, పరిణామ క్రమాన్ని ఒక క్రమ విధానంలో ఈ కావ్యేతిహాసం చర్చించింది.

వర్తమాన కాలాన్ని మాత్రమే కాక, భూత భవిష్యత్ కాలాలు కలుపుకోవడం ద్వారా ఈ కావ్యం విశిష్ట ప్రయోజనాన్ని సాధించింది. ఈ కావ్య ఇతివృత్తం గతానికి,

వర్తమానానికి, భవిష్యత్తుకు మూడింటికీ వర్తిస్తుంది. మానవుని జీవితంలోని అనేక దశలను మనిషి తన నిర్విరామ ఆలోచనా స్రవంతిలో తనను తాను తెల్సు కొనే ప్రయత్నం చేస్తాడు. ఎన్నో ఆటంకాలను ఎదుర్కొంటూ తన మేధస్సు ద్వారా సృష్టి రహస్యాలను అన్వేషిస్తాడు. జీవిత పరమార్థాన్ని తెల్సుకోవడమే మానవుని ఆలోచనల అంతిమ ప్రయో జనం.

ఆకాశాన్ని మనిషికి ఆదర్శంగా చూపడం కోసం సినారె దానికి తత్వారోహణ చేశారు. సాహితీ విమర్శకుల దృష్టిలో కావ్య పరమార్థం వ్యక్తిలోని సహృదయత తట్టి లేపడం. కవిత్వం దీనికి ఉపకరణంగా, వాహికగా ఉంటుందని సినారె ఈ కావ్యం ద్వారా నిరూపించారు.

"మట్టీ మనిషీ ఆకాశం
వీటి చుట్టే అల్లుకుంది సృష్టి కథా సూత్రం"

అన్న ప్రారంభ వాక్యాలు వస్తు నిర్దేశంతో పాటు, కావ్య పర మార్థాన్ని వెల్లడిస్తున్నాయి. సృష్టి కథాసూత్రం మొత్తాన్ని ఈ కావ్యేతిహాసం తనలో ఇమడ్చుకుంది. మట్టికీ, ఆకాశానికీ అను సంధానకర్త మానవుడే! ఇదే ఈ కావ్య వస్తువు.

మనిషికి ఉన్న అంతః శత్రువులలో అహంకారం మొదటిది. దీనిని వ్యంగ్యంగా

"చంద్రబింబం నుంచి తాను తవ్వి తెచ్చిన రాతి బెడ్డలు" ఇప్పటికే అద్దాల గంపల్లో ఉన్నాయి. అవి గుర్తుకొచ్చినప్పుడల్లా అహం కొమ్ములకు పదును పుడుతుంది" అని సినారె వ్యక్తం చేశారు.

"అమో! ఎప్పటికైన ఆకాశాన్ని మడచి తెచ్చి
భూమి ఒంటికి చుట్టకపోతాడా
నిరంతరాన్వేషి మనిషి,
అన్వేషణకు మూలం పరిణామ శీలం"

ఆకులు, అలములు తింటూ కొండ గుహల్లో తల దాచుకుంటూ గడిపిన మానవుడు ఇంత పురోగతిని సాధించడానికి కారణం అతని నిర్విరామ అన్వేషణ. ఈ గొప్ప లక్షణమే ఇన్ని విజయాలకు దారి తీసింది. కాలాన్ని జయించగలడన్న విశ్వాసమే ఇక్కడ వ్యక్తమవుతుంది. కాలం గురించి, కాలం శక్తిని గురించి కాల ప్రభావాన్ని గురించి ఈ కావ్యేతిహాసం కీర్తించింది.

"కాలం ఘనీభవిస్తే పర్వతం
కరిగితే మంచు
పారిపోతే ఏరు
వృత్తంలా పరిభ్రమిస్తే సుడిగాలి
అగోచరంగా ఉన్న కాలానికి
దృశ్యంగా అవతరించాలని నిరంతర తృష్ణ"

కాలాన్ని పర్వతంగా, మంచుగా, ఏరుగా, సుడిగాలిగా దృశ్య మానం చేశారు. కాలాన్ని భౌతికదృష్టి నుంచి కాక, దాని అఖండ త్వాన్ని వివరించేందుకు విశాలదృష్టితో సినారె ప్రయత్నించారు.

"కదలి పోవడమంటే కాలాన్ని కత్తిరిస్తూ పోవడమే
కత్తిరించిన చేతులు కనుమరుగయ్యే లోగా
ఎప్పటిలా కాలం అతుక్కుపోతుంది
పడవ చీల్చుకుపోయిన నీళ్ళలా"

కాలాన్ని కవి అంగీకరించి పాఠకులకి కూడా కాలాన్ని వృధా చేయవద్దనే సలహానిస్తున్నారు. అసలు కాలాన్ని స్తంభింపచేయాలని అనుకోవడమే సరికాదని సినారె పలుకు.

"కాసేపు పడుకుంటామని కెరటాలు మొండికేస్తే
నది (సముద్రం) లెంపలు వాయించదూ?" అని అంటారు.

"నిత్యం సంచలన శీలికి నిద్రలో కూడా నిద్ర పట్టదని" చెపుతారు.

"విశ్రాంతి తీసుకో అంటే గాలి అసహ్యించుకోదూ?" అని ప్రశ్నిస్తున్నారు.

"ప్రతి మనిషి అనుక్షణం కరగాలి, కదలాలి కాలానికి అశ్వ గతులు నేర్పుతూ"

అనటం మనిషి కాలప్రాధాన్యతను గుర్తెరిగి నడుచుకోవాలని అర్థాన్ని విశదీకరిస్తుంది.

"ఏ మనిషైనా ఎందుకు పుడతాడు?
జీవితాన్ని పూయించడానికే
ఏ కళ్ళైనా ఎందుకు విచ్చుకోవాలి?
ఆకాశం కొనలని తమలోకి లాక్కోవడానికే!"

జీవితంలో సార్థకతను సాధించడమే జీవితాన్ని పూయించడం. మానవజన్మ దీనికోసమే! కాలాన్ని తమ లోకి లాక్కోవాలనే విచ్చుకున్న ప్రతి కళ్ళూ సదా ప్రయత్ని స్తుంటాయి. అంతఃదృష్టి, బాహ్య దృష్టి రెంటినీ ఆసరాగా చేసుకుని మానవుడు సమ్యక్ - దృష్టితో సమస్త జీవులను దర్శించి ఆదర్శమూర్తిగా నిలబడాలి.

ఈనాటి మానవుడు మృత్యుభయంతో అనుక్షణం మరణిస్తున్నాడు. కాని నాశనం అనేది భౌతికమైన శరీ రానిదే తప్ప, అభౌతికమైన, నిత్య చైతన్యవంతమైన మానవుని ఆలోచనా ప్రవంతికి కాదు.

'దీపం ఊపిరికున్న తెగింపు మనిషి ప్రాణానికి లేకుంటే ఎలా నని?" కవి ప్రశ్నిస్తున్నారు. ఆత్మవిశ్వాసమే మనిషికి ఆయువుపట్టు. ఎన్ని సమస్యల సుడిగుండాలెదురైనా, చలించక "మళ్ళీ కొత్త ఆశ మట్టి మొలకై మాట్లాడినట్లు" మానవుడు నడవాలనే సూచన ఇక్కడ ఉంది.

"మృత్యువు ఎక్కడైనా, ఏ రూపంలోనైనా రావచ్చు. దానికోసం ఎక్కడ పైకప్పు కూలిపడుతుందోనని పడు కోవడం మానకుంటామా అని హాస్యధోరణిలో వ్యక్తం చేశారు.

"మంటికీ, మింటికీ మధ్య మనిషెందుకున్నట్లు?
అల్లె తాటిని బిగించినట్లు,
ఆ రెంటినీ కలిపేయడానికే
స్థలమాతృకను, కాలపతాకను
అనుసంధానించడానికే!"

ఈ అఖిల విశ్వంలో మనిషి ఉనికి స్థలకాలాలను జయించటంలోనే ఉందని సినారె భావన. కావ్య ప్రారం భంలో వివరించి నట్లు మట్టి, ఆకాశాలను ప్రతీకాత్మకంగా తీసికొని పై పంక్తులలో వాటిని మరింత విశదీకరించి, కావ్య ఆశయాన్ని పరమార్థాన్ని వ్యక్తీకరిస్తున్నారు.

"ఎప్పటికీ శాస్త్రానికి మించిన అస్త్రం లేదు
హేతువుని మించిన మౌలిక ధాతువు లేదు

ఏ నిరూపణ అయినా, శాస్త్రబద్ధంగా హేతువుగా నిలవాలని సినారె ఆకాంక్ష'.

జీవితంలో కూడా ప్రతి దానిని హేతువాద దృక్పథంతో ఆలోచించాలనే సంకల్పం ఆ భావంలో కనిపిస్తుంది.

కొన్ని వర్గాల ప్రయోజనాల కోసం, సంఘం ఏర్పరచిన కట్టు బాట్లకు కాలం చెల్లిందంటారు. అలాంటి ఆంక్షలను ఉల్లంఘించటం వల్లనే చరిత్రలో ఎంతో మేలు జరిగిం దంటారు.

"అదిగో పండు తినకు - తింటే పాపం
అది తీవ్ర దివ్య స్వరం
దానిని ధిక్కరించిన ఆదిమానవుడు
ఆత్మజ్ఞుడే కాదు విశ్వజ్ఞుడయ్యాడు
----------
ఇదుగో ఈ నీళ్ళు అంటుకోకు - అంటుకుంటే నేరం
అది కఠోర వర్ణ దుశ్శాసనం
ఆ ఆంక్షను ప్రతిఘటించిన అస్పృశ్యుడు
అభినవ శాసనకర్త అయ్యాడు"

చరిత్రలోని రెండు ప్రధాన ఘట్టాలను సినారె కవిత్వీక రించారు. పాపఫలం తినొద్దన్న ఆంక్షను ధిక్కరించి తిన్న ఆదాము మానవ సంతతికి ఆద్యుడు అయ్యాడు. ఇది బైబిల్ వృత్తాంతం. నీళ్ళను అంటుకుంటే నేరమన్న అభినవ మానవుల ఆంక్షలను ధిక్కరించి పోరాటం చేసిన అస్పృశ్యుడు అభినవ శాసనకర్త అయ్యాడు, అని ఈ దేశానికి రాజ్యాంగాన్ని ప్రసాదించిన బి.ఆర్. అంబేద్కర్‌ని ప్రస్తావిం చారు.

మనిషి ప్రవర్తనకు కారణం మనసు. మనసు కలుషిత మైతే జరిగేవి అనర్థాలు, మారణహోమాలు.

"నిత్యం, వాత్సల్యం వర్షించే మనసుకి
ఏ గ్రహణం పట్టిందిపుడు?
కరుణ కురిసే ఆ కళ్ళల్లో
కాలుష్యం వెర్రితలలు వేసింది
నిండు తేజం నిష్క్రమించింది
కురిలాంధకారం రంగ ప్రవేశం చేసింది
అక్కడ గజ్జె కట్టి ఆడుతున్నది ద్వేషమే"

నిత్యం వాత్సల్యం కురిపించే మనసులో ద్వేషం ప్రవేశిస్తే మానవుడు దానవుడవుతాడు. ఆ గాలి సోకితే

పచ్చటి ఆకులు నుసియైపోతాయి. జీవజలాలు విషపూరితమైపోతాయి. పండు వెన్నెల శ్మశానభస్మరాశి అవుతుంది. మనసు గురించి ఈ విధంగా కూడా సినారె వర్ణిస్తున్నారు.

"మనసు కోశంలో విషం బుసకొడితే
మానవ సంబంధాలు మాత్రమే కాదు
విచ్చుకున్న నిఖిల ప్రకృతే వికలమైపోతుంది
అమృతానికి, గరళానికి జన్మస్థలి మనసేమరి"

మనసులో విషం ప్రవేశిస్తే కేవలం మానవ సంబంధాలే కాదు. ప్రకృతి గూడా విధ్వంసమౌతుంది. ప్రతి భావానికి మనసే జన్మస్థలి అని సినారె భావించారు.

ఆశా స్వభావాన్ని గురించి సినారె ఈ విధంగా వ్యక్తీకరించారు.

"ఔను,
అవయవాలు చస్తాయి గాని
ఆలోచనలు చావవు
శరీరం చివికి మట్టిలో కలిసిపోతుంది
గుర్తు పట్టలేకుండా
ఆశయాలు జీవించి ఉంటాయి
కాల ఫలకం మీద చిక్కిన సంచలనాక్షరాలై"

మనిషి చనిపోయినా అతని ఆశయాలు బతికే ఉంటాయి. బ్రతికి ఉన్న ఆశయాలు మనిషిని సజీవంగా ఉంచుతాయి. ఎన్ని ప్రతికూల పరిస్థితులెదురైనా మనిషి విరాట్టులా ఎదుగుతూనే ఉంటాడని సినారె ఆశాభావం వ్యక్తం చేశారు. మనిషి మను గడత్వం మంచితనం, మానవత్వం ఆలంబనాలు. మానవ సంబంధాల సమతౌల్యమే మానవ జాతి మనుగడకు అంతః సూత్రం అని, దానిని పాటించే మనిషికి ఎదురులేదని, తిరుగులేదని అతడే ఈ విశ్వం పురోగతిని, నియతిని కాపాడే సూత్రధారి యని ఫలశ్రుతి చెప్పారు.

"ఇటు మట్టిని అటు మింటిని
అనుసంధించే సేతువులా ఉన్న మనిషి
స్థితమతిగా రూపొందితేనే విశ్వప్రగతి"

మనిషి నేడు స్థితమతిగా ఉండవల్సిన ఆవశ్యకతను సినారె మనకు గుర్తు చేస్తున్నారు. గీతాకారుడు చెప్పిన "స్థితప్రజ్ఞత్వం" మనిషికి అలవడి మనిషి, మనీషి అవుతాడు. ఈ కావ్యేతిహాసం ప్రతిపాదించే కావ్యతత్వం, పరమార్థం ఇదే.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# విశ్వనాథ నవలల్లో ఆత్మాహుతులు

- డా. సింగుపురం నారాయణరావు & - డా. సుసర్ల ఇందిర, తెలుగుశాఖ, బరంపూర్ విశ్వవిద్యాలయం, బరంపూర్, ఒరిస్సా.

భూమి మీద జన్మించిన ప్రతిజీవి తప్పించుకోలేని స్థితి మరణం. అయితే ఈ స్థితి నుండి తప్పించుకోవటానికి మానవుడు చేయని ప్రయత్నం అంటూ ఉండదు. ఇటువంటి ప్రయత్నంలో భాగంగా వచ్చిన ప్రక్రియే మృత సంజీవని విద్య. అయితే ఈ ప్రక్రియకు సరిగ్గా వ్యతిరేక మయిన మరొక ప్రక్రియ కూడా ప్రపంచ మంతటా కన బడుతోంది. ఏ విధంగా మనిషి ఇంకా ఇంకా జీవించాలని అనుకొంటాడో అదే విధంగా జీవితం తనకు భారమయి పోయిందని ఆ జీవితాన్ని బలవంతంగా చాలించాలని అనుకొనేవారు కూడా చాలామందే ఉంటారు. ఈ ప్రక్రియ పేరే ఆత్మహత్య. ఒక్క భారతీయసంస్కృతే కాదు ప్రపంచంలో ఏ సంస్కృతయినా సరే ఆత్మహత్య మహాపాపమనే చెబుతోంది.. ఒకరిని మఱొకరు చంపితే దాన్ని హత్య అంటున్నా. అదే ఒక వ్యక్తి తనను తాను చంపికొంటే ఆ ప్రక్రియను ఆత్మహత్య అంటున్నారు. కాని భారతీయ సంస్కృతి ఆత్మ నిత్యమనీ దానికి చావులేదనీ అంటోంది. ''ఆత్మనిత్యమ్మకాలాద్యవచ్ఛిన్నమ్ము'' అన్నారు విశ్వ నాథ రామాయణ కల్పవృక్షంలో. అటువంటప్పుడు ఈ ప్రక్రియను ఆత్మహత్య అని ఎలా అనగలం? అయితే ప్రపంచంలో ఏదో ఒక పద్ధతిలో ఈ ఆత్మహత్యలు కనిపిస్తూనే ఉన్నాయి. అసలు వేదాంతార్థంలో కాదు కాని లౌకికార్థంలో ఆత్మ అంటే శరీరం అనే అర్థం కూడా ఉంది. అసలు సహజమరణం, హత్య, ఆత్మ హత్య, సమాధి చెందటం, సహగమనం, భృగుపాతం, ప్రాయోప వేశం, కపాలమోక్షం, సజీవసమాధి, యోగాగ్నిలో దగ్ధమవటం.... ఇలా ఏ పేరుతో పిలిచినా మనిషిలో ఉన్న ప్రాణం పోవటం లేదా వ్యక్తిలోని చైతన్యం ఆగిపోయే ప్రక్రియను మరణం అంటున్నాం. ఒక వ్యక్తిని హత్య చేయటం ఎంత తప్పో, ఎంత పాపమో తనని తాను చంపుకోవటమూ అంతే తప్పు, అంతే పాపం. అయితే భారతీయసంస్కృతి సహజ మరణం కోసం ఎదురు చూడకుండా కొన్ని కొన్ని ప్రక్రియల ద్వారా తనకు తానుగా ప్రాణాన్ని త్యజించటాన్ని ఒప్పు కొంటోంది.

రఘువంశ రాజులు ఏ వయస్సులో చేయవలసిన పనులు ఆ వయస్సులో చేసిన తరువాత యోగం ద్వారా తమ శరీరాన్ని త్యజించేవారు అని రఘువంశం చెబుతోంది. వారు కూడా సహజమరణం కోసం ఎదురుచూడక యోగం ద్వారా శరీరాన్ని చాలిస్తున్నారు. అయితే యోగం ద్వారా చనిపోయే పద్ధతి అందఱికీ తెలియకపోవచ్చు లేదా అందుబాటులో లేకపోవచ్చు. మానవ జన్మమెత్తాక శరీరం దానంతట అది పడిపోయే వఱకూ వేచి ఉండవలసిందే కాని బలవంతంగా ఆ శరీరంలో ప్రాణాన్ని తీసి కొనే హక్కు ఎవరికి లేదనే అంటోంది ప్రపంచసంస్కృతి. చట్టరీతా అది నేరం కూడా. ఈ ఆసహమరణాలను గురించి చర్చించటమే ప్రస్తుత వ్యాపోద్దేశం.

సమాధి చెందటం అనే ఒక ప్రక్రియ మన భారతీయ సంస్కృతిలో కనబడుతోంది. కొంతమంది విశిష్టవ్యక్తులు సమాధి స్థితిలోనికి వెళ్ళిపోయి తమ శరీరాన్ని త్యజించటం చూడవచ్చు. సాధారణంగా స్వామీజీలు, బాబాలు, సన్యాసులు జీవితాన్ని చాలించటాన్ని సమాధి చెందట మంటారు. మంత్రాలయంలో ఉండే రాఘవేంద్రస్వామిది సజీవసమాధి అంటారు. ఇది కూడా యోగం ద్వారా జరిగే ప్రక్రియ. అటువంటప్పుడు అది సహజ మరణం కాకపోవలసివస్తోంది. అయితే రాఘవేంద్రస్వామిది అసహజ మరణమని ఆయన భక్తులు ఒప్పికోవటం లేదు. అదేకాక పృథివ్యాపస్తేజోవాయురాకాశాలు పంచభూతాలన్న విషయం అందఱికీ తెలిసిందే. మన చరిత్రను కాని, సాహిత్యాన్ని కాని, పురాణేతిహాసాలను కాని తిరుగవేస్తే ఈ పంచభూతాలలో లీన మయి ప్రాణోత్క్రమణ (ఆత్మాహుతి) కావించుకొన్న విశిష్ట వ్యక్తులు కొందఱు కనబడు

తున్నారు. అయితే ఈ విధంగా సమాధి చెందే ప్రక్రియను అసహజమరణంగా భారతీయ సంస్కృతి పరిగణించటం లేదు.

కుమారులైన లవకుశులను శ్రీరామచంద్రులవారికి అప్పగించిన తరువాత సీతాదేవి తన తల్లి భూదేవిని పిలిచి ఆమెతో పాటు భూమిలో ఐక్యమైపోయినట్లు చాలా రామాయణాలు చెబుతున్నాయి. అక్కడ ఆమె అవతార మూర్తి కనుక, అక్కడితో ఆ అవతార పరిసమాప్తి జరుగ వలసి ఉన్నందున సీతాదేవి సంక ల్పించినంతనే భూదేవి వచ్చి ఆమెను తనలో ఐక్యం చేసికొంది. మన పురాణేతి హాసాలు దీనిని సహజమరణంగానే పరిగణించి నందున దీనిని పృథివీ సమాధిగా తలచవచ్చేమో!!??

అదే విదంగా శ్రీరాముడు అవతారాన్ని పరిసమాప్తి నొందించే సమయంలో తమ్ములతో పాటు సరయూ నదిలోకి నడుస్తూ వెళ్ళిపోయినట్లు కొన్ని కథలు చెబు తున్నాయి. దీన్ని జలసమాధి అనవచ్చా? అయితే ఇక్కడ శ్రీరాముడు కాని సీతాదేవి కాని లోక సంరక్షణార్థం భూలోకంలో అవతారమెత్తినవారు. కార్యానంతరం వారు అవతార పరిసమాప్తి కావించవలసిన సమయం ఆసన్న మయినపుడు ఈ పాంచభౌతిక శరీరాన్ని వదలి తిరిగి తమ స్వస్వరూపమయిన తేజోమయ శరీరులయేందుకు ఈ లోకాన్ని వీడి ఆ పంచభూతాలలోనే కలిసిపోవలసి ఉంటుంది. ఇక్కడ రామావతారంలో సీతారాములు ఎంచుకొన్నవి పృథివీ జల సమాధులు చెప్పవచ్చు.

## యోగాగ్ని :

ఇక శబరి విషయానికొస్తే ఈమె సిద్ధయోగిని. మతంగ ముని శిష్యురాలు. శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో కలిసి ఆమె ఆశ్రమా నికి వస్తాడన్న గురువు ఆదేశం మేరకు మతంగముని ఆశ్రమంలోనే రాముని కోసం ఎదురు చూస్తూ ఉండిపోయిన రామభక్తురాలు. ఇలా ఎదురు చూస్తూనే ఆమె వృద్ధురాలైపోయింది. రామచంద్రుడు ఈమె ఆశ్రమానికి రాగానే అర్ఘ్యపాద్య ఆచమనాలు, సేకరించిన ఫలాలను సమర్పించింది.. రాముని అనుజ్ఞతో యోగాగ్నిలో ప్రవేశించి, మహాయోగులు పొందే సాయు జ్యాన్ని పొందింది.

వేదవతి కృశధ్వజ, మాలావతుల కుమార్తె. ఈమె జన్మించి నపుడు సూతికా గృహంలో వేదధ్వని వినబడిన కారణంగా ఈమెకు వేదవతి అనే పేరు పెట్టారు. ఈమెను విష్ణుమూర్తికి ఇచ్చి వివాహం చేయాలని కృశధ్వజుని కోరిక. కాని ఒకానొక రాక్షసుని చేతిలో కృశధ్వజుడు, ఇతని భార్య మరణించగా ఈమె తపస్సు చేసికొన టానికి వెళ్ళి పోయింది. ఆ సమయంలో రావణాసురుడు ఆమెను మోహించి, ఆమెను తాకగా రావణాసురుని బారి నుండి తన్ను తాను రక్షించుకోవటానికి అనివార్య పరిస్థితుల్లో యోగాగ్నిలో దగ్ధ మయిందని బ్రహ్మ వైవర్త పురాణం తెలుపుతోంది. ఈమే మఱు జన్మలో ఆయోనిజగా పుట్టిన సీత.

ద్రోణుడు కూడ కురుక్షేత్ర సంగ్రామంలో అధర్మపక్షాన పోరు సలుపుతున్నందుకు తీవ్రమనస్తాపానికి లోనై, బ్రాహ్మణ జన్మనెత్తి క్షత్రియధర్మం పాటించటంలోని అనౌ చిత్యాన్ని గ్రహించి, దేవతల చేత ప్రబోధితుడై, అస్త్ర సన్న్యాసం చేసి యోగమార్గాన శరీరాన్ని విడిచిపెట్టేడని భారతం చెబుతోంది. ఇక్కడ ఈ ముగ్గురి విషయంలో వారి వారి తేజస్సు పంచభూతాలలో కలిసిపోయింది కనుక దీనిని తేజోసమాధి అనవచ్చేమో?

## తుషాగ్ని ప్రవేశం :

అగ్ని సమాధి కోవలేనిదే 'తుషాగ్ని' ప్రవేశం.ఈ ప్రక్రియ కుమారిలభట్టు పట్ల మాత్రమే కనబడుతోంది. ఈతడు తుసాగ్ని ప్రవేశం చేయటానికి కారణాన్ని ఒక కథలా చెబుతారు. ఒకానొక కాలంలో బౌద్ధం బాగా వ్యాప్తి చెంది, వైదికమతంలో కూడా ఎన్నో అంతరమతాలు ఏర్పడి దేశం ఒక అనిశ్చితస్థితికి చేరుకొంది. బౌద్ధం వేదాలను ప్రమాణంగా అంగీకరించని కారణంగా నాస్తిక మత మయింది. ఈ నాస్తికమతాన్ని ఖండించి, ప్రజల్లో కర్మ నియతిని ఏర్పఱచి, మళ్ళీ అందఱినీ వేదమార్గంలో నడిపించ టానికి సాక్షాత్తూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామే కుమారిలభట్టుగ వెలిసేరని భారతీయుల నమ్మిక. ఈతడు వేదవేదాంగాలలో పండి తుడు. నాడు దేశంలో పాతుకు పోయిన నాస్తికమతమైన బౌద్ధాన్ని ఖండించ

టానికి, బౌద్ధమతం మీద నమ్మకం లేకపోయినప్పటికి ఆ మతవిషయాలు తెలియకుండా అవగాహన లేకుండా వారిని ఖండించ కూడదని భావించిన కుమారిలభట్టు ఒక బౌద్ధా రామంతో చేరి బౌద్ధవిషయాలు తెలిసికోనారంభించాడు. అయితే ఈతడు బౌద్ధంలో చేరటానికి కారణాన్ని తెలిసికొన్న బౌద్ధగురువు. ఆతని శిష్యులు ఆతనిని మేడపై నుండి క్రిందకు త్రోసివేసేరట! కుమారిలభట్టు క్రిందకు పడిపోతూ 'వేదమే కనుక ప్రమాణమైతే, సనాతనమతమే కనుక సత్యమైనదయితే, వేదధర్మమే అనుష్ఠించ వలసిన ధర్మమయితే క్రిందపడినా నేను మరణించకుందును గాక!' అన్నాడట! ఏడు అంతస్థుల పై నుండి క్రింద పడ్డా కుమారి లభట్టుకు ఆశ్చర్యకరంగా ఏమీ కాలేదు కాని అతని కంట్లో ఒక రాయి గ్రుచ్చుకొందిట! అపుడు కుమారిలభట్టు వేదమాతను ఇలా ప్రార్థించాడట. అంత పై నుండి క్రింద పడ్డప్పటికీ తనకు మరణం సంభవించలేదని, కనుక వేదమే ప్రమాణమని నిరూపితమయిందని, అయితే ఈ రాయి మాత్రం తనకెందుకు గ్రుచ్చు కోవాలి అని ప్రశ్నించాడట! అపుడు వేదమాత అశరీరవాణియై ఈ విధంగా పలికింది. వేదాలకి శ్రుతి అని మరియొక పేరు. వేదాన్ని మొట్టమొదట ఈశ్వరుడు మునుల చెవుల్లో చెప్పాడట! అప్పటి నుండి వేదాలు గురుపరంపరలో వ్యాప్తి చెందాయి. కుమారిలభట్టు వేదమే ప్రమాణమైతే అనే అనుమానం వ్యక్త పఱచి, వేదం ప్రమాణం కనుక నేను మరణించను అనే పూర్తి నమ్మకం వేదాల పట్ల చూపించకపోవటం చేత ప్రాణం నిలబడ్డా, కన్నుకు దెబ్బ తగిలిందని వాక్రుచ్చిందట! కుమారిలభట్టు ప్రధా నంగా కర్మిష్టి. యజ్ఞయాగాదులకి, దానాదికర్మలకి ప్రాచుర్యం, ప్రాధాన్యం కల్పించినవాడు. మనోవాక్కాయకర్మలా వేదధర్మాన్ని అనుష్ఠి:చినవాడైనప్పటికీ ఆ వేదధర్మాన్ని అనుమానించి తాను అపచారంచేసేననే భావనతో పశ్చాత్తప్తుడై తుషాగ్ని ప్రవేశం చేసేడు.

ఇక్కడ తుసాగ్ని అంటే ఏమిటో తెలిసికోవలసి ఉంది. తుషాగ్ని అంటే ఊకను పెద్ద రాశిగ పోసి, దానిని అంటించి దానిలో ప్రవేశించటం. ఊకకు ఉన్న లక్షణమేమిటంటే అందులో నిప్పు సెగ మెల్లమెల్లగా క్రింద నుండి అంటుకొంటూ వస్తుంది. ఈ కారణంగా మొదట కొద్దిపాటి వేడి పుట్టి ఆ వేడి క్రమంగా సెగగా మారిపోతుంది. ఈ ఊక కుప్ప మీద కూర్చున్న వ్యక్తి శరీరం పాదాలతో మొదలయి చివరకు మోకాళ్లు, తొడలు కాలుతూ చివరకు ఆ వ్యక్తి ఆ సెగతో కూడిన ఊకలో క్రిందకు దిగి పోతాడు. క్రమంగా శరీరంలో ప్రధానావయవాలైన గుండె మెదడు కాలిపోతాయి. శరీరమంతా కాలిపోయేదాకా ఈ బాధను భరిస్తూ అలా కూర్చోవలసిందే... కుమారిలభట్టు ఈ విధంగా తన్ను తాను ఆహుతినొనర్చుకొన్నాడు. అయితే ఇతడు ఈ విధంగా తన్ను తాను ఆహుతి నొనర్చుకోవటానికి కారణం ఏమిటి?

బౌద్ధం సనాతనధర్మాన్ని, వేదాలనీ అంగీకరించదని తెలిసి కూడా బౌద్ధ మతధర్మాలను తెలిసికొని వాటిని ఖండించటం కోసం తాను ఆ ధర్మానికి విరోధియై కూడా బౌద్ధ మతధర్మాలను తెలిసికొని వాటిని ఖండించటం కోసం తాను ఆ ధర్మానికి విరోధియై కూడా బౌద్ధ గురువులకు శుశ్రూష చేసి, వారి ద్వారా ఆ రహస్యాలను తెలిసికొన్నాడు. వేదధర్మానికి విరుద్ధంగా ప్రవర్తిం చమే కాక గురుద్రోహానికి పాల్పడ్డానని తలచి తాను చేసిన అనుచిత క్రియకు సరియైన ప్రాయశ్చిత్తం తుసాగ్నికి ఆహుతవటమేనని భావించాడు. కర్మిష్టి అయిన కారణాన ఆ కర్మనిష్ఠ కోసం తన శరీరాన్ని తృణప్రాయంగా తలచి అర్పించాడు. ఒకానొకకాలంలో ప్రాయశ్చిత్తకర్మల నిర్వహణ ఈ విధంగా ఇంత తీవ్రంగా ఉండేదని తెలుస్తోంది.

## ప్రాయోపవేశం :

ఇక ఈ రఘువంశంలోని మూడవ వాడయిన అజమహారాజు విషయానికొస్తే అతని భార్య పేరు ఇందుమతి, ఈమె పూర్వ జన్మలో హరిణి నామధేయురాలు. తృణబిందుడనే ముని తపస్సును భంగం కావించటానికి ఇంద్రుని పంపున భూలోకానికి వచ్చిన ఒక సురాంగన, హరిణి తన మనోహర రూపంతోటీ, తన సమ్మోహన కరమైన హావభావాలతోటీ ముని తపస్సును భగ్న పఱచగా ఆమెను మానవవనితవై జన్మించుమని శపించాడట!

తనకు క్షమాభిక్ష పెట్టుమని ఆమె మునిని ప్రార్థించగా దేవతాపుష్ప సందర్శనంతో ఈ పార్థివదేహానికి విముక్తి లభిస్తుందని అనుగ్రహించాడట! ఈ కారణంగా ఇందు మతి భర్తతో వనవిహారం చేస్తున్న సందర్భంలో ఆకాశ సంచారం చేస్తున్న నారదుని మహతి నుండి క్రిందపడ్డ దేవపుష్పం ఈమెను తాకగానే ప్రాణాలను వదిలి వేస్తుంది. భార్యా విరహంతో అజుడు జీవితం మీద విరక్తిని పెంచుకొన్నవాడైనప్పటికీ కుమారునికి రాజ్యస్వీకరణా యోగ్య మయిన వయసు రాని కారణంగా ఎనిమిదేళ్లు రాజ్యాన్ని మంత్రి సామంతుల సాహాయంతో పాలించి, కుమారుని విధ్యుక్తంగా రాజ్యాభిషిక్తుని కావించి, భార్యా వియోగ దుఃఖంతో శుష్కించిన శరీరం భారంగా భావించి ప్రాయోపవేశంతో శరీరాన్ని చాలించాడు. శరీరంలో ప్రాణం ఉన్నంత వఱకూ దానిని పోషించవలసిన బాధ్యత ఆ వ్యక్తిదే. అయితే ఇక్కడ అజమహారాజు భార్యా వియో గంతో శరీరాన్ని శుష్కింపజేసి చివరకు శరీరాన్ని వదలి వేసేడు.

విశ్వనాథ విరచిత కాశ్మీరరాజవంశ నవలల్లో ఒకటైన 'మిహిరకులుడు' నవలలో మిహిరకులుని తండ్రి వసు కులుడు, ప్రయోపవేశం ద్వారా ప్రాణాలని త్యజించేడు. ప్రాయోపవేశం అంటే ఏమిటి అని రచయితే ప్రశ్నించి "దుర్భాస్తరణము వేసికొని, భూషణాదులు తొలగించు కొని" నిరాహారంగా ఉంటూ, జపం ద్వారానో, తపస్సు ద్వారానో, ప్రాణాలను నిష్క్రమింపజేసికోవట మని నవలా ముఖంగా సమాధానం విశ్వనాథ.

ఆంధ్రదేశంలో పొట్టి శ్రీరాములవారి పేరు విననివారు ఉం డరు. ఒకప్పుడు ఆంధ్రదేశం మద్రాసురాష్ట్రంతో కలిపి సంయుక్త రాష్ట్రంగా ఉండేది. భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డం మొదలయిన తరువాత తెలుగుభాష మాట్లాడే ప్రజలకు వేరే రాష్ట్రం ఉండాలని తన ప్రాణాన్ని పణంగా పెట్టి, సత్యాగ్రహం చేసి 53 రోజులు నిరాహారంగా ఉండి ఆంధ్రదేశం సాధించాడు పొట్టి శ్రీరాములు. ఇక్కడ పొట్టి శ్రీరాములు నిరాహారంగా ఉండి ప్రాణత్యాగం చేసినప్పటికీ ఈ ప్రక్రియను ప్రాయో పవేశం అనే పేరుతో పిలువకపోవటం గమనార్హం. పొట్టి శ్రీరాములు కూడా నాడు ఒక విశిష్ఠకార్యాన్ని దృష్టిలో పెట్టికొనే శరీరత్యాగం చేసేడు అయితే మహాత్మాగాంధీ భారతదేశానికి స్వాతంత్రం సంపాదించే ప్రయత్నంలో భాగంగా సత్యాగ్రహాన్ని తన ఆయు ధంగా ఎంచుకొన్నాడు. పొట్టిశ్రీరాములు స్వతంత్ర ఆంధ్రదేశం కోసం నిరాహా రంగా ఉంటూ సత్యాగ్రహం చేసినపుడు అప్పటి కాలాను గుణంగా దాన్ని ప్రయోపవేశంగా వ్యవహరించలేదు. అయితే పొట్టి శ్రీరాములుది కూడా అసహజమరణమే!

## పశ్చాత్తాపం :

'చెలియలికట్ట' నవలను తీసికొంటే... ఈ నవలలో కథనాయిక రత్నావళి సీతారామయ్యకు రెండవ భార్య. సీతారామయ్య మధ్య వయస్కుడు కాగా రత్నావళి అప్పుడే యౌవనంలో అడుగు పెడుతున్న పడుచుపిల్ల. వయసు పొంగులో ఉన్న రత్నావళి మఱిది రంగుడు బోధించిన స్వేచ్ఛాప్రణయ సిద్ధాంతాల పట్ల, మఱిది పట్ల ఆకర్షితు రాలై ఇల్లు వదిలి అతనితో లేచిపోతుంది. రంగడు తన స్నేహితులను పిలిచి వారిలో ఎవరో ఒకరిని ఎంచుకొని వారితో శేషజీవితం గడుపమని సలహా ఇస్తాడు. పై పై మెఱుగులకి తాత్కాలికంగా ఆకర్షితురాలైనప్పటికీ భార తీయ సంస్కృతీ సంప్రదాయాలను నరనరాలా జీర్ణించు కొన్న రత్నావళి పరస్పర విరుద్ధమైన ఈ రెండు భావాల పట్ల సమన్వయాన్ని కుదుర్చుకోలేక, పరిస్థితులకి తలవొగ్గి రంగనితో కలిసి జీవించటం అలవాటు చేసికొంటుంది. అయితే సంప్రదాయంలో ఉన్న భద్రత పై పై మెఱు గులతో నిండిన ఈ క్రొత్త క్రొత్త సిద్ధాంతాలలో లేదని ప్రత్యక్షంగా, అనుభవపూర్వకంగా తెలిసికొంటుంది. ముకుందరావు దగ్గఱ శాస్త్రాలను చదివి పుస్తకజ్ఞానాన్ని, ఉద్యోగం చేసి లోకజ్ఞానాన్ని, జీవితంలో ఎదుర్కొన్న ఆటుపోట్ల అనుభవంతో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించి, త్రికరణశుద్ధిగా పశ్చాత్తాపాన్ని పొంది భర్త ఊరికి చేరు తుంది. భర్తకు మూడవభార్య వల్ల కలిగిన కుమారుని చేత తనకు ఆబ్ధీకాలు పెట్టించునట్లు అర్థించి, తన్ను

తాను పున్నామనరకం నుండి రక్షించుకోనెంచుతుంది. అయితే ఏ శరీరంతో తాను పాపం చేసిందో ఆ శరీరం మాత్రం నాశనం కావలసిందేనని, తనలోని ప్రకృతికి సముద్రుని ప్రకృతికి భేదం లేదని భావిస్తుంది. జీవితపు సరిహద్దు దాటిన ఫలితంగా సంసారం కాని, పేరుప్రతిష్ఠలు కాని, వంశం కాని, చివరకు అస్తి త్వమే లేకుండా పోయిందని తెలిసికొంటుంది. సముద్రుడు దర్మ బద్ధుడని, లోకంలో ధర్మం నిలిచి ఉన్నంతకాలం చెలియలికట్టను దాటి రాడని, కాని ధర్మాతిక్రమణ జరిగిననాడు చెలియలికట్టను అతిక్రమించి ఉప్పెన రూపంలో వచ్చి లోకాన్ని తనలో లీనం చేసికొంటాడని, తాను ధర్మాతిక్రమణ చేసిన కారణంగా సముద్రంలో తాను లీనమవటమే పరిష్కారంగా భావించి జలసమాధి అయిపోతుంది. ఈమెతో పాటు రంగడు కూడా ఆమె పోయిన మార్గంలో సముద్రంలో లీనమయిపోతాడు.

భారతీయసంస్కృతి, భారతీయధర్మం వదినా మఱదుల మధ్య సంబంధాన్ని తల్లికొడుకుల సంబంధంతో పోల్చుతుంది. వారిద్దఱి మధ్య అనైతిక సంబంధం ఎప్పటికీ గర్హ్యమే. ఒక జాతి నైతిక ధర్మాన్ని కోల్పోతే ఆ జాతి మరణించినట్లే. ఏ సమాజమైనా నాలుగుకాళ్ల మీద స్థిరంగా నిలబడాలంటే కుటుంబవ్యవస్థ స్థిరంగా ఉండాలి. సమాజం ఆ స్థిరత్వాన్ని కోల్పోయినప్పుడు సమాధి కావాలసిందే. ఇక్కడ రత్నావళి రంగలు సమాజానికి ప్రతీకలు. వారు ఆ సమాజం హద్దులు దాటారు కనుక వారికి సమాధి తప్పలేదు.

ఇక 'దిండుక్రింద పోకచెక్క' నవలనే తీసికొంటే నేపాల రాజ వంశ నవలల్లో ఒకటైన ఈ నవలలో ప్రతి నాయకుడైన శాకయ్య కారణంగా వంచితయైన రత్నావళి పదేళ్ల కొడుకు గోస్వామికి తల్లి, విగతభర్తృక, వఱదల బారిన పడి, క్షుద్బాధ నుండి తన్ను తాను రక్షించుకొనే ప్రయత్నంలో ఈ తల్లీకొడుకులను రక్షిస్తాడు కాముకుడైన శాకయ్య. ఈ సందర్భాన్ని తనకు అనుకూలంగా మలచుకొని రత్నావళిని లోబఱచుకొని ఆమెకు భర్తగా నటించి మోజు తీరగానే ఆ ఊరును వదిలి వెళ్ళిపోతాడు. తల్లికి జరిగిన అన్యాయానికి, తద్వారా ఆమెకు సంక్రమించిన పాపానికి నిష్కృతిని కనుక్కోవటమే జీవితధ్యేయంగా పెరుగుతాడీ కొడుకు. ఈ ప్రయత్నంలో భాగంగానే గోస్వామి హిమాలయ పర్వతవాసి, పురాణ కాలం నాటి వాడైన ఒక ముని ముఖతః ఒకానొక హోమ ప్రక్రియ ద్వారా ఈ విధంగా సంక్రమించిన పాపానికి నిష్కృతి సాధ్యమేనని తెలిసికొంటాడు. ఆ మునీశ్వరుని సాహాయ్యంతో శాకయ్య వలన వంచితులైన పదునాలుగు మంది స్త్రీలను ఒక చోట చేర్చి వారికి శాకయ్య వలన సంక్రమించిన పాపాన్ని శాకయ్యకే చెందేట్లు చేస్తాడు. అయితే ఈ ప్రక్రియలో పాలుపంచుకోని వారు ఇద్దఱు. వారే మంత్రి కూతురు నాలాయని, గోస్వామి తల్లి రత్నావళి.

రత్నావళి పరిస్థితులకి తలవొగ్గి, అనివార్యపరిస్థితుల్లో శాక య్యతో కొంతకాలం జీవితాన్ని కొనసాగించినా శాకయ్యతోడి తన జీవితం పాపభూయిష్ఠమని మనసా నమ్మింది. ఈ విధంగా తనకంటిన పాపానికి ప్రాయశ్చిత్త మొకటే పరిష్కారమని భావించింది. ఆ ప్రయశ్చితం ఆమె మనసును పూర్తిగా ఆవరించగానే ఆమె ప్రమేయం లేకనే ఆమెలోని ప్రాణాలు ఆమెను వీడాయి. ఇక నాలాయని విషయానికొస్తే ఈమెకూడా శాకయ్య వల్ల వంచి తురాలైన స్త్రీయే. శాకయ్య పట్ల ఆకర్షితురాలవటమే తాను చేసిన పాపంగా భావించింది. తత్కారణంగా కొన్ని ఏళ్లపాటు పిచ్చి దానిలా ఒక గదిలో ఉండిపోయి లోకంతో సంబంధం లేకుండా గడిపి పశ్చాత్తాపాన్ని అనుభవించింది. ఈ విధంగా వీరిద్దఱూ పశ్చాత్తాపాగ్నిలో దగ్ధమయినవారే... ఇక్కడ రత్నావళి విషయాన్నే తీసికొంటే ఆమె మరణించే సమయంలో కూడా శారీరకంగా బాధ పడ్డట్టు కాని, అసహజంగా మరణించినట్లు కనబడదు. త్రికరణ శుద్ధిగా ఆమె పశ్చాత్తాపాన్ని పొందింది. అక్కడ శాకయ్య శరీరం గాలిలో కలిసిన క్షణాన్నే ఈమె శరీరం నుండి ప్రాణం నిష్క్రమించింది. కనుక ఈమెది అసహజమైన మరణం కాదు నిజమైన ఆత్మహత్య అనవచ్చేమో!?!

ఇక 'ఏకవీర' నవల విషయానికొస్తే వ్యవస్థాధర్మాన్ని అతి క్రమించకూడదనే నియమానికి కట్టుబడి కుట్టాను తన ప్రేయసి మీనాక్షిని మఱచిపోవటానికి, తన భార్య అయిన ఏకవీర పట్ల అనురక్తుడవటానికి తీవ్రసాధన చేసేడు. వ్యక్తిగతమైన తన ప్రేమభావాన్ని వ్యవస్థాధర్మమైన వివాహానికి అనుబద్ధం చేయ టానికి నిరంతర సాధన చేసి, అందులో కృతకృత్యుడైన తపస్వి కుట్టాను. ఏకవీర విషయానికొస్తే ఆమె వీరభూపతిని ప్రేమిం చినా, పత్నీ ధర్మనిర్వహణకి ప్రాధాన్యానిచ్చి, వ్యవస్థా ధర్మాన్ని అను సరించాలని ప్రయత్నించినా ఆమె తొలినాటి ప్రేమ తత్ప్ర యత్నానికి అడ్డు వస్తూనే ఉంది. ఏకవీర ధర్మమార్గాను వర్తియై కుట్టానుపట్ల చూపిన భర్తృభావానికి అతడు ప్రతిస్పందించి అనుకూల్యమే చూపించి ఉంటే కథ మఱొక విధంగా జరిగేదేమో! కుట్టాను ఆమె పట్ల ప్రతి కూలుడై ఉండటంతో ఆమెలోని ప్రేమభావనకి ఉద్దీపన కలుగటం, ఆమెలోని వివేకం అది కూడని పని అని చెప్పటంతో ఆమె తన తొల్లిటి ప్రేమభావనని చాలా వఱకు అధఃకరించిందనే చెప్పాలి. కాని ఇంతటి వివేక వతీ విధివంచితే అయింది. ఆమె అంతరాత్మ ధర్మ ప్రబోధం చేస్తున్నప్పటికీ, వీరభూపతిని హఠాత్తుగా కలిసి కోవటం, తత్పర్యవసానమైన వారి పరిష్వంగంలో ఆమె పొందిన అలౌకికానుభూతి ఆమె ప్రేమ తపస్సుకి సమాధి స్థితిని కలుగజేసేయి.

ఆమెలోని అణువణువూ వీరభూపతి స్పర్శనే అనుభవి స్తోందిట! అది ఇంకొక విజాతీయస్పర్శను తాళుకోలేదట! అంతటి మనస్విని కనుకనే తనకు కలిగిన వ్యష్టిధర్మ, వ్యవస్థాధర్మ సంఘ ర్షణలో వ్యవస్థాధర్మమే శ్రేయస్క రమనీ, వ్యవస్థాధర్మ నిర్వహణలోనే వ్యక్తిధర్మానికి రక్షణ కలుగుతుందనే మహాశయంతో ఆ పాత్రని ఉదాత్తంగా చిత్రించి "త్యజేదేకం కులస్యార్థే....." అనే మను ధర్మాన్ని స్ఫురింపజేసేరు విశ్వనాథ. అంతమాత్రాన వ్యక్తిని సమా జానికి బానిసని జేయటం విశ్వనాథ ఆదర్శం కానేకాదు. ఎందు కంటే - ఇంత జరిగినా ఏకవీర వ్యక్తిగా పరమ పతివ్రతే. కాని వ్యవస్థలో ఇట్టివారికి స్థానం లేదన్న విష యాన్ని గ్రహించి ఈ వ్యవస్థ నుండీ, చివఱకు ఈ లోకం నుండే తప్పుకొనేట్లు చేయ టంలో "ఆత్మార్థేచ పృథివీంత్య జేత్" అనే మనుధర్మాన్నే మళ్ళీ స్ఫురింపజేస్తారు విశ్వనాథ.

వీరభూపతి ఊరూపేరూ కూడా తెలియని తన ప్రేయసి పట్ల గల ప్రేమభావనని మఱచిపోవటానికి, భార్య పట్ల తన భర్తృ ధర్మాన్ని నెరవేర్చటానికి శతధా ప్రయత్నించాడు. ఏకవీరతో హఠాత్ సమావేశం, పర్వరా లింగన సమయంలో సైతం తమ చర్య అధర్మం అని మాత్రమే అనుకొన్నాడు, కాని తన ప్రేయసి తన ప్రాణ స్నేహితుడు, తన స్వామి అయిన కుట్టాను సేతుపతి భార్య అని తెలిసేక మాత్రం స్నేహధర్మానికి తాను కళంకం తెచ్చానని భావించి, తన్ను తాను నిలువరించుకోలేక పోయాడు. అతనిలో పాపభావం వేయి మడుగులైంది. మొదటినుండీ వీరభూపతి ధర్మప్రేమను నిలబెట్టాలనే ప్రయత్నించాడు. కాని వ్యవస్థాధర్మాన్ని నిలుపని వ్యక్తికి ఈ వ్యవస్థలో స్థానం లేదని తలచి తనకు తానుగా శిక్ష విధించుకొని వ్యవస్థ నుండి వైదొలగి సన్న్యాసియైనాడు. ఇక్కడ వీరభూపతి సన్న్యాసియైనప్పటికి ఆ జీవితం మరణ సదృశమే.

వ్యవస్థాధర్మం ప్రత్యక్షంగా ఇద్దఱి జీవితాలనూ, పరోక్షంగా నలుగురి జీవితాలనూ బలి తీసికోవటం వల్ల సహజంగా ఆ నలుగురి మీదా మనకి సానుభూతి ఏర్పడు తుంది. ఈ పరిస్థితిలో, ఆ ఆవేశంలో వ్యవస్థాధర్మం మీద ధ్వజమెత్తే అవకాశం లేకపోలేదు. మరి ఆ ఆవేశపు పొంగులో వ్యవస్థనే మార్చుకోవాలని అభిప్రాయపడితే అది సమస్త సమాజాన్నీ సమూలంగా నాశనం చేసే ప్రమాదం ఉంది. అందుకే విశ్వనాథ దానిని సమర్థించక సమాజం కోసం కొందఱు వ్యక్తులు బలికావటం అభిలష ణీయమంటారు.

ఏకవీర విషయానికొస్తే ఆమె తన కోరికను తాను సాధించుకొంది. అయితే ఇచ్చను ఇచ్చవచ్చినట్లు పోనీ యక అదుపు చేసి చేసి చివరిక్షణంలో సమాజాన్ని త్రోసి రాజని ఇచ్ఛా పరిపూర్తికి సిద్ధ పడింది. అయితే అది కూడా కొద్ది క్షణాలే. అంతలోనే తాను చేస్తున్నది ఘనకార్యంగా భాసించక ప్రబోధాన్ని పొందింది. తాను చిరకాలంగా చేసిన

సాధన క్షణంలో వృధా అయినట్లు భాసించింది. తాను సహ్యమని భావించినదీ, సాధించదలుచుకొన్నదే తనకు అసహ్యమైపోయింది. అందుకే శరీరాన్ని విసర్జించటానికి ఆమె సమాయత్తమైంది. ఈ నవలలో నలుగురూ విధి వంచితులే. నలుగురిదీ ఆత్మాహుతే. అయితే ఈ ఆత్మాహుతులకి ఒక విధంగా సమాజం యొక్క ఆమోదం ఉంది. ఈ కథకు ఇంకొక ముగింపు లేదు. కనుక ఈ నవలలో విశ్వనాథ వీరివి ఆత్మహత్యలంటూనే ఆ ఆత్మహత్యలను ఆమోదించినట్లయింది.

**భృగుపాతం :**

భృగువు అంటే కొండ చరియ. పాతం అంటే పతనం అంటే కొండమీద నుండి క్రిందకు పడిపోవటం. కొండ కొమ్ము నుండి క్రిందకు దూకి ప్రాణాలను ఆహుతి చేసికొనే పద్ధతిని భృగుపాతం అంటారు. భారతీయ సంస్కృతిలో ఇటువంటి ఒకానొక పద్ధతి ద్వారా ప్రాణాలను తీసికొనే ప్రక్రియ కనబడుతోంది. దానికి సమాజ ఆమోద ముద్రా ఉంది. 'భ్రమరవాసిని' నవలలో కథానాయకుడు కాశ్మీరదేశంలోని లావాణకగ్రామ నివాసి. శ్రోత్రియ బ్రాహ్మణవంశజుడు. తండ్రి ఆజ్ఞ మేరకు నీలమణి అనే అతి సామాన్య యువతిని పెళ్ళి చేసికొన్నాడు. కాని సౌందర్యవతి కాని ఆమె పట్ల అనురాగాన్ని మాత్రం చూపించలేకపోయాడు. ఒక రోజు మధుసూదనుడు ఒక పాలరాతి లక్ష్మీ విగ్రహాన్ని కొని తెచ్చాడు. భర్తృనిరాకృతయైన నీలమణి ఆ విగ్రహానికి తదేక పూజలు చేయ సాగింది. నీలమణి తాదాత్మ్యం కోరి విగ్రహాన్ని సేవించగా, మధుసూదనుడు తద్విగ్రహగత సౌందర్యం పట్ల మోహితుడై, భార్యయందా సౌందర్యాన్ని ఊహిస్తూ, ధన రాజ్య ప్రాప్తి కోసం దేవిని సేవించాడు.

నీలమణి మరణానంతరం పూజామందిరంలో దొరికిన ఒకానొక శాక్తేయ గ్రంథం ఆధారంగా మధుసూదనుడు వైష్ణవియైన భ్రమరవాసిని గూర్చి కఠోరతపస్సు చేసి, ఆమెను మెప్పించి, ప్రత్యక్షం కావించుకొని, ఆమె తాను పాసించిన దేవతయన్న ఎఱుక లేక ఆమెని భార్యగ వాంఛించాడు. దేవి ఈతని కోరిక మరుజన్మలో సిద్ధిస్తుందని వరమిచ్చింది. అమ్మవారి అనుగ్రహానికి పాత్రుడైన మధుసూదనుడు తన కోరిక సిద్ధించటానికి అశ్వత్థవృక్షం నుంచి ప్రాణోత్క్రమణ కావించాడు. ఈ మధుసూదనుడే తరువాతి జన్మలో కాశ్మీరాధిపతి రణాదిత్యునిగ జన్మించాడు.

'నేపాలరాజ చరిత్ర సంబంధి నవల 'సౌదామని' లో రాజసోదరుడైన బాలార్చనుడు బాణేశ్వర, భూతోచ్చ దుర్గాలకు ప్రతినిధి. ఈతడు అతికాముకుడై తన మల్లుర సాహాయ్యంతో ఎన్నో అకృత్యాలొనర్చాడు. సౌదామని అనే స్త్రీ వేశ్యకులానికి చెందినదైనప్పటికీ అన్నచే ప్రబోధితురాలై, కులవృత్తిని కొనసాగించటానికి ఇష్టపడని కారణంగా బాలార్చనుని వల్ల, రాజవంశస్థుడైన నందివర్మ వలన అనేక కష్టాలకు గురై, బాలార్చనుని ప్రధాన మల్లుడైన దీర్ఘాయువు చేత రక్షితఅవుతుంది. ఈ సందర్భంలో దీర్ఘాయువు బౌద్ధగురువు బృహద్బుద్ధుని ప్రాణాలకు, సౌదామని అన్న దాసు ప్రాణాలకు ముప్పున్న కారణంగా దాసును బౌద్ధ విహారంలోనూ, బృహద్బుద్ధుని అడవిలోనూ ఉంచి వారిద్దఱి రక్షణభారాన్ని తన భుజాల మీద వేసికొంటాడు. అయితే దాసు, బృహద్బుద్ధుల అపహరణ, హత్య అభియోగాలు దీర్ఘాయువు ఎదుర్కొంటూ తన్ను తాను రక్షించుకొనే ప్రయత్నంలో గంగాజీ పేరుతో అజ్ఞాతంలోకి వెళ్లిపోతాడు. ఆదిశంకరులు నేపాల పరిసర ప్రాంతాలకు శిష్య సమేతంగా వస్తున్నారని తెలిసిన దీర్ఘాయువు వారిని బౌద్ధమయం కాకుండ నిలిచి ఉన్న విజయనగరాగ్ర హారానికి వేం చేయుమని ప్రార్థిస్తాడు. దీర్ఘాయువు చిన్నతనంలో యువరాజైన శివవర్మకు గురువు. విజయనగరాగ్రహారంలో దీర్ఘాయువు శంకరభగవత్పాదుల శిష్యులైన సురేశ్వరాచార్యులు, చిత్సుఖాచార్యులు, ఉదంకుడు, పద్మపాదాచార్యులకు, బౌద్ధ మతాచార్యులైన అవలోకితేశ్వర, ప్రజ్ఞాపారమ్య, బృహద్బుద్ధులకు మహారాజు పక్షాన యువరాజైన శివవర్మ సమక్షంలో బౌద్ధ వైదికవాదనలను ఏర్పాటు చేయటమే కాక ఆ వాదనలలో ప్రధానపాత్ర వహిస్తాడు. ఈ వాదనలలో బౌద్ధం ఓటమి నంగీ కరించగా శంకరులు నేపాలంలో అద్వైతాన్ని పునఃస్థాపిస్తారు. దీర్ఘా

యువు లేక గంగాజీ తన ప్రమేయం కారణంగా జరిగాయని భావించిన ఆకృత్యాలకు బాధ్యత వహించి, శంకరుల అనుమతితో భృగుపాతం చేస్తాడు.

భ్రమరవాసిని నవలలో మధుసూదనుడు అశ్వత్థవృక్షం మీద నుంచి దూకి ప్రాణోత్క్రమణ కావించుకోగా, సౌదామని నవలలో దీర్ఘాయువు భృగుపాతం ద్వారా ప్రాణోత్క్రమణ కావించుకొన్నట్లు వర్ణితం. రెండు ప్రక్రియలూ ఇంచుమించు ఒకే పద్ధతికి చెందినవి. మధుసూదనుడు అమ్మవారిని ప్రత్యక్షం కావించుకొని మఱు జన్మలో అమ్మవారే అతనికి భార్య అయే వరాన్ని పొందేడు. అమ్మ వారు ఆతనికి భార్య కావలెనంటే ఈ జన్మకు విముక్తి కాలగాలి. ఈ కారణంగా ఆతని జన్మ విముక్తికి అమ్మవారి అనుమతి ఉన్నట్లేనని అర్థం చేసికోవాలి. కనుకనే అశ్వత్థవృక్షం నుండి ప్రాణోత్క్రమణ కావించుకొన్నాడు. ఇక దీర్ఘాయువు విషయాని కొస్తే అతడు చేయని హత్యకు అభియోగాన్ని ఎదుర్కొని అజ్ఞాతం లోనికి వెళ్లిపోయాడు. చివరకు ఎవరి హత్యా అభియోగాన్ని ఎదుర్కొంటున్నాడో ఆ వ్యక్తే కట్టెదుట కనబడటంతో అతడు నేరస్తుడు కాడన్న విషయం నిరూపితమవుతుంది. మరి అటు వంటప్పుడు తాను చేయని నేరాన్ని నెత్తిన వేసికొనటమే కాక, ఆ నేరానికి తాను బాధ్యత వహించి భృగుపాతం చేయటం ఏ విధంగా సమర్థనీయమో తెలియటం లేదు.

**కాపలామోక్షం :**

"శైశవేభ్య-స్త విద్యానాం యౌవనే విషయైషిణామ్ ।
వార్థకే మునివృత్తీనాం యోగేనా-న్తే తనుత్యజామ్ ॥"

అని కాళిదాసు చతురాశ్రమాలూ సూర్యవంశరాజులు ఎలా నిర్వర్తించేవారో ఒక్క శ్లోకంలో చెప్పేడు. పరమాత్మ ప్రసాదించిన జీవితాన్ని ఫలవంతంగా అనుభవించి, యోగం ద్వారా ఈ తనువు త్యజించటం ఎంతైనా అభిలషణీయం. మోక్షార్థియైన మానవుడు ఆయువులో తృతీయ భాగాన్ని వానప్రస్థాశ్రమంలో గడిపిన పిమ్మట నాలుగవ భాగంలో సర్వసంగ పరిత్యాగియై, సన్యాసాన్ని స్వీకరించి, జితేంద్రియుడై, మృతుడై మోక్షాన్ని పొందుతాడు. వేయి పడగలు నవలలో జమీందారు హరప్పనాయుడు తన తల్లికి, పితామహికి పితృకర్మలు జరిపించిన అనంతరం వేణుగోపాల స్వామికి కళ్యాణోత్సవాలు జరిపిస్తాడు. ఆ తరువాత ఒక నాడు ధర్మారావును, తన తండ్రి రంగారావును పిలిపించి పద్మా సనస్థుడై ప్రాణాయామం చేయ నారంభించి, కొంతసేపైన పిమ్మట తండ్రితో ఇలా అంటాడు. ... **'అయ్యా! ఈ శరీరము మీరు కల్పించిరి. నేను మాతృకర్మలు సేయుటకు, స్వామి యుత్సవములు సేయు టకు వచ్చితిని. .... నేనిందుండుటకు రాలేదు. .... నా ప్రాణములు నా చేతిలో నున్నవి. నా ప్రాణములు బ్రహ్మరంధ్రము నుండి వదల బోవుచున్నాను. అని పద్మాసనాశీనుడయ్యెను. తరువాత నరగంటకు జంద్రాస్తమయము కాబోవు వేళకు పెటీలుమని ధ్వని వినిపించెను. హరప్ప బ్రహ్మకపాలమును భేదించుకొని ప్రాణములు నిర్గమించెను."** పై సంభాషణ వలన బ్రహ్మకపాల భేదనం ద్వారా బ్రహ్మైక్యం పొందటం అంటే ప్రాణాయామం చేస్తూ ప్రయత్నపూర్వకంగా ఊపిరి బిగబట్టటాన్ని సాధనగా చేసి తద్వారా ప్రాణాలను నిర్గమింప చేసికోవటం కపాల మోక్షమని తెలుస్తోంది. మానవుని పుట్టుక కాని మరణం కాని ఆతని చేతులలో ఉండవని, అది భగవన్నిర్ణయమని పెద్దల వచనం. అయితే హరప్పనాయుడు ఆ మరణాన్ని తన అధీనంలో ఉంచుకొని తనకు కావలసిన సమయంలో మరణాన్ని పొందగలిగేడు. ఇది సాధ్యమా? సాధ్యమనే యోగశాస్త్రం తెలుపుతోంది. మరణాన్ని తన అధీనంలో ఉంచుకొని, తన ఇచ్చవచ్చిన సమయంలో మరణాన్ని ఆహ్వానించటం వల్ల ఇది కూడ అసహజ మరణమే అవుతోంది కదా?

బ్రహ్మైక్యం పొందటం ఒక యౌగికప్రక్రియ. బంగార మందలి మాలిన్యం అగ్నితో కాల్చటం వల్ల దగ్ధమైనట్లు ప్రాణాయామం ద్వారా ఇంద్రియ దోషాలు దగ్ధమవుతాయని మనుస్మృతి తెలుపుతోంది. ప్రాణాయామం వల్ల రాగాది దోషాలను, పరమాత్మ యందు మనస్సు నిల్పటం వలన పాపాలని, ఇంద్రియనిగ్రహం ద్వారా సంసర్గదోషాలని, ఈశ్వరధ్యానం వలన అరిషడ్వర్గాలని పరిహరించవచ్చు. ఈ విధమైన ప్రాణాయామం ద్వారా చూడశక్యం కాని పరమాత్మ స్వరూపాన్ని ధ్యానయోగం ద్వారా చూడ

టానికి సాధ్యమవుతోంది. మానవుని వెన్నెముక వద్ద మూడు నాడులున్నా యనీ, అవి ఇడ పింగళ, సుషుమ్న లుగ వ్యవహృతమౌతున్నా యని పెద్దల మాట. ఇవి గంగా యమునా సరస్వతుల వంటివని స్మృతి ప్రమాణం.

"ఇడా భాగీరథీ గంగా, పింగళా యమునానదీ ।
తయోర్మధ్య గతా నాడీ, సుషుమ్నాచ సరస్వతీ ॥
ఏవం జ్ఞాన హ్రదే తీర్థే రాగద్వేష మలా-పహే ।
యః స్నాతి మానసే తీర్థే సయాతి పరమాం గతిమ్ ॥

ఇడా పింగళా సుషుమ్నా నాడుల కలయిక 'జ్ఞాన హ్రదము' అనే పవిత్రమైన పేరు కల పుణ్యతీర్థం వంటిదవు తుందనీ, ఆ తీర్థం మానవులలోని రాగద్వేషాలనే పాపమా లిన్యాలను పోగొడు తుందనీ, అట్టి మానసతీర్థంలో స్నానం చేసినవాడు మోక్షమార్గాన్ని చేరుకుంటాడనీ పై శ్లోకం తెలుపుతోంది. ఈ మూడు నాడులలో ప్రధాన మైనది సుషుమ్నా నాడి. ఇది మేరుదండం అనే వెన్నెముక దగ్గఱ ఉండి, సూర్యచంద్రాగ్నుల రూపంతో సర్వతేజో మయంగా ఉంటుందనీ దేవీభాగవతం తెల్పుతోంది.

ప్రధానా మేరుదండే-త్ర చంద్రసూర్యాగ్ని రూపిణీ ।
సర్వతేజోమయీ సాతు సుషుమ్నా నాడి రుచ్యతే ॥

ఈ సుషమ్నానాడి మానవుని మూలాధార చక్రం నుండి సహ స్రారం వఱకూ పయనం సాగిస్తున్నపుడు ఆ నాడి జీవునితో కలిసి సహస్రారంలో ఉన్న పరమాత్మ వఱకూ పయనిస్తుంది. మానవుని సుషమ్నానాడి ఆ పరమాత్మస్థానాన్ని చేరుకోవటమనే పరిణతి స్థితినే మోక్షం అంటారని "తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి" అనే ఉపనిషద్వాక్యం వ్యక్తపఱుస్తోంది. అటువంటి ఈ నాడి లోనే ప్రాణం, జఠరాగ్ని, బిందునాదాలు ఉంటాయి. ఈ నాడి పద్మంలో ఉండే సన్నని దారంలో ఉండి, పై భాగా నికి ప్రసరిస్తూ, మెఱుపు వలె మెఱుస్తూ బ్రహ్మనాడి అనే పేరుతో మానవుల బ్రహ్మపద ప్రాప్తికి పరమ సాధనమవు తోంది అని ఈ సూక్తి తెలియజేస్తోంది.

కంఠమధ్యే స్థితా నాడీ "సుషుమ్నా" సుప్రతిష్ఠితా
పద్మసూత్ర ప్రతీకాశా ఋజురూర్ధ్వ ప్రవృత్తినీ ॥
బ్రహ్మణో వివరం యావ ద్విద్యుదాభాసనలకం
వైష్ణవీ "బ్రహ్మనాడీ" చ నిర్వాణప్రాప్తి పద్ధతిః ॥

ఈ విధంగా సుషుమ్నానాడిని ఆధారంగా చేసికొని, పరమపదం చేరుకోవటమనే పరమ పవిత్రప్రక్రియనే కపాల మోక్షమని సామాన్యులు వ్యవహరిస్తున్నారు. ఆధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా చక్రాలను "షట్ చక్రాలంటారు. ఆధార చక్రంలో నిద్రి స్తున్న 'కుండలినీశక్తి'ని మేలుకొలిపి పైకి ప్రయాణం చేయించటంతో కుండలినీయోగం ప్రారంభమవుతుంది. ఆధా రంలో మొదలయిన ఈ జీవి ప్రయాణం ఆజ్ఞాచక్రం ద్వారా బయటకు పోతుంది. ఈ ఆజ్ఞాచక్రాన్నే బ్రహ్మ రంధ్రం లేక బ్రహ్మ అంటున్నారు.

'వేయిపడగలు' నవలలో హరప్ప మొదటి నుంచీ విరాగే. ఏ రాగమూ ఆతని నంటలేదు. ఈ కారణంగానే ఈ యోగవిద్య అతనికి అలవడి ఉండవచ్చు. ఆతని మనస్సు కూడా మాలిన్యం లేనిది. ధర్మపాలనం, వేద వేదాంగ విద్యాపారంగత్వం, యోగా భినివేశం ఉన్నప్పటికీ తన పితరులకు అపరకర్మలు జరిపించటమే ఆతని పరమధ్యేయమయింది. ఆ కర్మ పూర్తవగానే తన జన్మ చరితార్థం చెందిందని భావించి తనువు చాలించాలను కొన్నాడు. ధార్మికబుద్ధి ఉన్నవాడు కనుక, దేశంలో అధర్మం ప్రబలటానికి రాజస్థానీయుడైనందున తాను కారకునిగా తలచాడు. ఈ కారణంగానే **"చేతనైనంత వఱకు వేయి పడగలాడించితిని. ఆ యాడించుట ఏకదేశమైపోయెను. నా యందున్న దోషము దానికి సంక్రమించినది"** అంటూ దేశంలో ప్రబలుతున్న అధర్మానికి తన్ను కారకునిగా ఆరోపించుకొని, ధర్మప్రవర్తన ఏకదేశంగానే ప్రవర్తితమైం దని భావించి శరీరత్యాగానికి సంసిద్ధుడయ్యాడు. ఈ శరీరత్యాగానికి ఆతడు ఎన్నుకొన్న మార్గం కపాలమోక్షం. ఏడెనిమిది దశకాల్లో వచ్చిన "ఆనందభైరవి" అనే చలన చిత్రంలో నాట్యాచార్యుడు నాట్యాన్ని ఒక యోగంగా ఉపాసించి, కపాల మోక్షం ద్వారా ప్రాణోత్క్రమణ చేసి నట్లు చిత్రితమైంది.

## సద్యోమరణం :

**"పూర్వము భారతదేశమున వేదాంతవిద్యలు గొన్నిక్షత్రియ వంశముల యందే యుండెడిది. ఆ యుపాసనా విద్యలు బ్రాహ్మణు లెరుగరు. అట్లే కొప్పాకలోని పంచమ వర్ణస్థుల ఖడ్గవిద్య పంచముల యందే యుండెను."** అని రచయిత బద్దన్నసేనాని నవలలో పంచమ వర్ణస్థులకు మాత్రమే పరిమితమైన ఖడ్గవిద్యను గూర్చి వివరించారు. 'పులిముగ్గు' నవలలోని పులిముగ్గు కూడ ఇటు వంటి విద్యే అంటారు రచయిత. ఆంధ్ర దేశంలో క్షుద్రవిద్యలను పొసించే ఒకానొక తెగ ఉండేదట! "భేరీకోమట్లు, మాచాబత్తుల' వంశంలో వారీ తాంత్రిక విద్యలో సిద్ధహస్తులైనట్లు కొన్ని గాథలు ప్రచారంలో ఉన్నాయి. అయితే ఇవి ఆ వంశం వారికే పరిమితమై కాల క్రమాన అంతమైపోయాయి. 'పంచాగ్ని విద్య' ఉపనిషత్ప్రతి పాదిత విద్య. ఇది క్షత్రియుల విద్యయట! అదే విధంగా పూర్వకాలంలో ప్రాచుర్యంలో ఉన్న వైద్యంలో భాగమైన శస్త్రవిద్య మంగలికులానికే పరిమిత మయిన విద్య. 'తాబేలుమాత్రలు' తయారుచేసేవారు కుమ్మరివారట! అదే విధంగా హరిజనులలో ఒక విధమైన యోగవిద్య ఉందని రచయిత 'చందవోలు రాణి' నవలలో తెలిపేరు.

పంచమకులస్థుడు, చందవోలురాణికి ఆంతరంగిక రక్షకుడు అయిన మల్లన్న **'మా కులములో నొక యోగమున్నది. కోరినప్పుడు చనిపోవచ్చును. దాని కభ్యాసము చేయవలెను... మన దేశములో ననాదినుండియు, నొక్కొక్క కులములో నొక్కొక్క యోగము, నొక్కొక్క విద్య నుండుచు వచ్చెను. ఇది యుగాల నుండి యిట్లే వచ్చుచున్నది"** అని యువరాజైన సాంపరాయనితో అన్నాడు. మహారాజు యుద్ధంలో తీవ్రంగా గాయపడి మరణోన్ముఖుడై ఉన్నాడని వినిన చందవోలురాణి ఆతని తోడి వియోగాన్ని భరించలేక ఈ యోగం సాహాయ్యంతో సద్యోమరణాన్ని పొందినట్లు నవలలో వివరించారు. నవలలో రచయిత ఈ విద్యను గూర్చి ప్రస్తావించారే కాని దీనిని గూర్చిన వివరణ ఎక్కడా కనిపించటం లేదు.

## సహగమనం :

ఇతిహాసం, పంచమ వేదమయిన భారతంలో మాద్రి పాండు రాజు మరణం తరువాత భర్తతో సహగమనం చేసి మృత్యువును ఆహ్వానించింది. భర్త మరణించగానే భర్త చితిలోకి భార్య ప్రవేశించి తాను కూడా దహన మయిపోవటమనేది. ఈ ప్రక్రియనే సతీసహగమనమని అంటారు. ఒకానొక కాలంలో రాజపుత్ర స్త్రీలు భర్త మరణానంతరం ఈ ప్రక్రియ ద్వారా మరణాన్ని ఆహ్వానించే వారు. ఈ స్త్రీలు మొట్టమొదట్లో ఐచ్ఛికంగా తమ ప్రాణాలను తృణప్రాయంగా తలచి భర్తతో సహగమనం చేసినా కాలక్రమంలో భర్త చనిపోయిన ప్రతి స్త్రీ సామాజిక పరిస్థితుల కారణంగా బలవంతంగా తమ ప్రాణాలను సహగమనం పేరుతో తీసికోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే రాజారామమోహనరాయ్ వంటి సంఘ సంస్కర్తలు భర్త పోయినా ఆ స్త్రీలకు బ్రతికే హక్కు ఉందని ఎలుగెత్తి చాటి ఈ దురాచారాన్ని రూపుమాపేరు. కనుక పురాణకాలంలోనే కాక ఇటీవలి కాలంలో కూడా ఈ ప్రక్రియ భారతదేశంలో ప్రచారంలో ఉందని చెప్పవచ్చు. బలవంతంగా తమ ప్రాణాలను తీసికొనే ఈ ప్రక్రియ ఆనాడు సహగమనం పేరుతో చలామణీ అయినప్పటికీ దానిని ఆత్మహత్యగానే పరిగణించాలి. దీనిని అగ్ని సమాధిగా పేర్కొనవచ్చేమో!

సహగమనం అన్న మాటకి కలిసి గమించటం అంటే కలిసి నడవటం అని అర్థం. పతివ్రతయైన స్త్రీ, ఎల్లవేళలా భర్తతో సహా గమిస్తూనే ఉంటుంది. అయితే భర్త మరణించగానే ఆమెలోని జీవి దానంతట అదే రాలకపోతే బలవంతంగా ఆ ప్రాణాలను తీసికొనే ఈ ప్రక్రియ కాల క్రమంలో సమాజంలో ప్రబలింది. భారతంలో మాద్రి ఐచ్ఛికంగా భర్త చితిలో తానూ దగ్ధమైపోయింది. అయితే సహగమనానికి సరియైన ఉదాహరణ గీతగోవిందకర్త జయదేవుని భార్య పద్మావతి ఉదంతంగా చెప్పవచ్చేమో! ఆమెకు భర్త పట్ల ఉన్న ప్రేమను పరీక్షించ బోయి మహారాణి జయదేవుడు వేటలో మరణించాడని చెప్పగానే ఈ మాటలను విన్న మఱుక్షణం పద్మావతి ప్రాణాలను

వదిలివేసిందట! అంతటి భావుకసమ్రాజ్ఞి పద్మావతి! చరిత్ర మొత్తం మీద సతీసహగమనానికి సరియైన ఉదాహరణ ఈమేనేమో! రాజస్థానీ స్త్రీలది లౌకికార్థంలో సహ గమనమే అయినప్పటికీ ఆధ్యాత్మిక దృష్టిలో కాని పారమార్థిక దృష్టిలో కాని ఆ ప్రక్రియను సతీసహగమనం అనలేం.

'బద్దన్న సేనాని' నవలలో బాదమ్మకు భర్తయైన తిప్పన్న తోడి జీవనంలో కృత్రిమత్వం భాసించిందేకాని సహజత్వం కనిపించ లేదు. కాని తన కంటె వయస్సులో చిన్నవాడు అవివాహితుడయిన బద్దన్న తోడి జీవితంలో చారితార్థ్యం కనబడింది. భారతీయ ధర్మానికి ఆర్ష దాంపత్యం ప్రాణం. ఈ గార్హస్థ్య జీవనసౌందర్యం భారతీయ సనాతన వైదిక సాంఘికవ్యవస్థకు పునాది. భారతీయ సాంఘికధర్మంలో వివాహవ్యవస్థకు ఒక అత్యున్నతమైన స్థానం ఉంది. అయితే పవిత్రప్రణయం కూడా అంత అత్యున్నత స్థానాన్నీ ఆక్రమించినది. ఈ పవిత్ర ప్రణయావిష్కరణ కోసమే ఈ నవలా రచన జరిగిందని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఇద్దఱు వ్యక్తుల మధ్య ప్రేమ ఉద్భవిస్తే బాహ్యకారణాల వల్ల అది నశించదు. ఇదే విషయం ఈ నవలలో నిరూపితమైంది. బద్దన్నకు చిన్ననాటి నుండీ బాదమ్మపట్ల ప్రేమ ఉన్నప్పటికీ, దానిని వ్యక్త పఱచింది మాత్రం కరవాలభైరవుని సంహరణానంతరమే. ఇక్కడ ఇద్దఱూ అంత్యకులజులయినందున మాఱు మానువులు వారి కులాచార ప్రకారం సమ్మతమే. అయితే వారికీ సంఘపు కట్టుబాట్లు న్నాయి. అవి అతిక్రమించిన వారికి కులపెద్దలు విధించే శిక్షలూ ఉన్నాయి. బద్దన్న బాదమ్మలు సంఘపు కట్టుబాట్లను అతి క్రమించినప్పటికీ గ్రామపరిషత్తు విధించే శిక్షలను అనుభవించ టానికి వారు సిద్ధంగా లేరు. కారణం తాము చేస్తున్నది తప్పుకాదనే భావం వారి నరనరాల్లో జీర్ణించుకొనిపోయింది. తమ ప్రేమలోకాతీతమైనదని త్రికరణశుద్ధిగా నమ్మినవారే. కాని లోకం దృష్ట్యా వీరి ప్రేమ అధర్మం. సంప్రదాయ విరుద్ధం. కనుక సమాజ కట్టు బాట్లకు బంధితులు కావలసివచ్చింది.

లోకంలో మనుష్యులు శారీరక మనుగడ కోసం కొన్ని పనులు చేయవలసి వస్తుంటే, మానసిక మనుగడ కోసం కొన్ని పనులు చేయటం జరుగుతుంది. అయితే ఈ రెంటికీ సంఘర్షణ తప్పనిసరి అవుతోంది. ఒక వ్యవస్థ యొక్క మనుగడ కోసం సంఘసుస్థిరత కోసం వ్యవస్థ ఏర్పఱచిన నియమనిబంధనలే ధర్మశాస్త్రాలు. ఒక వ్యక్తిని వ్యక్తిగా గ్రహించినప్పుడు ఆ వ్యక్తి మానసికానందానికి ఈ ధర్మాలు ప్రతిబంధకాలే అవుతున్నాయి. కాని వ్యవస్థను సమిష్టిగా చూసినపుడు ఈ ధర్మాలుకాని, వివాహవ్యవస్థలో కాని తప్పులేదు. ఇక్కడ బద్దన్న బాదమ్మలు వ్యవస్థాతీమైన ప్రేమికులు. అట్టివారికి లౌకికమరణం అనివార్యం. అయితే వీరి ప్రణయం దివ్యమైనదనే విషయంలో ఏ విధమైన విప్రతిపత్తిలేదు. ఈ ప్రేమ నిర్బంధంగా కల్పించుకొనటానికి కాని ధార్మికబుద్ధితో అలవఱచుకోటానికి కాని సాధ్యమైనది కాదు. మనోగతమైన ప్రేమకు వ్యవస్థా నియమాలు వర్తించనప్పటికీ, తన్నియమోల్లంఘన పరులకు ఈ వ్యవస్థలో మనుగడ కష్టసాధ్యం. అందువల్లనే బదమ్మ బద్దన్నలు సంఘ వ్యవస్థకు బలికాక తప్ప లేదు.

ధర్మాన్ని ప్రతారించిన వారికి లోకంలో సుస్థిరత లేదు, అంత రాత్మకు ప్రతారణ కలిగితే ఆత్మకు శాంతి లేదు. కనుక ధర్మమ నేది సామాన్యజనులకే కాని విశిష్ట ప్రకృతులకి కాదు. వారిపట్ల ధర్మం వర్తించదని రచయిత తీర్పు. అట్టివారి పట్ల సంఘం యొక్క సానుభూతి తప్పని సరిగా ఉంటుంది. ధర్మానికి వ్యవస్థ ప్రతీక. కవి కావ్యంలో పాత్రలను గ్రహించి ధర్మాన్ని ధ్వనింపజేస్తాడు. బాదమ్మ సంఘవ్యవస్థా నియమాలకు బద్ధురాలు కాకపోవటం వల్ల పతివ్రత అయినప్పటికీ, ఆమె ప్రేమ అలౌకికమైనప్పటికీ వ్యవస్థకు బలి కావటం అనివార్యమైంది. ఈ కారణానే బాదమ్మ "మా ప్రేమకు మీ సూత్రములు పట్టవు. మాది లింగజ్ఞానాతీత మైన సంబంధం" అని తమ ప్రేమ యొక్క అలౌకికత్వాన్ని ఉద్ఘాటించి, సహగమనంతో తమ ప్రేమను లోకానికి చాటి చెప్పింది. మఱి బాదమ్మ బద్దన్నలది ఆత్మహత్యా?

కాశ్మీర నవలా మాలలో ఒకటైన మిహిరకులుడు నవలలో నవలాంతంలో మిహిరకులుడు ఒకానొక నదిని

మళ్ళించే ప్రయత్నంలో అడ్డం వచ్చిన రాతిని పతివ్రతయైన స్త్రీ స్పర్శమాత్రమే తొలగించగలదని కల గని దేశంలోని స్త్రీ లందఱినీ అక్కడకి రప్పించి, రాయి తొలగని కారణంగా వారిలో పతివ్రతలే లేరని నిర్ధారించుకొని, ఇంచుమించు మూడు కోట్ల మంది స్త్రీలని, వారి భర్తలని, తోబుట్టువులని సంహరించి చరిత్రలో 'త్రికోటిహు' డని సార్థక నామధేయుడైనాడు. విషయాన్ని తెలిసికొన్న కళ్యాణవతి భర్త నెదుర్కొని, ఆతనికి ధర్మోపదేశం గావించి, మిగిలిన స్త్రీల ప్రాణాలకి తన ప్రాణాలని వెలకడుతున్నానని చెప్పి, తాను ఆత్మాహుతి కావించుకొంటుంది. తన బహిఃప్రాణమైన రాణి కళ్యాణవతి మరణించటంతో మిహిరకులుడు పండగాలిన ఖడ్గాలున్న బల్ల మీదకి దూకి ప్రాణార్పణ గావించుకొంటాడు. ఇక్కడ కళ్యాణవతి డెబ్బది ఏళ్లు అంత క్రూరుడైన భర్తను సహించి అతనితో జీవితాన్ని పంచుకొని, తన పాలనలో స్త్రీలే లేకుండా పోతారనే పరిస్థితి వచ్చాక తన జీవితాన్ని పణంగా పెట్టి జీవితాన్ని చాలించింది. సాధారణంగా లోకంలో భర్తలు మరణిస్తే భార్యలు సహగమనం చేయటం చూస్తాము. అయితే దానికి విరుద్ధంగా ఇక్కడ మిహిరకులుడు సహగమనం చేస్తాడు. భార్య మరణించాక ఆమెలేని జీవితం ఊహించుకోలేక మరణాన్ని ఆహ్వానించాడు. ఇంతటి క్రూరుడు మరణించాక ఆతని మీద పాఠకునికి సాను భూతి కలుగుతుందే తప్ప ఒక క్రూరాతిక్రూరుడు మరణించి నందుకు సంతోషం కలుగటం లేదు. అయితే మిహిరకులునిదీ, కళ్యాణవతిదీ కూడా అసహజమరణమే కదా?

**ఆత్మహత్య :**

పైన వివరించిన వివిధ ప్రక్రియలకి పేర్లున్నప్పటికీ ఆధునిక కాలంలో తనకు తానుగా ప్రాణాలను తీసికోవటాన్ని ఆత్మ హత్యలనే వ్యవహరిస్తున్నారు. విశ్వనాథవారి నవలల్లో పైన చెప్పి నవే కాక ఈ రోజుల్లో మనం చెప్పికొనే ఆత్మహత్యలు కూడా ప్రస్తావితమయాయి. లలితా పట్టణ పురాణి, పరీక్ష, కుణాలు నిశాపం, మాబాబు నవలల్లోని వ్యక్తులు కొందఱు ఆత్మహత్య చేసికొని ప్రాణాలను తీసికోవటం గమనించవచ్చు.

'లలితాపట్టణపురాణి' నవలలో ప్రధానపాత్రధారి కాలాభట్టు, ఆతని సేవకుడు గిఘ్రి కూడా ఆత్మహత్య చేసికొన్నవారే. వీరదేవ వర్మ రాజ్యంలో అంతఃపురజనానికి పఞ్చాఙ్గాన్ని, జ్యోతిషాన్ని చెప్పే బ్రాహ్మణుడు నిరంజన భట్టు. ఈతడు వీరదేవవర్మ పాలితులలో పాలమ్ముకొని జీవించే ఒక స్త్రీ కుమార్తెకు మహారాణి యోగ ముందని తెలిసికొని, ఆమెను రాచబంధువుల బాఱినుండి రక్షించి, కాలాభట్టు అధీనంలో ఉంచాడు. అనాగరికురాలైన ఈమె కాలాభట్టు వద్ద సర్వశాస్త్రాలను నేర్చికొని, ఆతని సాహాయ్యంతో వీరదేవవర్మ భార్య అయింది. వీరదేవవర్మ తన తల్లుల అభీష్టానికి వ్యతిరేకంగా స్వతంత్రించి చేసికొన్న వివాహమిది. విషయాన్ని గ్రహించిన మహారాణితారాదేవి ఆమెను తన కోడలిగా స్వీకరించటానికి ఇష్టంలేనిదై, రాజు నగరంలో లేనప్పుడు మిథ్యాభి యోగంతో కోడలికి ఉరిశిక్ష విధించింది. ఈ అవమానాన్నుంచి తప్పించుకోవటానికి కాలాభట్టు ఆ కోడలి కోరిక మీద ఆమెను సంహరించి, తన సేవకుడైన గిఘ్రితో పాటు తానూ ఆత్మహత్య చేసికొన్నాడు. బ్రాహ్మణులు ఆత్మహత్య చేసికొంటే బ్రహ్మరాక్షసులై పుడతారని భారతీయులలో ఒక నమ్మకం. ఈ ఆత్మహత్య కారణంగా బ్రాహ్మణుడైన కారణంగా కాలాభట్టుకు బ్రహ్మ రాక్షసజన్మ, సేవకుడైన గిఘ్రికి పిశాచజన్మ కలుగుతాయి. ఇక్కడ వీరు ఒక నీచజన్మ కలుగుతుందనే భవిష్యత్తును తెలిసే అనివార్య పరిస్థితులలో ఆత్మహత్యకు పాలుపడ్డారు. అయితే ఈ కథ సుఖాంతం కావటం వల్ల, ఈ నీచజన్మ నుండి విముక్తి ఉండటం వల్ల పాఠకునికి వీరి పట్ల సానుభూతీ లేదు, కోపమూ లేదు.

లోకంలో అదృష్టవంతులు రెండు రకాలు. మొదటి వారు చచ్చిపోవటానికి ఇష్టపడని భాగ్యవంతులు. రెండవ వారు పేదతనాన్ని, కష్టాలను అనుభవించలేక చచ్చిపోవాలని అనుకొన్నప్పుడు మృత్యువు దానంతట అదే సంభవించేవారు. అయితే ఈ రెంటికీ తాను చెందని

వాడనని, మృత్యువు దానంతట అది రానపుడు ప్రయత్న పూర్వకంగా చనిపోవచ్చునని, అయితే ఆత్మహత్య మహా పాపమని, ఈ కష్టాలని ఈదటానిక తనకింకా మార్గాలు మూసికొని పోలేదని అనుకొంటాడు 'పరీక్ష' అనే నవలలో కథానాయకుడు. అయితే జీవితమనే పరీక్షలోనే కాక చదువు అనే పరీక్షలో కూడా ఘోరమైన పరాజయాన్ని చవిచూచినవాడీ కథానాయకుడు. చిన్నతనంలోనే కుటుంబ భారమంతా ఈతని పాలపడగా ఆతనికి సాధ్య మైన పద్ధతిలో ఈ బ్రతుకుబండిని నెట్టుకొని రావటానికి నానా అగచాట్లు పడతాడు. చెల్లెళ్ళ జీవితం ఒక దారికి వచ్చాక, ఇక తను జీవించి ఉండటంలో అర్థం లేదని భావించి, బల వంతంగా దానికి ఒక ముగింపు ఇచ్చేస్తాడు.

'మాబాబు' నవలలో తాను ప్రేమించిన మఱదలు తన తమ్ముని ప్రేమించిన కారణంగా వారిద్దఱికి పెళ్ళి జరిపించి, వారి జీవితానికి ఒక దారి చూపించినప్పటికి ఆ తమ్ముడు తన మనస్సులోని ఒకానొక అభద్రతా భావంతోనూ, పశ్చాత్తాప భావంతోనూ రైలు క్రిందపడి తన జీవితానికి ముగింపు పలుకుతాడు. ఆ తమ్మునికి ఆతడు కోరుకున్న జీవితాన్ని ఆతనికి ఇచ్చినా దాన్ని నిల బెట్టుకోకపోవటానికి ఆతని మానసిక పరిస్థితే ముఖ్యకారణ మయింది. ఆ భావనే ఆతని జీవితానికి ముగింపు అయింది.

ఈ జీవితమనే పరీక్షలో గోపాలం ఉత్తీర్ణుడు కాలేక పోయాడు. సమస్యలున్నప్పుడు పరిష్కారాలు ఉంటాయి. అయితే ఈ నవ లలో పరిష్కారం తీవ్రంగా ఉండటంతో పాఠకుణ్ణి దుఃఖంలో ముంచెత్తుతోంది. 'మాబాబు' నవలలో కూడా కథానాయకునిది దుఃఖభరితమైన జీవి తమే. అయితే ఈ జీవితాన్ని ఆతడు ఒక వైరాగ్యభావనతో చూసి, జీవితంలో కలిగే వైఫల్యాలను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. అవే వైఫల్యాలను అధిగమించలేక 'పరీక్ష' నవలలో జీవితాన్ని చాలించాడు గోపాలం. **"పదివేలమంది మనుష్యులలో నొక్కడెవడో మెత్తని ప్రకృతి కలవాడుండును. ఈ జీవితము వానికి పరీక్ష."** ఈ జీవితమనే పరీక్షలో ఉత్తీ ర్ణత ఆయా వ్యక్తుల మానసిక ద్రఢిమని బట్టి ఉంటుంది. అని ఈ కథలకి రచయిత ఇచ్చిన తీర్పు. ఈ కథల్లో 'మాబాబు' కథానాయకుని గుఱించి చదివినప్పుడు స్ఫూర్తి కలుగుతోంది అన్నది ఎంత సత్యమో 'పరీక్ష'లో గోపాలాన్ని గుఱించి చదివినప్పుడు అంత సానుభూతి కలుగుతోంది అన్నదీ అంతే సత్యం. ప్రపంచంలో మానవమనస్తత్వాలు అనంతం. ఎవరి అనుభవం వారిదే.... ఎవరి కష్టం వారిదే. వారు పడ్డ కష్టాలను ఎదుర్కొనే విధానాలు అనంతం. ఇలా చెయ్యకుండా ఉంటే బాగుండేది అని వారి గురించి ఒక తీర్పునిచ్చే ముందు ఆ ముగింపు మనకి స్ఫూర్తి నిస్తోందా? సానుభూతిని కలుగజేస్తోందా? అని ఆలో చించటం మాత్రం మానవులందఱి కర్తవ్యం.

'కుణాలునిశాపం' నవలలో కూడా కథానాయకులలో ఒకడైన మురారి స్నేహ ధర్మానికి అత్యంత ప్రాధాన్యాన్నిచ్చి తన స్నేహితుడైన వేంకటేశ్వర్లు కోసం తన జీవితాన్నే పణంగా పెడతాడు. తన స్నేహితుడు తనను, తన కుటుంబాన్ని ఎన్ని బాధలు పెట్టినా సహిస్తాడు. మురారి కొడుకు ఎన్ని ఉద్యోగ ప్రయత్నాలు చేసినా కలిసిరాక ఇల్లుగడవని పరిస్థితుల్లో వేంకటేశ్వర్లు దగ్గఱకు వెళ్ళి ఆతని చేత అవమానం పొంది, అవమానాన్ని తట్టుకోలేక ఆత్మ హత్య చేసికొంటాడు. కుమారుని మరణాన్ని కళ్లారా చూసేక తన బ్రతుకుకు అర్థం లేదని తలచి మురారి బల వంతంగా జీవితాన్ని చాలిస్తాడు. ఇక్కడ నవలలో ఈ ఇద్దఱూ ఎన్నో బాధలకు లోనయి, ఎప్పటికైనా తమకు మంచిరోజులు వస్తాయని ఎదురు చూసి, చూసి ఆ మంచి రోజులు ఇక తనకి ప్రాప్తం లేవని నిర్ణయించుకొని బల వంతంగా ప్రాణాలను తీసికొన్నప్పటికీ వారి మీద జాలి కలుగుతుందే తప్ప వారి మీద కోపం రమ్మన్నా రాదు. వీరు కూడా జీవితమనే పరీక్షలో ఓడిపోయినవారే. మరి ఆత్మహత్య చేసికొన్న వారికి కాని, వారి కుటుంబాలకు కాని సమాజం ఏమిచ్చింది? ఒక కథగా మిగిలిపోవటం తప్ప.

'కాశ్యాంతు మరణాన్ ముక్తిః' అని ఆర్యోక్తి. సర్వపాప హారిణి యైన గంగలో కాని, కాశీవిశ్వేశ్వరుని సాన్నిధ్యంలో కాని మరణిస్తే ముక్తి వస్తుందన్న నమ్మకం చాలామందిలో

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


ఉంది కాని, **"పురాణాల ప్రకారం కాశీలో సహజంగా మరణిస్తేనే ముక్తికాని ఆత్మహత్య చేసికొంటే కాదు. ప్రపంచం మొత్తం మీద ఆత్మహత్య చేసికొంటే పాపం లేక పోవటమే కాక తరువాతి జన్మలో అన్ని కోరికలు తీరేటు వంటి ప్రదేశం ఒక్క త్రివేణీసంగమమం మాత్రమే. ప్రయాగ మాధవుడు పరమకారుణ్య మయుడు. తన దగ్గర ఏ కోరిక కోరి మరణిస్తే ఆ కోరిక తీరుస్తాడని ప్రాచీనగాధలు చెబు తున్నవి"** అంతమాత్రాన మోక్షం కోరే ప్రతివ్యక్తీ ప్రయాగలో ఎందుకు ఆత్మహత్య చేసికోవటం లేదు? అనే ప్రశ్నకు సమాధానం దొరకటం కష్టసాధ్యమే. 'ధూమరేఖ' నవలలో పరాశరశాస్త్రి నవలాంతంలో ఆ దేశానికి తన అవసరం తీరిపోయిందని తెలిసికొనగానే ప్రయాగలో తన జీవితాన్ని చాలించాడు. అందరూ పరాశరశాస్త్రులు కారుగా?

ఇక్కడ నవలల్లో రత్నావళి, రంగులు కాని, రత్నావళి నాలా యనులు కాని తామాచరించినది పాపమని త్రికరణ శుద్ధిగా నమ్మేరు. ప్రాయశ్చిత్తానుభవం కోసం ప్రాణాలను త్యాగం చేసేరు. అదే విధంగా కుమారిలభట్టు గురు ద్రోహం చేసిన పాపానికి తన్నుతాను శిక్షించుకొన్నాడు. బాదమ్మకు భర్త ఉన్నప్పటికీ ఆతని పట్ల భర్తృభావాన్ని చూపలేకపోవటం వల్ల, బాదన్ననే భర్తగా భావించటం వల్ల బద్దన లేని జీవితాన్ని జీవించలేక, భర్తతో జీవి తాన్ని ఊహించుకోలేక తనకు తానుగా ప్రాణాన్ని తృణ ప్రాయంగా తలచింది. ఒక విధంగా మిహిరకులునిదీ ఇదే పరిస్థితి. ఆతడు ఎంత క్రూరుడైనప్పటికీ భార్య పట్ల ఏనాడూ క్రూరంగా వ్యవహరించలేదు. కాని ఆతడు తన పాలితులు మూడుకోట్ల మంది ప్రాణాలని బలితీసి కొన్నపుడు మాత్రం కళ్యాణవతి వారి ప్రాణాలకి తన ప్రాణాన్ని పణంగా పెట్టి తన ప్రాణాన్ని వదిలివేసింది. అయితే భార్య లేని జీవితం వ్యర్థంగ భావించి, మిహిర కులుడు తన జీవితాన్ని కడతేర్చుకొన్నాడు.

ఏకవీర వ్యక్తిగా పతివ్రతే అయినప్పటికీ వ్యక్తి వ్యవస్థా ధర్మ సంఘర్షణలో వ్యవస్థాధర్మం దృష్ట్యా తనకిక సమా జంలో స్థానం లేదని భావించి జీవితాన్ని తృణప్రాయంగా ఎంచి వైగైనదిలో లీనమైపోయింది.

'భ్రమరవాసిని' నవలలో మధుసూదనుడు తెలిసో తెలియకో అమ్మవారిని తన భార్యగా కావాలని కోరు కొన్నాడు. ఇందులో సాధ్యాసాధ్యాలను ప్రక్కన పెడితే అమ్మవారిని భార్యగా భావించటం అనుచితమే కాదు ఘోరపాపం కూడ. ఆటువంటప్పుడు అమ్మవారే ఆతనికి భృగుపాతం చేయుమని ఎందుకు అనుమతి ఇచ్చింది? అయితే కోరిక ఉడ్డోలంగా ఉన్నపుడు, తీవ్రాతి తీవ్ర మయినపుడు, దాని సాధన కోసం సాధకుడు తీవ్ర ప్రయత్నం చేసినపుడు సాధకుడు దానిలోని ఉచితాను చితాలను ఆలోచించడు కాని ఫలితం ఉండి తీరుతుంది. కనుకనే రాక్షసుల కోరికలు తీర్చటం కోసం బ్రహ్మైనా క్రిందకు రాక తప్పలేదు. అయితే కోరిక ఉచితమైనా అనుచితమైనా ఆ కోరికను తీర్చేది భగవతి కనుక ఆతని కోరికలోని అనౌచిత్యాన్ని ఆతడే తెలిసికొనేట్లు మరు జన్మలో ఆతనికి భార్యయై తన భగవల్లక్షణాన్ని స్వప్నాల ద్వారా తెలియజేసింది. అదే భగవల్లీల అంటే!!

'సౌదామని' నవలలో దీర్ఘాయువు తాను చేయని పాపాన్ని నెత్తిన వేసికొని ప్రాణోత్క్రమణ కావించుకొనాలని భావించినపుడు ఆదిశంకరులు ఆతనికి అనుమతి నివ్వటంలోని ఔచిత్యం ఆలోచించవలసిందే.

'వేయిపడగలు' నవలలో కపాలమోక్షం విషయానికొస్తే హరప్ప సహజమరణం కోసం ఎదురుచూడకుండా యౌగిక ప్రక్రియ ద్వారా ప్రాణోత్క్రమణ చేయటం ఏ విధంగా సమర్థనీయం? తాను ఈ లోకానికి ఒక ప్రయోజనార్థం వచ్చానని భావించబట్టి, ఆ ప్రయోజనం నెరవేరబట్టి జీవితాన్ని, ప్రాణాన్ని తృణప్రాయంగా భావించి వదిలి వేసేడు. అంత మాత్రాన అది ఆత్మహత్య కాకుండా పోతుందా?

'చందవోలురాణి' నవలలో కథానాయిక సరోజలోచన ఒకానొక యోగవిద్య ద్వారా సద్యోమరణాన్ని పొందింది. ఇక్కడ కూడా తనలోని ప్రాణవాయువుని నియంత్రించి, ఇచ్చవచ్చినపుడు దానిని వదిలివేయటం గమనించవచ్చు. భీష్ముడు సద్యోమరణం వరంగా పొందినవాడు. యుద్ధం లో గాయపడి కొన్ని రోజులు పాటు అంపశయ్య మీద ఉండి ఇష్టం వచ్చినపుడు ప్రాణాన్ని వదిలి వేసేడు.

ఇక విశ్వనాథ సాంఘిక నవలల్లో 'కుణాలుని శాపము', లో మురారి, ఆతని కొడుకు, కాని 'పరీక్ష' నవలలో గోపాలం కాని, 'మాబాబు' నవలలో కథానాయకుని తమ్ముడు కాని జీవితమనే పరీక్షలో ఘోరంగా విఫల మయి, ఆ పరాజయాన్ని తట్టుకోలేక బలవంతంగా తమ ప్రాణాలను తీసికొన్నారు. రచయిత ఈ నవ లల్లో ఆత్మ హత్యను చూపించినంత మాత్రాన వారు వానిని సమర్థిం చారని చెప్పలేము. వారి కష్టాలను చదివిన వారికి వారి పట్ల సానుభూతి కలుగవచ్చు, వారి బ్రతుకుకు చావే పరిష్కారమేమో అనిపించవచ్చు.

తమ ప్రేమ విఫలమయిందని ఆత్మహత్య చేసికొనే ప్రేమి కులో, భయంకర మైన జబ్బుతోటో, నొప్పితోటో బాధపడుతూ ఆ బాధను తట్టుకోలేక తమ ప్రాణాలను తీసికొంటున్న ఎంతో మంది యువతను చూస్తున్నాం. ఇటీవల రైతుల ఆత్మహత్యలు దేశాన్ని గడగడలాడి స్తున్నాయి. రోహిత్ వేముల ఆత్మహత్య ప్రపంచవార్తే అయి పోయింది. తమ అభిమాన చలనచిత్ర నాయ కుని సినిమా మొదటి రోజే చూడలేకపోయాడన్న కారణంగా మెడను కత్తితో కోసుకొన్న సంఘటన ఇటీవలి వార్తల్లో మొదటి స్థానాన్ని ఆక్రమించింది. తమ అభిమాన నాయ కుడు రాజకీయంగా ఓడిపోయాడనే కారణంతో తనను తను అంటించుకొని చనిపోయిన యువతకూ మన దేశంలో కొదవలేదు. అతిశీతల ప్రదేశాల్లో చలికాలంలో ఆత్మహత్యలు ఎక్కువ జరుగుతాయని గణాంక వివరాలు తెలుపుతున్నాయి. అక్కడి చలికి తట్టుకోలేక వారు తమ ప్రాణాలను తీసికొంటారట! పరిష్కారంలేని కొన్ని జబ్బు లతో బాధపడేవారు తమ జీవితాలను తామే అంతం చేసికొనే అవకాశాన్ని కల్పించుమని, అటువంటి కారుణ్య హత్యకు చట్టబద్ధత కల్పించుమని కోరినప్పటికి ప్రపంచం మొత్తం మీద ఒకే ఒక్క దేశం దాన్ని చట్టబద్ధం చేసిందట! బొంబాయిలో 18 ఏళ్లుగా అపస్మారక స్థితిలో నున్న ఒకా నొక స్త్రీ తరపున ఆమె బంధువులు కారుణ్యహత్యకు అనుమతిని కోరినా చట్టం ఆ అనుమతిని కల్పించలేదట! పరిష్కారంలేని అటువంటి జబ్బులకి ఎప్పటికైనా పరి ష్కారం చూపగలమని, శాస్త్రం ఆ స్థితికి ఎదుగుతుందని వైద్యుల ఆశ, ఆశయం కావచ్చు.

కొంతకొంత మంది జీవితాలూ, వారి బాధలూ చూసి నపుడు, వారు పడుతున్న బాధను చూసినప్పుడు వారి బాధ లనుండి వారికి చావే పరిష్కారమేమో అనిపిస్తుంది. ఇక్కడ ఇన్ని రకాల ఆత్మహత్యలు కనపిస్తున్నా ఆత్మహత్య చేసికొన్న వారి మీద సానుభూతి కలుగుతుందే తప్ప వారుచేసినది తప్పు అనిపించదు. చట్టపరంగా అది నేరమైతే కావచ్చు కాని, మానవత్వపరంగా అది నేరం కాదు అనిపిస్తుంది. వీరందఱూ జీవితాన్ని కాచి వడబోసిన వారే. ఇన్ని కథలు చదివిన తరువాత తమ తమ జీవితా లకి, సమస్యలకి పరిష్కారమార్గాలు లేకనే వీరు ఆత్మ హత్యలు చేసి కొన్నారేమో అనిపిస్తుంది. ఆ పాత్రల పట్ల సానుభూతి కలుగుతుంది. వారి గుఱించి ఆలోచించి నపుడు అయ్యో! వీరి జీవితం ఇలా ముగిసిందే అని పిస్తుంది. లోకంలో ఎవరైనా ఆత్మహత్య చేసికొన్నారంటే వారు జీవితంలో ఓడిపోయారు. వారు పిరికి పందలు అని ఒక తీర్పు ఇచ్చే ముందు వారు అంత భయంకర మైన అడుగు వేయటానికి వారికున్న కారణాలను ఆలో చించే సహృదయం కావాలి. ఎందుకంటే చావటానికి కావలసింది విషమో, కత్తో, కొండఅంచో, సముద్రమో కాదు, ప్రయాగలోని త్రివేణీ సంగమమో, కాశీనగర నివాసమో అంతకంటే కాదు... వారికి కావలసినది ధైర్యం!!!

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# నక్కల గిరిజన తెగ - సామాజిక సాంస్కృతిక జీవన విధానం

- డా. ముడావత్ వెంకటేష్

"ఆదిమ తెగల పుట్టు పూర్వోత్తరాలు, వాటి అనంతర చరిత్ర గురించి మనకు స్పష్టమైన పరిజ్ఞానం లేకపోయి నప్పటికీ, అవసర మైనంతగా పురాతత్త్వ సాక్ష్యాధారాలు, ప్రాచీన శిలాయుగ సాక్ష్యాధారాలు కూడా లభ్యం కానప్ప టికీ, చారిత్రక యుగానికి సంబంధించిన ఈ తెగల జీవితాల్లోని ఒడిదుడుకులను క్రోడీకరించ వచ్చు. ఆదిమ తెగల జీవితాల గురించి కొంతవరకు అవగాహన చేసుకోవ డానికి చారిత్రక సమాచారం దోహదపడుతుంది. దీని ద్వారా కేవలం ఊహాగానలమీద ఆధారపడకుండా, విశ్వాసనీయమైన సాక్ష్యాధారాలతో ఆదిమ జాతుల చరిత్రను కొంతవరకు పునర్నిర్మాణం చేయడం సాధ్యమవు తుంది. గిరిజనులు ప్రాచీన కాలంలో ఏకాంత జీవితం గడపడం లేదన్న విషయం పురాణ, ఇతిహాస గాథలను పరిశీలిస్తే అవగతమవుతుంది. అలాగే గిరిజనుల జానపద కళారూపాలను పరిశీలిస్తే రాముడు, సీత, లక్ష్మణుడు, రావణుడు, భీముడు వంటి పురాణ పురుషుల ప్రభావం వారిపై ఎంతవుందో అవగాహన చేసుకోవచ్చు.

మనదేశం విభిన్న మతాల, జాతుల, కులాల సంస్కృతుల సమాహారం. ఇందులో భాగమైన తెలం గాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా లలో ఈ వైవిధ్యం లేకపోలేదు. కాబట్టి విభిన్న మతాలు, భిన్న జాతులు, అనేక కులాలు, శ్రేణులు, సామాజిక నేపథ్యాలు, సాహిత్యం, సాంస్కృతిక విషయాలు అధ్యయనం చేయకపోతే భారతీయ సమా జాన్ని, అందులో భాగమైన తెలుగు సమాజాన్ని అర్థం చేసుకోవడం కష్టం అవుతుంది. నాగరిక ప్రపంచానికి దూరంగా కొండల్లో, కోనల్లో, అడవుల్లో జీవిస్తున్న ఆటవిక తెగలు ఎన్నో ఉన్నాయి. ఆ తెగలే గిరిజన తెగలుగా పేర్కొనబడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో 35 రకాల గిరిజన తెగలవారు నివసిస్తున్నట్లు ధృవీకరించారు. వీరు ఎక్కువగా తూర్పుకనుమలు, నల్లమల కొండలోయలు, అడవీ ప్రాంతాలలో నివాస ముంటున్నారు. గిరిజన తెగలు అభివృద్ధికి దూరంగా వెనకబడి జీవిస్తున్నారు.

## గిరిజనులు-నిర్వచనం :

భారత రాజ్యాంగంలో షెడ్యూల్డు తెగలు (Schedu-led Tribes) అన్న పదం మొదటిసారిగా కనిపిస్తుంది. రాజ్యాంగంలో ఆర్టికల్ 366(25) షెడ్యూల్డు తెగలను ఈ విధంగా తెలియజేస్తుంది. ఒకే విధమైన తెగలు లేదా గిరిజన సముదాయాలు లేదా సముదాయాలలోని భాగాలు లేదా సమూహాలు లేదా గిరి జన సముదాయా లన్నింటిని రాజ్యాంగంలో 342వ ఆర్టికల్ కింద చేర్చడం జరిగింది. కొంతకాలానికి గిరిజన తెగ నిర్వచనం, భావం స్థిరపడ్డాయి అనే విషయాన్ని నదీంహస్ నైన్ భారతీయ గిరిజనులు గ్రంథంలో ఇలా పేర్కొన్నారు. "ఒకేవిధమైన తెగలు లేదా గిరిజన సముదాయాలు, అంతేగాక రాజ్యాం గం ఎస్.టి. నిర్ధారణకు ఎటువంటి ప్రామాణికాలను స్పష్టం చేయలేదు. రాజ్యాంగ అధి కరణ 240 కింద ఏర్పాటైన వెనుకబడిన తరగతుల తొలి కమీషన్ సిఫార్సుల ప్రకారం కొండ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాల్లో నివసిస్తూ ప్రధాన జనజీవన స్రవంతిలో కలువకుండా నివసించే వారిని ఎస్.టి.లుగా పరిగణించవలసి ఉంటుంది. వారు ఏ మతానికైనా చెందవచ్చనీ పల్లా త్రినాథ్‌రావు ఆదివాసీల నిరాశ్రయత గ్రంథంలో పేర్కొన్నారు. తెగ ఆటవిక, ఆదిమ ప్రజల సమూహం. వారు తమకు ఆదిమ పురు షుడు ఒక్కడే అని భావిస్తారు. ఒక నాయకుని అధి కారాన్ని వారు అంగీకరిస్తారు. తెగ ప్రాంతీయ, అనుబంధం ఉన్న సామాజిక బృందం, అంతర్వివాహం వారిలో సామాన్య లక్షణం, పని విభజన కన్పించదు. తెగల నాయకులే వారిని పరిపాలిస్తారు.

## తెగ నిర్వచనం :

సాధారణంగా గిరిజన సమాజాలు చిన్నవిగా ఉం

టాయి వారి అవసరాలు, ఆలోచనలు పరిమితంగా ఉంటాయి. వారి సామాజిక, న్యాయ, రాజకీయ సంబంధాలు చాలా పరిమితమైనవి.

కొన్ని కుటుంబాలు లేదా కొన్ని కుటుంబ సముదాయాల మధ్య సమైక్యత ఉండి ఒకే పేరుతో వ్యవహరించడం వారు అందరూ ఒకే నిర్ణీత ప్రదేశంలో నివసిస్తూ ఒకే భాష మాట్లాడుతూ ఒకే రకమైన ఆహార విధానాన్ని అవలంబిస్తూ, ఒకే రకమైన వైవాహిక నియమాలను పాటిస్తూ, పరస్పర సహకార భావం కలిగి ఉండి వారి మధ్య పరస్పర అనుబంధముండే సమూహాన్ని "తెగ" అనవచ్చు. తెగ అనేది ప్రాంతీయ అనుబంధం ఉన్న సామాజిక బృందం అంతర్వివాహం వారిలో సామాన్య లక్షణం. పని విభజన కనిపించదు. తమ జాతి, తమ ప్రజలు, తమ ప్రాంతం అన్న భావన వీరిలో అధికంగా ఉంటుంది అని డి.వి. మహింద్ర వివ రించాడు. తెగ కొన్ని కుటుంబాల సమేతంతో ప్రకృతి శక్తి ఆరా ధనలతో మూఢవిశ్వాసాలతో ప్రకృతి ఒడిలో జీవిస్తారు. "తెగ వారు ఒక ఖచ్చితమైన ప్రదేశంలో కలిగిన ఒక మాండలికాన్ని మాట్లాడుతూ సజాతీయంగా, సాంస్కృతికంగా ఐక్యపరిచే సాంఘిక వ్యవస్థను కలిగి అట్లే ఉపతెగలతో పూర్వీకుల ఆరాధన లతో ప్రత్యేక మత సంస్కృతిని కలిగి ఉంటారు" అని కమలాదేవి ఛటోపాధ్యాయగారు నిర్వచించారు. ఆదిమ తెగల పుట్టు పూర్వోత్తరాలు వాటికి సంబంధించిన పురాతత్త్వ సాక్ష్యాధారాలు స్పష్టమైన పరిజ్ఞానం లభించాల్సిన అవసరం ఉంది. ప్రాచీన శిలాయుగ సాక్ష్యాధారాలు పరిశీలిస్తే ఈ తెగల జీవితాలలో ఒడిదుడుకులు గుర్తించవచ్చు.

## గిరిజనుల లక్షణాలు :

గిరిజనులు ప్రత్యేక వస్త్రాభరణాలతో కనిపిస్తారు. అలాగే వీరికి ప్రత్యేక భాషలు ఉన్నాయి. ఎక్కువ లిపి లేని భాషలే మాట్లాడ తారు. ఒక జాతికి ఒక భాష ఉంటుంది. గిరిజనులు సాధారణంగా నాగరికతకు దూరంగా జీవిస్తారు. ఒక నిర్ణీత ప్రాంతంలో, దట్ట మైన అడవులు మరియు కొండల మధ్య జీవిస్తారు. మూఢ విశ్వాసాలను, నమ్మకాలను కలిగి ఉండటం జరుగుతుంది. నృత్య గాన ప్రియులై ఒక ప్రత్యేక సంస్కృతి, సాంప్రదాయాలను కలిగి ఉంటారు. ప్రత్యేక రాజకీయ, ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంటారు. తమ పూర్వ వారసత్వాన్ని కాపాడుకుంటారు. ప్రత్యేక జీవన విధానం కలిగి ఉంటారు. ఒక్కో జాతికి ఒక్కొక్క రకమైన శారీరక లక్షణాలు కనిపిస్తాయి. ఆహార నియమాలలో కూడా తేడాలు గమనించవచ్చు. తమ పూర్వ వారసత్వాన్ని కాపాడుకుంటూ ఉంటారు. మొత్తంగా గిరిజన సమాజం నాగరిక సమాజానికి భిన్నంగా జీవించడం కనిపిస్తుంది. గిరిజనులు సాధారణంగా నాగరికులకు దూరంగా జీవిస్తారు.

నక్కల గిరిజన తెగ తరతరాలుగా గిరిజనులు ఎక్కువగా చింతలు లేని, ఒక విధంగా ప్రశాంతమైన జీవన విధానానికి అలవాటుపడ్డారు. దీనికి కారణం వారు సమీపంలో ఉన్న అడవుల నుంచి దైనందిన జీవనానికి కావలసిన వస్తువులను సమకూర్చు కోవడమే. రేపు ఎట్లా గడుస్తుంది అని ఆలోచించవలసిన అవసరం ఉండేదికాదు. ఈ విధమైన జీవన విధానాన్ని ప్రత్యేకమైన ఆచారాలతోను, కట్టుబాట్లతోను, నమ్మకాలతోను స్థిరపరచుకున్నారు. ప్రకృతి శక్తులను ప్రార్థిస్తే వాటి కరుణాకటాక్షాల వల్ల తమ అవసరాలు తీరుతాయన్న ఆలోచన వారి జీవన విధానంలో ఒక ముఖ్యమైన అంతర్భాగం. నక్కల తెగ ప్రకాశం, నెల్లూరు, సికింద్రాబాద్ పట్టణ ప్రాంతాల్లో మార్కెట్ సెంటర్లలో చిన్న చిన్న గుడారాలు వేసుకొని ఆడ, మగ అందరూ ఒకే వేషధారణతో (జుట్టు) వేసుకొని, రుద్రాక్షలు, శంఖాలు, పూసలు, నెమిలి ఈకలు, దువ్వెనలు, అద్దాలు వంటివి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు 'కస్తూరి' భాష మాట్లాడతారు.

## నక్కలతెగ వృత్తి :

వీరు పూర్వకాలంనుండి అడవిలో నక్కల్ని వేటాడి వాటిని వండుకుని తినేవారు. కావున వారికి నక్కల వారని పిలుస్తారు. ప్రధాన వృత్తి వేట. పురుషులు అడవిలో దొరికే కొంగలు, కాకులు, పావురాలు, ఉడుతలు వంటి వాటిని వేటాడి వాటిని అమ్ము కుంటారు. స్త్రీలు, పురుషులు

ఉండీలలు, దువ్వెనలు, అద్దాలు, శంఖాలు, రుద్రాక్షలు వంటివి అమ్ముకుంటారు. ప్రస్తుతం వీరు పట్టణ కేంద్రాలలో ఫుట్ పాత్‌పై జీవనం సాగిస్తున్నారు.

అడవే జీవనాధారంగా బ్రతికే గిరిజన ప్రజలు తమ జీవన విధానంలోకి బతకడం కోసం ఆహార అన్వేషణలో ఒక పని అవ లంబించక తప్పదు. అది అడవిలోని జంతువులను వేటాడడం, అది క్రమంగా వేటే జీవనాధారంగా క్రమంగా అదే వృత్తిగా మారడం జరిగింది. తన చుట్టు ఉన్న పరిసరాలు, ప్రకృతిని ఆధారంగా తమ ఆహార అన్వేషణ ప్రారంభించిన గిరిజనులు వేటనే ప్రధానమైన వృత్తిగా తమ ఆహార పోషణలో భాగం చేసుకున్నారు. గిరిజనులు తమ చుట్టువున్న అడవుల్లో, కొండల్లో, గుట్టల్లో, పొదల్లో వున్న జంతువులను వేటాడి తినడంతో పాటు, అడవుల్లోని క్రూర మృగాలనుండి తమను తాము రక్షించుకోవడం కూడా నేర్చుకున్నారు. ఇలా గిరిజనులు వేటాడి తినడానికి కావాల్సి నంత మాంసాన్ని ఉంచుకొని మిగిలిన మాంసాన్ని మారకంగానో, విక్రయించు కోవడం ద్వారానూ వచ్చే అదనపు విలువతో తమ జీవితాలను వెళ్లదీయడం జరిగింది. క్రమంగా జరిగిన ఆధునిక మార్పులలో భాగంగా పక్షులను పెంచడం, పశుపోషణతో పాటు, దారి దోపిడి, వ్యవసాయం, రాజ్య పాలన (గూడెంలను, అడవిని పాలించడం) తదితర మార్పులకు గురయ్యారు.

## నక్కలతెగ వివాహం. సంస్కృతి :

గిరిజనులు విభిన్న సంస్కృతుల మేలు కలయిక. ఒక్కో తెగకు సంస్కృతి ఉంటుంది. సంస్కృతి అంటే జీవన విధానం, ఆట, పాట, వేషం, నృత్యం లాంటివి మాత్రమే కాదు. భాష, సామాజిక వ్యవస్థ, ఆర్థిక విధానాలు, మతం, విద్య, ఆహారపు అలవాట్లు మొదలైనవి కూడా సంస్కృతిలో భాగంగా చెప్పవచ్చు. గిరిజనుల సంస్కృతి ప్రత్యేకంగా ఉంటుంది. నక్కల తెగ పెళ్లి తంతులో పురుషుడే స్త్రీ తల్లిదండ్రులకి డబ్బు ఇవ్వాలి. ఆర్థిక స్థోమతని బట్టి కట్న కానుకలు ఉంటాయి. పురోహితుడు ఉండడు. వీళ్లకు ఫ్లాట్ఫామ్ వేదిక. పెళ్లి వేడుకలు ఉండవు. జిలకర్ర బెల్లం, వేద మంత్రాలు ఉండవు. కుల పెద్దలే పెళ్లి తంతువు నిర్వహిస్తారు. అమ్మాయి మెడలో నల్లపూసల దండ మాత్రం వేస్తారు. ఇదే పెళ్ళి. అబ్బాయి మాత్రం పెళ్ళి ఖర్చు భరాయిస్తాడు. అడవుల్లో ఉంటూ వారి జీవన విధానం, వేష భాషలు, ఆహారపు అలవాట్లు, పెళ్ళిళ్ల మొదలైనవి వారి పురాతనమైన సంస్కృతికి అద్దం పట్టే విధంగా ఉంటాయి. తరతరాల నుండి పునరావృతం అవుతూ కొనసాగుతున్న సామూహికమైన సమ్మతిని పొందే మానసిక స్థితిని "నమ్మకం" అని చెప్పవచ్చు. గిరిజనులలో నమ్మకాలు ఎక్కువగా ప్రాకృతిక శక్తుల నుండి తమను తాము రక్షించుకోవడానికి, తమ సమూహాన్ని కాపాడుకోవడానికి, సులభంగా తమ వేట కొనసాగడానికి, పోడు వ్యవసాయం సాఫీగా సాగడానికి ప్రకృతి శక్తులను తమపై ప్రసన్నం చేసుకోవడానికి ఆ శక్తులను పూజిం చడం, బలి ఇవ్వడం లాంటి విశ్వాసాలు, నమ్మకాలు కలిగి ఉంటారు.

## నక్కలతెగ ఆచారాలు :

మానవుడు తన అవసరాలు తీర్చుకునేందుకు సహజీవనం అలవర్చుకున్నాడు. ఈ సహజీవనానికి చాలా సరళమైన, స్పష్టమైన మార్గం బంధుత్వం. వివాహం, సంతతి ప్రాతిపదికగా కుటుంబం లోని పలువురు సభ్యుల మధ్య ఈ బంధుత్వం ఏర్పడుతుంది. ఈ బంధుత్వాన్ని మజుందార్ (1967) మూడు విధాలుగా వర్గీకరించారు. 1) భార్యాభర్తల మధ్య, 2) తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య, 3) ఒకే తల్లి కడుపున పుట్టిన సంతానం మధ్య ఏర్పడే బంధుత్వం.

ఒక తెగకు, మరో తెగకు మధ్య ఆచార వ్యవహారాల్లో, నిబం ధనల్లో ఉన్న వ్యత్యాసం ఫలితంగా తెగల కుటుంబాల్లో విలక్షణ మైన భిన్నత్వం గోచరిస్తుంది. కుటుంబ సభ్యుల సంఖ్య ప్రాతి పదికగా కుటుంబాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. 1) సరళ లేదా చిన్న కుటుంబం, 2) ఉమ్మడి లేదా పెద్ద కుటుంబం. వీరిలో ఒక మూఢ ఆచారం ఉంది. కుల పంచాయితీల ద్వారానే వీళ్లు కుటుంబాల మధ్య ఘర్షణలు పరిష్కరించుకుంటారు. దేవాలయాల్లో పంచాయితీలు జరిపిస్తారు.

తప్పు నిరూపించుకోవడం కోసం ఎర్రని గునపాన్ని (కాల్చిన) చేతులతో పట్టుకొని పది అడుగులు నడవాలి. ఇలాంటి మూఢ విశ్వాసాలను పూర్వకాలం నుండి వీరు ఆచరిస్తున్నారు.

## నక్కలతెగ మతం, కులదైవం :

అలౌకిక, అతీంద్రియ శక్తుల పట్ల భీతి చెందిన మానవుల ప్రతిస్పందనే మతంగా పలువురు భావిస్తారు. చాలాకాలం వరకు మతం నాగరికతతో పాటు ఉద్భ వించిందని అనుకునేవారు. అయితే ఈ భావన వాస్తవం కాదని టైలర్ (%Tylor%) తిరుగులేని విధంగా రుజువు చేశాడు. నాగరిక సమాజాలుగా చెప్పుకుంటున్న ప్రస్తుత సమాజాలు అనుసరిస్తున్న మత కర్మకాండలకు పెద్దగా భిన్నం కాని విధంగా ఆదిమ సమాజాల్లో కూడా కర్మకాండ ఉం డేదని అతడు నిరూపించాడు. 19వ శతాబ్దం చివరి భాగంలో టైలర్ తన అధ్యయనాల ఫలితాలు ప్రచురిం చిన తర్వాత నరవర్గీ కరణ శాస్త్రవేత్తలెవరూ మత విశ్వా సాలు, కర్మకాండ అనుసరించని ఆదిమ సమాజాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు.

వీళ్ళ కులదైవం అయిన కంచిలో ఉన్న 'మధుర మీనాక్షి'. వీరు సంవత్సరానికి ఒక్కసారి అక్కడకు వెళ్లి కలుసుకుంటారు. అశుభ్రత వలన వీరిని ఎవరు ఏ పనిలో ఉంచుకోరు. అందుకోసం ఎన్నో అవమానాలు పడుతు న్నారు. అయిన అశుభ్రత వారి ఆచారం. తమ సాంస్కృ తిక, ప్రాకృతిక పరిసరాలతో సుఖవంతంగా జీవించడానికి గిరిజనుల మతంలో అనేక విశ్వాసాలు, కర్మకాండలు ఉన్నాయి. ఇవి ఎంతో శోభాయమానంగా ఉంటాయి. నలభయ్యో దశకం వరకూ భారతదేశంలోని గిరిజన మతాలను జనాభా లెక్కల నివేదికలలోనూ, ఇతర సాహిత్యంలోనూ ప్రకృతి ఆరాధన (%Animism%)గా పరిగణించేవారు. ఇక్కడ ప్రక ృతి ఆరాధన అంటే చాలా మొరటైన మతం. ఇందులో మాయాజాలానికి ప్రాము ఖ్యత హెచ్చు. దెయ్యాలూ, భూతాలతో నిండి ఉన్న ఈ ప్రపంచంలో మానవుడు జీవనయాత్ర చేస్తున్నట్లు విశ్వ సించడం మనకు కనిపిస్తుంది.

దేవతలు, ఇతర మానవాతీత శక్తుల ఆగ్రహంవల్ల వివిధ వ్యాధులు కలుగుతాయని గిరిజనులు భావిస్తారు. వివిధ జాతుల వారు గ్రామదేవతలు వారి ఆరోగ్యాన్ని రక్షిస్తాయని నమ్ముతారు. దేవతలు కొన్ని వ్యాధులకు కారకులని భావిస్తారు. ఎల్విన్ అధ్య యనం ప్రకారం సవరజాతిలో పిల్లల వ్యాధులు, అంధత్వం, దగ్గు, రొంప, మతిభ్రమణం, గర్భిణీ స్త్రీల వ్యాధులు, జంతువుల వ్యాధులు వివిధ దేవతల వల్ల సంభవిస్తాయని నమ్మకం. ఈ వ్యాధులన్నీ కూడా సంబంధిత దేవతలను ఆరాధిం చడం ద్వారా లేదా మంత్రగాళ్ల సహాయంతో నివారించ వచ్చునని వారికి గట్టి నమ్మకం. గిరిజన సముదాయాలలో వ్యాధులకు కారకాలను రెండు వర్గాలుగా విభజించవచ్చు. 1) వివిధ అతీత శక్తులవల్ల కలిగేవి, 2) భౌతిక కారణాల వల్ల కలిగేవి.

## ముగింపు :

వివిధ గిరిజన ప్రాంతాలలో చేపట్టబడ్డ పథకాలు, కార్య క్రమాలు గిరిజనుల స్థితిగతులను మార్చడానికి ఉ ద్దేశించబడ్డాయి. వారి పద్ధతులను, అలవాట్లను, జీవన విధానాన్ని మార్చడం అభివ ృద్ధి కార్యక్రమాల ముఖ్యో ద్దేశం. అయితే తరతరాలుగా వస్తున్న పద్ధతులను, ఆచా రాలను విడనాడడానికి నక్కల తెగ గిరిజనులు అంతగా ఉత్సాహం చూపకపోవడం. మార్పులను అంగీకరించ డానికి కావలసిన అనుకూలత వివిధ గిరిజన సమాజా లలో ఒకే రీతిగా ఉండదు. అనాదిగా బయటి ప్రపం చంతో సంబంధం లేకుండా జీవనం గడిపిన గిరిజనులకు భిన్నమైన తెగ నక్కల గిరిజన తెగ.

## ఆధార గ్రంథాలు :

1. వేణు గోపాల్, ఎన్ (అనువాదం): భారత చరిత్ర అధ్యాయానికి ఒక పరిచయం (మూలం). దామోదర్ ధర్మానంద్ కోసంచి. హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

2. ఆచార్య వెంకటరావు పోన్నాడ. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన సమస్యలు-సంక్షేమం. తెలుగు అకాడమీ, హైదరాబాద్. 2002.
3. రంగారెడ్డి, కెచ్చెల: అభివ ృద్ధికి దూరంగా ఆంధ్రప్రదేశ్ గిరిజనులు. సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ, ఖమ్మం జిల్లా కమిటీ. 2004.
4. బాలగోపాల్, కె: ఆదివాసులు వైద్యం సంస్కృతి అణచివేత. పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్. 2015.
5. డా. శాస్త్రి, వి.ఎన్.వి.కె.: అటవీ వాక్కులు ఎండమావులేనా? గిరిజన సంఘం. 2012.
6. క్రిస్టాఫ్ పాన్ ఫ్యూర్ హైమన్‌డార్ఫ్ (అనువాదం): అనంత్ మనుగడ కోసం పోరాటం హైదరాబాద్ బుక్ ట్రస్టు. 2000.
7. ఆచార్య ఐలయ్య షెపర్ట్, కంచ: ఉచిత ఉపాధ్యాయులు. భూమి బుక్ ట్రస్ట్,హైదరాబాద్. 2017
8. త్రినాధరావు, పల్లా: అభివ ృద్ధిలో ఆదివాసీలు! లయ, విశాఖపట్నం. 2004.
9. డా. శాస్త్రి, వి.ఎన్.వి.కె: గిరిజనులు భూమి సమస్య. గిరిజన సంఘం, హైదరాబాద్. 2012.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# డా॥ వి.ఆర్ రాసాని ప్రకృతి వైపరీత్య కథలు – సామాజిక స్పృహ

– యం. రాజన్న, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్, గుంటూరు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రాచుర్యం పొందిన ప్రక్రియ కథ. ఈ కథను కథానిక అని కూడా అంటున్నారు. సమకాలీన సమాజానికి చిత్రిక కడుతుంది కథానిక. ఇందులో ఏదో ఒక అంశం మాత్రమే చిత్రించ బడుతుంది. నవల వలె ఇది విస్తారంగా ఉండదు. తక్కువ పాత్రలతో వచనంలో చెప్పబడుతుంది. పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఈ కథానిక భారతీయ భాషల్లో ముఖ్యంగా తెలుగులో వెడువడుతున్నప్పటికీ, దీనికంటూ ఒక ప్రత్యేక స్థానముంది. ఆ స్థానాన్ని నిలబెట్టినవారు కథకులు. తెలుగులో దాదాపు ఐదువందలమంది వరకు కథకులున్నారు. వారిలో సీనియర్ మరియు సీరియస్ కథకులు యాభైమంది వరకు ఉంటారు. వారిలో అగ్ర గణ్యులు డా॥ రాసాని వెంకటరామయ్య గారు. వీరు సాహిత్య ప్రపంచంలో డా॥ వి.ఆర్. రాసానిగా సుప్ర సిద్ధులు.

డా॥ వి.ఆర్ రాసానిగారు కథలు, కవితలు, నాటకాలు, నాటి కలు, నవలలు రాసారు, రాస్తున్నారు. వీరికలం నుంచి ఇప్పటికే బతుకాట, పరస, చీకటి రాజ్యం, చీకటి ముడులు వంటి నవలలు వెలువడి వీరికి విశేష ఖ్యాతని తెచ్చి పెట్టాయి. కథలు దాదాపుగా వంద రాశారు. కవితలు నాలుగు వందలకు పైగా ఉన్నాయి. వీరు బహుముఖ ప్రజ్ఞావంతులుగా ఖ్యాతి గాంచారు. వీరు రైతులు, వివిధ కులవృత్తి దారులు, గిరిజనులు, ప్రకృతి వైప రీత్యాలు వంటి వాటిని వస్తువుగా తీసుకుని కథలు రాస్తున్నారు. వీరి కథల్లో రాయసీమ మాండలికం స్పష్టంగా కనిపిస్తుంది. అదే విధంగా కథన శైలి సంభాషణ రూపంలో ఉంటుంది. ఒక మాటలో చెప్పాలంటే కథ వస్తువుగా వీరు ఎన్నుకోనట్టి అంశం లేదనుటలో అతిశయోక్తి లేదు. కథానిక శిల్పంలో వీరిది వినూత్న దృక్పథం. దీనికి నిదర్శనంగా వీరి 'మృత్యు క్రీడ' కథలు నిలుస్తున్నాయి. ఈ మృత్యు క్రీడ సంపుటిలో పిశాచికోర, మృత్యు క్రీడ, నిప్పు అనే మూడు కథలున్నాయి. వీటిలో మొదటి రెండూ భూకంప విలయాన్ని, చివరిదైన నిప్పు కథ తగలబడుతున్న అడవుల నేపథ్యంగా రాయ బడ్డాయి.

'పిశాచి కోర కథకు ఒకప్పుడు రష్యాలో జరిగిన భూకంపం నేపథ్యం. అప్పట్లో భూకంపం రష్యాలో సృష్టిం చిన బీభత్స దృశ్యాలు, వివరాలు టి.విల్లో చూసి, పేపర్లలో చదివి చలించి పోయిన రచయిత డా॥ వి.ఆర్ రాసాని ఈ కథ రాశాడు. ఆ రోజుల్లోనే ఆంగ్లంలో స్టెయిన్‌బక్ రాసిన 'ది గ్రేప్స్ ఆఫ్ రాత్' నవలను చదివిన రచయిత, దానిని దృష్టిలో ఉంచుకొని 'ఈ పిశాచికోర' కథ రాశాడు. అమెరికాలో ఒకప్పుడు సంభవించిన ఆర్థికమాంద్యం ఫలి తంగా అతలాకుతలమైన సామాన్యుల జీవితాల గురించి రాసిన నవల అది. 'రెపోనీ కంట్రీలో కరువు సంభవించి, టామ్ రోడ్ కుటుంబం పోషణార్థమై కాలిఫోర్నియాకు వలసపోవడానికి బయలుదేరుతుంది. ఆ కుటుంబ సభ్యు లలో షరన్ అనే గర్భవతి ఉంటుంది. ఆ ప్రయాణంలో నానమ్మ, తాతయ్యలు మరణిస్తారు. ఆ కుటుంబ సభ్యు లైన నోవా, షరన్ భర్తలాంటి వారు వాళ్ళని వదిలేసి వెళ్ళి పోతారు. 'టులారే కంట్రీలో వివరాలడిగినందుకు ఆ కుటుంబ సభ్యుల్లో ఒకడైన జిమ్‌కేసీని' పోలీసులు కమ్యూ నిస్టు అని అరెస్ట్ చేస్తారు. ఆ రాత్రి ఆ వలస క్యాంపుకు ఎవరో నిప్పు పెట్టేస్తారు. మిగిలిన వారితో బాటు ప్రభుత్వ క్యాంపు గుడిసెల్లో తల దాచుకుంటుంది. అక్కడ కూలి గురించి మాట్లాడినందుకు పోలీసొకడు జిమ్ కేసిని చంపే స్తాడు. అదే గుడిసెలో ఒక ముసలివాడు ఆకలితో మర ణించే స్థితిలో ఉంటాడు. నవమాసాలు నిండిన షరన్ అమ్మనాన్నల సాయంతో బిడ్డను కంటుంది. అదే సమ యంలో ఆకలికి తట్టుకోలేక అరుస్తున్న ముసలాడికి బాలింత అయిన షరన్ తన వక్షోజాన్ని అందించి, స్తన్య

మిచ్చి అతని ప్రాణాలను నిలబెడుతుంది. అలాంటి షరన్ పాత్రను, పిశాచికోరల కథలో మరియా పేరుతో రాసాని చిత్రించాడు. మరియ తను చనిపోతూ తన భర్తకు, బిడ్డకూ స్తన్యమిచ్చినట్లు చెప్పాడు.

"సైనికులు మట్టంతా తీసేశారు ... ఒక్క అడుగు భాగం తప్ప. వాళ్ళను గమనించే కాబోలు జాగ్రత్తగా.... ఆ దూలాలను తీయకుండా సిమెంట్ దిమ్మెలు వారిపైన, పడకుండా అతి జాగ్రత్తగా అన్నీ తొలగించారు. ఎంతో కష్టపడి తవ్విన కొండ అడుగు భాగాన కనిపించిన ఎలుకల్లా ....అక్కడ మూడు మానవా కారాలు ...చర్మం కప్పుకున్న అస్థి పంజరాల్లా కనిపించాయి. అక్కడ దుర్వాసన. అందరూ ముక్కులకు చేతులడ్డు పెట్టుకున్నారు. కమాండర్ వారి దగ్గరకు వెళ్ళాడు. మిగిలిన సైనికులు అక్కడికి వెళ్ళారు. ఆదృశ్యం చూసిన వారి గుండెలు కరిగిపోయాయి.

నగ్నంగా ...వెల్లికిలా పడి వున్న మరియా ...ఒక వైపు ఆమె స్తన్యం గ్రోలుతున్నట్లు పోతాపోవ్.. మరో వైపు ఓల్యా" ఉంటారు.

భూకంపం మూలంగా ప్రాణ, ఆస్తి నష్టం ఏ మేర ఉంటుందో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు కథకుడు డా॥ వి.ఆర్ రాసాని గారు.

రెండో కథ మృత్యు క్రీడ. గుజరాత్‌లో 'భుజ్'లో సంభవించిన భూ కంపం పైన రాసిన కథ. భూకంపం వల్ల సంభవించిన బీభత్స దృశ్యాలను, టీ.వి, పేపర్ల ద్వారా తెలుసుకొని బాధా తప్త హృదయంతో రాసిన కథ ఇది. ఆ బీభత్స దృశ్యాలను కథకుడు వి.ఆర్ రాసాని ఇలా దృశ్యీకరించాడు.

"కంటికి కనిపించని ఏ రాక్షసమాయో ఇండ్లనీ, ఇండ్లల్లో వున్న మనుషుల్నీ చేతుల్లోకి తీసికుని, కర్కశంగా నలిపి పొడిచేసి పారేస్తున్నట్లు అనిపించింది.

ఎక్కడ చూసినా మనుషుల ఆర్తనాదాలు, మూలుగులు, అరుపులు, కేకలు. అది భూకంపం పిశాచికోరలు చాచిన స్థలం. భుజ్‌లోని కచ్ ప్రాంతం.

సగం నేలలో కూరుకుపోయి ఒక ప్రక్కకు వంగిపోయి వున్న ఆరంతస్తుల అపార్ట్‌మెంట్ల ముందర జరిగింది. తలచుకొని కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ కూర్చొనున్నాడు నలభయ్యేళ్ళ రామ్‌లాల్.

ఆ భవంతిలో అక్కడక్కడ కప్పు వూడిపడిన సిమెంట్ పెళ్ళలు, కాంక్రీట్ దిమ్మలు, వాటి పైనుంచి పైకి పొడుచుకొనివచ్చి కనిపిస్తున్న ఇనుపచువ్వలు, వాటి మధ్యన దిమ్మల కింద చిందర వందరయిన శరీరాలతో కొన్ని శవాలు. పై అంతస్థులో ఎక్కడో మూలుగులు.

నేల మట్టమయిన ఇళ్ళు మొండి గోడలు. అక్కడొకటి అక్క డొకటి శిథిలావస్థలో అలాగే నిలబడివున్న జనావాసాలు ... ఆ ఇళ్ళ మధ్యనే కొంత దూరంలో సురక్షితంగా ఇంకా అలాగే నిలబడి వున్న నాలుగంతస్తుల భవంతి ... ఎక్కడా నర సంచారమే లేదు" అంటూ ఆ బీభత్స దృశ్యాలను అక్షరీకరించాడు రచయిత డా॥ వి.ఆర్ రాసాని గారు.

శేషాచలం కొండల్లో వున్న ఎర్ర చందనపు చెట్లను కొట్టి దొంగ వ్యాపారం చేస్తున్న స్మగ్లర్ల నేపథ్యంలో వెలువడిన మొట్ట మొదటి కథ 'నిప్పు'. ఇందులో స్మగ్లర్ల కుట్ర ఫలితంగా శేషాచలం కొండలు అగ్ని బారినపడి 'ఏడు కొండలు' దహించుకుపోతున్నాయి. ఆ కొండల్లోని అనేక చెట్లు, జీవరాశులు కాలి బూడిదయిపోవుట వలన ప్రకృతికి చాలా నష్టము వైపరీత్యము జరిగిపోతున్నది.

ఎర్రచందనం దొంగల్లో వచ్చిన కలతల మూలంగా ఒక వర్గం అడవికి నిప్పు పెడుతుంది. దాని మూలంగా అడవంతా కాలిపోతుంది. "అడవికి నిప్పంటుకునింది గదా! ఇట్లా ఎండాకాలంలో ప్రతిసారీ ఎక్కడో దూరంగా చెట్ల కొమ్మలు ఒకదానికొకటి రాసుకోని అంటుకునేది. అరకొరగా అడవిని కాల్చి అదే ఆరిపోయేది. అట్లాంటి మంటలు ఒకదానికొకటి అడవంతా ఎగబడకుండా దేవస్థానమోళ్ళు అడవిలో బాటలు బాటలుగా చెట్లు నరికించి, అవి పాకేదానికి లేకుండా చేసేవోళ్ళు. కానీ ఈసారి ఏం జరిగిందో ఏమోకానీ కనీవినీ ఎరగనంత యిదిగా అగ్గంటుకునింది ఈ పక్క ఆర్పితే ఆపక్క, ఆపక్క ఆర్పితే యింకో పక్క ఎగసెగసి అంటుకొని అడివంతా కాలిపోయింది.

అడవిని కాల్చిన నిప్పు నార్పిన వారు మనుషులు. అడవి చల్లారింది. కానీ నిజమైన నిప్పు మనిషి గుండెల్లో వున్న స్వార్థం. అవినీతే గదా! దాన్ని మనుషులు ఆర్ప గలరా? మనిషి పెట్టిన నిప్పు ఈ కొండలో కొంత భాగానే కాల్చగలిగింది. కానీ మనిషిలో ఉండే అవినీతి నిప్పే ఎప్పుడో ఒకప్పుడు ఈలోకాన్నే కాల్చేస్తుంది అంటాడు కథకుడు డా॥ వి.ఆర్ రాసాని. ఈ కథలో మనిషి మనస్త త్వాన్ని రచయిత ప్రకృతి వైపరీత్యంతో ముడిపెట్టి అద్భు తంగా చిత్రించాడు.

ప్రకృతికి మనిషికీ ఒక హార్మోని ఉంటుంది. ఈ విషయాన్నే MC Conkey మరో రకంగా వ్యక్తం చేస్తాడు. ఆయన మాటలు ఇలా ఉన్నాయి. 'Harmony between man and nature may be gained at same time in the future and perhaps once more there will be a reconcialation of sun and unseen world expansion' (The Novels of Em Forster - Page 94) అంటాడు.

ఈ ప్రకృతికీ, వాతావరణానికీ అవినాభావ సంబంధం ఉం టుంది. వీటి మధ్య ఒక సమతుల్యత ఉంటుంది. ఈ సమ తుల్యతలో వ్యత్యాసం వస్తేనే ప్రకృతి వైపరీత్యం సంభవిస్తుంది. అయితే సమతుల్యత దెబ్బతినడానికి రోజు రోజుకీ వాతావరణ కాలుష్యాన్ని పెంచేస్తున్న మాన వుల అనౌచిత కార్యక్రమాలు కూడా ఎక్కువ కారణం కావచ్చు. ఈ సమతుల్యతను ధ్వంసం చేసే వైపరీత్యాలు మరెన్నో కనిపించి, కనిపించని అంశాలు కూడా కారణం కావచ్చు. వాటిలో ప్రధానమైనది మనిషి కుట్ర. మనిషి తన కుట్రతో అడవికి నిప్పు పెడుతున్నాడు దానివల్ల ఎంత నష్టం జరిగుతున్నదో తెలిసి కూడా గుర్తించ లేకున్నాడు మనిషి కుట్రవల్ల వందలాది సంవత్సరాలు జీవించిన చెట్లు క్షణంలో బూడిదైపోతున్నాయి. అదే విధంగా ఇంకా ఎంతో జీవ జంతు జాలాన్ని కోల్పో తున్నాము. ఇప్పటికైనా మనుషుల్లో పరివర్తన రావా లని ప్రకృతిని పరిరక్షించుకోవాలని కథకుడు డా॥ వి.ఆర్ రాసాని తన కథల్లో చక్కగా చిత్రించాడు.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# బాలసాహిత్యం - ఆధునిక పోకడలు

- డా॥ పి. ఉష, తెలుగు శాఖాధ్యక్షులు, మారిస్ స్టెల్లా కాలేజి, విజయవాడ.

మనిషి మనీషిగా ఎదగటానికి పునాది బాల్యదశలోనే పడు తుంది. తల్లి చెప్పిన వీరగాథల్ని విన్న బాలశివాజీ వీరశివాజీ అయ్యాడు. శ్రీమహావిష్ణువు కథలు విన్న అన్నమయ్య సంకీర్తనా చార్యుడు అయ్యాడు. అందుకే పసితనంలో నేర్చుకునేదీ, నేర్పించేదీ జీవితం వసి వాడి పోయేదాకా మనతో ఉంటుందని పెద్దలు అంటుంటారు. ఈ ఆశయం సాకారం కావాలంటే బాలల్ని చిరుత ప్రాయం నుంచే సాహిత్యపఠనం వైపు చక్కని అభిరుచి పెంచు కునేలా ప్రోత్సహించాలి.

ఓ పదిహేనేళ్ళ క్రితం కూడా పసికూనలు అమ్మ ఒడి ఉయ్యాలలో చేరి, గారాంగా ఊగుతూ, వచ్చీరాని మాట లతో "తాలంగం తాలంగం తాన్దన కిత్నా తాలంగం" అంటుండేవారు. అమ్మ ఒడి, అందులో బాలుడు, ముద్దుమాటలు... వింటుం టూనే ఓ మనోహర దృశ్యం మనోనేత్రంలో లీలగా కనిపిస్తుంది. ఒకప్పుడు బాలగేయా లను ఇళ్ళలోను, బళ్ళలోను పిల్లలకు నేర్పేవారు. అమ్మ వంట-ఇంటి పనులను చేసుకుంటూ కూడా, ఏ గుడికో వెళ్తూ కూడా, తన పిల్లలకి వారు చెప్పగలిగినన్ని బాల గేయాలను చిన్న చిన్న పద్యాలను నేర్పించేది. పిల్లలు తమ చిట్టి చిట్టి నోళ్ళతో చిలకల్లా వాటిని పలికేవారు. ప్రతి సందర్భానికి మన పూర్వులు ఏదో ఒక బాలగేయాన్ని చెప్పారు. కొన్ని తరాల పాటు బాలల్ని (పెద్దల్ని కూడా) అలరించిన బాలగేయాలు ఇప్పుడు ఎక్కడా విని (కని) పించటం లేదు.

పిల్లలకు మాటలు రాక ముందు నుండే అమ్మ గొంతును గుర్తించటం, విన్నదాన్ని జ్ఞాపకం ఉంచుకోవటం పిల్లల నైజం. అందుకే చిన్న చిన్న అభినయాలతో కాళ్ళు, చేతులు, కీళ్ళు కదిలిస్తూ ఆ కదలికలలో కమ్మని కంఠ స్వరంతో అమ్మ వినిపించే బాలగేయాలు పిల్లలకు ఆనం దాన్నిస్తుంది. వినికిడి శక్తిని, అవ గాహనను వారిలో పెంచు తుంది. ఆ ఏకాగ్రతే వారికి బడిలో ఉపయోగపడుతుంది. అంతేకాదు అవి పిల్లలలో ఉత్సాహాన్ని కలిగిస్తాయి. బాల సాహిత్యంలోని మరో కోణం ఏమిటంటే... మనకు వయసు వచ్చినా మదిలోని బాల్యపు మధురస్మృతులు చెరిగిపోకుండా చేస్తుంది.

బాలసాహిత్యంలో మరో కోణం - మాతృభాషా పరి రక్షణ. ఆంధ్రదేశంలో పుట్టి, దరఖాస్తుల్లో మాతృభాష తెలుగు అని రాసే బాలల్లో 80 శాతం మందికి పూర్తిగా తెలుగు రాయటం, చదవటం రావు. ఇందుకు కారణం ఎవరు ? అని చర్చించటం కన్నా పరి ష్కారం ఆలోచించి, ఆచరణలోకి తీసుకురావటం అత్యంత అవసరం. వ్యక్తి ఆలోచనలు, సృజనాత్మకత వికసించేది మాతృ భాషలోనే అనే విషయం అందరికీ తెలిసిన విషయమే. మాతృ భాషలో సాధికారత వస్తే మిగిలిన భాషల్ని ఎంతో తేలికగా నేర్చు కోవచ్చని ఎన్నో పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. ఇలా, మాతృ భాషాభిమానం బాలల్లో కలిగించటానికి కూడా బాలసాహిత్యం ఎంతో అవసరం.

అతి ప్రాథమిక స్థాయిలోనే బాలల్ని తెలుగుకి దూరం చేయడంతో 'చందమామ' లాంటి పిల్లల పత్రికలూ కను మరుగైపోతున్నాయి. కంప్యూటర్ విప్లవాలు, ఎలక్ట్రానిక్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందని గతకాలంలో చిన్నారు లకు సమాజాన్ని పరిచయం చేసింది. జ్ఞానాన్ని కలిగిం చింది బాల సాహిత్య పత్రికలే! బాల, చిన్నారిలోకం, చంద మామ, బాలజ్యోతి, బాలమిత్ర, బాల భారతి, బొమ్మ రిల్లు, బుజ్జాయి... లాంటి పత్రికలు బాలల ప్రపం చాన్ని అందమైన అనుభూతులతో నింపాయి. చిట్టిచిట్టి విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలు - మ్యాజిక్ చేయడం, ఏకాంకికలు ప్రదర్శించడం... లాంటి సానుకూలఫలితాలు కలిగాయి. బాలసాహిత్య పుస్తకం మార్కెట్‌లోకి వచ్చిందంటేనే ఎంతో సందడిగా ఉండేది. తలా ఒక పుస్తకం కొని వాటిని

మార్చుకుని చదవడం ఇప్పటికీ ఎవరూ మర్చిపోలేనివి. ఈ మార్పిడితోనే ఒకే అభిరుచి ఉన్నవారు స్నేహితులుగా మారడం జరిగేది.

హితాన్ని కోరేదే సాహిత్యం. అందులోనూ బాలల కోసం రాసిందే బాలసాహిత్యం. సరళంగా ఉండి, ఎంతో ఆహ్లాద కరమైన అంశాలతో కూడి మనకు నీతిని బోధిస్తుందది. చిత్రవిచిత్రాలు, ప్రకృతి వర్ణనలు, రాజ్యాలు-యుద్ధాలు, సాహసాలు, హాస్యం... ఇలా ప్రతి అంశమూ మనల్ని ఆలోచింపజేస్తుంది, రంజింప జేస్తుంది. 'కవిసామ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు కూడా ఓ ఇంటర్వ్యూలో 'పిల్లలేం ఖర్మ, చందమామ మేము కూడా చదువు తున్నాం' అన్నారు. ఇదీ బాలసాహిత్యం గొప్పతనం.

తెలుగులో బాలసాహిత్యం విరివిగా రావాలి. కామిక్స్ దగ్గర నుంచి ఆంగ్లంలో చదివించే సంస్కృతి పోవాలి. భాషపట్ల పిల్లల్లో మక్కువ పెంచాలి. ఈ పనిని బాల సాహిత్యమే చేయగలదు. చిన్నప్పుడు చదివిన బాల సాహిత్యం భాష పట్ల మక్కువ పెంచుతుంది. ఆ మక్కు వతో పెద్దయిన తర్వాత సాహిత్యమథనం చేయగలరు. మంచి పాఠకులో, సాహితీవేత్తలో కాగలరు. మన వ్యక్తి త్వాన్ని పెంచుకోవడానికి, మృగ్యమైపోతున్న విలువల్ని పెంపొందించుకోవడానికి, చుట్టూ ఉన్న సమాజం గురించి తెలుసు కోవటానికి, మనిషిలో సున్నితత్వం పెంచటానికి సాహిత్యం ఎంత గానో తోడ్పడుతుంది. సమాజాన్ని బాగు పరచడానికి అక్షరాన్ని మించిన ఆయుధం లేదు.

ఎంత చెప్పుకున్నా బాలసాహిత్యం గొప్పతనం తనివి తీరేది కాదు. కానీ, వర్తమాన సమాజంలో, సాహిత్యంలో బాలసాహిత్యం ఏ స్థాయిలో వస్తోంది? చెప్పుకున్నంత గొప్పగా సమాజాన్ని ప్రభావితం చేస్తోందా? అంటే వెంటనే సమాధానం చెప్పలేని పరిస్థితి ఉంది. ఇబ్బందికరమే అయినా వాస్తవాన్ని ఒప్పుకోక తప్పనిసరి పరిస్థితి ఉంది.

**ఉపశీర్షికలు :**

1. బాలసాహితీవేత్తలు - రచనలు - స్ఫూర్తి
2. బాలసాహిత్యం - అనువాదాలు - సమస్యలు
3. బాల రచయితలు, రచయిత్రులు - రచనలు - నేపథ్యాలు, ఇతివృత్తాలు
4. బాలసాహిత్యం - ముద్రాపకులు - సమస్యలు - సవాళ్ళు
5. బాలసాహిత్యం - సమకాలీనత
6. బాలసాహిత్యం - సాహిత్య సంస్థలు, ప్రభుత్వ శాఖలు
7. పాఠశాల విద్య - బాలసాహిత్యం

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# అర్నాద్ సత్య నవల - సమీక్ష

- డా॥ పప్పల వెంకటరమణ, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆమదాలవలస, శ్రీకాకుళం జిల్లా.

ప్రసిద్ధ కథా మరియు నవలా రచయితగా పేరొందిన దుంప హరనాదరెడ్డి 1946 జూలై 1వతేదిన దుంప అప్పారావు, అప్పలనర్సమ్మ దంపతుల ప్రథమ సంతానముగా జన్మించిరి. వీరి వంశీయుల నివాసం తూర్పుగోదావరి జిల్లా, రాజ మహేంద్రవరం. ఉద్యోగరీత్యా విశాఖ పట్నంలో స్థిరపడిరి. బి.హెచ్.పి.వి. ప్రభుత్వ రంగ సంస్థలో జూనియర్ ఇంజనీరుగా పనిచేసి పదవీవిరమణ పొందిరి. ప్రసిద్ధ రచయితలైన రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీ పట్నం రామారావు ప్రభావంతో రచనా రంగంపై దృష్టి పెట్టిరి. 'అర్నాద్' అనే కలం పేరుతో సుమారు 60కథలు మరియు నాల్గు నవలలను రాసి కథా, నవలా రచయితగా తెలుగు సాహితీ రంగమునందు సుస్థిర స్థానమును సంపాదించిరి.

అర్నాద్‌గారి కలం నుండి జాలువారిన నాలుగో ఆణి ముత్యం వంటి నవల సత్య. నవల పేరును ప్రధానపాత్ర అయిన సత్య పేరుతోనే నవల వెలువడింది. ఈ నవల అర్నాద్‌గారికి మంచి పేరు ప్రతిష్టలను తెచ్చిపెట్టింది.

కృష్ణారావు ఒక వింతమనిషి. ఎప్పుడు ఏమని పిలుస్తాడో, ఏ విధంగా ఆదరిస్తాడో, ఆక్షణం వరకు భార్య సత్యకు కూడా తెలి యదు. క్రమక్రమంగా తెలిసింది. అతనొక నరరూప రాక్షసుడని, మానవరూపంలో ఉన్న మృగమని, అనుమానపు జబ్బు ఎక్కువని చివరకు పుట్టింటి వారితో కూడా తెగతెంపులు చేయించినంతటి క్రూరుడని తెలిసింది. కృష్ణారావు శృంగారంలో కూడా రాక్షసా నందాన్ని పొందేవాడు. సిగరెట్ కాల్చే అలవాటు లేనప్పటికి సిగ రెట్‌తో సత్య శరీరమంతా వాతలు పెట్టి, చివరకు పాశవికంగా మర్మాంగంపై కూడా సిగరెట్ కాల్చి వాతలు పెట్టిన కామపిశాచి. మాటల్లో వర్ణించలేని దుర్మార్గుడు, పచ్చిత్రాగుబోతు.

సత్యకు చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. తండ్రి వేరొక పెళ్ళి చేసుకున్నాడు. అయినా తండ్రి బాగానే చూచుకునేవాడు. తమ్ముడు, చెల్లెలు మారటి వారైనప్పటికి సత్యను బాగానే చూచు కొనేవారు. పినతల్లి మాత్రం పెద్దగా ఆదరించేదికాదు. తండ్రి మంచి సంబంధమని, ఉద్యోగం చేస్తున్నాడని, మధ్యవర్తుల అబద్ధపు మాటలు నమ్మి, సత్య అనుమతి లేకుండా కృష్ణారావుతో వివాహం జరిపించారు. తరువాత కృష్ణారావు నిజస్వరూపం బయటిపడినా జరగవలసిన అన్యాయం జరిగిపోయింది. కూతు రున్ని చూడ్డానికి వెళ్ళినా వారితో గొడవపడి గుమ్మం ఎక్కకుండా తండ్రిని కూడా కట్టడి చేశాడు. అతడు ఒక మూర్ఖుడని తెలిసినప్పటికి చేసేది లేక సర్దుకుపోతుంది. పడక గదిలో ఆమెకు ప్రతిరాత్రి నరకం చూపిస్తాడు. భార్యపై అనుమానం ఎక్కువ. బంధువుల్ని కూడా ఇంటికి రానివ్వడు, ఉత్తరాలు తెచ్చే పోస్టు మేన్‌ని కూడా తన ఇంటికి రావద్దని వార్నింగ్ ఇస్తాడు.

కృష్ణారావు పెట్టే బాధలు తట్టుకోలేక సత్య ఒకసారి ఆత్మ హత్యకు ప్రయత్నించినపుడు తాను తల్లినయ్యానని తెలుసు కుంది. సత్య తాతయ్య నరసింహం, అమ్మమ్మ చూడ్డానికి వస్తే కృష్ణారావు వారిని అవమానించి పంపుతాడు. సత్య తల్లి కాబోతుం దని తెలుసుకున్న చిన్నారావు, సూరమ్మలు సత్య ఇంటికి వస్తారు. సత్య వైవాహిక జీవితం తెలుసుకొని బాధపడతారు. సత్యకు కాన్పు సమయంలో పక్కింటి రామాయమ్మ సాయం చేస్తుంది. ఆమె ప్రోత్సాహంతో బారసాల కూడా సత్య చేయిస్తుంది. ఆ బారసాల రాత్రే సత్యను కిరాతకంగా కృష్ణారావు అనుభవిస్తాడు. విపరీతమైన రక్తస్రావం జరిగి పసిబిడ్డతో సహా ఇళ్ళంతా రక్తపు మరకలే. విషయం తెలుసుకున్న పక్కింటి రామాయమ్మ కృష్ణారావును నిలబెట్టి పశువువా,మనిషివా అని గద్దించెను. సత్యను పెద్దాసుపత్రికి తీసుకెళ్ళి వైద్యం చేయించింది.

హింసించే భర్తకు దూరంగా ఎక్కడికో బిడ్డతో సహా వెళ్ళిపోవాలనుకున్న సత్యకు అకస్మాత్తుగా పిడుగువంటి వార్త తెలిసింది. భర్త కృష్ణారావు తను పని చేస్తున్న కంపెనీలో ప్రమాద వశాత్తు బ్రాయిలర్ పై నుండి క్రిందపడి మరణించాడని తెలిసింది. కృష్ణారావు మధ్యానికి బానిస, విధులకు కూడా త్రాగి వెళ్ళేవాడు. భద్రతకు సంబందించి యాజమాన్యం నిర్లక్ష్యంవల్లే ఒక మంచి కార్మికుల్ని కోల్పోయామని కార్మికులు క్రోధోద్రిక్తులై అక్కడనుంచి కదల్లేదు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రక రకాల యూనియన్ నాయకులు కృష్ణారావు మృతిపై సానుభూతి తెలియజేయడానికి సత్య ఇంటికొచ్చారు. కృష్ణారావు కుటుంబానికి న్యాయం చేయమని కార్మిక సోదరులందరూ ఏక తాటిపైకొచ్చి న్యాయం కోసం పోరాటం చేసి విజయం సాధించారు.

కృష్ణారావు మృతిపై ఎంక్వైరీ ఏర్పాటుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించింది. కార్మికులు కోరినట్లుగానే నిష్పాక్షితకు మారు పేరైన ప్రొడక్షన్ డిపార్టమెంటులో మేనేజరైన స్వామిని ఎంక్వైరీ ఆఫీసర్‌గా కంపెనీ నియమించింది. స్వామి అధికారి అయినప్పటికీ యాజమాన్యపు తొత్తు కాదు. కార్మిక పక్షపాతి. నిజాయితీ గలవాడని స్వామిపై కార్మికుల అభిప్రాయం. ఎంక్వైరీ ఆఫీసర్ ఎవరో కాదు సత్యను కూతురుగా చూసుకుంటున్న పక్కింటి రామాయమ్మ మేనల్లుడు.

మరోవైపు కృష్ణారావు మరణంతో కంపెనీ ఇచ్చే ఉద్యోగం కోసం సత్య పుట్టింటి వారు, మెట్టింటి వారు తమకే ఉద్యోగం చెందాలని వారి వారి ప్రయత్నాల్లో ఉన్నారు. మామయ్య ఆదిమూర్తి నీ మరిది సూర్యానికి ఉద్యోగం ఇమ్మని సత్యను బెదిరించేవాడు. సత్య పినతల్లి సూరమ్మ అల్లుడు కృష్ణారావు మరణించి నపుడు రాలేదు కాని కొడుకు చంద్రంకు ఉద్యోగం ఇప్పించమని మొసలి కన్నీరు కార్చడానికి వచ్చింది. రామాయమ్మ పరిస్థితుల్ని గ్రహించి సత్యకు హితబోధ చేసి ఉద్యోగం చేయడానికి సత్యను మానసికంగా సిద్ధం చేసింది.

కంపెనీ యూనియన్ సెక్రెటరీ అప్పలరాజు సూర్యంకు ఉద్యోగం ఇప్పించే ప్రయత్నంలో భాగంగా సత్య ఇంటికెళ్ళాడు. ఆమె అందచందాలు అతనిని కట్టిపడేశాయి. ఇతనికి వ్యసనాలు లేవు కాని నర్తనశాల సినిమాలో కీచకుని వంటివాడు. ఆమెకు ఉద్యోగమిప్పించి సత్యను పర్మినెంటుగా ఉంచుకోడానికి ప్రణాళికలు వేస్తుంటాడు. ఈ విషయం సత్య గ్రహించినప్పటికి రాములమ్మ సలహా వల్ల ఉద్యోగం వచ్చేవరకు సహించింది అప్పలరాజు సత్య ఇంట్లో బంధువులతో మీటింగ్ పెట్టి సత్య మెప్పును పొందడానికి ఉపన్యాసమిచ్చి, ధర్మం ప్రకారం సత్యకే ఉద్యోగం చెందాలని తన మాయా నిర్ణయాన్ని ప్రకటించాడు. బంధువులందరూ ఉద్యోగ ప్రయత్నాలు మాని ఎవరింటికి వారు వెళ్ళిపోయారు. రామాయమ్మ అపార విషయ పరిజ్ఞానం వల్ల, భగవంతుని దయవల్ల సత్యకు ఉద్యోగం వచ్చింది. కృష్ణారావు మరణం తరువాత వచ్చిన పి.ఎఫ్., గ్రాట్యుటీ వగైరావన్నీ ఇంట్లో వస్తువులతో సహా మామ ఆదిమూర్తికి ఇచ్చేసి ఏలూరు పంపేసింది.

సత్య ఉద్యోగంలో చేరితే చంటి కూతురు శిరీషను ఎవరు చూసుకుంటారనే ఆలోచనలో వుండగా ఆపద్బాంధవురాలైన రామాయమ్మ అభయహస్తమిచ్చింది. ఆమె రుణం ఎలా తీర్చుకోగలననుకుంది సత్య. "రామాయమ్మ తనకు గోదావరీ నదీమతల్లి, గలగల పారుతూ అమృత జీవధారతో తన నిస్సార బ్రతుకుపై ప్రేమగా ప్రవహించి ఒక మాగాణి భూమి వలె మార్చిన దయగల మహాతల్లి, ఆ తల్లి లేకుంటే తను లేదు, శరీష పుట్టదు, ఉద్యోగం దొరకదు గ్రద్దలు తన్నుకుపోయేవి".17

కంపెనీ ఉద్యోగంలో జాయిన్ కాడానికి రామాయమ్మ మేనల్లుడు స్వామి స్కూటర్‌పై వెళ్ళింది. సత్యకు లోయర్ డివిజన్ క్లర్క్ ఉద్యోగమిచ్చారు. కొత్త ఉద్యోగాన్ని సవాల్‌గా తీసుకొని కాలం తెలియనిరీతిలో రోజులు గడిచిపోతున్నాయి. అప్పుడే ఉద్యోగంలో చేరి ఆరు నెలలైంది. సత్యకు ఉద్యోగంలో టైపు మిషన్ పెట్టే బాధలు కంటే తోటి ఉద్యోగుల వెకిలి చేష్టలు, ఆకలి చూపులు,

లైంగిక చూపులు బాధించేవి. వీరు మనుషులు కాదు పశువులు అనుకునేది. వీళ్ల చూపుల అత్యాచారం కన్నా భర్త కృష్ణారావు శాడిజం వందరెట్లు నయమని ఆ సమయంలో అన్పిస్తుంది.

సత్య చల్లని పాపని ఒళ్ళో పెట్టుకొని, అనురాగం ఆప్యాయతలు పంచే రామాయమ్మ కుటుంబం అండదండలతో ఉద్యోగం చేసుకొని హాయిగా రోజులు గడిపేస్తుంది. ఇంతవరకూ కన్పించని జనరల్ సెక్రటరీ అప్పలరాజు వేధింపులు సత్యకు కొత్తగా మొదలయ్యాయి. ఒకరోజు ఇంటికొచ్చి శారీరక కోర్కెలు తీర్చమని, అర్ధరాత్రి వస్తానని చెప్పి వార్నింగ్ ఇచ్చి వెళ్ళాడు. ఈ విషయం స్వామి దంపతులతో చర్చించి ప్రణాళిక రచించింది. అప్పలరాజు వస్తానన్న సమయానికి సత్యకు బదులు అరవై ఏళ్ళ రామాయమ్మ ఆ ఇంట్లో వుంది. నిర్ణీత సమయానికి సత్య ఇంటికొచ్చిన అప్పలరాజును ఇరుగు పొరుగు సహాయంతో చిదగ్గొట్టారు. మరుసటి రోజు అప్పలరాజు వ్యతిరేక వర్గం వారు ఈ విషయం తెలిసి పేపర్లలో ప్రకటనలు వేయించారు “ ‘అభినవ కీచకుడు’. ‘కీచకుడిని కుళ్ళబుడిచిన ఆడ భీముడు’, ‘అరవై సంవత్సారాల వృద్ధురాలిపై అత్యాచారయత్నం”18’ కొత్త కొత్త శీర్షికలతో అప్పలరాజుకు వ్యతిరేకంగా కథనాలు వచ్చాయి. ఈ విషయంలో స్వామి స్నేహితుడు జర్నలిస్ట్ గోపాలం మరింత సహాయం చేశాడు. చివరకు అప్పలరాజు జనరల్ సెక్రటరీ పదవి పోగొట్టుకొన్నాడు. అధికారులకు లంచాలిచ్చి తిరిగి ఉద్యోగం సంపాదించుకొన్నారు.

సత్య కంపెనీ క్వార్టర్స్‌లోకి మకాం మార్చింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కాలం గడిచిపోతుంది. కొన్నాళ్ళకు స్వామి మరియు సత్యల మధ్య అక్రమ సంబంధముందని కరపత్రాలు ప్రచురించి కాలనీ అంతా పంచిపెట్టారు. మరోసారి భాష మార్చి అసత్య పదజాలంతో దూషిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. ఈ పని చేస్తున్నదంతా ఎవరని సత్య తర్జనభర్జన పడింది. సోదరుల పేరుతో ఉత్తరాలు రాసి వార్నింగ్‌లు ఇచ్చేదెవరని ఆలోచించింది. పచ్చిబూతులతో చదవడానికి అసహ్యమనిపించే ఈ ఉత్తరాలను తీసుకెళ్ళి స్వామి భార్య పద్మకు చూపించింది. పద్మ తేలికగ్గా తీసుకొని మనం భయపడితే అవతలివారు ఇంకా భయ పెడతారని, ఇలాంటివి పిరికివారు, మానసిక రోగులు రాసే ఉత్తరాలని చించి పారేయాలిగాని ఆలోచించి బుర్ర పాడు చేసుకోకూడదని పద్మ సలహాతో సత్య మనసు కుదుటపడింది.

ఓసారి సత్యను, వారి పాప శిరీషను రాత్రి అయిపోయిందని స్వామి వారిని ఇంటికి దీబెట్టెను. శిరీష కోరికతో స్కూటర్ బొమ్మ చూడ్డానికి లోనికి వెళ్ళెను. ఎవరో గిట్టనివారు, మారుపేర్లతో ఉత్తరాలు రాసేవారు బయట గడియపెట్టి కాలనీవాసులందర్నీ ఆ రాత్రి పిలిచి సత్య స్వామీల బండారం బయటపెట్టాలని ఇలాంటి పని చేశారు. కాలనీ పెద్ద అయిన అచ్చిరెడ్డిని కూడా పిలిచి చూపించారు. అచ్చిరెడ్డికి కూడా సత్యకు రాసే ఉత్తరాల వంటివే రాసి కాలనీ పరువు నిలపమని దొంగ ఉత్తరాలు రాశారు. ముల్లాల పేరుతో ముఖం మీద అడిగే ధైర్యంలేని సన్నాసులకు ఇదొక ఆనందమని సత్య అనుకొంది.

సత్యను కూర్చోబెట్టి ఒక విషయం అడుగుతున్నాను నిజం చెప్పమని పద్మ అడిగింది. కాకి వెదవలు మాటను నమ్మను, మొగుడు మాటలు అసలు నమ్మను, రాత్రి స్వామి ఇంటికి వచ్చాడా అని అడిగింది. వెంటనే సత్య కూతురు తల్లికి అవకాశం ఇవ్వకుండా పెద్దనాన్న రాత్రి ఇంటికొచ్చాడని, పెద్దమ్మ అడిగినా రాలేదని చెప్పమన్నాడని పసిపిల్ల శిరీష చెప్పగా పద్మకు ఎక్కడా లేని కోపం వచ్చింది. సత్య చెంపపై అయిదేళ్ళు అంటుకుపోయేలా కొట్టింది. ఊహించని పరిణామానికి సత్య నిర్ఘాంతపోయింది. సత్య మాట్లాడుతున్నా నీ మొహం చూపించకు, నా గుమ్మం తొక్కకు, నా జోలికి, నా మొగుడి జోలికి రావద్దని సత్యను బయటకు గెంటేసింది. సత్య కళ్ళు బైర్లు కమ్మినట్లయ్యాయి. సత్య చుట్టూ చీకటి, ప్రపంచమంతా చీకటి, శపింపబడినదానిలా అయిపోయింది. ఇప్పటివరకు అలరించిన అందమైన సాయం సంధ్య మరుగై చీకటి తెరలు అలముకున్నాయి. కూతురుతో కూడి ఇంటికెళ్ళిపోయింది. కూతురు కలుగజేసు

కున్నందుకు కొట్టి తరువాత బాధపడింది. సత్యకు ఒంటరిగా ఉన్నప్పుడు నేస్తమైన పుస్తకం చదువుకొని మనశ్శాంతి పొందింది.

ఒకరోజు రాత్రి సత్య ఇంటికి ఆరోజు ఎందుకు వెళ్ళావని భర్తను పద్మ అడిగింది. జరిగిన విషయం అంతా పూసగుచ్చినట్లు పద్మకు చెప్పాడు. తన మిత్రుడు పిలవగా మందు కొట్టడానికి రాఘవరావు ఇంటికి వెళ్ళాను. స్వామితో ఫుల్‌గా మందు త్రాగించి, నీ ఫ్రెండ్ సత్య ఇంటికి వెళ్ళి ఆమెకు బర్త్‌డే విషెస్ చెప్పి, కేక్ కట్ చేయించి తరువాత నీ ఇష్టమొచ్చింది చేసుకొమ్మని బలవంతంగా సత్య ఇంటికి ఆరాత్రి రాఘవరావు పంపించాడు. సూర్యుని వెంబడించిన నీడలా స్వామి వెనకాలే బయలుదేరి వెళ్ళి, సత్య ఇంట్లోకి స్మామి వెళ్ళిన వెంటనే రాఘవరావు తన ఇంటికి వచ్చి పద్మకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పాడు. అప్పుడు ఫోన్ చేసిన కాకి వెదవ రాఘవరావేనని తెలుస్తుంది. వాస్తవంగా స్వామికి లేని కోరికలు కల్గించి, మందుకు బానిసను చేయించి, చెడు తిరుగుళ్లకు ప్రోత్సహించింది అతని స్నేహితుడు రాఘవరావేనని తెలిసింది.

సత్య ఇంటికి వెళ్ళే ముందు స్వామికి రకరకాలుగా నచ్చచెప్పి, సత్య నిన్ను కోరుకుంటుందని, నిన్ను చూసిన తరువాత వేరొకరిని పెళ్ళి చేసుకోడానికి నిరాకరిస్తుందని, రకరకాల కల్పనలతో కథను అల్లి సత్యపై సెక్స్‌నకు మానసికంగా స్వామిని సిద్ధం చేశాడు. సెక్స్ కోరికతో వచ్చిన సత్యను సంతృప్తిపర్చుట నీ ధర్మమని, లేకపోతే స్త్రీ శాపం నీకు తగులుతుందని చెప్పి వెనుక నుండి రాఘవరావు గోతులు తీశాడు.

అర్ధరాత్రి తన ఇంటికి వచ్చిన స్వామిని చూసి సత్య నివ్వెర పోయింది. రాత్రి పన్నెండు గంటల తర్వాత నీ పుట్టినరోజు వచ్చేస్తుందని ఆ రాత్రే కేక్ కోయించి మత్తులోనే పుట్టినరోజు జరిపించాడు. అక్క పద్మతో పాటు ఉదయం రావలసిందని సత్య అనగా, అర్ధరాత్రి అక్కతో కూడి రాకూడదని తన కోరికను బయటపెట్టాడు. సత్య ఎప్పుడూ స్వామిలో చూడని శృంగార దాహాన్ని చూచి చనిపోయిన భర్త కృష్ణారావు గుర్తుకొచ్చాడు. మగవాళ్ళంతా ఇలాంటి పశువులేనని, చనువుగా వున్నానని, సహాయం చేసి ఆదుకున్నాడని, తన కుటుంబీకునివలె అభి మానించానని, తప్పుగా అర్థం చేసుకున్నాడని బాధపడింది. తీవ్రమైన సెక్స్ కోరికతో సత్య మీద పడబోతుండగా బలంగా గుండె లపై ఒక తన్ను తన్ని స్వామిని క్రిందికి తోసేసింది.

సత్యను తన అందచందాల్ని ఓసారి చూపించమని స్వామి ప్రాధేయపడ్డాడు. చేసిన మేలు మర్చిపోయావని సత్యకు గుర్తు చేశాడు. సత్య ఏడుస్తూ నీవు నన్ను నగ్నంగా చూడకూడదని, చూస్తే తట్టుకోలేవని చెప్పినను స్వామి విన్పించుకోలేదు. నీవు నా భాహ్య సౌందర్యాన్ని చూసి మోహిస్తున్నావని, నిజం తెలిస్తే నన్ను కోరుకోవని చెప్పి చీరను మోకాళ్ళ పిక్కల వరకు పైకెత్తి చూపించగా స్వామి ఖిన్నుడై నోటి మాటరాక మిన్నకుండెను. చేసిన తప్పుకు బాధపడ్డాడు. తన భర్త పెట్టిన క్రూర చర్యలను, తొడలపై, మర్మావయములపై కామపిశాచి కృష్ణారావు పెట్టిన గాయాల్ని చూపించింది. తను చేసిన పొరపాటుకు సిగ్గుపడి క్షమించమని ప్రాధేయపడి, జరిగిన విషయం పద్మకు చెప్పొద్దని మాటను తీసుకొని సత్య ఇంటినుండి బయలుదేరాడు. ఆ అర్థ రాత్రి తన ఇంటికి తిరిగొస్తుండగా ఈ మాయదారి కుక్కల బారిన పడి గాయాలపాలై ఆసుపత్రిలో చేరాడు.

వాస్తవ విషయాల్ని తెలుసుకున్న పద్మ చాలా పశ్చాత్తాపపడింది. అనవసరంగా సత్యను అపార్థం చేసుకొన్నానని విచారించింది. తన సత్య నిప్పువంటిదని, తన భర్తను తప్పు మార్గం పట్టించిన కాకి వెధవల్ని , ముఖ్యంగా రాఘవరావు వంటి వారిని అసహ్యించుకుంది. కూతురులా చూసుకున్న శిరీషను తలచుకొని కుమిలిపోయింది. సత్య ఇంటికి వెళ్ళి క్షమించమని ప్రాధేయపడింది. అందరం గతంలోలాగే కలసిమెలిసి హాయిగా ఉందామని కోరింది.

సత్యకు హైదరాబారు బదిలీ అయింది. సత్యను ట్రైన్ ఎక్కించ డానికి స్వామి, పద్మలు స్టేషన్‌కు వచ్చారు. శిరీషను విడిచిపెట్టలేని పరిస్థితిలో పద్మ వుంది. ట్రైన్ బయలుదేరుతుండగా అప్పు డప్పుడు వస్తూవుండు అని స్వామి బైబై చెప్పడంతో నవల ముగించబడింది.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# విప్లవ కవిత్వంలో వచన రూపం

– డా॥ గోనిపాటి ధర్మారావు, సహాయ ప్రాంతీయ సంచాలకులు, ఇగ్నో సంచాలకులు, ఇగ్నో ప్రాంతీయ కేంద్రం, విశాఖపట్నం.

వచన కవిత్వం పెట్టుబడిదారీ వ్యవస్థలోని యాంత్రిక మైన నిర్జీవమైన వ్యాపార సంబంధాలను ప్రతిఫలించే కవితారూపంగా మార్క్సిస్టులు అభివర్ణించారు. అయితే దీన్ని పూర్తిగా బూర్జువా కవితా రూపంగా నిందించడం కూడా తగదు. కవిత్వం ప్రజల పరం కావాలంటే వచన కవిత్వాన్ని వదిలిపెట్టి 'పాట'ను, 'గేయాన్ని' వాడాలని విప్లవ కవులు భావించారు మొదట్లో.

"కవిత్వమంతా పాటల రూపంలోనే ఉండాలన్న కఠిన నియమం ఏమీలేదు. ఐతే విప్లవ కవిత్వ భాష వచనం కాదు. అసలు కవిత్వ భాషే వచనం కాదు. అది శ్రమ జీవులు మాట్లాడుకునే జీవ భాష - శ్రమ నుండి పుట్టి శ్రమజీవికీ అతని చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచానికీ మధ్య గల సంబంధం నుండి వికసించిన ఉత్కృష్టమైన అభివ్యక్తి అది. ఇక బూర్జువా సమాజంలో వాడే భాష శ్రమనుండి వేరైన పెట్టుబడి, పెట్టుబడి నుండి పుట్టిన సామాజిక సంబంధాల మొత్తానికి ప్రతిరూపం. అందుకే వచన కవితా రూపం నిర్జీవమైన యాంత్రిక బూర్జువా మార్కెటు సంబంధాలను సూచిస్తుంది... ఇంకో విధంగా చెప్పాలంటే వచన కవిత భౌతిక వాస్తవికతనుండి పరాయీకృతమైన కవితా రూపం" అంటారు మార్క్సిస్టు విమర్శకులు.

ఈ సిద్ధాంత రాద్ధాంతాల్ని పక్కనపెడితే వచన రూపంలో వచ్చిన కవిత్వానికి విప్లవ కవిత్వంలో మంచి స్థానమే ఉంది. వీరి కవిత్వంలో ప్రతీకలు, భావ చిత్రాలు మొదలగునవి విరివిగా కన్పించి కవిత్వాన్ని కొత్త ఎత్తులకి తీసుకెళ్ళాయి. మొదటినుండీ పాట, గేయం - వీటినే నమ్ముకున్న శివసాగర్ లాంటి వారు కూడా వచన కవిత్వాన్ని కూడా మొదటినుండీ పాట, గేయం - వీటినే నమ్ముకున్న శివసాగర్ లాంటి వారు కూడా వచన కవిత్వాన్ని కూడా మొదటినుండీ రాస్తూ వచ్చారు. 'నరుడా! భాస్క రుడా!' లాంటి ఒక మైలురాయి లాంటి 'పాట'ని విప్లవోద్యమానికి అందించిన శివసాగర్ ఆ పాట రాయడానికి ముందే 'మేక్రో స్కోపిక్', 'లెనిన్ నా లెనిన్' అనే వచన కవితలు కూడా రాశాడు.

"కసితో స్వార్థం శిరస్సు గండ్ర గొడ్డలితో
నరక గల్గిన వాడే నేటి హీరో
ప్రజల గుండెల్లో కొండల్లో మాటు కాసి
ట్రిగ్గర్ నొక్కగలిగిన వాడే ద్రష్ట
ప్రజలను సాయుధం చేస్తున్న రివల్యూషనరీ నేడు కవి"

(మైక్రోస్కోపిక్, శివసాగర్ కవిత్వం)

ఈ పంక్తుల్తో కవిత్వం నినాదంలా, నిర్వచనంలా ఉంది. ఈ నాలుగైదు పంక్తుల్లోనే మార్క్సిస్టు - లెనినిస్టు - మావో ఆలోచనా సిద్ధాంతాల్ని, విప్లవాచరణని, ఇమిడ్చి కవిత్వంగా మార్చాడు ఈయన.

విప్లవం ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ప్రభుత్వాలు, పోలీసులు విప్లవకారులపై, వారి ఇళ్ళపై దాడులు చేసినప్పుడు వాటికి ప్రతిస్పందించి రాసిన 'అలలు' కవిత కూడా శివసాగర్‌లోని శిల్ప చాతుర్యానికి ఓ ఉదాహరణ.

"అలలపైన నిఘా!
అలలు కనే కలలపైన నిఘా!
అలలపై అనురాగం చూపించే
చిరుగాలి సితారా సంగీతంపై నిఘా!
..........................................................
ఉరికంబం మీద అలలు!
కటకటాల వెనుక అలలు!
కన్నీళ్ళలో అలలు! అలలు!
కారడవిలో అలలు! అలలు!
కడలి జనం! అలలు దళం!
అలలు కడలి ప్రాణప్రదం!"

(శివసాగర్ కవిత్వం, పు. 36)

అంటూ ప్రతీకాత్మకంగా చెప్తున్నాడు కవి. ఇక్కడ అలలు విప్లవ పోరాటయోధులకి ప్రతీక. సముద్రం సమాజం లేదా ప్రజలు. ప్రజలకి ప్రాణప్రదమైన, ప్రజల కష్టాల్ని తొలిగించగలిగే పోరాటం చేస్తున్న అడవిలోని దళాలలపై పోలీసులు నిఘా వేయడం నిరు పయోగం అంటున్నాడు.

"అలల నెవ్వరడ్డగలరు?
కడలినెవ్వడాపగలడు?" అని ప్రశ్నిస్తాడు.

అలాగే 'కుట్రదారు వాంజ్మూలం' కవిత కూడా 'కుట్ర' పదాన్ని మాటిమాటికీ వాడి దాంతోనే విప్లవ ప్రాధాన్యాన్ని వ్యక్తం చేస్తాడు.

'న్యాయ మూర్తులుంగారూ!
సూర్యోదయం కుట్రకాదు
సూర్యుడు కుట్రదారుడు కాడు
నిండుచూలాలి ప్రసనవేదన కుట్రేనంటారా?
చరిత్ర రథ గమనాన్ని ఏమంటారు?
న్యాయ మూర్తులుంగారూ
భూమిని చాపచుట్టగా చుట్టి
చంకన పెట్టుకున్న రాక్షస భూస్వామ్యం కుట్ర
నా దేశాన్ని విదేశాలకు తెగనమ్మే
దళారీతనం కుట్ర" (శివసాగర్ కవిత్వం, పు. 99)

విప్లవ కారులు కుట్రదారులనీ, విప్లవం పేరుతో రాజ ద్రోహం చేస్తున్నారనీ కేసులు బనాయించి ఉద్యమాన్ని అణగద్రొక్కేసే ప్రభుత్వ ప్రయత్నాలకు నిరసనగా, న్యాయ స్థానాల నుద్దేశించిన ఈ కవి తలో విప్లవకారుల పోరాటాన్ని ఇక సామాజిక సహజ ప్రతిక్రియగా సూచించాడు. సూర్యోదయం, నిండుచూలాలి ప్రసవ వేదన ఎంత సహజమైనవో ఈ విప్లవ పోరాటం కూడా సమాజ వాస్తవికతలోంచి వచ్చిన సహజమైన పోరాటం అని చెప్పదలచుకున్నాడు.

భూమిని చాపచుట్టగా చుట్టి..... అన్న పాదాల్లో హిందూ పౌరాణిక కథల పోలికతో భూస్వాముల దాష్టీకాన్ని భూమిని, శ్రామికులు, రైతుల పరం కాకుండా హక్కు భుక్తం చేసుకున్న తీరుని ఎండ గట్టడం కన్పిస్తుంది.

శివసాగర్ తరువాత చెరబండరాజు కవితల్లో కూడా ఈ రకపు సంవిధానం కన్పిస్తుంది. ఇతను మొదట్లో పాటను తన కవితా రూపంగా తీసుకున్నా కూడా తరు వాతి రోజుల్లో వచన కవిత్వం రాశాడు. దీని గురించి తానే చెబుతూ...

"ఖమ్మంలో చర్చల ఫలితంగా పాటలే రాయాలని నిర్ణయం జరిగింది. అయితే అలా అనుకొన్నప్పటికీ వచన కవిత రాయక తప్పలేదు. ఇది ప్రతి కవికీ ఎదురవు తుందని నేననుకుంటున్నాను. కొన్ని సబ్జెక్ట్స్ పాటల్లోనూ, కొన్ని వచన కవితల్లోనూ చెప్పాల్సి ఉంటుంది. ప్రతిదాన్ని పాటలో చెప్పడం సాధ్యం కాదని నా ఉద్దేశ్యం" అన్నారు. ఇతను రాసిన వచన కవితల్లో భావం సూటిగా ఉం టుంది. తీవ్రంగా ఉంటుంది.

మనిషి మీద నమ్మకం పోగొడుతున్న మీరు
దేవుడిమీద ప్రమాణం చేయమంటారెందుకు?
దోషికి నిర్దోషికి ఒకటే సూత్రం
వల్లించిదే వల్లించి వాదిస్తారు
ఫీజు కుడితి కుండలో
న్యాయాన్ని ఎలుకలా ముంచేస్తారు...."
(నెనెక్కనివ్వండి బోను, ఈ తరానికి చెరబండ రాజు చిరునామా, పు. 15)

ఫీజులకోసం న్యాయాన్ని కుడితిలో ఎలుకల్ని ముంచేసి నట్లుగా ముంచేస్తారని అలంకారికంగా చెప్పడం ఇక్కడ కన్పిస్తుంది. అలాగే తీవ్రమైన వ్యంగ్యంతో రాసిన కవితలు కూడా ఈయన రాశాడు. మతం పేరుతో మోసం చేస్తే దొంగస్వాములు, బాబాలు, పీఠాది పతుల వేషాల్ని ఎండ గడుతూ రాసిన ఈ క్రింది కవితలో వ్యంగ్యమే శిల్ప మయింది.

"పల్లకీలలో తప్ప ప్రయాణం చేయరు
ధనవంతుల మేడల్లో తప్ప పూరిగుడెసల ఊసెత్తరు
కాళ్ళుండీ కుంటివాళ్ళు
మనుషుల భుజాల్ని తప్ప యింకేమీ ఎక్కరు
కాషాయాంబరాలు మానరు
సంతాన వరప్రసాదం లేక

ఆధ్యాత్మిక చింతనపేర
అత్యంతాధునిక లలనా మణుల్ని వంచించందే వదలరు"
(జగద్గురువులొస్తున్నారు జాగ్రత్త, ఈ తరానికి
చెరబండ రాజు చిరునామా, పుట. 25)

వ్యంగ్యం విషయానికొస్తే శివసాగర్ రాసిన కుట్రదారు వాంజ్మాలంలోని ఈ క్రింది పాదాలు కూడా మరో ఉదా హరణలు.

"న్యాయ మూర్తులుంగారూ!
మీరు... రూ బహుమంచివారే
అధర్మనిధనంలో యమధర్మరాజంతటివారు" - భౌతిక వాస్తవికత ననుసరించి సహజంగా వచ్చిన విప్లవ పోరా టాన్ని కుట్రగా అభివర్ణించిన న్యాయస్థానాలపై వ్యంగ్యంగా రాసిన ఈ కవిత కూడా శిల్ప సౌందర్యానికి మంచి ఉదా హరణ. దీని గురించి చెప్తూ విమర్శకులు "బూర్జువా సమా జంలోని సామాజిక సంబంధాల స్వభావాన్ని వ్యక్తీకరించే వచన కవిత ఆ సమాజంలోని వైరుధ్యాన్ని వ్యంగ్య రూపంలో చిత్రించడానికి అనువుగా ఉంటుంది. ఈ లక్ష ణాన్ని శివసాగర్ వంటి కవి క్షుణ్ణంగా వాడుకో గలడు అని 'కుట్ర' ఋజువు చేస్తుంది". ఈ విధంగా విప్లవకవులు పాట, గేయంతో పాటు వచన కవిత్వాన్ని కూడా తమ కవిత్వంతో సుసంపన్నం చేశారు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# విశ్వము - మానవునికి అవినాభావ సంబంధము

- డా. యస్.పి. కృష్ణవేణి, అర్థశాస్త్ర అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.

విశ్వాన్నంతటిని జాగ్రత్తగా పరిశీలిస్తే అది రెండింటి మిశ్ర మంతో నడుస్తుంది. 1. పదార్థము, 2. చైతన్యం. రెండూ ఒకదానితో మరోకటి సంబంధం కలిగి ఉంటాయి. పదార్థము మాత్రం కంటికి కనిపస్తూ ఉంటుంది. ఆ పదార్థాన్ని నడిపించే తన్యం మాత్రం కనిపించదు. చైత న్యం ఉంటేనే పదార్థానికి విలువ ఉంటుంది. చైతన్యం గోచరించాలంటే తప్పనిసరిగా పదార్థం కావాలి. ఒకటి స్థూలమైతే మరొకటి సూక్ష్మత్వం. సైన్స్ ప్రకారం వీనిని విషయము మరియు విషయగ్రహణము అనీ, భగవద్గీత ప్రకారము క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుడనీ, మామూలు వాడుక పదాలలో ప్రపంచం మరియు పరమాత్మ అని అంటారు. కంటికి కనిపించని పరమాత్మగురించి పురా ణాలలో అనేక వర్ణనలు ఇచ్చారు. నిరాకారుడు, నిర్గు ణుడు, ఆది-మధ్య-అంతం లేని వాడు. సృష్టిస్థితిలయాలు కూడా అతడే. అంతటా వ్యాపించి ఉన్నవాడు. ఆ భగ వంతుడు. పదార్థాన్ని పరిశీలిస్తే అది పంచభూతాలలో కూడి ఉంటుంది. అది భూమి, నీరు, అగ్ని, వాయువు మరియు ఆకాశం. ఉన్నది మాత్రము ఒకటే, రూపాలు వేరు. అది ఒక దానిచే మరొకటి హరించబడుతూ ఒకదాని నుండి మరొకటి ఏర్పడుతుంటాయి. భూమి నీటిచే హరించబడుతుంది. నీరు అగ్నిచే ఆవిరైపోతుంది. అగ్ని వాయువుచే హరించబడు తుంది. వాయువు ఆకాశంలో కనిసిపోతుంది. ఇలా ఏర్పడే విధానాన్ని పరిశీలిస్తే ఆకాశం నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని వాయువు కలిస్తే నీరు, నీరు ఘనీభవం చెందటంద్వారా భూమి ఏర్పడుతాయి. ఈ విధంగా ఒకవైపున విభజన చెందుతూ మరొకవైపున ఏర్పడుతూ ఉంటాయి. ఇవి ఏవి నిలకడగా ఉండవు. నిరంతరం మార్పు చెందుతూ ఉంటాయి. అయితే పదార్థం మోతాదు పెరగటంగానీ, తగ్గటం గానీ ఉండదు. ఈ మార్పులు జరగటానికి తప్పనిసరిగా ఏదో ఒక శక్తి కావాలి అదే ప్రాణశక్తి. దానినే కొందరు ఈశ్వరశక్తి అని, కొందరు అల్లాశక్తి అని, మరికొందరు యెహోవాశక్తి అని వేరు వేరు పేర్లతో పిలుస్తారు. శక్తి కూడా పెరగటంగాని, తగ్గటం కాని ఉండదు.

విశ్వంలో ఉన్న ఏ వస్తువువైనా ఏ ప్రాణి అయినా మూడు దశలలో గోచరిస్తుంది. అవి 1. సృష్టి, 2. స్థితి, 3. లయం. ఏ ప్రాణి అయినా ఏ పదార్థమయినా ఈ మూడు దశలకు లోబడి ఉండవలసిందే. ఒక పదార్థం మూందు సృష్టించబడుతుంది. ఆ తర్వాత పోషించబడుతుంది. ఆ తర్వాత నశించిపోతున్నది. సృష్టి, స్థితి, లయలనే ఈ మూడు ప్రక్రియలు మనకంటికి కనిపించేవే. అయితే ఇది జరగటానికి వెనుక మూడు శక్తులుం టాయి. ఆ మూడు శక్తులకు ముగ్గురు అధిపతులు ఉంటారు. వారే బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు. సృష్టికి బ్రహ్మ, పోషణకు విష్ణువు, లయానికి ఈశ్వరుడు. ఆ ముగ్గురికి ముగ్గురు దేవతా స్వరూపాలను ఇచ్చారు. బ్రహ్మకు సరస్వతి, విష్ణువుకు లక్ష్మీదేవిని, శివునికి పార్వతిని జంటగా ఇచ్చారు. ఏదైనా సృష్టించాలంటే తెలివి కావాలి కదా అందుకే జ్ఞానదేవత అయిన సరస్వతి, పోషించాలంటే ధనం కావాలికదా అందుకే విష్ణువుకు ధనశక్తి అయిన లక్ష్మీదేవిని ఇచ్చారు. నాశనం చేయాలంటే భౌతిక శక్తి కావాలికదా అందుకై శివునికి జతగా పార్వతిని ఇచ్చారు. మూడు రూపాలను గమనించి నపుడు వారివారి స్వభావాలు కూడా గోచరి స్తాయి.

సరస్వతి ముఖంలో జ్ఞానం ఉంటుంది. అందుకను గుణంగానే చేతిలో వీణ ఉంటుంది. ఆమె వాహనం కూడా హంసయే. లక్ష్మీ దేవి పుష్కలంగా ధనరాసులను సృష్టించి అందరికి ఇవ్వగలదు. కనుక ఆమె ఎక్కడికి వెళ్ళనవసరం లేదు. నిండుగా అలంక రించుకొని పద్మంపై నిశ్చలంగా ఉంటుంది. ఆమె ముఖంలో లక్ష్మీకళ ఉట్టి పడుతుంది. లయకారి అయిన పార్వతి ఎల్లప్పుడూ ఉగ్రరూపంలో ఉంటుంది. అందుకే ఆమె చేతిలో

త్రిశూలం ఉంటుంది. వాహనం కూడా క్రూరమెన పులి లేక సింహం ఉం టుంది. త్రిమూర్తులలో కూడా మనం ఈ వ్యత్యాసాన్ని గమనించ వచ్చు. బ్రహ్మకు నాలుగు వేదాలకు ఆనుగుణంగా నాలుగు తలలు, విష్ణువుకు నిర్మలత్వం, సమత్వం ఉంటాయి. శివుడు త్రిశూలం, గంగ, పాములతో కూడి స్మశానములో భయంకరంగా కనిపిస్తాడు. కాబట్టి ముగ్గురు కూడా మూడు శక్తులకు ప్రతిరుపాలే కాని వ్యక్తులు మాత్రము కాదు.

పై వివరించిన మూడు శక్తులకు అనుగుణంగా మూడు గుణాలు ఉంటాయి. దానినే త్రిగుణాలు అంటారు. సృష్టికి సంబం ధించినది సత్వగుణం, స్థితికి సంబందించినది రజోగుణం, లయ నికి సంబందించినది తమోగుణం, భూమితో సహా దానిపైన ఉన్న కొన్ని పదార్థాలు స్తబ్దతగా ఉంటాయి. దానినే తామశికం అంటారు. అగ్ని వాయువు, నిరంతరం చలనంలో ఉంటాయి. దానినే రజోగుణం అంటారు. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అదే సత్వగుణం. కాబట్టి జడంగా ఉన్నది తమోగుణంలో నిరంతరం పదార్థాన్ని సూక్ష్మంగా పరిశీలించిన, వేరువేరుగా కనిపిస్తున్న పుటకీ అందులో ఏకత్వమే ఏ పదార్థాన్నయినా విడగొట్టుకుంటూ సూక్షాతిసూక్ష్మ స్థితికి తీసుకువెళితే చివరకు అణువులు, వానినుండి పరమాణువులు వస్తాయి. ఒక పరమాణువును ఛేదించ గల్గితే అందులో ఎలక్ట్రాన్స్, ప్రోటాన్స్ ఉంటాయి. ప్రోటాన్ పాజిటివ్ శక్తి, అంటే సత్వగుణం. మనం ఏ పదార్థాన్ని తీసుకున్నా జీవం ఉన్నా లేకపోయినా చివరకు కన్పించేవి ఈ మూడు రేణువులు. వాని వెనుక ఈ మూడు గుణాలే కాబట్టి పదార్థం అంతా ఒక్కటే, కలయిక మారేసరికి వేరువేరు రూపాలలో కనిపిస్తుంది. వాస్తవం చెప్పాలంటే ఏకత్వం ఉన్నది భిన్నత్వం కనిపిస్తుంది. శక్తి కూడా ఒక్కటే కాని అనేక తత్వాల్లో గోచరిస్తూ ఉంటుంది.

ఒక మానవునిగురించి కూడా సమగ్రంగా పరిశీలిస్తే, మానవులలో కూడా విశ్వంలో ఉన్నట్టుగా పదార్థం మరియు చైతన్యం ఉంటాయి. కంటికి కనిపించేదేహం స్థూలమైనది. దానిని నడిపించే శక్తి ఉందే అదే సూక్ష్మమైనది. ఆ విధంగా రెండింటికీ మధ్య పోలికలు మరియు సమన్వయం ఉంటాయి. దేహాన్ని క్షేత్రం అనుకుంటే అది పదార్థం. చైతన్యాన్ని క్షేత్రజ్ఞుడు అంటారు. ఒకటి శరీరం రెండు మనసు. జీవుడు మరియు అందలి శక్తినే జీవాత్మ అంటారు. మన దేహంలో కూడా విశ్వంలో ఉన్నట్లుగానే పంచభుతాలు ఉన్నాయి. మన శరీరంలో 70 శాతం పైన నీరు ఉంటుంది. భూమి మీదకూడా అంతేశాతం నీరు ఉంటుంది. మన శరీరంలోని ఆ పంచభూతాలను నడిపే ఐదు శక్తులే పంచ ప్రాణాలు. అవి ప్రాణ, వ్యాస, సమాన, అపాన మరియు ఉదాన వాయువులు. విశ్వంలో ఏముందో మనలో కూడా అదే ఉంది.

మనం విశ్వం నుండి వచ్చాం. తిరిగి మరలా విశ్వం లోనికి వెళతాం. విశ్వంలో ఉన్న పదార్థం ఒకటే ఐతే భిన్నంగా కనిపిస్తుంది. విశ్వంలో ఉన్నశక్తి అనేక రూపాలుగా గోచరిస్తుంది. మనం కష్టపడి పనిచేస్తున్నప్పుడు ఉపయోగించే శక్తి భౌతికశక్తిగా, ఆవేశపూరితముగా మాట్లాడేటప్పుడు మానసిక శక్తిగా లోతుగా పరిశోధన చేస్తున్నప్పుడు విజ్ఞానశక్తిగా, ధ్యానంలో ఉన్నప్పుడు ఆధ్యాత్మిక శక్తిగా ఉంటుంది. ఉన్నశక్తి మాత్రం ఒక్కటే. ఎవరికివారు వారి జీవన విధానానికి అనుగుణంగా వాడుకుంటూ ఉంటారు. విశ్వంలో ఉన్నట్టుగానే మనవులలో కూడా సృష్టి, స్థితి, లయలుంటాయి. మనిషి పుట్టుకను సృష్టి అని, జీవిం చటాన్ని స్థితి అని, మరణించటాన్ని లయం అంటాము. సృష్టి, స్థితి, లయలకు అనుగుణంగా మానవునిలో రజో, సత్వ, తమో గుణాలు ఉంటాయి. అయితే కొందరు ఎక్కువ రజశికంగా, మరికొందరు ఎక్కువ తామశికంగా, మరికొందరు ఎక్కువ సాత్వి కంగా ఉంటారు. కాబట్టి మానవునకు విశ్వనికి అన్ని కోణాల నుండి పరిశీలించినా సమన్వయం ఉన్నది. మనవుడు విశ్వనికి ప్రతి రూపం. విశ్వమంతటిని ఒక మర్రి వృక్షం అనుకుంటే మానవుడు ఒక మర్రి విత్తనం. ఈ మర్రి విత్తనంలోనే విశ్వమంతా అవ్యక్తంగా ఉంటుంది. కాబట్టి మనలో విశ్వపదార్థం మరియు విశ్వశక్తి ఉన్నాయి. అందుకే మానవునికి-విశ్వానికి అవినాభావసంబంధం కలిగి ఉన్నది.

**లోకాసమస్తాస్సుకినోభవన్తు...**

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# గురజాడవారి 'ముత్యాల సరాలు' - పరిశీలన

- డా॥ యం. గిరిబాబు, తెలుగు విభాగం, జ్ఞానభారతి క్యాంపస్, బెంగళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు.

సామాజిక దృక్పథం కలిగిన ఆధునిక రచయితల్లో ప్రముఖులు గురజాడ వేంకట అప్పారావు. వీరు సమాజం లోని దురాచారాలను రూపుమాపడానికి తన రచనల ద్వారా నడుంకట్టి సఫలీ కృతులయినారు. గురజాడ వారు సమకాలీన చైతన్యంతో కూడిన కవితా వస్తువును సమాజం నుంచే గ్రహించి సగటు మనిషికి అర్థమయ్యే విధంగా రాశారు. ఇలా రాయడానికి ఆయన ఒక కొత్త చంధస్సుని రూపొందించుకున్నారు. ముత్యాలు పొదిగిన సరం అందంగా, ఆకర్షణీయంగా ఉన్నట్లుగా గురజాడవారు తన కొత్త చంధస్సుకు 'ముత్యాల సరాలు' అని పేరు పెట్టుకున్నారు. ఈ ముత్యాలసరాలు గేయ రూపంలో ఉంటాయి. ఇవి పాడుకోవడానికి అనువుగా ఉండడమే గాకుండా వీటిని పాడిన వెంటనే భావం స్ఫురించడంతో పాటుగా గేయం మొత్తం మనస్సు లోతుల్లో నిలిచి పోతుంది. ముత్యాల సరములు, కాసులు, కన్యక, లవణ రాజుకల, పూర్ణమ్మ, దేశభక్తి, మనిషి అనేవి 'ముత్యాల సరాలు' లోని ముఖ్య ఖండికలు. ఈ ఖండికలను పరిశీలించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

### ముత్యాల సరములు ఛందస్సు :

గురజాడ రచనల కవితా సంపుటిని శెట్టి ఈశ్వరరావు గారు సంపాదకత్వం వహించిగా దీనిని విశాలాంధ్ర వారు ప్రచురించారు. ఈ ముత్యాల సరములు తెలుగు సాహిత్యంలో మార్పులను తీసుకురావడానికినాంది పలికింది. దీనిలో గురజాడవారు వస్తువు, కవిత్వం యొక్క విశిష్టతను గురించి ఇలా తెలిపారు.

'గుత్తునా ముత్యాల సరములు
కూర్చుకొని తేటైన మాటలు
క్రొత్త పాతల మేలుకలయిక
క్రొమ్మెరుంగులు చిమ్మగా'

అంటూ గేయ కవితను ప్రారంభించారు. ప్రాచీన కాలం నాటి పద, భాషాడంబరం ప్రదర్శించకుండా నూతన ఛందస్సును నిర్మించుకొని, కొత్త, పాత విధానాన్ని కలుపుకొని తేనెలొలుకు తేటైన తెలుగు మాటలతో కవిత్వం చెప్పారు. ప్రాచీన కాలంలో పాల్కురికి సోమ నాథుడు ప్రజలకు ప్రాధాన్యతనిచ్చి కావ్య వస్తువు ఛందస్సులోను గేయరూపంలో ఉండే ద్విపద, రగడ వంటి వాటితో రచనలు చేశారు. దీనిని స్ఫురించేవే కొత్త పాతల మేలు కలయిక. గురజాడవారు జానపదగేయ బాణిలో ముత్యాల్లాంటి పదాలను ఏర్చి, కూర్చి, ముత్యాల సరాలు రచించారు.

'మెచ్చనంటా నీవు నీవిక
మెచ్చకుంటే మించిపాయెను
కొయ్యబొమ్మలె మెచ్చు కళ్ళకు
కోమలుల సౌరెక్కునా?'

గురజాడవారు పై కవితా పంక్తులలో నూతన కవితా విధానం గురించి ప్రస్తావిస్తూ నాటి సంప్రదాయవాదులకు చెదరకుండా వారి కవిత్వంతో సమాధానం చెప్పారు. వారి నూతన కవిత్వాన్ని సమర్థించకపోయిన నష్టం ఏమిలేదు అని భావించారు. నూతన కవితా దృక్పథం ప్రతిష్టించారు. వీరి ముత్యాల సరాలు కథాత్మక గేయ కవితలో వస్తువు ముఖ్యంగా నాటి కులం మూఢనమ్మ కాలపై వ్యతిరేకతను నూతన హేతువాద దృక్పథంతో సాగింది. ముత్యాల సరాలు ద్వారా గురజాడ వారు ఆనాటి సమాజం లోని దురాచారాలు, అంటరానితనం ఎంత తీవ్రస్థాయిలో ఉండేవో తెలిపారు. అంతే గాకుండా సమాజంలోని మూఢనమ్మకాలు, అంటరానితనం తొలగి పోయి సమ సమాజం ఏర్పాటు కావాలని ఈ ఖండిక ద్వారా తెలిపారు.

### కాసులు :

గురజాడవారి 'కాసులు' గేయకవితలో నూతన ప్రేమ

సిద్ధాం తాన్ని ప్రతిపాదించారు. ముఖ్యంగా దీనిలో స్త్రీ, పురుషుల మధ్య ఉండవలసిన ఐక్యతను గురించి తెలిపారు. భర్త దైవంతో సమానం అనే పాత మాటలు వద్దని, భార్యాభర్తలు ఇద్దరు సమా నమే అని ఎవరి గొప్ప వారిదన్నారు. ఇద్దరు కలిసి మెలసి ఉండడం వలన ఇద్దరి మధ్య అనురాగం, ఆప్యాయతలు పెరుగు తాయని కాసులు ఖండిక ద్వారా సమాజానికి సందేశం అందించారు.

'ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును
ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును'

భార్యాభర్తలు ఇద్దరు అన్యోన్యంగా ఒకరిపై మరొకరు ప్రేమను చూపించుకున్నట్లయితే ఆ ప్రేమ జీవితాంతం వరకు నిలిచి ఉంటుందని గురజాడ వారు రెండు పంక్తుల్లోనే నూరేళ్ళ జీవిత సారాన్ని ప్రబోధించారు.

**కన్యక :**

గురజాడవారి 'కన్యక' కవితలో అధికారం ఉందనే గర్వంతో ఏమి చేసినా తనను ఎవరూ ఏమీ చేయలేరనే రాజు గర్వం, కోటలు మట్టి కలిసిన విధానం కళ్ళ ముందు కదిలాడుతున్నట్లు అక్కడ జరిగిన సంఘటనలను కరుణ రసాత్మకంగా తెలిపారు. శెట్టిగారి ఇంట పుట్టిన కన్యకను రాజు ఆశించడం. రాజు తన అభిప్రాయాన్ని కన్యకకు తెలియజేస్తాడు. రాజు అభిమతానికి కన్యక అంగీకరించదు. కన్యకను రాజు బలత్కరించడానికి ప్రయత్నిస్తాడు. తన వారు ఎవరూ కూడా రాజును ఎదిరించే సాహసం చేయరు. చివరికి కన్యక గుడి ముందు కాలుతున్న అగ్ని గుండంలో దూకి ఆత్మార్పణ చేసుకుంటుంది. రాజును ఎదిరించే ధైర్యం ఎవరికీ లేదని తెలిసిన కన్యక వారి బంధువులను ఉద్దేశించి ఇలా అంటుంది.

'పట్టమేలే రాజు అయితే
రాజునేలే దైవ ముండదే
పరువు నిలుపను పౌరుషము
మీకేల కలగదొకో!'

రాజ్యాన్ని పరిపాలించే రాజు అని రాజుని చూసి భయపడు తున్నారు. రాజుని పరిపాలించే దైవం ఉంది కదా! ఆ దైవం చూస్తూ, ఊరుకోదు. సాటి కలానికి చెందిన స్త్రీని పరాయి పురు షుడు బలవంతంగా చెరబట్టాలని అనుకుంటుంటే మీరు ఎలా చూస్తూ ఉంటారు. పరువు నిలుపుకోవడానికి కొంచెం అయినా పౌరుషం కలిగి ఉండాలి కదా అంటూ కన్యక తమ వారిని ఉద్దే శించి మాట్లడుతుంది. ఆ రాజుని ఆనాటి రాజుల దుశ్చర్యలను గురించి తెలిపారు. స్త్రీలకు స్వేచ్ఛ లేకుంటే సమాజంలో వారి పరిస్థితి ఎలా ఉంటుందో విశదీకరించారు. ఎదుటి వాళ్లకు భయ పడుతున్నంత కాలం వాళ్ళు భయపెడుతూనే ఉంటారని, ఎదురు తిరిగి పోరాడితే ఎంతటి శత్రువునైనా జయించవచ్చనే దృఢసంక ల్పాన్ని కల్గిస్తుంది. బలవంతంగా ఇతరులకు సంబంధించిన దానిని ఆశించి పొందాలని అనుకుంటే దాని ఫలితము ఎంత దారుణంగా ఉంటుందో కన్యక పాఠం ద్వారా రచయిత తెలిపారు. అత్యాశపరుడైన రాజు కన్యకను కోరుకొని, ఆమె ఆత్మా ర్పణకు కారణమవుతాడు. చివరికి రాజు మరణించడం, రాజ్యాం సర్వనాశం కావడం ఈ గేయం ద్వారా తెలుస్తుంది.

**లవణరాజు కల :**

1911వ సంవత్సరంలో గురజాడవారు లవణరాజు కల అనే గేయ రచన చేసి ఆంధ్ర భారతిలో ప్రచురించారు. డామన్ పితియస్ కథలో గ్రీకు దార్శనిక సిద్ధాంతాలకు నూతన వ్యాఖ్యానం చేసి అంటరాని తనాన్ని నిరశించారు. మానవతా వాదము ఇందులో మనకు కనిపిస్తుంది. వర్ణ కట్టుబాట్లకు కట్టుబడకుండా గుణానికి ప్రాధాన్యం ఇవ్వాలని వారు ఆశించి సమాజానికి హితువు పలికారు. ఆనాటి సమాజంలో అంటరానితనం అధికంగా ఉండేది. పంచముల గాలి కూడా ఇతర కులాల వారికి సోకేది కాదు. గుడిలోకి, బడిలోకి రానిచ్చేవారు కాదు. అలాంటి పరి స్థితుల్లో గురజాడ వారు వర్ణ వ్యవస్థను రూపు మాపేందుకు నడుంకట్టారు. సమాజంలో అంటరానితనం అమానుషంగా తయారయింది. దీనిని గమనించిన గురజాడ వారు ఈ దరా చారాన్ని రూపుమాపడానికి తన రచనల ద్వారా ప్రయత్నం చేసి, సఫలీకృతుడైనాడు. మనిషిలో

గుణాలను చూడాలే కానీ కులం ప్రధానం కాదని సమాజానికి హితువు పలికారు. అగ్రకులాల వారు వారి అవసరాలకు పంచముల శ్రమను దోచుకుంటారు. రాజకీయ అవసరాలు వచ్చినప్పుడు సహపంక్తి భోజనాలు చేయడం లాంటివి చేస్తారు. అలా చేస్తే కులం అనేది సమసి పోదని, పంచములకు చెందిన అమ్మాయిని వివాహం చేసుకుంటే నిజమైన ఐక్యమత్యం కలుగు తుందంటారు. ఆ విషయం గురించి గురజాడవారు ఇలా అంటారు.

'కలసి మెసగిన యంత మాత్రనె
కలుగబోదీ యైక్యమత్యము
మాలమాదిగ కన్నె నెవతినో
మరులు కొనరాదా'

అంతేగాకుండా మంచితనం అనేది ఎక్కడ ఉం టుందో అక్కడ కులాల ప్రస్తావన తీసుకురాకూడదని విశ్వసించారు. ఈ విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ, మంచి అనేది మాల అయితే ఆ మాల కులానికి చెందిన వ్యక్తిని నేనే అవుతానని గురజాడ కులగజ్జి లేని సమాజం కోసం ఆరాటపడినట్లు తెలుస్తుంది. ఆ విషయాన్ని గురించి ఇలా అంటారు.

'మంచి అన్నది మాల అయితే
మాల నే అగుదున్'

**పూర్ణమ్మ :**

ఆనాటి సమాజంలో బాల్య వివాహాలు అధికంగా జరి గేవి. ముక్కు పచ్చలు ఆరని ఆడపిల్లలకు కూడా వావా హాలు చేసే వారు. ఈ దురాచారం ఎంతో పసిమొగ్గలను సతీసహగమనం, ఆత్మార్పణకు బలిగొన్నాయి. ఈ దురాచారాన్ని రూపుమాపడానికి, సమాజంలో మార్పు కోసం సమాజానికి కనువింపు కలిగించడానికి గురజాడ వారు కరుణ రసాత్మకంగా 'పూర్ణమ్మ' గేయ రచన చేశారు. ఇది పాడుకోవడానికి అనువుగా ఉండి చక్కటి భావాలను కలిగి ప్రతి శ్రోత హృదయాన్ని ద్రవింప చేస్తుంది. ఆడపిల్ల పుడితే అదృష్టం అని కాకుండా అరిష్టంగా భావించే రోజు లవి ఆ సమయంలో గురజాడ వారు వారి రచనల ద్వారా సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి ఉద్య మించారు. ఆడపిల్ల తల్లి దండ్రులు ధనానికి ఆశపడి పదహారేళ్ళ ప్రాయం గల పూర్ణమ్మను ముదుసలి వాడికి ఇచ్చి పెళ్ళి చేసిన సంఘటన గురించి గేయంలో ఇలా అంటారు.

'కాసుకు లోనై తల్లిదండ్రీ
నెనరూ న్యాయం విడనాడి
పుత్తడి బొమ్మ పూర్ణమ్మను వొక
ముదుసలి మొగుడుకు ముడివేస్రి'

పూర్ణమ్మకు ముదుసలి వానితో వివాహం చేసిన తరువాత ఆమె ఆడుకోవడానికి వెళ్ళేది కాదు. తనతోటి పిల్లలు మొగుడు తాతయని అంటూ ఉంటే పూర్ణమ్మ తన ఇష్టదైవం అయినటు వంటి దుర్గను చేరి ఏడుస్తుంది. చిన్న పిల్లలు మనస్సులు గాయ పడినప్పుడు వారు ఎలాంటి మానసిక క్షోభకు గురవుతారో గుర జాడ వారు తెలియజేశారు. పూర్ణమ్మ తన అన్నదమ్ములతో, పిల్ల లతో మాట్లాడుతూ, తల్లిదండ్రులను జాగ్రతగా చూసుకోండి, దుర్గాదేవిని పూజించండి అని చెబుతుంది. సాధరణంగా ఆడ వాళ్ళు తమకు వచ్చిన కష్టాలను ఎదుటి వాళ్ళకు చెప్పేటప్పుడు అసలు విషయాన్ని దాచిపెట్టి, ఇతర విష యాలు చెబుతుంటారు. పూర్ణమ్మ కూడా అలాగే ప్రవర్తిం చింది. తాను ఆత్మార్పణ చేసు కుంటున్నాను అనే విషయాన్ని దాచిపెట్టి, ఇతర విషయాలు తన అన్న దమ్ములతో పంచుకంటుంది. ఇక్కడ గురజాడ వారు నేర్పుగా పూర్ణమ్మ చే మాట్లాడించిన పద్ధతి ఆయన సంస్కర్త హృదయాన్ని తెలియజేస్తుంది.

'కన్నుల కాంతులు కలువల చేరెను
మేలిమి చేరెను మేని పసల్
హంసల జేరెను నడకల బెడగుల్
దుర్గను జేరెను పూర్ణమ్మ'

పూర్ణమ్మ దుర్గలో లీనమైపోయిన క్రమాన్ని వర్ణించే ఘట్టము పాఠకుల మనస్సును ద్రవింపజేస్తుంది.

'దిక్కులేని వారికి ఆ దేవుడే దిక్కు' అనే సామెతలాగా పూర్ణమ్మ తన ఇష్టదైవ సన్నిధిలో ఆత్మార్పణ చేసు కుంటుంది. తీ గేయం బాల్యవివాహాలకు తెరదించడానికి కొంతవరకు దోహదపడిందనుటలో అతిశయోక్తి లేదు.

**దేశభక్తి :**

గురజాడ వారి 'దేశభక్తి' గేయం ద్వారా ప్రపంచ మానవాళికి గొప్ప విశ్వమానవత ప్రేమను పంచారు. దీని ద్వారా మానవతా వాదం, దేశభక్తి, మరియు జాతీయత అన్ని రంగాల అభివృద్ధిని కాంక్షించారు. ఈ గేయంలో ఎక్కడా కూడా దేశము పేరు కానీ మతము పేరు కానీ లేకుండా ప్రపంచంలోని అన్ని దేశాల వాళ్ళు ఈ గేయాన్ని పాడుకొనే విధంగా రచించారు. ఈ గేయంలో అన్ని వర్గాల వారి గురించి వాళ్ళ యొక్క విశిష్టతను గురించి తెలిపి యున్నారు. దేశభక్తి గేయాన్ని అర్థం చేసుకోవడానికి పాండిత్యం అవసరం లేదు. సగటు మానవుడు చదివి అర్థం చేసకోగలడు. అంతటి సులువైన పదజాలంతో గురజాడ వారు రచించారు. ఈ గేయంలోని ఒక్కొక్క పద్యం ఒక ఆణిముత్యమై 'ముత్యాల సరాల'ను ముచ్చట గొలుపుతాయి. ప్రతి భారతీయ పౌరుడు తనకు దేశభక్తి ఉందని గొప్పలు చెప్పుకుంటుంటారు. అలాంటి వారిని ఉద్దేశించి గురజాడ వారు ఇలా అంటారు.

'దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టి వోయి
గట్టి మేల్ తలపెట్టవోయ్'

కొంతమంది గొప్పలు చెప్పుకుంటూ, కాలం గడుపు తుంటారు. అలాంటి వాళ్ళను గురించి గురజాడ వారు పై విధంగా అంటారు. వట్టి మాటలు చెప్పకుండా ఏదైనా ఒక పని చేసి చూపించమంటాడు. ప్రతి మనిషిలో మంచి అనేది పెంచాలని, ఎదుటి వాళ్ళలో మంచిని పెంచాలంటే మనం మంచి వారిగా ఉండాలనే విషయాన్ని నిగూఢంగా ధ్వనింపజేశాడు.

**మనిషి :**

గురజాడ వారి 'మనిషి' గేయం హేతువాద దృష్టితో రాసిన గేయం మనిషి చేసిన రాయిరప్పకు మహిమ కల దని సాగి మొక్కడం అనేది మనిషి, రాయికన్నా తక్కువగా చూడడమే అని విమర్శించారు. మనిషి యొక్క మనసు అని పనులకు ఆధారం. మానవ సేవయే మాధవ సేవ అని మనిషి యొక్క విశిష్టతను ఎలుగెత్తి చాటారు. గురజాడ వారు మనిషి గొప్పతనాన్ని గురించి 'మనిషి' గేయంలో ఇలా అంటారు.

'యెల్ల లోకములొక్కయిల్లై
మతములన్నియు సమసిపోవును
జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును'

గురజాడ అప్పారావుగారు మనిషి విశ్వ ప్రేమికుడు కావాలని ఆకాంక్షించాడు. అలాంటి రోజులు రావాలని ప్రగాఢంగా వాంఛించారు. ఆ దిశగా రచనలు రాస్తూ, సమాజాన్ని సంస్కరించడానికి పూనుకున్నాడు.

'బ్రతికి చచ్చియు ప్రజలకెవ్వడు
ప్రీతి గూర్చునో వాడే ధన్యుడు'

అనే మాటలు గురజాడ వారికి చక్కగా సరిపోతాయి. ప్రస్తుత సామాజిక, ఆర్థిక, రాజకీయ, పరిస్థితులలో గుర జాడవారి దేశభక్తి గీతం నేటి యువతకు భవితకు స్ఫూర్తిగా నిలుస్తుంది. వారి హేతువాద దృక్పథం నవ్యకవితా విధా నాలు తెలుగు సాహిత్య వినీల ఆకాశంలోని ముచ్చట గొలిపే తారకల్లాగా సుస్థిరంగా నిలిచి ప్రకాశిస్తుంటాయి.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. గురజాడ రచనలు - ఈశ్వరరావు సెట్టి
2. తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య 2వ సంపుటం
3. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు - సినారె
4. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - వేల్చేరు నారాయణరావు.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# నెమలి కన్నులు కవిత్వం -అభివ్యక్తి వైవిధ్యం

- దొరిశెట్టి ప్రుష్మిణి, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

సమకాలీన ప్రసిద్ధ కవిగా, అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా ప్రసిద్ధి చెందిన దార్ల వెంకటేశ్వర రావు తాను కవిత్వం రాసినప్పటి నుండీ 2016 వరకు రాసిన కవితలన్నింటినీ **నెమలి కన్నులు** పేరుతో ఒక సంపుటిగా ప్రచురించారు. 'నెమలి కన్నులు' కవితా సంపుటిలోని వివిధ కవితల్లో గల అభివ్యక్తిని, ఆ కవితా సంపుటిలోని వివిధ అభివ్యక్తి విధానాల వల్ల వ్యక్తమైన సౌందర్యాన్ని పరిచయం చేయడమే ఈ వ్యాసం ప్రధాన లక్ష్యం.

'అభివ్యక్తి' అనే శబ్దానికి రకరకాలైన అర్థాలు కనిపిస్తున్నాయి. 'విశిష్టంగా వ్యక్తీకరించడం' అనేది 'అభివ్యక్తి'లో కనిపించే మౌలికాంశం. Expressionism అనే ఆంగ్ల పదానికి A style of painting, music, drama etc. in witch an of writer seeks to express emotional experience ratter impressions of the external world n" Oxford Dictionary వివరిస్తుంది.దీన్ని బట్టి ఒక చిత్రం, సంగీతం, నాటకం మొదలైన కళా రూపాలన్నీ కళాకారుని అంతరంగంలో భావోద్రేకాల్ని బహిర్గతం చేసే ఒక విధానం అభివ్యక్తిలో ఉంటుంది. అభివ్యక్తి అనేది కళాకారుని అనుభవాల కళాభివ్యక్తిగా స్పష్టమవుతుంది. సారాంశంలో 'అభి వ్యక్తి' అంటే ఉన్న దాన్ని వ్యక్తం చేయడం అని తెలుస్తుంది. కవి లేదా కళాకారుని హృదయంలోని స్పందనను వ్యక్తీకరించటం అనే అర్థాన్ని దీన్ని బట్టి గ్రహించవచ్చు. కవి లేదా కళాకారుని హృదయంలోని రస స్పందనను విశిష్టంగా వ్యక్తీకరించటం అభివ్యక్తి అవుతుంది.

లోకంలో ఉన్న దాన్ని కవి చూసి మళ్ళీ అందంగా బయటకు చెప్పాలనుకుంటాడు. అది సామాన్యంగా చెప్పినట్లు కాకుండా, అసామాన్యంగా చెప్తాడు. అలా గుండె గొంతుకలో కొట్లాడిన సంపద రకరకాల రూపాల్లో బయటి ప్రపంచానికి వ్యక్తీకరించే ప్రయత్నం చేస్తాడు. చిత్రకారుడైతే చిత్రం రూపంలోనూ, సంగాత కళాకారుడైతే రాగాలు, ధ్వనుల రూపంలోనూ వ్యక్తీకరిస్తాడు. కవి శబ్దాలతో అభివ్యక్తం చేస్తాడు. అభివ్యక్తి కూడా ఒకే మూస పద్ధతిలో వ్యక్తమైతే తాను అనుభవించినంత రసాన్ని స్పందననీ పాఠకులు కూడా అందుకోలేకపోవచ్చునని గానీ, ఒక్కో స్పందనని ఒక్కో రూపంలో వ్యక్తం చేస్తేనే రసా విష్కృతి సమర్థవంతంగా జరుగుతుందని గానీ భావించవచ్చు. అందుకనే కళాకారుడు తాను వ్యక్తీ కరించే వస్తువుని రకరకాల రూపాల్లో, రకరకాల పద్ధతుల్లో అభివ్యక్తం చేయాలనుకుంటాడు. అభివ్యక్తిని రెండు రకాలుగా వివరించవచ్చు. i).విశిష్టంగా వ్యక్తీకరించటం. ii). విశిష్టతను వివిధ రూపాల్లో వ్యక్తీకరించటం.

తాత్త్వికంగా చూస్తే సృష్టిలోని ప్రతి వస్తువూ ప్రతీకాత్మకంగా కనిపిస్తుంది. కవి ఒక వస్తువును అనుభూతి చెందటం ద్వారా ఆ అనుభూతి ఉన్నదున్నట్లుగా అభివ్యక్తీకరించడానికి ప్రతీక కంటే అనువైన సాధనం లేదు. ప్రతి వస్తువూ, వ్యక్తిలోని అనేకమైన అనుభూతుల్ని అంతరంగంలో అత్యంత సంఘర్షణతో రగిలి స్తుంది. కవి ప్రయోగించిన ప్రతీక, ఆ అనుభూతుల్ని అభివ్యక్తీక రించేదిగా ఉండాలి. అందుకే వస్తువని చెప్పకుండా అనుభూతి కేంద్రమైన మరో వస్తువుని చెప్పటం ద్వారా అసలు వస్తువుని స్ఫురింపచేయటం ప్రతీక వినియోగమవుతుంది. వివరణలతో పని లేకుండా అనుభూతిగా అభివ్యక్తీకరించడానికి ప్రతీక ఉప యోగపడుతుంది.

కవిత్వంలో ఒక విషయం మరో విషయానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతీకలుగా చెప్పబడతాయి. ప్రాతినిధ్యం వహించే వస్తువులని కవి సమాజం నుంచి గాని, స్వీయ కల్పనలనుండి గాని గ్రహించి చెప్తాడు. జీవితంలోని

సుఖదుఃఖాలు మొదటి సారిగా శక్తివంతంగా, కళాత్మకంగా కవిత్వంలోనే వ్యక్తీకరించబడతాయి. కాబట్టి కవి స్వీయానుభవాలనుంచే పదాలు, ప్రతీకలు స్వీకరించి కవితా నిర్మాణం చేసి తన అనుభవాన్ని అభివ్యక్తీక రిస్తాడు కవి. సహజంగా కవులు సముద్రాన్నో, నదినో, పర్వతాన్నో జీవితానికి ప్రతీకలుగా గ్రహించి జీవితంలో జరిగిన సంఘటనలకు వీటన్నింటిని ప్రాతినిధ్యం వహించేలా చేస్తాడు. ఈ కవి కూడా "చౌరస్తా"ని ఒక జీవితానికి ప్రతీకగా గ్రహించి వసంతం, శిశిరాలను ప్రాతినిధ్య వస్తువులుగా చేసి నభూతోనభవిష్యత్తి అనే కవితలో తనదైన గొప్ప అనుభవాన్ని అభివ్యక్తి రూపంలో వ్యక్తీకరించాడు. **"జీవన చౌరస్తాలో కొచ్చిన కొత్తలో / వెలుగులు విరజిమ్మిన వసంతం / ఇంత తొందరగా / భవిష్యత్తు మొగ్గల్ని చిదిమేసిన /శిశిరమైన చీకటి అవతారం / రంగుల ప్రపంచం / అద్భుతమైన రూపం / వికృతమై వెక్కిరిస్తూ / రక్తసిక్తమైన కాన్వాస్" (నభూతో నభవిష్యత్తి, పుట:9)**

'చౌరాస్తా' అనేది అన్యదేశ్య పదం. నాలుగు రోడ్ల కూడలి అని వాచ్యార్థం. 'జీవన చౌరస్తా' అని దీన్ని కవి ప్రయోగించాడు. కవితలో అక్షరదోషమో, కవి ప్రయోగమో పదాన్ని మార్పు చేసినట్లు మాత్రం కనిపిస్తుంది. 'తన నిర్ణయాలు తాను తీసుకునే సమయం' అనేది ఇక్కడ ఒక అర్థంలో స్ఫురిస్తుంది. 'నలుగురూ తమకిష్టమైన నాలుగు వైపులకు వెళ్ళే మార్గాల్లోకి వచ్చినప్పుడు' అని మరొక అర్థం వ్యంగ్యార్థంగా కనిపిస్తుంది. తానొక నిర్ణయాన్ని తీసు కోవాల్సిన తొలిదశలోనో, లేక అంతా సంతోషంగా తమ తమ ఉన్నత లక్ష్యాలను నెరవేర్చుకునే క్రమంలోనే తన జీవితంలో ఎదురైన విషాదాన్నిక్కడ కవి వ్యక్తీకరిస్తున్నాడు. 'భవిష్యమొగ్గల్ని'బీ 'వెలుగులు విరజిమ్మిన వసంతం' వంటివన్నీ కవి రాబోయే జీవితం గురించి గొప్ప కలలు కన్నాడని చెప్పే కీలకాంశాలు. కానీ, తన జీవితంలో ప్రవేశించిన 'విషాదం' తన కలల్ని కల్లలు చేసేసిందనే వేదన తర్వాత కవిత అంతా వర్ణితమైంది. అందుకనే కవి 'శిశిరమైన చీకటి అవతారం' అని జీవితమంతా అప్పుడే శిశిర ఋతువులోని ఆకులు రాలినట్లే, ఆశలు రాలిపోయి మోడు వారిపోబోతున్న జీవితాన్నిక్కడ దృశ్యీకరిస్తున్నాడు. అందుకనే 'చీకటిఅవతారం' గురించి వర్ణించాడు. చీకటి అనే అవతారం తన జీవితంలో వసంత పూయాల్సిన జీవితాన్ని శిశిరఋతువుగా మార్చేసిందనే ఆవేదనను వ్యక్తీకరిస్తున్నాడు. ఇక్కడ -భవిష్యత్తు ఎంతో అందంగా ఉండాల్సిన జీవితం తొందరగా ముగిసిపోతున్న భయాందోళన గల మనస్తత్వం అభివ్యక్తమైంది. దీనికి జీవితమనే మార్గాన్ని, దాని చుట్టూ ఉన్న ప్రకృతినీ వర్ణిస్తూ, ఆ ప్రకృతిని ఆరు ఋతువుల్లోని రెండింటితో సామ్యం చెప్పాడు. సంతోషానికి వసంతఋతువునీ, విషాదానికి లేదా ముగిసిపోతున్న జీవితానికి శిశిరాన్ని ప్రతీకాత్మకం చేశాడు. దాన్ని చివరిలో 'రక్తసిక్తమైన కాన్వాస్' అని ముగించాడు. జీవితమనే రహదారిలో అనేకమంది నడుస్తుంటారు. రకరకాలైన సన్నివేశాల్ని, సంఘటనల్ని, కొన్నిసార్లు వివిధ చిత్రకారులు వేసే చిత్రాల్ని చూస్తుంటారు. కవి ఒక జీవితమేదో అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత కనిపించబోయే చిత్రాన్ని మనసులో రూపుకట్టిస్తున్నాడు. అందుకే దీని శీర్షికను 'నభోతో నభవిష్యతి' అని పెట్టడం ద్వారా 'ఇలాంటి అర్థాంతరంగా ముగిసిపోయే జీవితం ఇంతకు ముందలేదు, ఇకపై ఉండకూడద'నే ఆకాంక్షతో పెట్టినట్లుంది. విషాదాన్ని వర్ణిస్తూనే, ఆశను చిగురింపజేయడం ఈ కవితాఖండికలో కనిపించే గొప్ప అభివ్యక్తి వైవిధ్యం. దీని ద్వారా కవి-మానవజీవితం మన చేతుల్లో ఉన్నట్లే ఉన్నా, ఏదీ మన చేతిలో లేకుండా పోయే ప్రమాదం కూడా పొంచే ఉంటుందని గమనించాలి. అప్పుడు మానవుని మానసిక, భౌతికస్థితి ఎలా ఉంటుందో చెప్పలేం. అలాంటి స్థితిని ఈ కవితలో ప్రతీకాత్మకంగా అభివ్యక్తీకరించాడు కవి.

ముదిగొండ వీరభద్రయ్య తత్త్వదర్శనం గురించి 'విమర్శ, కళాతత్త్వశాస్త్రం' లో ఇలా చెప్పాడు. **"తత్త్వ**

**దర్శనం అన్నది ప్రతి ప్రతీకలోను మౌలికంగా ఉండి తీరాల్సిన అంశం. కవి వస్తువులోని తత్వాన్ని దర్శించి నపుడే ప్రతీకకు సామాగ్రి అతడు పొందినట్లు"** (పు:283). కవిత్వంలో ఇతర కవితా వస్తువులను వేరుచేసి తనను తాను చూపించుకోగలదు ఈ తాత్త్వికత. అయితే కవిత్వంలో తాత్త్వికత ప్రతీకగా నిలిచింది అన్న విషయం అందులో పైకి కనిపించే అంశం చెప్పలేదు. ఈ అంశం లుప్తం అవడం వల్ల సామ్యం తాత్త్వికం అయి ప్రతీకగా నిలుస్తుంది. కవి 'రహస్యం విప్పిన చిలుక' కవితలో మరణాన్ని లుప్తం చేసి పంచభూతాల్ని పంచేంద్రియాలకి ప్రతీకలుగా చేసి తాత్వికతను ఇలా అభివ్యక్తీ కరించి చెప్పాడు. **"చూపులన్నీ నిర్జీవాలు/కోపతాపాలు అన్నీ బలవంతపు ప్రయత్నాలు/మాటల్లో వేదాంతం/చేతల్లో విద్యుక్తం/క్షణక్షణాల్లో జీవితం/వరం పొందాకే నిర్వేదం!/ నీటి బుడగలో, మట్టి కుండలో/కొవ్వొత్తి వెలుగులో/ఆకాశ నక్షత్రాల్లో.../తెలుస్తున్న జీవ రహస్యం"** (రహస్యం విప్పిన చిలుక, పుట:86)

ఈ కవితలో కవి తాను చూసిన ప్రాంతాల్ని మానవ జీవి తంలో కవిత్వీకరిస్తున్నాడు. ఇందులో పైకి సీతాకోక చిలుకను కోన సీమతో పోలుస్తున్నట్లు కనిపిస్తుంది. కాని సీతాకోకచిలుక పదం ద్వారా మానవుని ప్రాణాన్ని ధ్వని రూపంలో మనకి స్ఫురింపచేస్తున్నాడు. ఇక్కడ కవి కవిత్వంలో అల్లెగొరి అనే టెక్నిక్‌ను ఉపయోగించాడు. అలిగెరి (Allegory) అంటే ఒక కవిత పైకి ఒక అర్థాన్ని కలిగి ఉండి అన్యాపదేశంగా మరో అర్థాన్ని స్ఫురింప చేస్తున్నట్లయితే ఆ కవిత చెప్పబడిన 'టెక్నిక్‌ని అల్లెగొరి అంటారు. ఈ టెక్నిక్‌నే కవి ఇందులో ప్రయోగించాడు. తెలుగులో 'ప్రాణం పోతుంది' అనే నానుడి ఉంది. ఆ ప్రాణాన్నే ఆత్మ అని అంటారు. ఆత్మ భౌతికమైన దేహంతో కూడినప్పుడు జీవాత్మ రూపంతో మానవుడిలోకి వస్తుంది. 'జీవాత్మ' శరీరం విడిచి మరో శరీరంలో కలిసి పోవడం గాని లేదా శాశ్వతంగా 'పరమాత్మ'లో ఐక్యం కావడం గాని జరుగుతుందని భారతీయ ఆధ్యాత్మిక చింత చెప్తోంది. మరో శరీరంలో కలిస్తే పునర్జన్మ పరమాత్మలో లీనమై పోతే మోక్షం. అందుకనే ప్రతి జీవిలోను ఆత్మ ఉంటుందని, 'ఆత్మ'కు చావులేదని హిందూ మత గ్రంథాలు చెప్తున్నాయి. రకరకాల భౌతిక దేహాల్లో ఆత్మ వివిధ పరిణామాల్ని పొందుతుంది. అది రకరకాల పరిణామాల్లో మనకి కనిపించే ఒక దశ సీతాకోక చిలుక లాంటిదే అని వర్ణించాడు కవి.

ఈ కవి మరోకచోట వజ్రానికి, సంకల్పానికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని సూచిస్తూ బంధం అనే లక్షణాన్ని చెప్పాడు. వివరించదలచుకున్న విషయానికి, దానికి ప్రతీకగా నిలపదలచుకున్న విషయానికి మధ్య పరస్పర సంబంధం ఉండాలి. దీన్నే ఆంగ్లంలో Correspondence అంటారు. ఇది కవిత్వాన్ని అభివ్యక్తీకరించే ప్రతీక లక్షణాలలో చాలా ముఖ్యమైనది. చెప్పదలచుకున్న అంశానికి ఎన్నుకున్న వస్తువుకి మధ్య సంబంధం కనిపిస్తేనే కవి దేన్నైనా మరొక దానికి ప్రాతినిధ్యం వహింప చేయ గలుగుతాడు. సహజంగా కవిత్వం భావుకతకు సంబంధించింది అయితే అందులో ప్రతీకలుగా ప్రకృతి, పూలు, చెట్లు, వాన, మంచు ఇలాంటివి గ్రహించబడి కవి మనసులో మెదిలే భావచిత్రం పాతుకుని మనసుకు హత్తుకునేలా అభివ్యక్తీకరించాడు కవి. ప్రక ృతిలోని వస్తువులు ప్రతీకలుగా ఉండటంవల్ల విషయం, వస్తువుల మధ్య సంబంధం దృఢంగా ఉంటుంది. అలాగే ఈ కవి సంకల్పానికి వజ్రాన్ని గ్రహించి ఆ రెండింటి మధ్య అవినాభావ సంబంధాన్ని ఇప్పుడు కావాల్సింది అనే కవితలో ప్రతీకాత్మకం చేసి చెప్పాడు కవి. 'వేంపెంట' ప్రాంతంలో దళితుల్ని కొంతమంది భూస్వాములు దారుణంగా చంపేశారు. ఆ సంఘటన 1998 జూలై 16 వతేదీన జరిగింది. భూస్వాములు కొంతమంది దళితుల్ని చంపేశారు. దళితులు కూడా పొలాలు పండించుకొని, తమతో పాటు పోటీగా విఘ్నేశ్వరుని ఉత్సవాలు చేసుకుంటూ,

దేవుణ్ణి ఊరేగిస్తూ గ్రామంలోకి తీసుకొని రావడం వంటి చర్యలన్నీ భూస్వాముల్లో దళితుల పట్ల ద్వేషాన్ని పెంచాయి. అందువల్ల దళితుల్ని పట్టపగలే ఎనిమిది మందిని దారుణంగా నరికేశారు. కోర్టుల్లో న్యాయం జరుగు తుందో లేదో అని సందేహిస్తున్న తరుణంలో నక్సలైట్లు ఆ భూస్వాముల్ని చంపేశారు. తమ భావజాలం మార్క్సిస్టుదే అయినప్పటికీ, దళితుల పక్షం నిలిచినందుకు అటువంటివారికి మద్ధతు తెలుపు తున్నట్లు కవి ఈ కవిత రాశాడు. దీనిలో కవి కుల దృక్పథంతో జరుగుతున్న అన్యాయాలకు వర్గదృక్పథంతో చేస్తున్న పరిష్కారాల్ని కూడా ఆహ్వానిస్తున్నాడనిపిస్తుంది. **"ఇప్పుడు కావాల్సింది/ గుండె ద్రవించడం కాదు/వజ్ర సంకల్పాన్నందించాలి!"** (ఇప్పుడు కావాల్సింది: 54)

ఇక్కడ వజ్రం అన్నది కవిత్వంలో సంబంధించి సంకల్పానికి ప్రతీకగా మారింది. వజ్రానికి ఉన్న కాఠిన్యం, అదుర్భేద్యత్వం అనే అంశాల్ని ఇక్కడ సంకల్పానికి ఆపాదించాడు. సంకల్పం గుండె ద్రవించినట్లు అంటే సంతోషం దుఃఖం వంటివి కలిగి నప్పుడు మన భావాలు ఎలా అయితే మారుతాయో అలా కాకుండా ఎన్ని ఆటంకాలు, సమస్యలు వచ్చిన వాటిని అధిగ మించి మన సంకల్పాన్ని నెరవేర్చుకోవాలి. అంటే వజ్రం ఎంత గట్టిగా ఉంటుందో మన సంకల్పాన్ని కూడా అంతే గట్టిగా దృఢ నిశ్చయంతో ఉండి సాధించుకోవాలి. ఈ విషయాన్ని చెప్పటానికి కవి అతి కాఠిన్యమైన వజ్రాన్ని సంకల్పానికి ప్రతీకగా స్వీకరించాడు.

అలాగే **'నానీ నువ్వెప్పుడొస్తావురా'** కవితలో కన్నీటికి ముత్యాలను ప్రతీకగా గ్రహించి వాన చినుకుకి ముత్యాలతో ఉన్న సంబంధాన్ని కన్నీటికి ముత్యాలకి అనువర్తించేలా అభివ్యక్తీకరించాడు కవి. **"నేనేమని చెప్పనురా / ప్రతి కలకీ నువ్విస్తున్న / కన్నీటి ముత్యాల దండల్ని / బాత్‌రూంలో దాచేస్తున్నానని చెప్పనా? / నా మధుమోహనాంగి / మళ్ళీ మళ్ళీ పిలుస్తుంటుందని చెప్పనా?" ('నానీ నువ్వెప్పుడొస్తావురా: 74)** ఇక్కడ 'మధుమోహనాంగి' అనే ప్రయోగంలో ఒక చమత్కారం ఉంది. 'మధుమేహం' మనిషిని మోహించిందంటున్నాడు. 'మోహం' ఒకరికి సంబంధించిందే. కొన్ని సార్లు ఇద్దరికీ కూడా ఉండొచ్చు. కానీ, మధుమేహం (షుగర్) ని మోహించేవాళ్లెవరు? అంటే మనం వద్దన్నా అదే మోహిస్తుంది. కాబట్టి ఒకవైపునుండే మోహింపబడ్డం జరిగింది. ఇక, ఆ మోహంలో పడిన తర్వాత దాని చుట్టూ తిరగాల్సిందే. మధుమేహాన్ని ఒక వ్యక్తిగా ఆరోపించాడు కవి. అందువల్లనే ఆ మధుమేహాన్ని స్త్రీలింగంగా భావించి 'మోహనాంగి' అన్నాడు. ఆమె మోహంలో పడిన తర్వాత ఆమె ఎప్పుడు రమ్మంటే అప్పుడు, ఎక్కడికి రమ్మంటే అక్కడికి పోవాల్సిందే.

**"అణువులో అణువునై"** కవితలో కూడా నిరాశకు ప్రతీకగా ఆకాశాన్ని గ్రహించి తాత్త్వికంగా ఆధ్యాత్మిక దృష్టితో మోక్షం పొందాలని ఇలా రచించాడు. **"ఏకాకిని చేసి భయపెట్టే / నిరాశ నిశీధికి / నిలయమైన నాకళ్ళు / నీ రాకతో తేజోవంతమై మెరిసి పోతున్నాయ్ / ఆ అణువులో ఒక అణువునై / లయమై పోవాలనుకునే / ఇన్నేళ్ళ నిరీక్షణకో / సుమధుర సుందర సాక్షా త్కారం" (అణువులో అణువునై .పుట:89)**

ఇక్కడ 'సుమధుర సుందర సాక్షాత్కారం' అనేది భగవంతునిలో లీనమైపోవడం, భగవంతుణ్ణి ప్రియునిగా భావించి మోక్షం పొందడం అనే వాటికి ప్రతీకలుగా నిలిచాయి. ఇందులో కవి ఒక రకమైన తాత్త్వికపరమైన ప్రయాణం కనిపిస్తుంది. కానీ నిజానికి దీనిలో తాత్త్వికతతో పాటు హేతుబద్ధత కూడా ఉంది. మరణం తర్వాత మనిషి అస్తిత్వం ఏమిటి? మనిషి తానున్నంత వరకు అన్ని నావే అనుకుంటాడు. సమస్తం తానే అనుకుంటాడు. మరి తానే వెళ్ళిపోయాక... అంతా తానే అనుకున్నది... అన్నీ తనవే అనుకొన్నవి... ఏమైపోతాయి? తను లేకుండా అవి ఎలా ఉం టాయన్న మనిషి జిజ్ఞాసలో అర్థముందా? సమాధానానికి అందని ప్రశ్నలేం కావివి. వీటికి సమాధానాల్ని వెదికే ప్రయాణమే ఈ కవిత.

ఇలా రకరకాల అనుభవాల నేపథ్యాలకి అక్షరూపం ఇచ్చి పాఠకులను ఆలోచింపచేసే విధంగా ఈ నెమలి కన్నులు కవితా సంపుటిలో 'అభివ్యక్తి' వైవిధ్యంతో కొనసాగి పాఠకుల్ని చదివిస్తూ, ఆలోచింపజేస్తుంది. అనుభూతి వెల్లువనిస్తుంది. ఆహ్లాదాన్నిస్తూ, కొత్త కవితాభివ్యక్తులకు ప్రేరణనిస్తుంది.

## ఉపయుక్త గ్రంథసూచి :

1. **వేంపెంట** : ఈ 'వేంపెంట' అనే గ్రామం, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. భూస్వాములు కొంతమంది దళితుల్ని చంపేశారు. దళితులు కూడా పొలాలు పండించుకొని, తమతో పాటు పోటీగా విఘ్నేశ్వరుని ఉత్సవాలు చేసుకుంటూ, దేవుణ్ణి ఊరేగిస్తూ గ్రామంలోకి తీసుకొని రావడం వంటి చర్యలన్నీ భూస్వాముల్లో దళితుల పట్ల ద్వేషాన్ని పెంచాయి. అందువల్ల దళితుల్ని పట్టపగలే ఎనిమిది మందిని దారుణంగా నరికేశారు. కోర్టుల్లో న్యాయం జరుగుతుందో లేదో అని సందేహిస్తున్న తరుణంలో నక్సలైట్లు ఆ భూస్వాముల్ని చంపేశారు.

❀ ❀ ❀

# నెల్లూరు జిల్లా - డప్పు విన్యాసం

**- కె. వెంకట రమేష్ బాబు,** పరిశోధక విద్యార్థి, ప్రాచ్యపరిశోధన సంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

పల్లెటూళ్ళలో పండుగలు పబ్బాలుకు మంగళ వాయిద్యం తప్పని సరిగా ఉంటుంది. మేళతాళాల మోతతో గ్రామాల్లోని వీధులు మారుమోగుతుంటాయి. వాటికి అంతటి ప్రాధాన్యత ఉంది. అందుకే పెద్దలు వేళాపాలా లేని తిండి తాళం మేళం లేని పెళ్ళి వ్యర్థమని అంటారు. వాటి కోవకు చెందినదే డప్పు విన్యాసం. నాటి నుండి నేటి వరకు డప్పు విన్యాసానికి ఎంతో ప్రాచుర్యం ఉంది. నెల్లూరు జిల్లాలో ప్రతి గ్రామంలో ఉత్సవాలకు ఊరేగింపులకు జాతర్లకు, పెళ్లిళ్లకు, తిరునాళ్లకు ఆన వాయితీగా డప్పు వాయించేవాళ్లు ఉన్నారు. డప్పు విన్యాసం గురించి తెలియజేయడవే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.1974-75 ప్రాం తంలో యల్లాయపాళెం గ్రామం లో వడ్లమూడిపెద్ద రాఘవయ్య గారి కుమారుడు చని పోయనప్పుడు ఆ గ్రామమంతా విషాదచ్ఛాయలు అలు ముకున్నాయి. వారిని ఆ విషాదం నుండి బయటికి తీసుకురావడానికి రాఘవయ్య మిత్రుడు కామ్రేడ్ జక్కా వెంకయ్యగారు. ఏదో ఒక జానపద కళకు తీసుకొచ్చి ఆ గ్రామంలో నేర్పిస్తే బాగుంటుందని ఆలోచించి కృష్ణా జిల్లాలోని ఉంగుటూరు మండలం నుంచి డప్పు విన్యాసం నేర్పించే గురువు బసవయ్యను పిలిపించి ఆ గ్రామస్తు లకు డప్పు వాయిద్యంలో శిక్షణ ఇప్పిం చాడు. అప్పటి నుంచి నేటి వరకు అందరూ డప్పు విన్యాసం నేర్చు కున్నారు. 20 నుంచి 30 మంది దాకా యూనిఫాంలాగా ఒకే రకమైన దుస్తులు వేసుకొని చుట్టు పక్కల గ్రామాలలో ఏ చిన్న కార్యక్రమం జరిగినా వీరు వెళ్లి డప్పుల ప్రదర్శన ఇచ్చేవారు. ఎంతో నైపుణ్యంతో నేర్చుకున్న వీళ్ల డప్పు వాయిద్యం మంచి పేరుప్రతిష్టలు సంపాదించుకుంది. అనతికాలంలోనే డప్పు వాయిద్యం అంటే యల్లాయపాళెం అనే పేరు మారుమ్రోగిపోయింది. అంత గొప్పగా ఆ ఊరివాళ్లు డప్పు వాయిద్యాన్ని ప్రదర్శించేవాళ్లు. 1990లో నెల్లూరు జిల్లాకు వచ్చిన ఆనాటి రాష్ట్ర గవర్నర్ కుమిత్ మన్ జోషిగారు నెల్లూరులోని కస్తూరి బా కళాక్షేత్రంలో నటరాజన్ అనే అవార్డు వడ్లమూడి రాఘవయ్య గారికి ఇచ్చారు. వడ్లమూడి రాఘవయ్యగారు తన శిష్యులను వ్యసనాలకు దూరంగా ఉంచి మంచి కళాకారులుగా తీర్చి దిద్దారు. వారిలో తల్లు శీనయ్య ప్రముఖ డప్పు విన్యాస కునిగా ప్రసిద్ధి పొందారు. ఆ తరువాత ప్రొద్దుటూరు నుంచి చంటెయ్యను తీసు కొచ్చి కొంతకాలం నేర్చు కున్నారు. ఆయన తరువాత గుంటూరు జిల్లా నుంచి మన్నేపల్లి పాములు అనే అతన్ని తీసుకొచ్చి ఒక నెల రోజులు ఈ డప్పు వాయిద్యాన్ని నేర్చుకున్నారు. ఆయనకు డబ్బులు ఇచ్చే సమయంలో రేడియో కేంద్రంలో ఉన్న డైరెక్టర్ గారిని సినీ దర్శకుడు కె. విశ్వనాథ్ నెల్లూరుకు వచ్చి తన సినిమాలోకి జానపద కళాకారులు కావాలి అని అడుగగా, ఆయన యల్లాయపాళెం అనే ఒక గ్రామం ఉంది. ఆ ఊరిలో మంచి కళాకారులు ఉన్నారు. పాటలు బాగా పాడుతారు. డప్పు బాగా వాయిస్తారు. అన్ని రకాల కళాకారులు అక్కడ ఉన్నారు అని కె.విశ్వనాథ్గారికి చెప్పారు. అప్పుడు కె.విశ్వనాథ్గారు యల్లాయ పాళెం గ్రామానికి ఒక వాహనాన్ని పంపి కళాకారులు కావలి ఆర్డీవో ఆఫీసుకు రావాల్సిందిగా కోరారు. అప్పుడు కొందరు ఈ గ్రామం నుంచి వెళ్లారు. ఆర్డీవో ఆఫీసులో వీళ్లతో డప్పు వాయిద్యాన్ని ప్రదర్శింపజేసి, అందులో కొందరిని 'సూత్రదారులు' అనే సినిమాలోకి ఎంపిక చేసుకున్నారు. ఈ సినిమా షూటింగ్లో భాగంగా అన్నమయ్య దేవా లయం, అన్నవరంలో వారంరోజులు, రాజమండ్రి దగ్గర దేవీపట్నంలో డప్పు వాయిద్యాన్ని ప్రదర్శించడం జరి గింది. 1993లో ప్రజానాట్య మండలి గుంటూరు జిల్లా, సత్తెనపల్లి నియోజకవర్గం, పణిద గ్రామంలో రాష్ట్రస్థాయి డప్పుల శిక్షణా కార్యక్రమం పెట్టింది. ఆ శిక్షణకు నెల్లూరు

జిల్లా నుంచి యల్లాయపాళెం గ్రామానికి చెందిన తల్లు శీనయ్య గురువుగా ఎంపికై 150మంది కళాకారులకు అక్కడి కళాశాలలో ఒక నెలా పదిహేను రోజులు శిక్షణ ఇచ్చాడు. తమిళనాడు, కడప, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో ఇప్పటికీ శిక్షణ ఇస్తున్నాడు. అణ గారిన ఈ డప్పు కళకు ఒక డ్రస్ కోడ్ పెట్టుకుని 2016 మార్చి 24న డప్పు కళాకారుల సంఘం ఏర్పాటు చేయబడింది నెల్లూరు జిల్లాలో. జిల్లా కార్యదర్శిగా తల్లు శీనయ్య ఎంపికయ్యాడు.

## డప్పుల తయారీ విధానం :

పూర్వకాలంలో గంగిరేని, వేప, పెద్దరేగిలాంటి చెట్ల కొయ్య లతో ఈ డప్పును తయారుచేసేవారు. మొదట ఆ కొయ్యలను తీసుకొచ్చి గ్రామాలలో ఉండే కొలిమోళ్ల దగ్గర ఇస్తారు. వాళ్లు వాళ్ల దగ్గరుండే బాడిశ, ఉలితో కొయ్యలను వంకరగా నాలుగు ముక్కలు చేస్తారు. వాటిని గుండ్రంగా పెట్టి అలిమేను గిన్నెలతో అతికిస్తారు. రెండు అడ్డవేళ్ల వెడల్పు, మూడు అంగుళాల పొడవు చేసి దానిని సీలలతో బిగించేస్తారు. చనిపోయిన పశువులు, దూడల చర్మాలు తీసుకొచ్చి అవి నానబెడతారు. చింతగింజలను దంచి అన్నంలో ఉడకేసి, ఆ తరువాత బాగా నూరి ఆ బందనాన్ని తీసి కొయ్యకు పూసి చర్మాన్ని అతికించి తాళ్లతో ఆ పక్క ఈ పక్క బాగా లాగి బరువు పెడతారు. వారం లేదా పదిరోజులు ఎండబెడతారు. ఆ తరువాత ప్రోగ్రాంకు వెళ్లాలనుకున్నప్పుడు ఈ డప్పును సెగ చేయాలి. ఎండిన వరి గడ్డి, తాటాకులతో అలా వేడి చేసినప్పుడు మంచి నాదం వస్తుంది. మనకు కావాల్సిన నాదం వచ్చేంత వరకు వేడిచేసుకొని తరువాత ప్రదర్శనుకు తీసుకెళతారు. ఆ శబ్దం రెండు మూడు గంటలదాకా ఉంటుంది. మళ్లీ తగ్గిపోతుంది. అలా తగ్గినప్పుడు మళ్లీ సెగ పెట్టుకోవాలి. డప్పు నేర్చుకోవాలంటే కనీసం 30మంది ఉండాలి. దీనిని ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా నేర్చుకోవచ్చు. డప్పు నేర్పే క్రమంలో గురువు మొదటిరోజు ఒక పాఠం నేర్పిస్తారు. దానిని ఆది తాళం అంటారు. అది ఎలా ఉంటుందంటే 'జాం తాక్ తాక్ తాక్ జాం తాక్ తాక్ తాక్ జాం తాక్' దీనిని మొదటి పాఠం అంటారు. దీనిలో మూడు రకాల అడుగులు ఉంటాయి. ఈ పాఠం 30 మందికి చెప్పి వాళ్ల చేత వాయింపజేస్తారు. వాళ్లందరూ ఇది నేర్చుకున్నప్పుడు అడుగులు నేర్పిస్తారు. ఈ వాయిద్యంలో 15రకాల పాఠాలు ఉంటాయి.

'జాం తాక్ తాక్ తాక్ జాం తాక్ తాక్ తాక్
జాం తతనక్ నాక్ జాం తతనక్ నాక్ జాం తతనాక్
జగ్గినకక్కం నకాక్ జనన జగ్గినకక్కం నాకాక్ జనజన
జగ్గి జగ్గి జనికం నకం నాక్ జగ్గి జగ్గి జనకం నకం నాక్
జనాక్ నక నక్ జనాక్ నక నక్ జనాక్ నక నక్

దొండాకు బీరాకు అనేది ఒక పాఠం. ఇందులో మరలా తొమ్మిది రకాల రిథాలుంటాయి. ఈ దొండాకు బీరాకు పాఠాన్ని జాతర్లలో వీరంగం అంటారు. దొండాకు బీరాకులో మొదటి పాఠం. 'జగింత నకదిన జగింత నకదిన జగింత నకదిన దిగ్గి దిగ్గి నాక దిన దిగ్గి దిగ్గి నాక దిన' దీన్ని జాతర్లలో వీరంగం అంటారు. యాదవులు వీరతాళ్లు వేసేటప్పుడు మాతమ్మలకు, ఆడ దేవతలకు ఉత్సవాలు చేసేటప్పుడు ప్రాధాన్యం కలిగిన వాయిద్యం ఈ వీరంగం. 'జిగి తాక్ జిగి తాక్ జిగి తాక్ జిగి తాక్ జిగి తాక్' దీన్ని కొంచెం ముందుకు వెళ్లి దొండాకు బీరాకు పాఠంగా మలుచుకొని 'దొండాక్ దొండాక్ దొండాక్ దొండాక్ బీరాక్ బీరాక్ దొండాక్ బీరాక్ దొండాక్ బీరాక్' అని వాయిస్తారు.

## తిరునాళ్లకు సంబంధించిన పాఠాలు :

## చిందరువు :

మాతలు ఆడే ఆటను 'చిందరువు' అంటారు. ఆ సందర్భంలో వాయించేవి

'జనగిరులు జజ్జినాక్ జనగిరులు జజ్జినాక్ జనగిరులు
జజ్జినాక్ జన-జజ్జినాక్ జన-జగ్‌నాక్
జగ్ నాక్ జగ్గునాక్ జగ్గునాక్ - జన జగ్ నాక్ జగ్ నాక్ జగ్ నాక్

## పులివేషాల సందర్భం :

దిరి గిరి గిన్నక్ దిరి గిరి గిన్నక్ గిరి గిరి గిరి గిరి
గిరిజ దిరి గిరిజ - జె జె జె జె జె

జగ్ నక నక జగ్గు నక నక జగ్గు నకజ జె జె జె

జగ్ నక నక జగ్గు నక నక నజ జె జె జె జె జె జగ్గనక నక నకజ జగ్గు న నక నకజ

**కర్రసాము :**

1. జరిగించకనాక్ జరిగించకనాక్ జరిగించకనాక్ జెజ్జెన జజ్జనజాం తజ్ఞాంత నకజ
2. తిరిగింత తాక్ తాక్ తిరిగింతక తాక్....జె జె జెజ్జన తజ్ఞాంత నకజ
3. జరిగించ నక నక కరిగించ నక నక జరిగించ నక కరిగించ నక కరిగించ నక
4. జన్నక్ నికనాక్ తన్నక నికనాక్ జన్నక నికనాక్ నక తన్నక నికనాక్

ఇలా కొన్ని పాతాలు ఉన్నాయి డప్పులు వాయిస్తుంటే డప్పు లకు అనుగుణంగా నైపుణ్యం గల అడుగులు వేస్తారు. డప్పు విన్యాసాల్లో మనుషులపై మనుషులు ఎక్కడం, కింద నలుగురు, పైన నలుగురు నిలబడి వాయించడంలాంటి విన్యాసాలు ఎన్నో చేస్తారు. సాధారణంగా డప్పు నేర్చుకోవాలంటే కనీసం 30 రోజులు పడుతుంది. పాతాలు, అడుగులు తినాళ్ళకు, జాతర్లకు కళాత్మకంగా వాయించాలంటే సంవత్సరం పడుతుంది. డప్పు విన్యాసం వలన మానసికానందం కలగడమే గాకుండా వివిధ భంగిమలలో నృత్యాలు చేయడం వలన దేహ దారుఢ్యం కలుగుతుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగు పత్రికారంగంలో - ఓరుగల్లు

- షేక్ అక్బర్ పాషా, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్,

వరంగల్ జిల్లా వ్యాపారానికెంత ప్రసిద్ది చెందిందో, కాకతీయ శిల్పకళకు ఎంత ప్రాశస్త్యం చెందినదో సాహిత్య వికాసానికి అంతే ప్రసిద్ది చెందింది. సాహిత్య వికాసానికి పత్రికలు జీవగర్రలు ఈ పత్రికల ద్వారా ఎంతో మంది రచయితలు వెలుగులోకి వచ్చారు. వస్తున్నారు. ఈ పత్రికలు, వర్తమాన, భవిష్యత్ కాలాలకు వారధి లాంటివి. అంతేగాదు ప్రజలకు ప్రభుత్వం మధ్య అవగాహనకు సోపానాలు అని చెప్పటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఈ పత్రికలే ప్రపంచ నలుమూలల వార్తలు, సాహిత్యం ప్రజలకు సన్నిహితం చేస్తాయి. ప్రజాసంబంధాలకు దగ్గరయిన ఈ పత్రికా రంగంలో వరంగల్ జిల్లా నుండి వచ్చిన తెలుగు పత్రికల గురించి శోధించినప్పుడు నా దృష్టిలోకి వచ్చిన పత్రికల వివరాలకు సంపా దకులపేర్లను ఇక్కడ పొందుపరుస్తున్నాను.

| | పత్రికలు | సంపాదకులు |
|---|---|---|
| 1. | కాకతీయ దిన పత్రిక | చోడవరపు రాజనేంద్ర |
| 2. | తెలుగు పత్రిక 1922-25 | ఇనుగుర్తి - ఒద్దిరాజు సోదరులు |
| 3. | పూలదోట మాసపత్రిక | కంభంపాటి అప్పన్నశాస్త్రి |
| 4. | శోభ మాసపత్రిక 1947-48 & 50, 51 | దేవులపల్లి రామానుజరావు |
| 5. | కాకతీయ వారపత్రిక 1945-52 | పాముల సదాశివరావు |
| 6. | వెలుగు 1952-55 జనగామ | 1957-1960 వరంగల్ చోడవరపు విశ్వనాథం |
| 7. | విశ్వసాహితి (పర్కాల) | కటంగూరు నరసింహరెడ్డి |
| 8. | గౌడపత్రిక | కక్కెర కాశీనాథం |
| 9. | విరాట్ (ప్రస్తుతం హైదరాబాద్ నుండి వస్తుంది) | వేంకటేశ్వరశాస్త్రి |
| 10. | ప్రగతి వారపత్రిక | బండారు చంద్రమౌళీశ్వరరావు |
| 11. | జనధర్మ వార పత్రిక | టి.వై. నరసింహాచార్య |
| 12. | సాధన మాసపత్రిక 1965 | బండారు సదా శివరావు |
| 13. | మానధర్మ మాసపత్రిక 1950 | టి.లోకాచార్య |
| 14. | ధర్మభూమి వారపత్రిక | కె. చంద్రమౌళీశ్వరరావు |
| 15. | జనధర్మవారపత్రిక 28-11-1958 | యం.ఎస్. ఆచార్య |
| 16. | జనధర్మద్వై వార పత్రిక 1976 | యం.ఎస్. ఆచార్య |
| 17. | జనధర్మ (ద్వైమాసిక సాహిత్యానుబంధం) | యం.ఎస్. ఆచార్య<br>కోవెల సుప్రసన్నా చార్యులు సంపాదకులు |
| 18. | వరంగల్లు వాణి దినపత్రిక 1980 | యం.ఎస్. ఆచార్య |
| 19. | జనధర్మ (ప్రస్తుత వరంగల్ వాణి అనుబంధ సంచిక) | |
| 20. | ప్రజామిత్ర వారపత్రిక 1965 | దివ్వెల హనుమంతరావు |

| | | |
|---|---|---|
| 21. | కవితాజ్యోతి 1964 నవంబర్ | ఎ.వి.సత్యనారాయణ |
| 22. | గ్రామాభ్యుదయ త్రైమాస పత్రిక 1967 | కీర్తి రామనాథం |
| 23. | పరిశ్రమ పక్షపత్రిక | మాచర్ల జగన్నాథం |
| 24. | ప్రతినిధి | యస్. మల్లేశం |
| 25. | సృజన మాసపత్రిక 1967 | పెండ్యాల వరవరరావు |
| 26. | ఏకశిల వారపత్రిక 1972 | బి. దేవమ్మ |
| 27. | ఏకశిల వారపత్రిక 1983 | ఎ. దేవయ్య |
| 28. | ఆరోగ్యసధనం మాసపత్రిక 1972 అక్టోబర్ | చిలువేరు కృష్ణమూర్తి |
| 29. | ఓరుగల్లు ధర్మ వారపత్రిక 1974 | టి. రాజేశ్వర రావు |
| 30. | తెలుగు ధర్మ వారపత్రిక 1968 | దుగ్గిశెట్టి వెంకటయ్య |
| 31. | ప్రజాయుగం వారపత్రిక | ఎస్.పి. రాజేశ్వరరావు |
| 32. | దీపిక మాస పత్రిక | వై. విద్యాసాగర్ |
| 33. | విమర్శిని వార్షిక సంచిక 1976-80 | కాకతీయ విశ్వవిద్యాలయం |
| 34. | కోరిక మాసపత్రిక 1981-82 | టి. భాస్కరాచార్య |
| 35. | ప్రసారిక మాసపత్రిక 1982 | నమిలికొండ బాలకిషన్‌రావు |
| 36. | అగ్రగామి వార్తాపత్రిక 1982 జనగామ | కన్న పరశురాములు |
| 37. | విశ్వతరంగిణి మాసపత్రిక 1984 | శ్రీమతి కట్టశశికళ |
| 38. | పల్లె జీవితం పక్ష పత్రిక | మరం శేఖరయ్య |
| 39. | చిత్రవిచిత్ర సినీ వార పత్రిక | రాజా |
| 40. | చిత్రగీత | వరంగల్ ఫిలింసొసైటి |
| 41. | అభ్యుదయం | కోకల సీతారామశర్మ |
| 42. | అదృష్టం జ్యోతిష్య మాసపత్రిక 1967-72 | మదుసూధనరావు |
| 43. | కార్మికశక్తి 1967 | బండారు నాగ భూషణరావు |
| 44. | తీర్పు వారపత్రిక 13-1-1986 జనగామ | విజయ్ కుమార్ |
| 45. | కాంగ్రెస్ వార పత్రిక 1952 | దేవులపల్లి సుదర్శన్ |
| 46. | సోషలిజం 1976 | పరీద్‌కైసర్ |
| 47. | ఆంధ్ర టెలివర్కర్ 1966 | యం.జనార్ధనం |
| 48. | వ్యాపారం రంగం 1967 | జి.వి. రామకృష్ణరావు |
| 49. | ప్రాపర్ న్యూస్ పరకాల 913 | కేలిక కిషన్ ప్రసాద్ |
| 50. | తేజోమయ మాసపత్రిక 1971 | జి.వి.యస్. ఆచార్య |
| 51. | దేవస్థానవాణి 1968 | టి.వై.ఎస్. ఆచార్య |
| 52. | నాస్తికత్వం త్రైమాసిక 1965 | వెంపో |
| 53. | ఆంధ్రరాష్ట్రం 1967 | వి. రంగారావు |
| 54. | విమోచన పక్షపత్రిక 1976 | పి.కిషన్ రావు |

| | | |
|---|---|---|
| 55. | మానుకోటవార్త | బి.ఎన్. గుప్త |
| 56. | వరంగల్ పత్రిక | కోమురయ్య |
| 57. | యువతరంగం 1980 | గుండా ప్రకాశరావు |
| 58. | పిచ్చిగీతాలు మాసపత్రిక 1983 | ప్రారంభ సంచిక తెచ్చేలోనే మరణించేను |
| 59. | పేరు తెలియదు వారపత్రిక 1969 | మామిడి రమాకాంతరావు |
| 60. | శక్తిబందు వారపత్రిక 1986 | దివ్వేల రామారావు |
| 61. | Stage friends | తెలుగు రంగస్థల మాసపత్రిక 1986<br>పడాల భిక్షపతి |
| 62. | సేవా ప్రపంచం పక్షపత్రిక | దానం జనార్ధన్ |
| 63. | వైశ్యకల్ప | శ్రీమతి ఉప్పల భారతీ |
| 64. | Press Bulletin పక్షతరంగాణి 1987 | సముద్రాల ఓంకార్ |
| 65. | ఆదాయం 1988 | యం. రామారావు |

నేను ఇక్కడ పొందుపరుస్తున్న విషయం సంపూర్ణం కాదు. సమగ్రముకాదు, దాదాపు 200 వరకు పత్రికలున్నట్లు సమాచారం. నాకు తెలిసినంతవరకు ఇక్కడ వివరించాను. అయితే ఈ సమాచారాన్ని సేకరించుటకు నేను నమిలికొండ సునిత గారిని కలిశాను. ఆమె గతంలో "వరంగల్ జిల్లా పత్రికలు - సాహిత్య సేవ" అను అంశంపై పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని రాశి ఉన్నారు. అందులోని సమాచారాన్ని కొంత గ్రహించాను.

✿ ✿ ✿

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# మహబూబ్‌నగర్ కథలు - దళిత, గిరిజన, బహుజన జీవన చిత్రణ

**- డా॥ డి. మల్లయ్య** తెలుగు అధ్యాపకులు, పి.యస్.సి & కె.వి.ఎస్.సి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల, కర్నూలు జిల్లా.

1902 లో తెలుగు కథానిక పుట్టింది. 1910 లో తెలుగు కథానికా ప్రవాహం మొదలైంది. 1925 లో తెలుగు దళిత కథానిక వెలువడింది. తెలుగు నేలలో ఈ కథానిక పుట్టేనాటికి ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణ జాతీయోద్య మాలు బలంగా సాగడం, కుల సమానత వేదికమీదకు రావడం, అస్పృశ్యత ప్రధాన స్రవంతి కావడం, దళితులు ఆలోచనాపరులు కావడం, తాము కోల్పోతున్న హక్కులను గుర్తించడం, హిందూవాదాన్ని ప్రశ్నించడం, అగ్రవర్ణ దౌర్జన్యాన్ని వ్యతిరేకించడం లాంటి అంశాలు మొద లయ్యాయి.

ఆ తర్వాతి కాలంలో దళితులు చైతన్యవంతం కావడం అస్పృశ్యతను వ్యతిరేకించే ఉద్యమాలలో భాగస్వా ములు కావడం, భౌతిక వాదం మాటున ముందుకు సాగడం, తమ ఉనికిని మార్చుకొనే ప్రయత్నం చేయడం, దళిత ఉద్యమాలను బలోపేతం చేయడం, దళితులపై సాగే హింసను

అత్యాచారాలను ప్రతిఘటించడం, తమ హక్కులను కాపాడుకొనే ప్రయత్నం చేయడం, ఆ ప్రయత్నంలో సవర్ణుల నుండి దళితులు తీవ్ర హింసను ఎదుర్కొనడం, హత్యలకు గురికావడం, దళితుల ఆత్మగౌరవ పోరాటాలు సాగడం లాంటి అంశాలు గత శతాబ్దాన్ని బాగా కుది పేశాయి. ఇలాంటి గత శతాబ్ది సంఘటనలన్నింటికీ తెలుగు కథానిక సాక్షీభూతంగా నిలిచింది. గ్రామీణ సమా జంలోని దళితులు, వారి జీవన స్థితి, గాయాలు, చేస్తున్న పోరాటాలు, పొందుతున్న లాభాలు, చేయాల్సిన పోరా టాలు.... ఇలా వీటన్నిటిని రచయితలు తమ కథానికల ద్వారా రికార్డు చేసే ప్రయత్నం చేశారు. తెలుగు కథానికలో భాగంగా వచ్చిన మహబూబ్‌నగర్ జిల్లా కథా సాహిత్యంలో కూడా ఇవన్నీ చిత్రీకరించబడ్డాయి.

మహబూబ్‌నగర్ నిజాము ఏలుబడిలో వుండడం వల్ల ప్రజాజీవనంలో కొన్ని ప్రత్యేక పరిస్థితులు కనిపిస్తాయి. ఉన్నత వర్గాల వారు జాగీర్దార్లకు దగ్గరగా ఉండేవారు. వారి ద్వారా నిజాము ప్రభుత్వానికి కూడా దగ్గర కాని దళిత, బహుజనులకు అటువంటి అండ లేనే లేదు. వాళ్ళు నిజాము పోలీసుల దోపిడీకి గురయ్యారు. ఈ దోపిడీని మహబూబ్‌నగర్ జిల్లా కథకులు తమ కథల ద్వారా వ్యంగ్యంగా శక్తివంతంగా చిత్రించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో వివిధ ప్రక్రియల్లో గొప్ప రచనలు రావడం వెనుక అక్కడి ఉద్యమాలు ప్రధానంగా దోహదం చేశాయి. ఈ ఉద్యమాల్లో దళిత, బహుజనులు సాహసోపేతంగా పాల్గొన్నారు. నిజాం వ్యతిరేక పోరాటంలో వారి సాహస కార్యాలను ముఖ్యంగా తొలి తరం కథా రచయితలు గొప్పగా చిత్రించారు. అనంతర తరానికి చెందిన రచయితలకు నక్సలైట్ ఉద్యమంలో భూమి కోసం భుక్తి కోసం సాగిన పోరాటం కథా వస్తువైంది. ఈ కథల్లోనూ దళితులు, బహుజనుల త్యాగాలు చిత్రించ బడ్డాయి.

మహబూబ్‌నగర్ నుండి బొంబాయి ఆ పరిసర ప్రాంతాలకు వలస వెళ్ళిన పేదల బాధలపై అనేక కథలు వచ్చాయి. జీవనం గడవక పొట్టచేత బట్టుకొని వలస వెళ్ళక తప్పని పరిస్థితులొకవైపు, తల్లీతండ్రీ, ఊరువాడా వదలి దూరదేశం వెళ్ళలేక మరోవైపు పడ్డ వేదనను చిత్రిస్తూ కథలు రాసిన వారిలో గొరుసు జగదీశ్వరరెడ్డి (వలస పక్షులు); జనజ్వాల (... ఎడమకాలు చెప్పు జారింది, పిచ్చి పిల్ల); కోట్లవనజాత (సముద్రం); డా॥ భీంపల్లి శ్రీకాంత్ (వలసజీవులు); ఉదయమిత్ర (పేగు బంధం, అమ్మను జూడాలె....., పట్నం వచ్చిన ఎలుక) వంటి వారున్నారు.

పాలమూరు కథారచయిత గొరుసు జగదీశ్వర రెడ్డి రాసిన 'వలస పక్షులు' కథలో సగటు వలస కూలీలు వలస వెళ్ళాక అక్కడ కాంట్రాక్టర్‌ల దురాగతాలకు ఎలా బలైపోతారనేది ఈ కథలో ప్రధాన ఇతివృత్తం. పాల మూరు కరువు నేపథ్యంలో తన తండ్రిని పోగొట్టుకున్న

ఒక పిల్లవాడు తల్లితో కలసి విశాఖపట్నం వలస వెళ్ళి అక్కడ ఆమెనీ పోగొట్టుకుని, అక్కడే పనిచేస్తున్న మరొక వ్యాపారి సాయంతో పెరిగి, పెద్దవాడై బాగా చదువుకొని విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జూనియర్ మేనేజర్ అవుతాడు. ఆయన తన వృత్తిలో భాగంగా వున్నపుడు ఒక ప్రమాదం సంభవించి నూకాలమ్మ అనేకూలీ గాయపడుతుంది. అతడామెకు సహాయం చేస్తాడు. ఆమెకు న్యాయం జర గాలని తన పై అధికారులతో, కాంట్రాక్టర్లతో వాదిస్తాడు. ఆ క్రమంలోనే తన వైయక్తిక జీవితం ఎలా ధ్వంసమైందో చెప్తాడు రచయిత. "గగనంలోని పక్షులు మరోచోటుకి వలస వెళ్ళినా స్వేచ్ఛగా తిరుగుతూ వాటి పొట్టలు నింపు కొని కొన్నాళ్ళకి తిరిగి సొంతగూటికి చేరుతుంటాయి. కానీ, పాలమూరి పక్షులు రెక్కలు ముక్కలు చేసుకొంటూ, డొక్కలు మాడ్చుకుంటూ, మేస్త్రీలను, కాంట్రాక్టర్‌లను మేపడానికి వలస వెళ్తుంటాయన్న యదార్థం ఎందరికి తెలుగు" అనడం పాలమూరు వలస కూలీల జీవితాన్ని వివరిస్తాయి. వలస బాధితుల దయనీయ స్థితిని గురించి కూడా జనజ్వాల తన 'పిచ్చిపిల్ల' అనే కథలో చిత్రించాడు. ఇందులో వలస వెళ్ళిన తల్లిదండ్రుల కోసం వారు చని పోయారని తెలియక ఎదురుచూసి, తెలిశాక మానసిక అస్వస్థతకులోనయ్యే ఒక చిన్నారి జీవితం గురించిన ఇతివృత్తంతో సాగిన కథ. అవిద్యావంతులైన వలస కూలీలు కాంట్రాక్టర్ల దోపిడీకి ఎలా గురువుతున్నారో చిత్రిం చడం జరిగింది.

మహబూబ్‌నగర్ జిల్లాలో కనిపించే మరొక ముఖ్యమైన కోణం, ఈ ప్రాంతపు వెనుకబాటుతనం, ఈ వెనుక బాటుతనం కథల్లోకి కూడా ప్రవహించింది. ఇక్కడి నుంచే రచయితలు తయారై తమ వెతలకు అక్షరరూపం ఇవ్వడం, తమ బాధల గాథల్ని సహజంగా, శక్తివంతంగా చిత్రించడానికి ప్రయత్నించడం కనిపిస్తుంది. గ్రామాల్లో బడులు వచ్చాయి. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు పిల్లలకు అన్ని విషయాలు చెబుతుంటారు. ఇదే విషయం పాలమూరు కవి, రచయిత అయిన 'జనజ్వాల' రాసిన '...... ఎడమకాలు చెప్పు జారింది' అనే కథలో ఒక సాధారణ పేద కుటుంబీకుడు, నిమ్న కులస్థుడు, అయిన ఒక ఉపాధ్యాయుడు తన జీవితంలో చూసిన పాలమూర్ లేబర్‌కు సంబంధించిన విషయాన్ని చెప్పడమే ఇందులోని ప్రధాన ఇతివృత్తం. ఇందులో కథకుడు పాలమూర్ లేబర్ దయనీయ స్థితి గురించి, దళిత బహుజనుల జీవన స్థితి గతులను గురించి శక్తివంతంగా చిత్రించాడు. ఇదే విష యాన్ని ఇతివృత్తంగా తీసుకొని డా॥ భీంపల్లి శ్రీకాంత్ 'వలసజీవులు' కథలోనూ, ఉదయమిత్ర 'పేగుబంధం', 'అమ్మను జూడాలె', 'పట్నం వచ్చిన ఎలుక', కథల్లోనూ మహబూబ్‌నగర్ జిల్లా దళిత బహుజన, మైనారిటీ ప్రజల జీవన విధానాన్ని సహజంగా చిత్రించారు.

తెలంగాణలో బహుజనులకున్న అనేక సమస్యల్లో దొరల ఆగడాలు అతిపెద్ద సమస్య. ఇది మహబూబ్‌నగర్ జిల్లాలోనూ ఉంది. ఈ సమస్యకు ఇతివృత్తంగా చేసుకొని ఎందరో ఈ జిల్లా కథారచయితలు ప్రజా జీవితాన్ని చిత్రిం చారు. ఈ సమస్యను ఉదయమిత్ర రాసిన 'బానిస రాజ్జెం' కథలో మనం చూడవచ్చు. తక్కువ కులంలో పుట్టినప్పటికీ దొరలకు బాంచెలు కావొద్దని, విలువలతో మానవత్వంతో బతికే దళిత కుటుంబాన్ని ఓర్చుకోలేని, దొర ఎన్నో కుటిలోపాయాలతో ఒక దళిత కుటుంబాన్ని లొంగ దీసుకొని ఆ కుటుంబ జీవితాన్ని ఎలా విధ్వంసం చేసిండో కవి అటు దళిత చైతన్యాన్ని, ఇటు దొరల దౌర్జన్యాలను, ఆగడాలను, సామాజిక స్థితిని శక్తివంతంగా చిత్రించాడు. ఈయనే ఇదే ఇతివృత్తంతో రాసిన 'సాచ్చీ' కథలో కూడా దొరలకు వ్యతిరేకంగా సత్య విషయాన్ని సాక్షంగా చెప్పిన దళితుడి మంచితనం, దళితుడి మానవతాగుణం, దళి తుడి సాహసం దొరల దౌర్జన్యం ముందు ఏవిధంగా ఓడిపోయిందో, దొరల ఆగ్రహానికి ఎలా గురయ్యిందో రచయిత నిపుణతతో చిత్రించాడు. ఇదే రచయిత 'బిచ్చ గత్తె' కథలో పురుషాహంకారాన్ని చూపిస్తూ స్త్రీ తన దయనీయ స్థితిలో కూడా తన అస్తిత్వాన్ని చాటుకున్న పరిణామాన్ని చిత్రించాడు. తెలుగు సాహిత్యంలో చాలా వరకు స్త్రీ, పురుష సంబంధాలు విచ్ఛిన్నమౌతున్న వైనాన్ని చెప్పగలుగుతున్నారు. కాని ఇంటి గడపదాటిన స్త్రీని ఏం చేయాలో తెలియని అయోమయ స్థితి చాలావరకు కని పిస్తుంది. కాని ఈ కథలో బిచ్చగత్తె తాను ఒంటరిగానైనా

గౌరవంగా జీవించగలననే ధీమా ఉంది. బహుశా స్త్రీ పురుష సమానత్వ సాధనలో ఈ తెగింపు ఒక భాగమే కావచ్చు. ఇది ఈయనే రాసిన గ్యాస్‌లైట్ కథలో కూడా కనిపిస్తుంది.

పిల్లల మనసులో మనసుగా, భాషలో భాషగా ఒదిగి పోయే విధంగా వెంకట్రాములు అద్భుతమైన కథలు రాస్తాడు. ఉపాధ్యాయుడుగా బడిలో ఎంతగా ఒదిగి పోయాడో బయట ఉపాధ్యాయ ఉద్యమానికీ అంతగా నాయకత్వం అందించాడు. ఏడు కథలతో 'జంగిడి' కథా సంకలనాన్ని రాశాడు. ఈ కథలు దేనికవి వేర్వేరు విషయాలను మనతో సంభాషించినా అంతస్సూత్రం బడుగు, బలహీన వర్గాల జీవితం, పర్యావరణం. సమా జంలోని, జీవితంలోని కల్మశాన్ని కడిగిపారేయకుండా ఒక ఆటంకంగా, ఒక వ్యాపారంగా సామ్రాజ్యవాద విషకోరలు ఎట్లా చుట్టుముట్టినాయో ఈ కథలు తెలుపుతాయి. మన కళ్ళముందరనే మన జనాలు, మన వనాలు మారవలిసి నట్టు గుణాత్మకంగా కాకుండా ఒక వికృత రూప విక్రియ ఎట్లా జరుగుతున్నదో ఈ కథలు చూపెడతాయి. అనా గరికత నాగరికతగా, నాగరికత అనాగరికతగా, చలామణి అవుతుండటం లోయ కథలో మనం చూస్తాం. మన పల్లెలు 'జంగిడి' కబేళాలకు ఆహారంగా మారటం, జంగిడి జీవనాధారంగా బతికిన ఎల్లప్ప బతుకు జంగిడిలాగా దైన్యంలోకి దిగజారడం జంగిడి కథలో పెను విషాదం. మన బళ్ళల్లో పిల్లలు ఎట్లా ఉన్నారు. 'అందరికీ అక్షరాల పథకం ప్రభుత్వాలకు ఆదర్శం'. అది వెంకటేష్‌కు ఆద ర్శమే. 'పోలి' అట్లానే బడికి చేరింది. బడిలో ఉండ గలిగిందా? చదువుకోగలిగిందా? పోలిని బడి తరి మేసిందా? అమ్ముకున్నది అవ్వేనా? సమాజం పోలి కోసం ఆలోచిస్తున్నదా? ప్రభుత్వాల ప్రయోజనాలు వేరు కదా? పోలి కథ మన పసిపిల్లలు పనిపిల్లలుగా ఎట్లా అమ్మకానికి పోతున్నారో, ఎటుపోతున్నారో తెలియని దుస్థితి చెప్తుంది. ఈ కథలో మన పిల్లలు, మనం, మన పరిసరాలు అన్నీ సరుకుగా వ్యాపారానికి బందీలుగా ఎట్లా మారి పోయాయో తెలుస్తుంది. 'ఏడు సంచుల దరిద్రం' కథ ట్రాక్టర్ కొనటం అనే గోదాలోకి దిగటంతో మొదలై ట్రాక్టర్‌ను వదిలించుకోవటంతో ముగుస్తుంది. కలలు కనలేని జీవన వ్యవసాయ సంక్షోభంలో ఉన్న మైబు, మైబమ్మ తదితర పాత్రలు మనని వెంటాడుతాయి. ఆపరేషన్ బర్డ్‌హంట్ కథ వర్తమాన సమాజ చలనాన్ని దృశ్యమానం చేసి మనం ఎక్కడ ఉన్నామో....... ఎక్కడ ఉండాలో తేట తెల్లంచేస్తుంది.

'సేద్యం' కవితా సంకలనంతో కవిగా మనందరికీ తెలిసిన ఇక్బాల్ కథలూ రాశాడు. మూడున్నర దశాబ్దా లుగా ప్రజాస్వామిక తాత్వికధార తెగకుండా రాస్తున్నాడు. జీవితాన్ని ఏమేమి కప్పేస్తున్నాయో ? తాను అర్థం చేసుకున్నదంతా మనకూ అర్థం చేయించే ప్రయత్నంలో నిరంతరం రాస్తూనే ఉన్నాడు. ఏడు కథలతో ఒక సంకలనం తెచ్చాడు. 'కాలువ మింగిన ఊరు' కథలో ఆలోచింపజేసే చర్చను అందించాడు. చేనేత కార్మికుల బతుకులలో పాదుకొన్న అసహజ మరణాల స్థితిని 'చెల్లని రాజ్యం కథలోను' డిఇఓ కార్యాలయ లంచగొండితనాన్ని నిలదీసిన సందర్భాన్ని 'అతడే' కథలోను చూపించాడు. పోలేపల్లి గ్రామాన్ని సమాధిచేసి దాని మీద పరుచుకున్న 'కఫన్' లాగా సెజ్ ఎట్లా పోలేపల్లి ప్రజల బతుకుల్ని సమాధిచేసిందో 'కఫన్' కథలో వివరించాడు. పాలమూరు వలసజీవుల బిడ్డడు 'బీజా' బాల్యాన్ని అనేక ఎతలు చుట్టుకున్నాయి. తమ పల్లెను, బతుకు వలసలను, బడిని, పంతుళ్ళను, కాలిన ఊరును అతడు అనుభ వించాడు. బస్సుమీద పేరిన దుమ్ములో అతను రాసి పంపిన అవ్వ చావు వార్తను అమ్మ చూస్తుందా ? అతని చుట్టూ అతనికి అన్నీ సమస్యలే. బీజా ఈ సమస్యలను దాటే పనిలో బయల్దేరాడు. అతనిప్పుడు ఎక్కడున్నాడు? చిన్న వయసులోనే చెరువంత జీవితాన్ని అనుభవించిన బీజా మనందరి విముక్తికి దారులు వేస్తున్నాడా ....... ? ఇదే సంకలనంలోని మరో కథ 'ఎటు చూసినావాడే' ఇది పాఠకున్ని కదిలించి, ఆలోచింపజేసే కథ.ఈ కథలో అదృశ్యమైన పిల్లవాడు బడినుండి మాయమైన పిల్లవాడు. విద్య ప్రాథమిక హక్కుగా అంగీకరించారు. సందర్భంలో సమస్యల వలయంలో చిక్కుకుని ప్రపంచీకరణలో కొట్టుకొనిపోయిన వాడు. ఆకలి, కరువు, వలసలకు

ఆహుతి అయినవాడు. ఇదంతా కూడా వందల సంవత్స రాలుగా ఒకరికి ఒకరము అనే సహకారం, సమిష్టి జీవనం కష్టసుఖాల్లో స్పందించే మనుషులను కోల్పోవడం మహ బూబ్‌నగర్ దళిత బహుజనుల జీవన బ్రతుకుకు నిదర్శనం.

ఈ పాలమూరు కథల రాజకీయ ఆర్థిక నేపథ్యం. ఈ దేశ పాలనలో సామ్రాజ్యవాద ప్రేరేపిత అభివృద్ధి నమూ నాను అమలు చేస్తున్న సందర్భం. పాలమూరు రాజకీయ నాయకులు ఆంధ్ర పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ వాళ్ళ సంపదకు దాసోహం అంటున్న సందర్భమిది. లేక పోతే కృష్ణానదిలో తమ జిల్లా న్యాయమైన వాటా కొరకు పోరాటం చేయకపోవడమేమిటి? ఆంధ్రా పెట్టుబడు దారులు, దేశ దళారీ నాయకులతో మిలాఖతై ప్రపంచీ కరణ ఈ దేశానికి, ఈ దేశ ప్రజలకు, వ్యవసాయ జీవి తానికి, గ్రామీణ వృత్తులకు పూర్తిగా వ్యతిరేకమైన ఒక నమూనాను ఈ దేశం మీద రుద్దారు. దాంతో కృష్ణానదిలో నీళ్ళ వాటా కోల్పోయి కరువుకు విలవిలలాడుతున్న పాలమూరు బడుగు, బలహీన వర్గాల మీద ఈ దుర్మార్గ అభివృద్ధి నమూనాను రుద్దడంతో గత రెండు దశాబ్దా లుగా ప్రజల జీవితం మరింత విధ్వంసానికి గురైంది. ఈ విధ్వంస చిత్రీకరణే ఈ కథలు.

1980 ల ఆధునికీకరణ పరిణామాలు, 1990 ల నూతన ఆర్థిక విధానాల పరిణామాలు దేశదేశాల సమాజా లను, మొత్తంగా ప్రపంచాన్ని అనేక కుదుపులకు ఆటు పోట్లకు గురిచేశాయి. ఈ ప్రభావం ఏ మనిషిని ఏ ఇంటినీ ఏ ప్రాంతాన్ని వదిలిపెట్టలేదు. చదల చీకటి కదల బారిం దేమో కానీ, ఉరుములు మెరుపులతో కొత్త చీకట్లు కమ్ము కున్నాయి. ఈ వెలుగు నీడలన్నీ సాహిత్యంలో నమోదు కావాలి. ప్రయాణిస్తున్న వాహనం కుదుపులకు లోనయి నపుడు తట్టుకోలేని దేహాల మనుషుల లాంటి పరిస్థితి పాలమూరు దళిత, బహుజనుల జీవితాలను కమ్మే సింది. ఈ దైన్యాన్ని నమోదు చేసి కదిలించవలసిన బాధ్యత పాలమూరు రచయితల మీద చాలానే ఉంది.

వేల సంవత్సరాల గత చరిత్రలోను, మనకు దగ్గరి ఈ నూరేండ్ల చరిత్రలోను మనం పట్టుకొని పది మందికీ చూపవలసిన ఆసక్తికరమైన ప్రత్యేకమైన అనేక సందర్భాలు పాలమూరులో ఉన్నాయి. ప్రజలు కాపాడుతూ వచ్చిన మౌఖిక కథలు, పాడుకున్న వీరగాధలు అభూత కల్పనలదాడికి, ఆధునిక మిడియా దాడికి గురవు తున్నాయి. మన పెద్ద మనుషుల నుంచి, జానపద గాయ కుల నుంచి విని ఈ కథలన్నీ నమోదు చేయవలసి ఉంది. వాటిలో ఉన్నటువంటి ప్రజాజీవన చిత్రణ నేటి దళిత, బహుజన, గిరిజన వర్గాల, స్థానిక చరిత్ర అవగా హనకు, భవిష్యత్తు నిర్మాణానికి ఇవి ఎంతైనా తోడ్పడ తాయి.

తృణీకరించబడ్డ వర్గాల పట్ల, అణచివేతకు దోపిడీకి, గురవుతున్న వర్గాల పట్ల రావాల్సినంత సాహిత్యం మహ బూబ్‌నగర్ జిల్లా నుండి రావడం లేదు. సమాజంలో దళిత, మైనారిటీ, గిరిజన, బహుజనులు అధిక సంఖ్యా కులైనా, ఈ దేశ ఉత్పత్తులలో అగ్రభాగంలో ఉన్నా, ప్రభుత్వాలచేత, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగిన మిగి లిన సామాజిక వర్గాల చేత నిరాదరణకు గురవుతూనే ఉన్నారు. రచయితలు కూడా ఈ వర్గాల నుంచే ఈనాడు ఎక్కువగా వున్నారు. దేశం ఆర్థికంగా, సాంకేతికంగా అన్ని రంగాలలో ముందుకు వెళుతున్న ఈ సందర్భంలోనూ ఈ వర్గాల గురించి పట్టించుకునేవారు తక్కువే. ఈ విధానం మారాలి. నిరాదరణకు గురైన వారి గురించి రాయాల్సిన చారిత్రక అవసరాన్ని గుర్తించాలి. ఎందుకంటే మనకు చరిత్ర అంటే రాజులు, వారి పాలనా, కళాపోషణ, నాయకుల ఘన కార్యాలే కాదు. వాటితోబాటు సామాన్య లకు సంబంధించిన విషయాలు కూడా చరిత్రేనన్న సత్యాన్ని ప్రపంచం విస్మరించింది. రొటీన్ విషయాలతో గిడసబారిపోయివున్న చరిత్ర, మన ప్రాచీన సంస్కృతి మొదలైన విషయాలతో చరిత్రను పునర్నించుకోవాల్సిన అవసరం ఎంతయినా వుంది. అది జరగాలంటే Gross Roots అయిన దళిత, బహుజన, గిరిజన, మైనారిటీల చరిత్ర సంస్కృతి తెలియాలి. వారి జీవన విధానం తెలి యాలి. అందుకోసమైనా దళిత బహుజన, గిరిజన, మైనారిటీల కథలు విస్తారంగా రావాలి. వారి జీవితాలు మెరుగుపడాలి.

BHAVAVEENA
Vol. 16, Issue. 2(1), February - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# జాషువా 'కాందిశీకుడు' - మానవతావాద దృక్పథం

- డా॥ పల్లి చిన్నోరావు

నవయుగ కవితాచక్రవర్తిగా పేరొందిన గుర్రం జాషువా 1895 సెప్టెంబర్ 28వ తేదీన గుంటూరు జిల్లా విను కొండలో జన్మించారు. జాషువా తల్లిదండ్రులు. శ్రీ గుర్రము వీరయ్య, లింగమాంబలు వర్ణాంతర వివాహము చేసుకున్నారు. ఆనాటి సమాజంలో కుల మత వర్గ పోరుకు ఎదురు నిలిచి జీవించడమే కాకుండా తమ పిల్లలను కూడా వర్గ పోరుకు వ్యతిరేఖంగా మానవతా దృక్పథంతోనే ప్రేమగా పెంచారు. కళాప్రపూర్ణ, మధుర శ్రీనాథ, కవికోకిల మొదలైన బిరుదులు పొందిన జాషువా సాహితీ వ్యాసంగంతోపాటు కొన్నాళ్ళు యం.యల్.సి సభ్యుడు గాను సామాజిక సేవలందించారు. ఈయన రచించిన పదుల గ్రంథాలలో "క్రీస్తు చరిత్రము" కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొంది విశిష్టమైన కీర్తి పొందింది. జాషువా రచించిన గబ్బిలము, పిరదౌశి, మంతాజ్ మహల్, స్వప్నకథ మొదలైన గ్రంథాలవలె 'కాందిశీకుడు' కూడా విశేషమైన పాఠకాధరణ పొందింది. ఈ గ్రంథంలో కపాలానికి కాందిశీకునికి జరిగిన చర్చలు క్షుణ్ణంగా పరిశీలించినచో జాషువా కవి యొక్క మానవతా దృక్పథము విశదమగుచున్నది.

మానవుడు అత్యంత ప్రాముఖ్యమైన వ్యక్తిగా, మానవ ప్రాముఖ్యతను, అన్ని కోణములందును చాటి చెప్పారు గ్రీకు తత్త్వవేత్తలు మానవతావాదము నందలి భావముల రూపవే కాందిశీకుడు కావ్యము. శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారి భార్య సుదర్శనాంబగారు ఈ కావ్యాన్ని అంకి తం పొందారు. 1942-43వ సంవత్సరాల మధ్య రచించ బడిన ఈ కావ్యము 1945వ సంవత్సరంలో మొదటిగా ప్రచురించబడింది. కల్పిత కావ్యమైన ఈ గ్రంథము యొక్క ఉద్దేశ్యమును గ్రంథ పీఠికలో జాషువా క్షుణ్ణంగా వివరించారు.

"నిరపరాధులగు మానవులను నిష్కారణముగా నాహుతి గొనుచున్న నేటి ప్రపంచ యుద్ధ భీకర కాలమున శాంత్యహింసల యౌత్కృష్ట్యములను స్థిరీకరించుటయే నా ఆశయము" యుద్ధ విముఖతతో వ్రాయబడిన కాంది శీకుడు కావ్యములో శాంతి స్థాపన మార్గమున మానవతా ప్రబోధము చేసిరి. జాషువా కవిత్వమును గూర్చి శ్రీ షేక్ యాకూబ్ఆలీ గారు ఈ క్రింది విధముగా వివరించిరి.

"జాషువా కవిత మానవాళికి మార్గం జూపింది
మానవాళి జాషువా కవితకు పూలబాట వేసింది
రవి వెలుగు నశించదు, కవి సందేశం ఆగదు
అందుకు తార్కాణం జాషువా కవితయే" అన్నారు

ఆంధ్రుడైన ఒక బర్మాకాందిశీకుడు ప్రాణ భయ ముతో అరణ్యములు దాటి వచ్చును. నల్లమలకొండలలో ఒక రాత్రివేళ తన కష్టాలను తలచుకొంటూ తన పాదా లకు తగిలిన మానవ కపాలముతో జరిపిన సంభాషణలు ఇందలి కథావస్తువు.

"వసుధనను బోలు నొకమంద భాగ్యడెపుడొ
తనువు చాలించి యుండు కాంతారసీమ"

(కాంది - పుట:22)

అని ఆశోపహతుడైన పాంథుడు ఆ కపాలమును ధన్యుడిగా భావించిరి. కానీ కపాలము పకపక నవ్వి ఆ కాందిశీకుడితో తానొక బౌద్ధ భిక్షువునని సంభాషణ గావించెను. "పాడిన పాటనే మళ్ళీ పాడకుండా జాషువా సమకాలీన సమాజమును వర్ణించి, మానవ హృదయాలతో మార్పు తేవడానికి ప్రయత్నించారు. సౌందర్యం చెడ కుండా జాగ్రత్త వహించారు. ఏ కావ్యం వ్రాసినా ఖండిక చెప్పినా వాటిలో మానవతా వాదాన్ని మర్చిపోలేదు". మాన వతా వాదము జాషువా రచనలకు జీవగఱ్ఱ. శ్రీ గొల్లపూడి ప్రకాశరావు పైన వివరించినట్లు ఏదో పాత ఇతివృత్తాలను తీసుకొని పెంచి పెంచి వ్రాసే విధానమును విడిచి, నూతన విషయముల ద్వారా మానవతావాద పథకాన్ని ఎగురవేశారు. అనుమానవముతో చేసే కాందిశీకుని

కపాలము సోదర ప్రేమతో 'వయస్యా!' అని సంబోధించుట తదుపరి స్మశాన క్షోణి వేదాంతము చెప్పుట, గొప్ప మానవతా వాదమునకు నిదర్శము. మరణించిన పిదప ధూళిగా మారిన రాచవాని కళేబరమును, ఆచార్యవంతుని అస్థిపేటిని, పేదరాలి కంకాళమును, గనికార్మికుని సమాధిని చూపించి సమతా ప్రసంగమొనరించినది కపాలము. పరలోకమును ఈ విధంగా వివరించినది.

"శాంతి స్వర్గంబు నరకమ శాంతియనుచు
నిర్వచింతురు మా బౌద్ధుని యమరతులు
సర్వ సృష్టికి బుద్ధుండే స్రష్టయుండ్రు
సర్వ మతముల సిద్ధాంత సారమిదయ
బుద్ధదేవుని సత్కళాపుంజ మెల్ల
నీశ్వరాకారమని బౌద్ధ లెన్ను చుండ్రు
స్వర్గ నరకాల రెండు నీ జగతియందు
నరుడు సృష్టింపగలడని నమ్మగలను"

(కాంది -పుట:25)

మానవుడే స్వర్గనరకాలను సృష్టించగలడని జాషువా వివరించారు. మానవుడే మహనీయుడు. మనవ జీవితము శుభప్రథమైనది. పవిత్రమైనది. ధన దాహమును, యుద్ధములను, అరికట్టుకొని సర్వమానవ సహోదరత్వమును పెంచుకొని, ఆకలి, దారిద్ర్యములను, నిర్మూలించుకొని ప్రేమతో నడచిన స్థలమే పరలోకము. అదే మానవతా వాదులు కోరుకునేలోకము. రాచరికపు వ్యవస్థ, మత మూర్ఖత్వము నశించాలని కపాలము తెలియచేసినది. తరువాత పలనాటి యుద్ధము గూర్చి బ్రహ్మనాయకుని గూర్చి జంతుబలులు, కోడిపందాలు, సతీసహగమనము వంటి దురాచారాల గూర్చి, త్రాగుబోతు తనము, దారి దోపిడీ దారులను గూర్చి కపాలము ప్రశ్నించినది. ఇలాంటి దురాగతములు బుద్ధుని బోధనలవలన తన వంటి బౌద్ధ భిక్షువులవలన మాసిపోయి వుండవచ్చునని తలచినది కపాలము. బుద్ధుని బోధనల వలన పులులు మేకలుగా మారాయని, బ్రహ్మనాయుడు గుత్తికొడలందు దాగి ఉన్నాడని చెప్పుకొనుచున్నారని వివరించారు. ఇదంతా వేదనా యుగమని గౌతమబుద్ధుడు, మహాత్మా గాంధీ వుండవలసిన రోజులు కావని జాషువా, భగవద్గీతా కృష్ణుని ప్రాముఖ్యతనీ క్రింది విధముగా వివరించిరి.

"గీతాకృష్ణుడు గావలె
నీతరుణము నందు, గాంధియేమిటికి మహా
గౌతమ బుద్ధుండేటికి
మాతను వల్లికలు, పిరికి మందులు చివికెన్"

(కాంది - పుట:34)

పిరికితనము మాయందు చోటు చేసికొనినదని, కావున గీతాకృష్ణుడే కావలెనని వివరించారు. ఇది నాజూకు యుగంబని ఆకాశవాణి, ఘంఘన విమానములు, విద్యుత్, వంటివి వచ్చాయని వివరించారు. స్త్రీ స్వేచ్ఛను ప్రశంసించి, ఈ యుగములోని కవులు మానవతా వాదమును గూర్చి ప్రచారము గావించారు.

"మాకవులా పింతురుసమంచిత నవ్యముగ గోచితంబులై
యాకటి చిచ్చురార్చు హృదయ ప్రవిదారి దయాకథాంశముల్"

(కాంది-పుటం35)

పైన పేర్కొనిన ఆకటి చిచ్చులార్చు మానవతావాద సాహిత్యమును వినిపించు చున్నారని వివరించిరి జాషువా. కాని భారతదేశము నందుగాని, లోకములోగాని, సంపూర్ణ మానవత్వము, ఆర్థిక స్వాతంత్ర్యము లభింపలేదని, పేదలు పేదలుగానే మిగిలిపోవుచున్నారని జాషువా వాపోయారు. పై సంగతులు వినిన కపాలము తొట్రుపడి చింతాకాలుష్యము చిమ్మిరేగినది. యుద్ధవాతావరణము ప్రబలిపోయి దీనమానవులు కరువును అనుభవించుచు శాంతిని కోల్పాయారని తెలిసింది. "ఎన్నండీ రణవహ్ని చల్లవదు.... " అని కపాలము విశ్వ కళ్యాణ మెప్పుడు వచ్చునో వివరింపకోరింది. కాందిశీకునికి జవాబుగా కపాలము చెప్పిన సందేశము మానవతావాదము. (1) సమర భావము, అస్పృశ్యతా జాడ్యము అన్ని విధాల నిర్మూలనమైనప్పుడు (2) నాదేశము, నాజాతి, నేను, నావాడు అను స్వాభిమానము నశించినప్పుడు (3) సమస్తలోక కళ్యాణ కరమైన పనులు నిర్వహించునప్పుడు మానవతా రాజ్యము నందు ప్రజలు సుఖమును అనుభవింతురని జాషువా ఈ కావ్యములో పేర్కొన్నారు. కాందిశీకుడు కావ్యము

మానవతావాదముతో నిండియున్నది. 'కాందిశీకుడు' కావ్యము గూర్చి శ్రీ బొడ్డు ప్రకాశముగారి వాక్యాలు గమనింపవలసివున్నది.

"అహింసా ఖడ్గాన్ని బూని యుద్ధాన్ని మాన్పిస్తానని పాంథుడు శపథం చేశాడు. దేశాభ్యుదయానికి పాటు పడతానని భీష్మించాడు. ఈ ప్రతిజ్ఞయే ప్రతి భారతీయుడు చేయవలసినది. Down with casteism down with communism అని నెహ్రూ చెప్పిన మూల సూత్రాన్ని అందరూ మనస్కరించి నేటి స్వేచ్ఛా రాజ్యంలో కృషి చేయవలసి ఉంది. ఇది జాషువా గారి అమూల్యమైన కావ్య సందేశం".

పై వాక్యాలలో ప్రత్యక్షమగునది మానవతావాద సిద్ధాంతమే. జాషువా 'కాందిశీకుడు' కావ్యము నందు కపాలమునకు కాందిశీకునికి జరిగిన సంవాదము మూలమున బౌద్ధ ధర్మములోని గొప్పతనాన్ని ప్రస్తుత సమాజ వైఖరిని వివరించినది. మానవతావాద రాజ్యము ఎట్లుంటుందో ఈ రచనలో చూపించారు జాషువా.

"ఎనలేని దు:ఖ వహ్నికిద్యాయమైనట్టి
తృష్ణ నెల్లరు సంహరించుచోటు"

(కాంది -పుట:25)

"పై పద్యములోని విశ్వమానవ సమైఖ్యత, ప్రేమ సందేవము, సర్వమత సారమైన ప్రేమ చాటించుచున్నది. ఈ పద్యమునందు గల భావం బౌద్ధ వాఙ్మయంలో కలదో లేదో గాని శ్రీ జాషువా కవి రాసిన ఈ భావం అన్ని మత స్థలకు అనుకూలమే అనగా అభ్యుదయాకాంక్ష కలిగిన వారందరికీ సమ్మతమే. ఏ సంఘ సంస్కర్త చెప్పిన విషయమైనా విశ్వమానవ సౌభ్రాతృత్వానికి దారి తీస్తుంది." అని బొడ్డు ప్రకాశముగారు పై పద్యాన్ని గూర్చి వివరించారు.

మానవతావాదము మానవుని చర్యలకు మానవుడే బాధ్యత వహించాలని తెలియజేస్తుంది. మానవుని నూతన మార్గమును చూపి, అతడినే సమస్తమునకు కేంద్రముగా పరిగణించుచున్నది. కనుక నవ్యమానవతావాదము మానవుని వ్యక్తిత్వ వికాసమునకు దోహదము చేయుచున్నది. ఈ కాందిశీకుడు కావ్యమునందు మానవ సమాజమునకు విశ్వమానవ సౌభ్రాతృత్వము కావలెనని కోరారు.

"కులమతాల కంచుకోటల మంటగలిపిన
మానవతావాదిని
పొలగడిగిన మనసు గలిగిన జాలిగొలిపెడి దీనబంధుని
నేను చూచితి
వెలుగు బాటలు మనకు చూపిన
వేదన కిలలనవతరించిన వివరించిని
విలాస పుటెల్లువల కర్తవ్యమును
విస్మరించని వీరయోధుని
సహజశక్తిని నేను చూచితి"

అని జాషువాను పరిశోధకులు మానవతావాదిగా పేర్కొన్నారు. పవిత్రమైన మానవ జీవితమును మహోన్నతమైన మానవతా శిఖరములపై నిలిపిన కవి చక్రవర్తి జాషువా. నదులెన్ని పోకడలు పోయినా సముద్రంలోనే సంగమించే టట్లు, భిన్న పరిస్థితుల ప్రభావానికిలోనై కవిత్వాన్ని వెలయించిన జాషువా మాత్రము హింసా కాలుష్య, కలుమత విద్వేష రహితమైన ఒక నవ సమాజాన్ని గూర్చి కలలు కన్నాడు. ఈ ఖండ కృతిలో కపాల పాంధులకు జరిగిన సంవాదమున జాషువా ఆవిష్కరించిన 'పరము' దానినే చూచించుచున్నది. పై విషయాల ఆధారముగా జాషువా రచించిన ఈ కాందిశీకుడు కావ్యము మానవతావాద మహాకావ్యము అనుటలో అతిశయోక్తిలేదు.

## పాద సూచికలు :

1. కాందిశీకుడు - భూమిక పుట:1
2. షేక్‌యాకూబ్ ఆవీగారు, కవిపాదుషా, (సం.బి.థియడోర్) నవయుగ కవి చక్రవర్తి, ముందు పేర్కొన్నది. పుట:60
3. శ్రీ గొల్లపూడి ప్రకాశరావు: "కపాల సందేశం - కాందిశీకుడు" పుట: 248

4. శ్రీ బొడ్డు ప్రకాశము : ''కాందిశీకుడు - కావ్య ప్రశస్తి'' పుట:84
5. పేదే: పుట - 74-75
6. జాషువా కవిత్వతత్త్వము -పుట:96

**ఆధార గ్రంథాలు :**

1. జాషువా రచనలసంపుటి ప్రథమభాగం: విశాలాంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ- 2003
2. జాషువా కవిత్వ తత్త్వము: అడుసుమిల్లి పూర్ణచంద్రారావు. (ప్రజాశక్తి పబ్లికేషన్స్-విజయవాడ - 1972)
3. జాషువా కృతుల సమాలోచన: డా॥ బి.భాస్కరచౌదరి. (సమతా పబ్లికేషన్స్ చిత్తూరు - 1972)
4. జాషువా జీవిత కవితా ప్రస్థానము: డా॥బి.భాస్కరచౌదరి. (సమతా పబ్లికేషన్స్ చిత్తూరు - 1972)

భావ వీణ BHAVA VEENA

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

Journal of Telugu Literary, Culture & Language Study

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 9703301698.